సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 54
శుక్రవారం 16-5-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



శిల్పకళకు ముగ్ధులై.. చేనేతకు పరవశించి..

గురువారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మిస్ వరల్డ్ భామలు


13 లో



క్షమాపణ చెప్పండి

కల్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్‌ను క్షమాపణ చెప్పాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

- వివరాలు 6లో



స్వాధీనం చేసుకోవాలి

పాకిస్తాన్ వద్ద ఉన్న అణ్వాయుధాలను ఐఏఈఏ సంస్థ పరిధిలోకి తీసుకురావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టంచేశారు.

- వివరాలు 6లో



తుర్కియేకు భారీ ఝలక్

తుర్కియే వైమానిక సేవల సంస్థ 'సెలెబీ' భారత్‌లో కార్యకలాపాలు సాగించేందుకు ఇచ్చిన భద్రతా క్లియరెన్స్‌ను కేంద్రం రద్దు చేసింది.

- వివరాలు 6లో



డబ్ల్యూటీసీ ఫైనల్ ప్రైజ్‌మనీ పెంపు

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ–2025) ప్రైజ్‌మనీని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) భారీగా పెంచింది.

- వివరాలు 17లో

ఎవరు సుప్రీం?

బిల్లుల ఆమోదానికి గవర్నర్లు, రాష్ట్రపతికి గడువెలా విధిస్తారు?

సుప్రీంకోర్టుకు 14 సూటిప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

గవర్నర్ ఆమోదించకున్నా బిల్లును చట్టంగా అమలు చేయొచ్చా?

గవర్నర్లు, రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాలను అసాధారణ అధికారాలతో సుప్రీంకోర్టు పక్కన పడేయొచ్చా?

బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో రాజ్యాంగబద్ధంగా గవర్నర్‌కు ఉన్న ఆప్షన్లు ఎన్ని?

రాష్ట్రపతి వెలువర్చిన నిర్ణయాలు ఏ విధంగా న్యాయసమీక్ష పరిధిలోకి వస్తాయి?

2 లో

బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్రపతి సుప్రీంకోర్టును సూచనలు, సలహాల కోసం కచ్చితంగా సంప్రదించాలా?

చట్టంగా మారబోతున్న బిల్లుల్లోని అంశాలపై కోర్టు మధ్యలోనే తీర్పులు ఇవ్వవచ్చా?

రాజ్యాంగంలో కాలావధి ప్రస్తావన లేనప్పుడు మీరెలా రాష్ట్రపతికి కాలపరిమితిని విధిస్తారు?



ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలు

రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతిగానీ, గవర్నర్‌గానీ గరిష్టంగా 3 నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలి. ఒకవేళ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపాలనుకుంటే అందుకు తగు కారణాలనూ పేర్కొనాలి. గవర్నర్ల అలసత్వపూరిత చర్య న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుంది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా న్యాయసమీక్ష అధికారం మాకు ఉంది.

సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ప్రశ్న

"బిల్లులకు ఆమోదముద్ర విషయంలో ఏకంగా గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి విధించడమేంటి? గవర్నర్లు, రాష్ట్రపతి ఫలానా కాలపరిమితిలోపే నిర్ణయం వెలువర్చాలని రాజ్యాంగంలో ఎలాంటి కాలావధి ప్రస్తావన లేకపోయినా బిల్లుల విషయంలో మీరెలా కాలపరిమితిని విధిస్తారు? ఆర్టికల్ 200, 201ను ఈ తరహాలోనే వినియోగించాలని గవర్నర్లు, రాష్ట్రపతికి మీరెలా దిశానిర్దేశం చేయగలరు?



మా వస్తువులకు భారత్‌లో జీరో టారిఫ్!

→ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు తొందరపాటు ప్రకటన చేశారు. టారిఫ్‌లు విధించకుండానే తమ దేశం నుంచి వస్తూత్పత్తుల దిగుమతికి భారత్ అత్యంత ఉత్సాహం చూపిస్తోందని గురువారం అనూహ్య ప్రకటన చేశారు. దీనిపై వెంటనే స్పందించిన భారత్.. అలాంటిదేమీ లేదని, టారిఫ్‌ల ఖరారుపై చర్చలు జరుగుతున్నాయని స్పష్టంచేసింది. జీరో టారిఫ్ ప్రతిపాదన లేదని కుండబద్దలుకొట్టింది.

- వివరాలు 6లో

మెట్రో చార్జీల మోత

- రేపటి నుంచి కొత్త చార్జీల అమలు
- టికెట్ కనిష్టంగా రూ.12, గరిష్టంగా రూ.75
- ప్రయాణికులపై రోజుకు సుమారు రూ.కోటి అదనపు భారం -12లో


పుష్కరస్నానం ఆచరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, పొన్నం, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ తదితరులు

'సరస్వతి' పునాదిగా పుష్కర వేడుకలు

- త్వరలో వచ్చే గోదావరి, కృష్ణా పుష్కరాలనూ ఘనంగా నిర్వహిస్తాం
- సమ్మక్క, సారలమ్మ జాతరను వైభవంగా జరిపిస్తాం
- ఈ అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా: సీఎం రేవంత్‌రెడ్డి
- కాళేశ్వరం ప్రాంతానికి ఘనచరిత్ర ఉంది.. ఈ ప్రాంత అభివృద్ధికి రూ.200 కోట్లు
- చతుర్వేద పుష్కరఘాట్ వద్ద ఘనంగా సరస్వతి పుష్కరాలు ప్రారంభం

12 లో

నిజాయితీపరులైతే సెలవు చూసి ఎందుకు చేశారు?

లాంగ్ వీకెండ్ చూసుకుని చెట్లు ధ్వంసం చేసేందుకు ప్లాన్ చేశారా?

పర్యావరణ అనుమతులు తీసుకున్నారా?

మీరు అక్కడ పారిశ్రామిక పార్క్ నిర్మిస్తారా లేక ఇంకేదైనా చేస్తారా అనేది అప్రస్తుతం

కంచ గచ్చిబౌలి కేసులో ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

2 లో



'కంచ'ను రిజర్వు ఫారెస్టుగా ప్రకటించాలి

సుప్రీంకోర్టుకు కేంద్ర సాధికార కమిటీ నివేదిక

ముందుకా?.. వెనక్కా?

సుప్రీం వ్యాఖ్యల నేపథ్యంలో టీజీఐఐసీ మల్లగుల్లాలు

- వివరాలు 2లో

ఎల్‌ఆర్‌ఎస్ నిబంధనల్లో సవరణలు

గిఫ్ట్ డీడ్, వారసత్వం ఆధారంగా కూడా అవకాశమిస్తూ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) కింద 2020లో దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించిన దరఖాస్తుల పరిష్కారం విషయంలో తలెత్తుతున్న ప్రధాన సమస్యకు మునిసిపల్ శాఖ పరిష్కారం చూపించింది. ఇప్పటి వరకు ఎల్‌ఆర్‌ఎస్‌కు తప్పనిసరిగా సేల్‌డీడ్‌ను జతపరిస్తేనే సంబంధిత ప్లాటు లేదా లేఅవుట్ క్రమబద్ధీకరణ చేసేందుకు అవకాశం ఉండేది. దీంతో ఇతర మార్గాల ద్వారా ప్లాట్లు పొందిన వారు క్రమబద్ధీకరణ జరగక ఆందోళన చెందారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులపై సమీక్షించిన మునిసిపల్ శాఖ దీనిపై నిర్ణయం తీసుకుంది. ఇకపై క్రమబద్ధీకరణకు తప్పనిసరిగా సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ ఉండాల్సిన అవసరం లేదు. రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్, ఎక్స్ఛేంజ్ డీడ్ లేదా వారసత్వ హక్కుతో స్థలాన్ని పొందిన వారు కూడా ఇప్పుడు రెగ్యులరైజేషన్‌కు అర్హులు. 2020లో రూపొందించిన అనధికార లేఅవుట్ల రెగ్యులరైజేషన్ నిబంధనల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటి వరకు కేవలం అమ్మకపు రిజిస్ట్రేషన్ ఉన్న వారికి మాత్రమే అవకాశం ఉండగా, ఇకపై కుటుంబ సభ్యుల మధ్య జరిగిన గిఫ్ట్ లేదా వారసత్వం ద్వారా లభించిన స్థలాలు కూడా ఈ పరిధిలోకి రానున్నాయి.

రేవంత్ వల్ల అధికారులు జైలుకు వెళ్లే పరిస్థితి

కంచ గచ్చిబౌలి భూములపై సీఎం తన తప్పులు ఒప్పుకోవాలి

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించి కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన తప్పులను ఒప్పుకోవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలి భూములపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ గురువారం 'ఎక్స్'లో స్పందించారు. 'కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ విధ్వంసానికి పాల్పడటంపై ప్రభుత్వం తరఫున వాదిస్తున్న న్యాయవాదితో పాటు అధికారులపైనా సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పర్యావరణ విధ్వంసానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు అధికారులను జైలుకు పంపించాలా? అంటూ హెచ్చరించింది. రేవంత్‌రెడ్డి చేసిన తప్పులకు తెలంగాణ ప్రభుత్వ అధికారులు శిక్ష ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. రేవంత్ మూర్ఖత్వం వల్ల అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తోంది. ఈ భూముల వ్యవహారం నుంచి రేవంత్‌రెడ్డి తప్పించుకునే అవకాశం లేదు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'వందలాది బుల్డోజర్లతో ధ్వంసం చేసిన కంచ గచ్చిబౌలి అడవిని పునరుద్ధరించకుంటే కోర్టుల్లో రేవంత్‌కు శిక్షలు తప్పవు. ఈ భూములను అమ్మి రూ.10 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడటం నమ్మక ద్రోహమే. అడవులను ధ్వంసం చేయడం ముమ్మాటికీ పర్యావరణ చట్టాల ఉల్లంఘనే. కంచ గచ్చిబౌలి భూములను ప్రభుత్వం కాపాడాల్సిందే' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

ప్రత్యేక సౌకర్యాల కోసం ఆదేశాలు ఇవ్వలేం

గాలి జనార్దన్‌కు స్పష్టం చేసిన సీబీఐ కోర్టు

సాక్షి, హైదరాబాద్: గాలి జనార్దన్‌రెడ్డికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాల్సిందిగా జైలు అధికారులకు ఆదేశాలు ఇవ్వలేమని నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయన దాఖలు చేసిన పిటిషన్ అనుమతికి నిరాకరిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మైనింగ్ కేసులో దోషులుగా తేలడంతో గాలి జనార్దన్‌రెడ్డితో పాటు మరో ముగ్గురికి సీబీఐ కోర్టు మే 6న ఏడేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న గాలి జనార్దన్‌రెడ్డి తనకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా జైలు అధికారులను ఆదేశించాలని కోరుతూ సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయ స్థానం.. అక్రమాల కేసులో అరెస్టయిన వారికి స్పెషల్ కేటగిరీ కింద వసతులు కల్పించలేమని పేర్కొంది. ఆ పిటిషన్‌ను తిప్పిపంపింది.



..పన్లోపని తుర్కియే అధ్యక్షుడిని కూడా పిలుద్దాం సార్! కొంతకాలం పాలన చూసుకోమని చెబుదాం!

ఏమీ లేకున్నా... ఇచ్చేయ్ గుర్తింపు!



అన్ని ఇంజనీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు

జేఎన్‌టీయూహెచ్ గ్రీన్ సిగ్నల్

- కాలేజీల్లో తనిఖీ నివేదికలన్నీ నామమాత్రమే
- 50 కాలేజీల్లో డేటాసైన్స్‌కు బోధకులు కరువు
- 38 కాలేజీల్లో సీఎస్ఈకి అనుభవజ్ఞులైన అధ్యాపకుల్లేరు
- తనిఖీ నివేదికలపై తూతూ మంత్రం సమీక్ష
- అనుబంధ గుర్తింపులో భారీగా రాయ'బేరాలు'!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియ తుది దశకు చేరుకుంది. దాదాపు అన్ని కాలేజీలకు గుర్తింపు ఇవ్వాలని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రైవేటు కాలేజీల తనిఖీ నివేదికలపై వర్సిటీ అధికారులు గురువారం సమీక్షించారు. అనేక కాలేజీల్లో సరిపడా బోధకులు లేరని, మౌలిక వసతులు లేవని తనిఖీ బృందాలు పేర్కొన్నట్టు తెలిసింది. అయితే, వర్సిటీ ఉన్నతాధికారులు వీటిని పెద్దగా పరిగణనలోనికి తీసుకోకుండా, లోపా లను సరిచేసుకునేందుకుమరో అవకాశం ఇవ్వాలని మాత్రమే నిర్ణయించినట్టు సమాచారం. కాలేజీలు ప్రారంభించే నాటికి ఫ్యాకల్టీని నియమించుకోవాలని, లేబొరేటరీలు, మౌలిక వసతులు కల్పించాలని ప్రైవేటు కాలేజీలకు తెలిపేందుకు సిద్ధమయ్యారు. ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తు న్నాయి. ఫ్యాకల్టీ లేకుండా గుర్తి ంపు ఇవ్వడం ఏమిటని విద్యావేత్తలు, విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. గుర్తింపు ఇచ్చాక కాలేజీలు స్పందించకపోతే చేసేది ఏమీ లేదని పేర్కొంటున్నారు.

ఒత్తిడా? డీలానా?

ఫ్యాకల్టీ, మౌలిక వసతులు లేని కాలేజీల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం ఉండటం లేదని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఆగ్రహం వ్యక్తంచేసింది. తనిఖీల్లో ఈ అంశాలను ప్రధానంగా చూడాలని సూచించింది. వాస్తవానికి ఫ్యాకల్టీ, మౌలిక వసతులు లేనప్పుడు సెక్షన్లు తగ్గించడమో, గుర్తింపు నిలిపివేయడమో చేయాలి. కానీ, వీటి ఏర్పాటుకు కాలేజీలకు మరో అవకాశం ఇవ్వాలని అధికారులు నిర్ణయించా రు. ఈ మొత్తం వ్యవహారం వెనుక భారీ డీల్ జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఒక ప్రైవేటు కాలేజీకి చెందిన వ్యక్తితో యూనివర్సిటీ కీలక అధికారి అంటకాగడం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. ప్రభుత్వం నుంచి ఒత్తిడి రావడం వల్లే అందరికీ అనుబంధ గుర్తింపు ఇవ్వాల్సి వస్తోందని ఆయన సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఆ కోర్సులకు అధ్యాపకులెక్కడ?

ఇంజనీరింగ్ కాలేజీలను జేఎన్‌టీయూహెచ్ బృందాలు కొన్ని నెలల క్రితమే తనిఖీ చేశాయి. 140 కాలేజీల్లో వాస్తవ పరిస్థితితో నివేదిక ఇచ్చాయి. 50 కాలేజీల్లో డేటాసైన్స్ బోధించేందుకు మాస్టర్ డిగ్రీ చేసిన నిపుణులు లేరని తేల్చారు. కొన్ని కాలేజీలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే వారిని బోధకులుగా చూపించే ప్రయత్నం చేశాయి. వారి పాన్‌కార్డులను పరిశీలిస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తు న్నట్టు తేలింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఏఐఎంఎల్ కోర్సుల్లో సీట్లు పొందిన కాలేజీల్లోనూ నిపుణుల కొరత కనిపిస్తోంది. గుర్తింపులేని సంస్థల నుంచి డిప్లొమా కోర్సులు చేసిన వారిని బోధకులుగా చూపించినట్టు తేలింది. రెండుమూడు సెక్షన్లకు ఒకే అధ్యాపకుడు ఉన్న కాలేజీల సంఖ్య 24 ఉందని గుర్తించారు. డిజిటల్ లేబొరేటరీలు పేరుకు మాత్రమే ఉంటున్నాయి. అందులో లాంగ్ లెర్నింగ్ లాంగ్వేజ్, ఇతర ప్రోగ్రామింగ్ ఫైల్స్ కూడా కన్పించడం లేదని తనిఖీ బృందాలు వర్సిటీకి నివేదించినట్టు తెలిసింది. డేటాసైన్స్‌ను విశ్లేషించేందుకు లేబొరేటరీలో అవసరమైన ప్రోగ్రామింగ్ లేదని గుర్తించారు.

ఎవరు సుప్రీం?

బిల్లుల ఆమోదానికి గవర్నర్లు, రాష్ట్రపతికి గడువెలా విధిస్తారు?

సుప్రీంకోర్టుకు 14 సూటిప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- గవర్నర్ ఆమోదించకున్నా బిల్లును చట్టంగా అమలు చేయొచ్చా?
- గవర్నర్లు, రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాలను అసాధారణ అధికారాలతో సుప్రీంకోర్టు పక్కన పడేయొచ్చా?
- బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో రాజ్యాంగబద్ధంగా గవర్నర్‌కు ఉన్న ఆప్షన్లు ఎన్ని?
- బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్రపతి సుప్రీంకోర్టును సూచనలు, సలహాల కోసం కచ్చితంగా సంప్రదించాలా?
- చట్టంగా మారబోతున్న బిల్లుల్లోని అంశాలపై కోర్టు మధ్యలోనే తీర్పులు ఇవ్వవచ్చా?
- రాజ్యాంగంలో కాలావధి ప్రస్తావన లేనప్పుడు మీరెలా రాష్ట్రపతికి కాలపరిమితిని విధిస్తారు?

న్యూఢిల్లీ: రాష్ట్రాల శాసనసభలు పంపిన బిల్లులు గవర్నర్లు, రాష్ట్రపతి వద్ద ఆమోదముద్ర కోసం నెలల తరబడి వేచిచూస్తున్న వైనంపై తీవ్ర అసహనం వ్యక్తంచేస్తూ సర్వోన్నత న్యాయస్థానం వెలువర్చిన సంచలనాత్మక తీర్పు, ఆ తీర్పులో గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి విధించిన వైనంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అసాధారణ రీతిలో స్పందించారు. బిల్లులకు ఆమోదముద్ర విషయంలో ఏకంగా గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి విధించడమేంటని సుప్రీంకోర్టుపై రాష్ట్రపతి తాజాగా ప్రశ్నల వర్షం కురిపించారు. సర్వోన్నత న్యాయస్థానం వెలువర్చిన అత్యంత కీలకమైన తీర్పుపై ఇలా రాష్ట్రపతి తీవ్ర, విస్తృతస్థాయిలో స్పందించడం, నేరుగా సుప్రీంకోర్టునే స్పందన కోరడం ఇటీవలికాలంలో ఇదే తొలిసారి. సుప్రీంకోర్టు వెలువర్చిన తీర్పులపై సందేహాలు వెలిబుచ్చుతూ ప్రశ్నలు సంధించడం కూడా ఇదే తొలిసారి అని న్యాయరంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేశారు. రాష్ట్ర అసెంబ్లీలు పంపిన బిల్లులపై రాష్ట్రపతి నిర్ణయం కోసం గవర్నర్ రిజర్వ్‌లో ఉంచిన నేపథ్యంలో అలాంటి బిల్లులపై మూడు నెలల్లోగా రాష్ట్రపతి తన నిర్ణయాన్ని తెలపాల్సిందేనని ఏప్రిల్ 8వ తేదీన సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు వెలువర్చడం తెల్సిందే. దీంతో బిల్లులపై రాష్ట్రపతికి సుప్రీంకోర్టు కాలపరిమితిని విధించవచ్చా అనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగంలోని 143(1) అధికరణం ద్వారా తనకు దఖలు పడిన అసాధారణ అధికారాలను ఉపయోగించి రాష్ట్రపతి తాజాగా సుప్రీంకోర్టుకు పలు ప్రశ్నలు వేశారు. రాష్ట్రపతి మొత్తంగా 14 సూటి ప్రశ్నలు వేశారు.

గత నెలలో ఇచ్చిన తీర్పులో ఏముంది?

తమిళనాడు శాసనసభ ఆమోదించిన కొన్ని బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ రవి ఆమోదించకుండా తన వద్దే చాలా కాలంగా పెండింగ్‌లో ఉంచడంతో డీఎంకే ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతిగానీ గవర్నర్‌గానీ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలంటూ జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌ల ధర్మాసనం తేల్చి చెప్పింది. ఒకవేళ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపాలనుకుంటే అందుకు తగు కారణాలనూ పేర్కొనాలని సూచించింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై ఎటూ తేల్చకపోతే తమను మళ్లీ ఆశ్రయించవచ్చని కోర్టు స్పష్టంచేసింది. గవర్నర్ల ఆలస్యపూరిత చర్య న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా ఈ న్యాయసమీక్ష అధికారం తమకు ఉందని కోర్టు వెల్లడించింది.

ఆ 14 ప్రశ్నలు క్లుప్తంగా..

- ఆర్టికల్ 200 ప్రకారం తన వద్దకు వచ్చిన బిల్లులపై గవర్నర్ రాజ్యాంగబద్ధంగా ఏఏ రకాలైన నిర్ణయాలు తీసుకోవచ్చు?
- బిల్లులపై అన్ని రకాల ఆప్షన్లను ఉపయోగించుకుంటూ నిర్ణయాలు తీసుకునే క్రమంలో రాష్ట్ర మంత్రి మండలి ఇచ్చిన సలహాలు, సూచనలకు గవర్నర్ ఏమేరకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉంది?
- స్వీయ విచక్షణాధికారంతో గవర్నర్ తీసుకునే నిర్ణయాలను రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం ఎంత మేరకు న్యాయసమ్మతమైనవిగా భావిస్తారు?
- ఆర్టికల్ 200 కింద గవర్నర్ తీసుకున్న నిర్ణయాలను సుప్రీంకోర్టు ఆర్టికల్ 361 కింద న్యాయసమీక్ష జరుపుతుందా?. రాజ్యాంగబద్ధంగా తీసుకున్న నిర్ణయాలను ఏ విధంగా సవాల్ చేయగలదు?
- గవర్నర్ ఇంతకాలంలోపే నిర్ణయం వెలువర్చాలని రాజ్యాంగంలో ఎలాంటి ప్రస్తావన లేకపోయినా మీరెలా గవర్నర్‌ను ఫలానా కాలపరిమితిలోపే నిర్ణయం చెప్పాలని ఆదేశించగలరు?. ఆర్టికల్ 200ను ఈ తరహాలోనే వినియోగించాలని మీరెలా దిశానిర్దేశం చేయగలరు?
- ఆర్టికల్ 201 ప్రకారం తనకు దఖలుపడిన విచక్షణాధికారాలను ఉపయోగించి రాష్ట్రపతి వెలువర్చిన నిర్ణయాలు ఏ విధంగా న్యాయసమీక్ష పరిధిలోకి వస్తాయి?
- రాష్ట్రపతి ఫలానా కాలపరిమితిలోపే నిర్ణయం వెలువర్చాలని రాజ్యాంగంలో ఎలాంటి కాలావధి ప్రస్తావన లేకపోయినా బిల్లుల విషయంలో మీరెలా రాష్ట్రపతికి కాలపరిమితిని విధిస్తారు? ఆర్టికల్ 201ను ఈ తరహాలోనే వినియోగించాలని రాష్ట్రపతికి ఏ అధికారంతో ఆదేశాలు ఇచ్చారు?
- రాష్ట్రపతి సమ్మతి కోసం ఏదైనా బిల్లును గవర్నర్ పెండింగ్‌లో పెడితే ఈ బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్రపతి సుప్రీంకోర్టును సూచనలు, సలహాల కోసం సంప్రదించాలా?. ఒకవేళ సంప్రదించినా కోర్టు ఇచ్చే ఆ సలహాలు, సూచనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందా?
- బిల్లులకు సంబంధించి గవర్నర్‌గానీ, రాష్ట్రపతిగానీ తీసుకున్న నిర్ణయాలు చట్టంగా మారేలోపే ఆ నిర్ణయాలను కోర్టు న్యాయసమీక్ష జరపవచ్చా?. చట్టంగా మారబోతున్న బిల్లుల్లోని అంశాలపై కోర్టు మధ్యలోనే తీర్పులు ఇవ్వవచ్చా?
- ఆర్టికల్ 142 ద్వారా తమకు దఖలుపడిన అసాధారణ అధికారాలను ఉపయోగిస్తూ సుప్రీంకోర్టు అప్పటికే గవర్నర్లు/రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాలు/ఉత్తర్వులు అమలుకాకుండా ప్రత్యామ్నాయ ఉత్తర్వులు/తీర్పులు వెలువర్చవచ్చా?
- రాష్ట్ర శాసనసభలో ఆమోదం పొందినా సరే గవర్నర్ ఆమోదించని/ఆమోదం పొందని బిల్లును చట్టంగా అమలుచేయొచ్చా?
- ఏదైనా చట్టం రాజ్యాంగానికి లోబడే ఉందా? లేదా? అని తేల్చి కనీసం ఐదుగురు సభ్యులున్న రాజ్యాంగ ధర్మాసనానికి రిఫర్ చేయాలనే నిబంధనను సుప్రీం కచ్చితంగా అమలుచేయాల్సిన అవసరం లేదుకదా?
- ఆర్టికల్ 142 ప్రకారం సుప్రీంకోర్టుకు దఖలుపడిన అధికారాలు కేవలం చట్టాలు ఏ విధంగా అమలవుతున్నాయి? వంటి విధానపర నిర్ణయాలకే పరిమితమా? లేదంటే పరిపాలన, చట్టాల కూర్పు వంటి న్యాయస్థానేతర అంశాలకూ విస్తరించాయా?
- సుప్రీంకోర్టుకు ఆర్టికల్ 131 కింద కాకుండా మరే ఇతర అధికరణం కింద రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించే అధికారం ఉందా?

నిజాయితీపరులైతే సెలవు చూసి ఎందుకు చేశారు?

లాంగ్ వీకెండ్ చూసుకుని ధ్వంసం చేసేందుకు ప్లాన్ చేశారా?

- పర్యావరణ అనుమతులు తీసుకున్నారా?
- మీరు అక్కడ పారిశ్రామిక పార్క్ నిర్మిస్తారా లేక ఇంకేదైనా చేస్తారా అనేది అప్రస్తుతం
- కంచ గచ్చిబౌలి కేసులో ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: 'లాంగ్ వీకెండ్.. అదీ కోర్టుకు సెలవులున్నవి చూసుకుని ప్రీప్లాన్‌తోనే అక్కడ చెట్లన్నీ ధ్వంసం చేశారా? ఉద్దేశపూర్వకంగా విధ్వంసం చేసే ఆలోచన లేకపోతే పనిదినాలైన సోమవారం నుంచి ఆ పనులు చేసుకోవచ్చు కదా? మీరు చేసింది చూస్తుంటే పక్కా ప్లాన్ ప్రకారమే చేసినట్లు ఉంది' అంటూ సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మిస్టర్ సింఘ్వీ మీరు బుల్డోజర్ల ఫొటోలు చూశారా? డజన్ బుల్డోజర్లను అంత తక్కువ టైంలో మోహరించగలరా? ధ్వంసం చేసిన ప్రాంతంలో పునరుద్ధరణ చర్యలు చేపడతారా? లేక జైలుకు వెళతారా' అంటూ ప్రశ్నలు సంధించింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కంచ గచ్చిబౌలి కేసు విచారణను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీలతో కూడిన ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభిషేక్ మనుసింఘ్వీ, మేనక గురుస్వామి; బీ ద ఛేంజ్ వెల్ఫేర్ సొసైటీ తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు, పి.మోహిత్‌రావు; మరొకరి తరఫున న్యాయవాది ఎస్.నిరంజన్ రెడ్డి, వరుణ్ ఠాకూర్ వాదనలు వినిపించారు.

ఎలాంటి కార్యక్రమాలు జరపట్లేదు

'ప్రస్తుతం ఆ ప్రాంతంలో పనులన్నీ ఆపేశాం. ఆ భూముల్లో మేము ఎలాంటి కార్యక్రమాలు జరపట్లేదు' అని ప్రభుత్వం తరఫున హాజరైన సింఘ్వీ సుప్రీంకోర్టుకు తెలిపారు. అటవీ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి ఫొటోలతో కూడిన సమగ్ర నివేదికను కోర్టుకు అందజేస్తామన్నారు. చెట్లు నరికిన ప్రాంతంలోనే మొక్కలు నాటుతున్నారా అని ధర్మాసనం ప్రశ్నించగా, అక్కడ నాటడం లేదని, మరోచోట నాటుతున్న విషయాన్ని పిటిషనర్లు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. 104 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిలో దాదాపు 60శాతం చెట్లు నరికివేశారని అమికస్ క్యూరీ సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వర్ చెప్పారు. అక్కడ చదును చేసిన ఫొటోలను సర్వే ఆఫ్ ఇండియా కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ)కి ఇచ్చిందన్నారు. సీఈసీ అవన్నీ ధర్మాసనానికి ఇచ్చిందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం రిప్లై ఇస్తామంటే తమకేమీ అభ్యంతరం లేదని చెప్పారు. అక్కడ చెట్ల నరికివేతకు అనుమతులు తీసుకున్నారా అని సింఘ్వీని ప్రశ్నించగా.. సెల్ఫ్ సర్టిఫికెట్ తీసుకున్నామని బదులిచ్చారు. 50 హెక్టార్లకు పైగా ఉంటేనే ఈసీ క్లియరెన్స్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

రాత్రికి రాత్రే ఎందుకు చేశారు?

డజన్ల కొద్దీ బుల్డోజర్‌లను రాత్రికి రాత్రే అక్కడికి తరలించి వేలాది చెట్లు నరికివేయాల్సిన అవసరం ఏం వచ్చిందని ధర్మాసనం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. పారిశ్రామిక పార్క్ నిర్మిస్తామని చెబుతూ ప్రభుత్వం అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేసిందని ఎస్.నిరంజన్ రెడ్డి ధర్మాసనానికి చెప్పారు. 'మీరు అక్కడ పారిశ్రామిక పార్క్ నిర్మిస్తారా? లేక మరే ఇతర నిర్మాణం చేస్తారా? అనేది మాకు అప్రస్తుతం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా లేదా అని మరోసారి ధర్మాసనం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. 'వేలాది చెట్లను నరికివేసిన వీడియోలు చూసి మేం చలించాం. బుల్డోజర్‌ల శబ్దాలకు జంతువులు ప్రాణభయంతో పరుగులు తీశాయి. ఆ ప్రాంతంలో పర్యావరణాన్ని పునరుద్ధరించే ఆలోచన ఉందా? లేక అక్కడే నిర్మించే తాత్కాలిక జైలుకు మీ చీఫ్ సెక్రటరీ, సంబంధిత అధికారులు జైలుకు వెళతారా? అనేది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించుకోవాలి' అని చీఫ్ జస్టిస్ గవాయి హెచ్చరించారు. కంచ గచ్చిబౌలిలో అటవీ పునరుద్ధరణకు రాబోయే వర్షాకాలమే సరైన సమయమని నిరంజన్ రెడ్డి వాదించారు. హైదరాబాద్‌లో రుతుపవనాల సీజన్ జూన్ మొదటి వారం నుంచే ప్రారంభమవుతుందని చెప్పారు. అటవీ పునరుద్ధరణకు ప్రభుత్వం దగ్గర ఎటువంటి ప్రణాళిక లేదని, కావాలనే, జూలైలో వాయిదాకు కోరుతున్నారన్నారు. విచారణను జూలై 23కు వాయిదా వేసిన ధర్మాసనం.. వంద ఎకరాల పునరుద్ధరణపై ప్రణాళికను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

మూడు స్కూళ్లను కూల్చివేశారు..

చెట్ల నరికివేతపై పోరాడిన 200 మంది యూనివర్సిటీ విద్యార్థులపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, కొందరిని జైలుకు పంపారని విజిల్ బ్లోయర్స్ తరఫున వరుణ్ ఠాకూర్ వాదనలు వినిపించారు. అయితే ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నాయని, పలువురు విద్యార్థులు జైల్లో ఉన్నారని చెప్పారు. అలాగే ఈ ప్రాంతంలో మూడు స్కూళ్లను కూల్చివేశారని ఆరోపించారు. విద్యార్థులపై కేసుల్ని కొట్టివేయాలని కోరారు. అయితే స్కూళ్లను బుల్డోజ్ చేశారన్న వాదనపై జస్టిస్ గవాయి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ ఆరోపణను మొదటిసారి వింటున్నామని సింఘ్వీ అన్నారు. ఈ అప్లికేషన్ (ఐఏ)ను ఈ కేసుతో కలిపి విచారించడం కుదరదని సీజేఐ స్పష్టం చేశారు. కావాలంటే వేరే పిటిషన్ దాఖలు చేసుకోవాలని ఆదేశిస్తూ... ఐఏను విత్‌డ్రా చేసుకునేందుకు స్వేచ్ఛనిచ్చారు.

ముందుకా?.. వెనక్కా?

కంచ గచ్చిబౌలిపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో టీజీఐఐసీ మల్లగుల్లాలు

- కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు తీసుకోవాలనే అభిప్రాయం
- సంప్రదింపుల ప్రక్రియను కొనసాగించే యోచనలో ఉప సంఘం

సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీం కోర్టు ధర్మాసనం తాజా వ్యాఖ్యల నేపథ్యంలో ఈ అంశంలో కేంద్ర బిందువుగా ఉన్న తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) మల్లగుల్లాలు పడుతోంది. పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చాలంటూ సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో భవిష్యత్తు కార్యాచరణపై ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. కంచ గచ్చిబౌలి భూములపై సమర్పించిన అఫిడవిట్‌లోని అంశాలకు కట్టుబడి ఉంటూనే తొలుత పర్యావరణ నష్టాన్ని పూడ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని భావిస్తోంది. అందులో భాగంగా అటవీ పునరుద్ధరణ, పర్యావరణ సమతుల్యత పునరుద్ధరణకు సంబంధించిన ప్రణాళికలు సమర్పించే అవకాశమున్నట్లు సమాచారం.

పర్యావరణ అనుమతులపైనా దృష్టి?

కంచ గచ్చిబౌలి భూములను అభివృద్ధి చేసేందుకు రూపొందించిన ప్రణాళికల ప్రకారం పర్యావరణ అనుమతులు అవసరం లేదనే అభిప్రాయాన్ని ప్రభుత్వం వ్యక్తం చేస్తూ వచ్చింది. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్ లోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించింది. అయితే అనుమతులు లేకుండా పనులు మొదలు పెట్టారనే సుప్రీంకోర్టు అభ్యంతరాల నేపథ్యంలో కేంద్ర పర్యావరణ శాఖ నుంచి అదనపు అనుమతులు పొందేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలపైనా చర్చించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు లోబడి ఉంటూనే ఈ భూముల విషయంలో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై న్యాయ నిపుణులతో ప్రభుత్వవర్గాలు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. ఆ భూముల్లో పర్యావరణ విధ్వంసం జరుగుతోందంటూ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు, పర్యావరణ కార్యకర్తలు నిరసనలు తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా మంత్రివర్గ ఉప కమిటీని ఏర్పాటు చేసింది. భూ వినియోగంపై సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా తగిన సిఫార్సులు చేసే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించింది. దీని కోసం వర్సిటీ అధ్యాపకులు, పర్యావరణవేత్తలు, ఇతర భాగస్వామ్య వర్గాలతో కమిటీ సంప్రదింపులు జరిపింది. ఇప్పుడు సెంట్రల్ యూనివర్సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ, విద్యార్థి సంఘాలు, పౌర సంస్థలు, పర్యావరణవేత్తలతో సంప్రదింపులు కొనసాగించడంలో ఉన్న సాధ్యాసాధ్యాలనూ ప్రభుత్వం పరిశీలించే అవకాశముంది.

రూ.10వేల కోట్ల రుణంపై మల్లగుల్లాలు

ఇప్పటికే కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి రూ.10వేల కోట్ల రుణం తీసుకున్న టీజీఐఐసీ సుప్రీంకోర్టులో ప్రతికూల తీర్పు వస్తే ఎదురయ్యే పరిణామాలను కూడా మదింపు చేస్తోంది. ఈ రుణాలకు ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన నేపథ్యంలో తిరిగి చెల్లింపులో పెద్దగా సమస్య ఉండబోదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆ భూములను అభివృద్ధి చేయడానికి సాధ్యం కాని పక్షంలో ప్రత్యామ్నాయంగా పుప్పాలగూడలోని 400 ఎకరాలను ఐటీ సంస్థల కోసం కేటాయించే అంశాన్ని పరిశీలించాలని మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ 400 ఎకరాల్లో టీజీఐఐసీ వద్ద ఉన్న 250 ఎకరాలతోపాటు ఐఏఎస్, ఐపీఎస్, ఎమ్మెల్యేలు, ఎంపీలకు గృహాల కోసం గతంలో కేటాయించిన స్థలాలను వెనక్కి తీసుకుని అభివృద్ధి చేయాలని సూచించిన విషయం విదితమే. ప్రత్యామ్నాయంగా ఆ భూములను ఎంపిక చేస్తారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'కంచ'ను రిజర్వు ఫారెస్టుగా ప్రకటించాలి

సుప్రీంకోర్టుకు కేంద్ర సాధికార కమిటీ నివేదిక

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలను వన్యప్రాణుల రక్షణ చట్టం–1972 నిబంధనల మేరకు రిజర్వు ఫారెస్టుగా ప్రకటించేలా కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) సిఫార్సు చేసింది. భూమి నిర్వహణను కూడా అటవీ శాఖకు అప్పగించాలని అభిప్రాయపడింది. కంచ గచ్చిబౌలి భూ వివాదంపై సుప్రీంకోర్టు సిద్ధాంత దాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్ర సాధికార కమిటీ గురువారం సుప్రీంకోర్టుకు మరో నివేదికను అందజేసింది. '400 ఎకరాలపై ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనాన్ని పరిశీలించగా.. 56 శాతం అటవీ ప్రాంతమేనని తేలింది. ఇందులో కూడా 7.08 శాతం దట్టమైన అడవి (70 లేదా అంతకంటే ఎక్కువ శాతం చెట్లు), 31.89 శాతం మధ్యస్థ అడవి (70శాతం కంటే తక్కువ 40 శాతం కంటే ఎక్కువ చెట్లు), 17.17 శాతం బహిరంగ అడవి (10–40 శాతం చెట్లు) ఉన్నాయి. ఇదంతా చెట్ల నరికివేతకు ముందు. ఈ గణాంకాలు తెలంగాణ సర్కార్ చెప్పిన దానికంటే చాలా ఎక్కువ. 1.44 శాతం దట్టమైన అడవి, 7.99 శాతం మధ్యస్థ అడవి, 9.5 శాతం బహిరంగ అడవి.. అని సర్కార్ పేర్కొంది. చెట్ల నరికివేత తర్వాత.. ఈ గణాంకాలు 0.002 శాతం దట్టమైన, 0.61శాతం మధ్యస్థ, 7.92 శాతం బహిరంగ అడవిగా ఉన్నాయని పేర్కొంది.

ఆకుపచ్చ జీవవైవిధ్యానికి ప్రాముఖ్యత

'2,300 ఎకరాల భూమిలో గొప్ప జీవవైవిధ్యం దాగిఉంది. ఇది పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుంది. ఈ భూమిని కన్జర్వేషన్ రిజర్వ్‌గా లేదా డీమ్డ్ ఫారెస్ట్‌గా ప్రకటించి, అత్యున్నత స్థాయి రక్షణ కల్పించడంపై పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. పారిశ్రామిక పార్కు కోసం పాక్షికంగా తొలగించిన చెట్లను నాటి పునరుద్ధరణ పనులు చేపట్టాలి. ఎలాగూ వర్షాకాలం వస్తోంది కనుక స్థానికంగా ఎదిగే చెట్లు, పొద జాతులను దట్టంగా నాటాలి. నేలతోపాటు తేమ పరిరక్షణ కార్యకలాపాలను చేపట్టాలి. రాష్ట్రంలోని అటవీ భూముల పరిశీలన కోసం క్షేత్రస్థాయి అటవీ అధికారులు, పర్యావరణ శాస్త్రవేత్తలు, ఐటీ, రిమోట్ సెన్సింగ్ నిపుణులు, సర్వే ఏజెన్సీలతో కమిటీని పునర్నియమించాలి. అటవీ ప్రధాన సంరక్షణాధికారి, భూ పరిపాలన ప్రధాన కమిషనర్, భూ యాజమాన్య విభాగాల సీనియర్ అధికారులు, న్యాయ నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలతో కూడిన ఉన్నతస్థాయి సమన్వయ కమిటీని వేసి ప్రభుత్వ, సంస్థాగత భూములను గుర్తించాలి. తడి భూములు (సంరక్షణ–నిర్వహణ) నియమాలు–2017 ప్రకారం.. ఈ ప్రాంతంలోని అన్ని నీటి వనరులను తడి భూములుగా రక్షించేందుకు, హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోకి ప్రవహించే అన్ని మురుగునీటి అవుట్‌లెట్ల మూసివేతకు వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా లేదా మరో ప్రముఖ సంస్థ ద్వారా కంచ భూముల సమగ్ర పర్యావరణ అంచనా వేయించాలి' అని నివేదికలో సీఈసీ సిఫార్సు చేసింది.



లక్ష్మికి ఇచ్చిన హామీపై 'సాక్షి' మెయిన్ పేజీలో ప్రచురితమైన కథనం



చిన్నమల్లారెడ్డిలో లక్ష్మి ఇంటికి వెళ్లి మంజూరు పత్రాన్ని అందిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

లక్ష్మికి ఇందిరమ్మ ఇల్లు

సీఎం ఇచ్చిన హామీపై 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందన

ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసిన ప్రభుత్వ సలహాదారు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జోడో యాత్రలో భాగంగా 2023 మార్చి 18న కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డి గ్రామం మీదుగా వెళుతూ కూలిపోయిన ఇంటిని చూసిన అప్పటి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి.. తాము అధికారంలోకి రాగానే ఇల్లు కట్టిస్తామని భిక్కనూరు లక్ష్మికి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే విషయంపై 'రేవంతన్నా.. నన్ను యాది మరువకు' శీర్షికన 'సాక్షి'మెయిన్ ఎడిషన్‌లో ప్రచురించిన కథనంపై సీఎం స్పందించారు. ఉన్నతాధికారులను ఆదేశించడంతో రెవెన్యూ అధికారులు అదే రోజు లక్ష్మి ఇంటికి వెళ్లి ఇల్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపుతున్నట్టు చెప్పారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో లక్ష్మికి ఇల్లు మంజూరు కాలేదు. ఇందిరమ్మ ఇళ్ల పథకం రూపుదిద్దుకోవడంతో భిక్కనూరు లక్ష్మితోపాటు చిట్యాల రాజమణి, భిక్కనూరు రేణుకలకు కూడా ప్రత్యేక కేసు కింద ఈ ఏడాది జనవరి 28న ఇళ్లు మంజూరయ్యాయి. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పథకం ద్వారా మంజూరైన పత్రాలను గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ లక్ష్మితోపాటు మరో ఇద్దరికి అందజేశారు. ఇంటి నిర్మాణం కోసం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. 'సాక్షి పేపర్ల నాకు సీఎం సారు ఇచ్చిన హామీ గురించి రాసింద్రు. ఇచ్చిన మాట నిలుపుకున్న రేవంత్‌రెడ్డి సారుకు కృతజ్ఞతలు'అంటూ భిక్కనూరు లక్ష్మి తన సంతోషాన్ని వ్యక్తం చేసింది.

ఓసీపీ-2లో పేలుళ్లు

- ధ్వంసమైన నివాసాలు.. నాగెపల్లి గ్రామస్తుల ఆందోళన



ధ్వంసమైన ఇళ్లు

రామగిరి (మంథని): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని సింగరేణి సంస్థ ఆర్జీ–3 ఓసీపీ–2లో గురువారం భారీ బ్లాస్టింగ్‌లు జరిగాయి. దీంతో సమీపంలోని నాగెపల్లి గ్రామంలోని సీ–బ్లాక్‌లో నివాసాలు ధ్వంసం కావడంతోపాటు గ్రామస్తులకు గాయాలయ్యాయి. బ్లాస్టింగ్‌లతో తమ ఇళ్లపై రాళ్లు పడుతున్నాయని, తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ పెద్దపల్లి – మంథని మధ్యగల మెయిన్ రోడ్డుపై గ్రామస్తులు రాస్తారోకో చేశారు. సమాచారం అందుకున్న జీఎం సుధాకర్‌రావు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, మంథని సీఐ రాజు, రామగిరి ఎస్సై చంద్రకుమార్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. అనంతరం బ్లాస్టింగ్‌లతో ధ్వంసమైన ఇళ్లను పరి శీలించారు. సింగరేణి తరఫున కమిటీ ఏర్పాటు చేసి నష్ట నివారణ చర్యలు చేపడతామని జీఎం సుధాకర్‌రావు హామీ ఇచ్చారు.

ఆయన (అల్లాహ్)యే మీ కొరకు రాత్రిని వస్త్రంగానూ (తెరగానూ). నిద్రను విశ్రాంతి స్థితిగానూ మరియు పగటిని తిరిగి బ్రతికించి లేవబడే (జీవనోపాధి) సమయంగానూ చేశాడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 16 మే 2025

'సుప్రీం'కు న్యాయ మీమాంస

శాసనసభలు ఆమోదించి పంపే బిల్లులపై రాష్ట్రపతి లేదా గవర్నర్లు నిర్దిష్ట కాలవ్యవధిలో నిర్ణయాన్ని ప్రకటించాలనీ, లేనట్టయితే వాటిని ఆమోదించినట్టుగా భావించవచ్చని గత నెలలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మరోసారి కోర్టు మెట్లెక్కింది. ఈ తీర్పుపై కేంద్రప్రభుత్వం తాజాగా రాష్ట్రపతి ద్వారా సుప్రీం కోర్టు అభిప్రాయాన్ని కోరింది. నిజానికి, ఆ తీర్పు ఇటీవల రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. సాక్షాత్తూ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ దానిపై విరుచుకు పడ్డారు. 'ఈమధ్య ఒక తీర్పు ఏకంగా రాష్ట్రపతికే ఆదేశాలు జారీచేసింది. జడ్జీలే సూపర్ పార్లమెంటుగా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్య శక్తులే లక్ష్యంగా దాడి జరుగుతోంది' అంటూ విమర్శించారు. కీలకాంశాలపై రాజ్యాంగ న్యాయస్థానాలు వెలువరించే అసాధారణ తీర్పులు ఒక్కోసారి అసాధారణ పరిణామాలకు దారి తీస్తాయి. తమ శాసనసభ ఆమోదించి పంపిన బిల్లుల్ని గవర్నర్ ఆర్.ఎన్. రవి ఎటూ తేల్చకుండా దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచుతున్నారని ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన వ్యాజ్యంలో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ సంచలన తీర్పు వెలువరించింది. అసెంబ్లీలు ఆమోదించి పంపిన బిల్లులు నెలల తరబడి, ఏళ్ల తరబడి గవర్నర్ల వద్ద పెండింగ్‌లో వుండిపోవటం తమిళనాడు సమస్య మాత్రమే కాదు... విపక్షాల ఏలుబడిలో వున్న కొన్ని ఇతర ప్రభుత్వాల పరిస్థితి సైతం ఇలాగే వుంది. భిన్న సందర్భాల్లో సుప్రీంకోర్టు పలు ఆదేశాలు జారీ చేస్తూనే వచ్చింది.

విస్తృత ప్రజా ప్రయోజనాలు ఇమిడివున్న అంశాల్లో వివరణ కోరడానికీ లేదా సందేహ నివృత్తికీ, రాష్ట్రాలమధ్య తలెత్తే వివాదాల్లో అభిప్రాయం కోరడానికీ 'ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్' రూపంలో కేంద్రప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానం ముందు వ్యాజ్యం దాఖలు చేస్తుంది. రాజ్యాంగంలోని 143(1) అధికరణ కింద వున్న ఈ అధికారాన్ని అరుదైన సందర్భాల్లో మాత్రమే కేంద్రం వినియోగించుకుంటుంది. ఈ తీర్పుద్వారా సుప్రీంకోర్టు తన అధికార పరిధిని దాటిందన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ నివేదనలో 14 ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులు తమ పరిశీలనకొచ్చినప్పుడు రాష్ట్రపతి లేదా గవర్నర్లు ఏం చేయాలో రాజ్యాంగంలోని 200, 201 అధికరణలు నిర్దేశిస్తున్నాయి. వాటిననుసరించి బిల్లుల్ని ఆమోదించే లేదా తోసిపుచ్చే అధికారం వుంటుంది. 200 అధికరణ ప్రకారం బిల్లు గవర్నర్ పరిశీలనకొచ్చినప్పుడు 'సాధ్యమైనంత త్వరగా' దానిపై అభిప్రాయాన్ని ప్రకటించాలంటున్నది. దాన్ని నిరాకరించాక తిరిగి అదే రూపంలో రెండోసారి బిల్లు వచ్చినప్పుడు గవర్నర్ తన ఆమోదాన్ని పెండింగ్‌లో వుంచరాదని చెబుతోంది. రెండోసారి వచ్చిన బిల్లును గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపినపక్షంలో ఏం చేయాలో 201 అధికరణ సూచిస్తోంది. ఆమోదానికి లేదా తిరస్కారానికీ అందులో నిర్దిష్టమైన వ్యవధిని సూచించటం లేదన్నది 'ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్' ప్రస్తావిస్తోంది. అలాంటప్పుడు గవర్నర్లయినా, రాష్ట్రపతైనా మూణ్ణెల్లలోగా బిల్లులపై తమ నిర్ణయం ప్రకటించాలని, లేనట్టయితే వాటిని ఆమోదించినట్టే భావించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తుందని ప్రశ్నిస్తోంది. పైగా ఇలాంటి ఆదేశాలు రాజ్యాంగ ధర్మాసనం ఇవ్వాలి తప్ప ఇద్దరు సభ్యుల ధర్మాసనం ఇవ్వొచ్చునా అనే సందేహాన్నీ వ్యక్తం చేసింది.

మన రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగాన్ని ఒక దార్శనిక పత్రంగా రూపొందించారు తప్ప మనల్ని మనం ఎలా పరిపాలించుకోవాలో... దేన్ని ఏవిధంగా ఆచరించాలో సూచించే నిబంధనల పత్రంగా తయారుచేయలేదు. కనుకనే ఆచరణలో ఎదురయ్యే సమస్యల్ని దృష్టిలో వుంచుకుని దానికి భాష్యం చెప్పుకోవటం, సవరించుకోవటం తప్పటం లేదు. మన కార్యనిర్వాహక వ్యవస్థ ఈ 75 ఏళ్ల ప్రస్థానంలో రాజ్యాంగానికి వందకుపైగా సవరణలు తీసుకురావాల్సి వచ్చిందంటేనే ఆ సంగతి తెలుస్తోంది. ఇక సర్వోన్నత న్యాయస్థానం భిన్న సందర్భాల్లో వెలువరించిన తీర్పుల ద్వారా వివిధ అధికరణల విస్తృతిని పెంచింది. వీటన్నిటికీ రాజ్యాంగస్ఫూర్తే గీటురాయి. మన దేశంలో పటిష్ఠమైన సహకార సమాఖ్య వ్యవస్థ ఉండాలని రాజ్యాంగం ఆశించింది. కేంద్ర ప్రతినిధులుగా రాష్ట్రాల్లో గవర్నర్లు ఏం చేయాలో, రాష్ట్రపతి ఎలా వ్యవహరించాలో రాజ్యాంగంలోని అధికరణలు చెబుతున్నాయి. తమ ఆచరణ దేశంలో సహకార సమాఖ్య వ్యవస్థ పరిఢవిల్లాలని చెప్పే రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉంటున్నదో లేదో పరిశీలించుకోవాల్సిన అవసరం గవర్నర్లకుంది.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యే ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన వాగ్దానాలకు అనుగుణంగా ఒక చర్యకు ఉపక్రమించినప్పుడు దాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవటం ఏ రకంగా సబబవుతుంది? ఇందువల్ల కేవలం ఒక రాజకీయపక్షం ఆధ్వర్యంలోని ప్రభుత్వాన్ని పనిచేయకుండా నిరోధించటం మాత్రమే కాదు... ప్రజలిచ్చిన రాజకీయ అధికారాన్ని గుర్తించ నిరాకరించటం కూడా! ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా రాజ్యాంగ పరిధిని దాటి, మందబలంతో దేశ భద్రతకు ముప్పు కలిగించే నిర్ణయాలు తీసుకుంటే వాటిని ఆపడాన్ని ఎవరూ ప్రశ్నించరు. కానీ ప్రజాహితం, వారి సంక్షేమం, భద్రత కోరి చేసే బిల్లుల్ని కూడా పెండింగ్‌లో వుంచటం ఏం సబబు? గవర్నర్లు తమవద్దకొచ్చే బిల్లుల్ని అకారణంగా పెండింగ్‌లో వుంచటం సారాంశంలో రాజకీయ సమస్య. కనీసం దీన్ని గవర్నర్లవరకూ పరిమితం చేసి రాష్ట్రపతి ప్రమేయాన్ని నివారించి వుంటే బాగుండేది. కానీ రాష్ట్రపతి దగ్గర సైతం బిల్లులు పెండింగ్‌లో పడటం వల్ల సమస్య మరింత జటిలమైంది. తాజా నివేదనను పరిశీలించబోయే రాజ్యాంగ ధర్మాసనం ఈ విషయంలో ఏం చెబుతుందో వేచిచూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, **తిథి:** బ.చవితి రా.2.31 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** మూల ప.2.02 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ప.12.19 నుండి 2.02 వరకు, తదుపరి రా.12.06 నుండి 1.46 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.56 వరకు, తదుపరి ప.12.21 నుండి 1.12 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.10 నుండి 8.44 వరకు.

సూర్యోదయం : 5.32
సూర్యాస్తమయం: 6.20
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

దేశవ్యాప్తంగా న్యాయ 'కొరత'

సందర్భం



మాజా దారూవాలా

ప్రతి వ్యవస్థనూ – అది సాధించాల్సిన ఫలితాలు సాధించేలా – పరిపూర్ణంగా రూపొందిస్తారు. మరి భారత న్యాయ వ్యవస్థ మాటేమిటి? పనితీరులో వెనుకబాటుతనం, అసమానత్వం, జాప్యం... ఇవేనా దీని నుంచి మనం ఆశించిన ఫలితాలు?

ఇటీవలే 'ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025' వెలువడింది. 18 పెద్ద రాష్ట్రాలు, 7 చిన్న రాష్ట్రాల్లో ప్రజలకు న్యాయం ఎలా అందుతోందో ఇది అద్దం పడుతోంది. పాత నివేదికల మాదిరిగానే ఇది కూడా పోలీసు, జ్యుడీషియరీ, జైళ్లు, న్యాయ సహాయం గురించి విపులంగా చర్చించింది. ఆ యా రంగాల్లో వ్యవస్థాగత సామర్థ్యాలు తగిన స్థాయిలో లేవనీ, వాటిని పెంచుకోవలసి ఉందనీ ఈ నివేదిక తేల్చింది. అనేక మందికి ఈ వ్యవస్థ అందుబాటులో ఉండటం లేదు. తను చేయగలిగినంతా చేస్తోంది. అయినా అత్యవసర న్యాయ సేవను అవసరమైన స్థాయిలో అందించలేక పోతోంది.

సిబ్బంది కొరతతో న్యాయంలో లోటు

రాష్ట్ర బడ్జెట్ల మీద ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. జస్టిస్ సిస్టమ్‌కు తగినన్ని నిధుల కేటాయింపు జరగటం లేదు. కేటాయింపుల్లో సింహభాగం జీతాలకే పోతుంది. మౌలిక సదుపాయాలు, పరికరాలు, నైపుణ్యాల పెంపునకు మిగిలే నిధులు అంతంత మాత్రమే. రాష్ట్రాల జీడీపీలు పెరిగిన సందర్భాల్లోనూ, ఏవో కొన్ని రాష్ట్రాలు మాత్రమే అదే నిష్పత్తిలో జ్యుడీషియరీకి నిధులు పెంచుతున్నాయి.

న్యాయ వ్యవస్థలు మొత్తం మీద 25 శాతం సిబ్బంది కొరత ఎదుర్కొంటున్నాయి. హైకోర్టు జడ్జీలలో 31 శాతం, పోలీసు యంత్రాంగంలో 22 శాతం, జైళ్ల శాఖలో 33 శాతం ఖాళీలు భర్తీ చేయకుండా పడున్నాయి. పోలీసు స్టేషన్ పర్యవేక్షణలో ఉండే జనాభా, ప్రాంతం చాలా ఎక్కువగా ఉండటం మరో సమస్య. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పోలీసు స్టేషన్లు తక్కువగా ఉంటున్నాయి. దీంతో గ్రామీణులకు న్యాయ పరిష్కారాల లభ్యత తగ్గిపోతోంది. సివిల్ పోలీసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నప్పటికీ, నిరంతరం ఖాళీలు ఉంటూనే ఉన్నాయి. దీంతో ఈ వ్యవస్థ కుంటినడక నడుస్తోంది. జాతీయస్థాయిలో ప్రతి అయిదు పోస్టుల్లో ఒకటి ఖాళీగా ఉంటోంది. అంటే 5,00,000 మందిని నియమించాల్సి ఉంది. జనాభా–పోలీసు నిష్పత్తి అతి తక్కువగా ఉండే ప్రపంచ దేశాల్లో ఇండియా ఒకటి. మన పోలీసు దళాల్లో 80 శాతం మంది కానిస్టేబుళ్లు ఉంటారు. సూపర్‌వైజరీ, టెక్నికల్ విభాగాల్లో 35 శాతం ఖాళీలు ఉండటంతో పర్యవేక్షణ అధికారులు తక్కువ అవుతున్నారు.

నియామక ప్రక్రియ లోపభూయిష్ఠంగా ఉండటం వాస్తవం. ఎప్పుడు ప్రకటన వెలువడుతుందో తెలియదు. చివరకు ప్రకటన వెలువడినా నియామకాలు పూర్తి కావడానికి రెండేళ్లకు పైగా పడుతోంది. దీంతో శిక్షణ సంస్థల మీద భారం పెరిగి శిక్షణ ప్రక్రియ తూతూ మంత్రంగా సాగుతోంది. సిబ్బంది సరైన అవగాహన లేకుండానే విధుల్లోకి వస్తున్నారు. ఇది ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తోంది. శిక్షణ సంస్థలకు నిధుల కొరత కూడా ఉంది. పోలీసు బడ్జెట్లో కేవలం 1 శాతమే వీటికి దక్కుతోంది. సిబ్బంది వైఫల్యాలకు అధికారులు వీటిని సాకులుగా చూపిస్తున్నారు. న్యాయలోపానికి వారు ఇలా కారణాలు చూపించే వీల్లేదు. ఇది ప్రమాదకరమైన సమస్య. ఇది విధానపరమైన వైఫల్యాలకూ దోషులు శిక్షలు పడకుండా తప్పించుకోవడానికీ దారితీస్తుంది.



◆ దేశంలో అపరిష్కృత వ్యాజ్యాల సంఖ్య త్వరలోనే 6 కోట్లకు చేరుకోబోతోంది. దేశంలోని 1,330 జైళ్లలో 90 కారాగారాల్లో సామర్థ్యానికి రెట్టింపు సంఖ్యలో ఖైదీలు కిటకిటలాడుతున్నారు. వీరిలో అత్యధికులు విచారణ ఎదుర్కొంటున్నవారే. జనాభాలో ప్రతి 10 లక్షల మందికి కేవలం 15 మంది జడ్జీలు ఉన్నారు. 40 ఏళ్ల క్రితమే 50 మంది ఉండాలని సిఫారసు చేసినా, మంజూరైన 21 పోస్టులు కూడా భర్తీ కావడం లేదు.

పెండింగ్ కేసుల గుట్ట

ఇక జ్యుడీషియల్ వ్యవస్థలో 5 కోట్లకు పైగా పెండింగు కేసులు మూలుగుతున్నాయి. జనాభాలో ప్రతి 10 లక్షల మందికి కేవలం 15 మంది జడ్జీలు ఉన్నారు. 40 ఏళ్ల క్రితమే 50 మంది ఉండాలని సిఫారసు చేసినా, మంజూరైన 21 పోస్టులు కూడా భర్తీ కావడం లేదు. ప్రతి హైకోర్టు న్యాయమూర్తీ 7,000కి పైగా కేసులు పరిష్కరించాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. దిగువ కోర్టుల్లో ఈ సంఖ్య 2,200. ఈ నేపథ్యంలో అపరిష్కృత వ్యాజ్యాల సంఖ్య త్వరలోనే 6 కోట్లకు చేరుకోబోతోంది.

పర్యవసానంగా, జైళ్లు కిక్కిరిసి పోతున్నాయి. బెయిలు మంజూరుపై సుప్రీం మార్గదర్శకాలతో పాటు, అండర్ ట్రయల్ రివ్యూ కమిటీలు, డిఫెన్సు కౌన్సెల్ స్కీములు, బెయిలుకు ప్రభుత్వ నిధులు, జైలువారీగా లీగల్ క్లినిక్స్, వేల కొద్దీ న్యాయ సహాయ లాయర్లు వంటి ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నప్పటికీ... పదేళ్లలో ఖైదీల రద్దీ 18 నుంచి 30 శాతానికి పెరిగింది. 1,330 జైళ్లు ఉండగా, 90 కారాగారాల్లో సామర్థ్యానికి రెట్టింపు సంఖ్యలో ఖైదీలు కిటకిటలాడుతున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని మురాదాబాద్ వంటి కొన్ని చెరసాలల్లో ఉండవలసిన వారి కంటే నాలుగు రెట్ల మంది ఉంటున్నారు. సుప్రీం కోర్టుకు సమర్పించిన ఒక నివేదిక ప్రకారం, 40 శాతం మందికి నిద్రపోవాలంటే కూడా స్థలం కరవే! ఖైదీలలో సుమారు మూడో వంతు మందే దోషులుగా శిక్ష అనుభవిస్తున్నవారు... మిగిలినవారు అందరూ విచారణ ఎదుర్కొంటున్న ఖైదీలే! వీరిలో అత్యధికులు అట్టడుగు వర్గాల వారు. పేదరికం ఇక్కడ నిజమైన నేరం.

ఆహ్వానించదగిన మార్పులు

ఇన్ని ప్రతికూలతలు ఉన్నప్పటికీ, కొన్ని సానుకూల అంశాలు కూడా లేకపోలేదు. బడ్జెట్లు పెరుగుతున్నాయి. ఫోరెన్సిక్ ల్యాబ్స్‌ను ఆధునికంగా మార్చుతున్నారు. టెక్నాలజీ వినియోగంలోకి వస్తోంది. ఢిల్లీ డిజిటల్ వ్యాజ్య నిర్వహణ విధానం, తెలంగాణ ఇ–ప్రిజన్ సిస్టమ్స్, మహారాష్ట్ర ఏఐ ఆధారిత లీగల్ ఎయిడ్ చాట్ బాట్స్, తమిళనాడు పోలీసు స్టేషన్లలో మెరుగైన సీసీటీవీ కవరేజీ ఇందుకు ఉదాహరణలు.

బిహార్ పోలీసు దళాల్లో స్త్రీల వాటా 24 శాతానికి పెరిగింది. సబార్డినేట్ కోర్టు జడ్జీల్లో మహిళలు 38 శాతానికి పెరిగారు. అయితే, హైకోర్టుల్లో ఇది 14 శాతం మాత్రమే! ప్రప్రథమంగా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, జైలు సిబ్బందిలో ట్రాన్స్‌జెండర్ల గణన అధికారికంగా చేపట్టారు. కేరళ ప్రభుత్వం కోర్టు రూములు దివ్యాంగులకు అనుకూల రీతిలో ఉండేలా చర్యలు చేపట్టింది.

ఆ యా కులాల ప్రాతినిధ్యం కూడా పెరుగుతోంది. వాణిజ్య వివాదాల్లో మధ్యవర్తిత్వ విధానాన్ని గుజరాత్ ప్రాచుర్యంలోకి తెస్తోంది. కోర్టుల్లో రద్దీ తగ్గించడానికి వీలుగా సైబర్ క్రైమ్ యూనిట్లు, పోక్సో, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు వంటి ప్రత్యేక సంస్థలు ఏర్పాటు అవుతున్నాయి.

సంస్థలు బలహీనంగా ఉన్నా వ్యక్తిగత చొరవ సత్ఫలితాలు ఇస్తుంది. ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రత్యేక శ్రద్ధ వహించి జైళ్ల ఆక్యుపెన్సీ రేటును 91 నుంచి 83 శాతానికి తగ్గించి, ఖైదీలకు వసతి సదుపాయం పెంచగలిగారు. అలాగే అధికారుల ఖాళీలను 46 శాతం నుంచి 14 శాతానికి తగ్గించారు. సంకల్పం ఉంటే మార్గం ఉంటుంది.

న్యాయం అనేది మాటలకే పరిమితమైన ఒక ఉన్నత ఆదర్శం కాదు. అది సాధించగలిగిన లక్ష్యం. దాన్ని అందించే బాధ్యత ప్రభుత్వాల మీద, కోర్టుల మీద ఉంది. మనం చట్టబద్ధ ప్రజాస్వామ్యంలో కొనసాగాలంటే, ప్రతి ఒక్కరికీ ప్రతిరోజూ నిరంతర ప్రాతిపదికన న్యాయం అందాలి.

వ్యాసకర్త 'ఇండియా జస్టిస్ రిపోర్ట్' చీఫ్ ఎడిటర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

ఒక 'గుప్త' రచయిత

కామెంట్



కరణ్ థాపర్

అది ఎంతో కాలం నుంచీ అత్యంత రహస్యంగా ఉంటూ వచ్చింది. ఇప్పుడు దాన్ని తునాతునకలు చేయబోతున్నాను. నిజానికి ఆయన ఒక్కడే! కానీ బాహాటంగా రెండు జీవితాలు గడుపుతున్నారు. ఆయన ఎంతవరకూ వెళ్లారంటే, తనకోసం ఒక మారుపేరు సృష్టించుకున్నారు. ఆయనకు ఆ పేరుతో రెండో వృత్తి కూడా ఉంది.

ఆయన మనకున్న గొప్ప సామాజిక శాస్త్రవేత్తల్లో ఒకరు. ఈ హోదాతో ఆయన 21 పుస్తకాలు రాశారు. శివసేన మీద 'నేటివిజం ఇన్ మెట్రోపోలిస్', సిక్కుల ఐడెంటిటీ మీద 'ద కాంటెక్స్ట్ ఆఫ్ ఎత్నిసిటీ', రైతు జీవితం మీద 'రైవల్రీ అండ్ బ్రదర్‌హుడ్', రెండు ప్రపంచాల నడుమ చిక్కుకున్న ఇండియా మీద 'మిస్టేకెన్ మోడర్నిటీ', మారుతున్న ఇండియా ప్రొఫైల్ మీద 'ఫ్రమ్ పీపుల్ టు సిటిజెన్స్' వంటివి వీటిలో కొన్ని. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో వీటికి మంచి ఆదరణ లభించింది. ఆయన ఒక సామాజికవేత్త అని ఇప్పుడు మీకు తెలిసిపోయింది. అవునా?

ఆయన ఈ మధ్యకాలంలో మంచి కాలమిస్టుగానూ గుర్తింపు పొందారు. ప్రముఖ జాతీయ పత్రికల్లో ఆయన రాస్తున్న కాలమ్స్ ఆలోచనాత్మకంగా ఉంటాయని పాఠకులు మెచ్చుకుంటారు. అవి లోతైనవే అయినా అప్పుడప్పుడు మనల్ని డిస్టర్బ్ చేస్తాయి. ఆంగ్ల భాషతో ఆడుకోవడం ఆయన ప్రత్యేకత. ఆ తీరు చాలామందిని ఆకట్టుకుంటుంది. పదాలతో గారడీ చేస్తూ, రెండో హెన్రీ హిగ్గిన్స్ అనిపిస్తారు. పలు సందర్భోచిత పరిణామాలు ఆయన ద్వారానే మీ దృష్టిని ఆకర్షించి ఉంటాయంటే అతిశయోక్తి కాదు.

ఇదంతా ప్రజలకు బాగా తెలిసిన కథ. ఈ పార్శ్వం ద్వారానే ఆయన విద్వత్తు ప్రపంచానికి తెలిసింది. ఈ పునాది మీదే ఆయన ఖ్యాతి నిర్మితమైంది. 75 ఏళ్ల జీవితంలో పరిపక్వమైన వ్యక్తిత్వం ఆయనది. ఇప్పటికల్లా మీలో కొందరికైనా ఆయనెవరో తెలిసిపోయి ఉండాలి. అవునా?

అయితే, ఆయనలో మీకు తెలియని 'రెండో వ్యక్తి' ఉన్నాడు. అతడిని ఎంతో గుట్టుగా దాచి ఉంచాడు. ఓ పదేళ్లుగానో అంతకు ముందు నుంచో ఈ 'రెండో వ్యక్తి' మర్డర్ మిస్టరీలు, క్రైమ్ ఫిక్షన్లు రాస్తున్నాడు. ఇప్పటికి మూడు రచనలు చేశారు. అవి: లెడ్ టిన్ యెల్లో, లెటజ్ ప్రే ఫర్ టిమ్మీ, వాట్ ద విట్నెస్ డిడ్ నాట్ సీ. వీటికి సామాజిక శాస్త్రంతో ఎంత మాత్రం సంబంధం లేదు. ఆ వాసనలే ఉండవు. సిక్కుల ఐడెంటిటీ, శివసేన లేదా ఇండియా సంక్షోభాలు మచ్చుకైనా కనిపించవు. ఇవి పూర్తిగా అమెరికన్ ఇతివృత్తంతో లేదా అమెరికన్ పాత్రలతో సాగుతాయి. జనం ఆశలు, ఆకాంక్షలు, దౌర్బల్యాలు, వైఫల్యాలు, వారి జీవితాల్లో ఎదురయ్యే సంక్లిష్ట సమస్యల గురించి వీటిలో ఉంటుంది. మానవ నైజం మీద దృష్టి పెడతారు.

◆ ఆయన ఎంతవరకూ వెళ్లారంటే, తనకోసం ఒక మారు పేరు సృష్టించుకున్నారు. ఆయనకు ఆ పేరుతో రెండో వృత్తి కూడా ఉంది!

నేను ఈ కథల్లోకి వెళ్లను. ముందే తెలిస్తే మజా ఉండదు. జనం ఏ సందర్భంలో ఎలా మాట్లాడతారో ఆ తీరును పట్టుకునే నేర్పు ఆయన సొంతం. వారి మాటలే కాదు, ఆ మాటల యాస, ధ్వని కూడా ఈ రచనల్లో ప్రతిఫలిస్తాయి. పాత్రలు తమ స్వరాలతో సహా మన మనసులో తిష్ఠ వేసి కథనాన్ని చివరిదాకా చదివింపజేస్తాయి.

ఆయనలో మరో గొప్ప నైపుణ్యం ఉంది. వర్ణనలు చేసే తీరులో అది కనబడుతుంది. ఆ వర్ణనల్లో అలంకారాలు ఉండవు. పదాల ఆడంబరం ఉండదు. సన్నివేశాన్ని చిత్రీకరించే తీరు సునిశితంగా, పదునుగా, ఎంతో నిర్దిష్టంగా ఉంటుంది. ప్రకృతి దృశ్యాల వర్ణనలో ఆయనకు గొప్ప అభిరుచి ఉంది. అతి సాధారణ దృశ్యాలు సైతం జీవం పోసుకుని కళ్లెదుట దర్శనమిస్తాయి.

నేను చెబుతున్న వ్యక్తి పేరు డి.జి. రే (D.G. Rae). ఇది అసలు పేరు కాదు. ఆయన కలం పేరు. ఆ గొప్ప రచయిత ఎవరో ఈ కలం పేరులోనే హింట్ ఉంది. ఇదీ పి.డి.జేమ్స్ (బ్రిటిష్ క్రైమ్ నవలల రచయిత్రి) పెన్ నేమ్ లాంటిదే అనిపిస్తుంది. దీన్ని అవుననలేం, కాదనలేం. జేమ్స్ లానే ఈయనా పూర్తి పేరు వెల్లడించడానికి ఇష్టపడలేదు. అయితే, ఈ పొట్టి పేరులోని అక్షరాలు ఆయన అసలు పేరునే సూచిస్తాయి. జేమ్స్‌లా కాకుండా ఇవి ఈ రచయిత జెండర్‌ను దాచిపెట్టడం లేదు. తను స్త్రీని అంటూ మభ్యపెట్టడం లేదు.

కలం పేరు లోని చివరి భాగం ఇంటిపేరు. "Rae' అనేది బహుశ అమెరికన్ అయ్యుండే విదేశీ పేరుని ధ్వనిస్తుంది. ఉద్దేశపూర్వకంగానే తప్పుదారి పట్టించడానికి ఈ పొట్టి పేరు సృష్టించుకున్నట్లుంది. వాస్తవానికి, ఇది తన తల్లి వివాహ పూర్వపు బెంగాలీ ఇంటిపేరు. "Ray'. రెంటి ఉచ్చారణ (రే) ఒకటే అయినా స్పెల్లింగ్ మాత్రం వేరు.

మీరు ఎవరి గురించి చదువుతున్నారో ఆయన అసలు పేరు ఇక చెప్పేస్తున్నా... అది దీపాంకర్ గుప్తా. అయితే డి.జి. రే అని పిలిపించుకునేందుకే దీపాంకర్ ఇష్టపడతారు. ఆయన క్రైమ్ స్టోరీలు బావుంటాయి. ఈ మండు వేసవి మధ్యాహ్నాల్లో ఈ థ్రిల్లర్స్ చదువుతూ రిలాక్స్ అవ్వొచ్చు. నేనిప్పుడు ఆయన నాలుగో బుక్ ఎప్పుడెప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నా.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

అదిగో పులి... ఇదిగో తోక!

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్

గత వారం ఘటనలూ, పరిణామాలూ చూస్తే 'అదిగో పులి... ఇదిగో తోక' సామెత గుర్తుకొస్తోంది. విహారయాత్రలకు వెళ్లిన వారిని ఊచకోత కోసిన దుర్మార్గం ఎవరైనా ఖండించవలసినది, కన్నీరు కార్చవలసినది. నేరస్థులను పట్టుకుని, విచారించి, కఠినంగా శిక్షించమని కోరవలసినది. ఆ దుర్మార్గానికి కారకులైన వారిని పొరుగుదేశం ప్రోత్సహిస్తున్నదని, బుద్ధి చెప్పాలని భారత ప్రభుత్వం ఆ దేశంలోని 'టెర్రరిస్టుల స్థావరాలు' అని అనుమానం ఉన్న చోట్ల దాడి చేసింది. పాకిస్తాన్ ప్రభుత్వం డ్రోన్లతో ఎదురుదాడులు చేసింది. స్వయంగా భారత ప్రభుత్వ అధికారులే అది యుద్ధం కాదని ఎన్నోసార్లు అన్నారు. కాని లేని పులికి తోకలు వెతికి, తాము చూశామని ప్రచారం చేసి అమాయకులను నమ్మించేందుకు అనేక మంది వీరంగం వేశారు. అందులో బాధ్యతాయుతంగా ఉండవలసిన నాలుగో స్తంభమూ ఉంది. వ్యక్తులుగానూ, బృందాలుగానూ... భావజాల ప్రోత్సాహపు ఐటీ సెల్స్ ఉన్నాయి.

సున్నిత సందర్భంలో టీవీ ఛానళ్లు, యూట్యూబ్, వాట్సప్, ఫేస్ బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలూ గత వారంలో కోట్లాది అబద్ధాలను వండి వార్చాయి. టీవీ ఛానళ్ల వార్తా, విశ్లేషణా ప్రసార వేదికలు గనుక అక్కడ చెప్పే చిన్నపాటి అబద్ధమైనా, అర్ధసత్యమైనా బహుగుణీకృతమై ప్రచారంలోకి వస్తుంది. దాని ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఆ అవకాశాన్ని తప్పని సరిగా బాధ్యతాయుతంగా వాడాలి. కాని భారత ప్రధాన స్రవంతి ఛానళ్లన్నీ బాధ్యతా రాహిత్యంలో అవధులు దాటాయి.

'నిన్న రాత్రి 'ఆజ్ తక్' లాహోర్‌ను స్వాధీనం చేసుకుంది, 'జీన్యూస్' కరాచీని పట్టుకుంది. రిపబ్లిక్ టీవీ న్యూయార్క్‌ను స్వాధీనం చేసుకుంది. ఉదయానికల్లా వాళ్లు అన్నీ వెనక్కి ఇచ్చేశారు, మళ్లీ రాత్రి స్వాధీనం చేసుకోవడానికి!' అని మే 9 రాత్రి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మార్కండేయ ఖట్జూ చేసిన వ్యంగ్య ట్వీట్ పరిస్థితి ఎంత చేజారిందో చూపుతుంది. ఆ ట్వీట్‌లో ఆయన మూడు ఛానళ్ల పేర్లే ప్రస్తావించారు గాని, ఎటువంటి మినహాయింపు లేకుండా దాదాపు అన్ని ఛానళ్ల రిపోర్టర్లూ, యాంకర్లూ పోటీ పడి తామే స్వయంగా యుద్ధ క్షేత్రంలో ఉన్నట్టు, తమ ముందరే బాంబు దాడులు, వైమానిక దాడులు, డ్రోన్ దాడులు జరుగుతున్నట్టు అభినయించారు. తమ పని నిష్పక్షపాతంగా, వస్తుగతంగా, తటస్థంగా ప్రజలకు వార్తలు చెప్పడం మాత్రమే అనేది మరిచిపోయి, తామే ఒక పక్షం తీసుకుని, వార్తలు వండి వార్చారు. కేకలూ పెడబొబ్బలూ పెట్టారు. ప్రాంతీయ భాషా ఛానళ్లు, పత్రికలు కూడా ఆ టీవీ ఛానళ్లనూ సామాజిక మాధ్యమాలలో ఉద్దేశపూర్వకంగా వెలువడిన అబద్ధాలనూ అనుసరించాయి. మొత్తం మీద సత్యం కనబడకుండా పోయింది.



యుద్ధ మేఘాలు కమ్ముకున్నప్పుడు సత్యం మీద పొగమంచు కమ్మే మాట నిజమే. కాని వార్తామాధ్యమాల పని ఆ పొగమంచును చెదరగొట్టడం! దాన్ని పెంచడం కాదు! కాని సత్యం మీద పొగమంచు కమ్మే పని, నేరుగా అబద్ధాలు ప్రచారం చేసే పని సరిహద్దుకు అవతలా, ఇవతలా... ప్రచార మాధ్యమాలూ, సామాజిక మాధ్యమాలూ శాయశక్తులా చేశాయి.

ఆశ్చర్యమేమంటే, ఈ అబద్ధాల కాలపరిమితి కొన్ని గంటలు మాత్రమే. ఎందుకంటే, ఇక్కడ ఎన్ని అబద్ధాలు చెప్పినా కొన్ని గంటల్లోనే నిజమేమిటో ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తుంది. ఒకవేళ ప్రభుత్వం చెప్పేది కూడా పూర్తి నిజం కాదనుకుంటే అంతర్జాతీయ ప్రచార మాధ్యమాలు చూసే సాంకేతికత అందుబాటులో ఉంది. ఇవాళ్టి సమాచార విస్ఫోటనంలో దేశదేశాల రక్షణ వ్యవహారాల నిపుణులు ఆ యా ఘటనల మీద నిమిషాల్లోనే తమ విశ్లేషణ వినిపిస్తున్నారు. అంటే జర్నలిస్టులమని చెప్పుకునే అర్ణబ్ గోస్వామి వంటివారు ఎన్ని అరుపులు అరిచినా కొన్ని గంటల్లో అబద్ధాలని రుజువైపోయే అవకాశాలున్నాయి.

నిజాలు చెప్పే, అంతర్జాతీయ తటస్థ వార్తలు పునర్ముద్రించే వెబ్‌సైట్ల మీద ఆంక్షలు విధించిన ప్రభుత్వం, ఈ అబద్ధాల దుమారాన్ని మాత్రం యథావిధిగా సాగనిచ్చింది. ఈ అబద్ధాలు, అర్ధసత్యాలు ఒక ఎత్తయితే... కనీస మర్యాద, సభ్యత లేకుండా సంబంధం లేని వారిని లాగడం, తిట్లూ, దుర్భాషలూ కురిపించడం విపరీతంగా జరిగాయి. యుద్ధం వద్దన్నవారి మీద, శాంతి వాక్యాలు చెప్పినవారి మీద ద్వేషం వెదజల్లడం జరిగింది.

ఈ పరిణామం ఎంత దూరం పోయిందంటే... రిపబ్లిక్ ఛానల్‌కు సలహాదారుగా ఉన్న మేజర్ (రిటైర్డ్) గౌరవ్ ఆర్య... తన సొంత యూట్యూబ్ ఛానల్‌లో చేసిన వ్యాఖ్యలతో భారత ప్రభుత్వం దౌత్యస్థాయిలో క్షమాపణలు చెప్పుకోవలసిన పరిస్థితి వచ్చింది. ఆయన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చిని సువ్వర్ (పంది) అనీ, సువ్వర్ కె ఔలాద్ (పంది సంతానం) అనీ అసభ్యకరమైన మాటలెన్నో అన్నాడు. అక్కడ ఆయన చూపిన కారణం – ఇరాన్ మంత్రి భారత పర్యటనకు ముందు పాకిస్తాన్ పర్యటన చేశారని! ఆ వీడియో ఇరాన్‌లో కూడా వైరల్ అయి, న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం 'అతిథులను గౌరవించడం ఇరానియన్ సంస్కృతిలో చిరకాల సంప్రదాయం. ఇరానియన్లం అతిథులను దైవానికి ప్రియమైనవారిగా భావిస్తాం. మరి మీరో?' అని ట్వీట్ చేయగా, భారత ప్రభుత్వం అది 'ఒక ప్రైవేటు భారత పౌరుడి' అభిప్రాయం అనీ, తమకు దానితో సంబంధం లేదనీ వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది. మర్నాడే ఆ ఇరాన్ మంత్రి భారత్‌కు కూడా వచ్చి ఎన్నో ద్వైపాక్షిక, వాణిజ్య ఒప్పందాల మీద సంతకాలు చేశారు!

అలాగే, ఇరుదేశాల సైనికాధిపతులు కాల్పుల విరమణకు అంగీకరించారనే వార్త ప్రకటించినందుకు భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీద, ఆయన కుటుంబ సభ్యుల మీద బూతులు కురిపించారు. అటువంటి దాడులకు గురైనవారు మరెందరో ఉన్నారు.

యుద్ధంలో మొట్టమొదట మరణించేది సత్యం అంటారు. ప్రస్తుత సత్యానంతర యుగంలో మరణించడానికైనా, సజీవంగా ఉండడానికైనా సత్యానికి స్థానమే లేదు. భావోద్వేగాలదీ, మనోభావాలదీ మాత్రమే రాజ్యం! ఎంత రెచ్చగొడితే అంత వ్యాపారం, అంత జనాకర్షణ!!

వ్యాసకర్త 'వీక్షణం' ఎడిటర్

స్వల్ప ఆయువు

ధృతరాష్ట్రుడు విదురుడితో మాట్లాడుతూ 'మనుషుల ఆయువు వంద సంవత్సరాలైనా అతి తక్కువ మందే వందేళ్ళు జీవిస్తున్నారు. ఎక్కువ మంది వందేళ్ళ లోపే మరణిస్తున్నారు. ఎందుకు? దీని గురించి నీకేమైనా తెలిస్తే చెప్పు' అన్నాడు.

అందుకు విదురుడు, ఆరు అంశాలే మనిషి ఆయుష్షను తగ్గిస్తున్నాయన్నాడు. అవి – అహంకారం, అదే పనిగా వాగుతూ ఉండటం, త్యాగ గుణం లేకపోవడం, కోపావేశాలు, స్వార్థబుద్ధి, మిత్రులకు నమ్మక ద్రోహం చేయడం! ఏ విధంగా చూసినా ఈ ఆరూ ఎవరికీ మంచివి కావన్నాడు. 'నేనే గట్టివాడిని, నేనే ధనవంతుడిని, నేనే దాతను, నేనే మంచివాడిని, ఇతరులు దుష్టులు' అని అనుకోవడంతో గర్వం తలకెక్కుతుంది. గర్విష్ఠిని భగవంతుడు శీఘ్రమే అంతం చేసేస్తాడు. కనుక గర్వం లేకుండా ఉండటానికి తనలోని లోపాలను, తప్పులను చూసుకోవాలి. అదేపనిగా మాట్లాడేవాడు అనవసరమైన విషయాలను గురించి మాట్లాడి లేని పోని కయ్యాలకు కాలుదువ్వుతాడు. అందుకే పరమాత్మ భగవద్గీతలో 'పరుషమైన మాటలు మాట్లాడకపోవడం మంచిది. నిజమైనది ఏదో, ప్రియమైనది ఏదో, మంచిది ఏదో తెలుసుకుని మాట్లాడాలి' అన్నాడు.



జ్యోతిర్మయం

అన్నింటినీ మనమే అనుభవించాలనే ఆశ వల్ల మనలో త్యాగం చేయాలనే ఆలోచన పుట్టదు. 'మనం ఈ ప్రపంచంలో పుట్టిందే మన కోసం కాదు, ఇతరులకు సాయం చేయడానికే' అని తెలుసుకుంటే త్యాగ గుణం అలవడుతుంది.

మనిషికి ప్రథమ శత్రువు కోపం. కోపాన్ని జయించిన వాడే యోగి. అతనే ప్రపంచంలో సుఖపడతాడు. ఎవరు చెడు చేసినా ఎవరు మనల్ని కోపగించుకున్నా వాటిని సహించడం అలవాటు చేసుకోవాలి. స్వార్థమే అన్ని చెడులకూ కారణం. దీని నుంచి ఇవతలకు రావాలంటే మనలో మానవత్వం రవ్వంతైనా ఉండాలి. ఇక చివరగా, మిత్రులకు నమ్మక ద్రోహం చేయడం ఏ విధంగానూ సబబు కాదు. భగవంతుడు గీతలో చెప్పినట్లు అందరితోనూ మంచిగా ఉండాలి. ద్రోహచింతన తగదు. కరుణ ఉండాలి.

– యామిజాల జగదీశ్

జీతాల పెంపుపై హర్షం

సాక్షి, హైదరాబాద్: అప్‌గ్రేడ్ అయిన మినీ అంగన్‌వాడీలకు ప్రభుత్వం వేతనాలు పెంచినందుకు మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం మంత్రి సీతక్కను అసోసియేషన్ అధ్యక్షురాలు వరలక్ష్మి, సభ్యులు శంకరమ్మ, లక్ష్మి, శివమ్మ కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సర్కారు నిధులు రాక ప్రైవేటుతో దోస్తీ!

జేఎన్‌టీయూహెచ్ 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్'

- ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలతో కలిసి ఏర్పాటు
- రాష్ట్రంలోని టాప్ 12 కాలేజీలతో జట్టు
- నిధుల సమీకరణకు సరికొత్త మార్గం



సాక్షి, హైదరాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) కొత్తగా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలతో కలిసి దీనిని ముందుకు తీసుకెళ్తామని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ (వీసీ) ప్రొఫెసర్ జీకే రెడ్డి తెలిపారు. వర్సిటీకి స్వీయ నిధుల సమీకరణ దీని ప్రధానోద్దేశమని చెబుతున్నారు. యూనివర్సిటీకి ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. అనుబంధ గుర్తింపు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల నిర్వహణ, అన్ని కోర్సులకు విద్యార్థుల నుంచి వచ్చే ఫీజులు, కొన్ని రీసెర్చ్ ప్రాజెక్టుల వల్ల సమకూరే నిధులతోనే నడుస్తోంది. వర్సిటీకి భవనాలున్నా భూమి మాత్రం ఇప్పటికీ లీజు పద్ధతిలోనే ఉంది. కేపీహెచ్‌బీ హౌసింగ్ బోర్డ్‌కు సంబంధించిన భూమిని లీజుకు తీసుకున్నారు. ఇప్పుడిది రోడ్లు భవనాల శాఖ పరిధిలో ఉంది. దీనికి ఏటా రూ.కోటిపైనే లీజు చెల్లిస్తోంది. దీంతో పాటు అధ్యాపకుల వేతనాలు, నిర్వహణ ఖర్చులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణకు ఎక్సలెన్స్ తోడ్పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఏమిటీ ఎక్సలెన్స్?

ఒక్కో కాలేజీలో ఒక్కో బ్రాంచీకి మెరుగైన మౌలిక వసతులు ఉంటాయి. రీసెర్చ్‌కు అవసరమైన వాతావరణం ఉంటుంది. వివిధ రంగాల్లో నిపుణులైన విద్యార్థులు, ఫ్యాకల్టీ విభిన్న కాలేజీల్లో ఉండొచ్చు. రాష్ట్రంలోని టాప్ 12 కాలేజీలను జేఎన్‌టీయూహెచ్ గుర్తించి వాటితో భాగస్వామ్య ఒప్పందం చేసుకుంటుంది. ఈ కాలేజీలన్నీ కలిసి వివిధ రకాల పరిశోధన ప్రాజెక్టులు చేపడతాయి. ఇందులో విద్యార్థులనూ భాగస్వామ్యం చేస్తాయి. జేఎన్‌టీయూహెచ్ వంటి మెరుగైన విశ్వవిద్యాలయం భాగస్వామ్యంతో ప్రైవేటు కాలేజీల బ్రాండ్ మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. ఇదే కోణంలో ప్రైవేటు కాలేజీల్లో వసతులను జేఎన్‌టీయూహెచ్ సద్వినియోగం చేసుకుంటుంది. దీనివల్ల జాతీయ స్థాయిలో రీసెర్చ్ ప్రాజెక్టులు తెచ్చుకునే వీలుందని ప్రొఫెసర్ జీకే రెడ్డి తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ఎక్సలెన్స్‌ను తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నామని ఆయన చెప్పారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేశామని వెల్లడించారు.

'కాళేశ్వరం' అశాస్త్రీయ నిర్మాణం

బరాజ్‌లు కూలటానికి బాధ్యులెవరో తేల్చాలి

- దుర్వినియోగమైన నిధులు రికవరీ చేయాలి
- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, జస్టిస్ చంద్రకుమార్, పీజీ శాస్త్రి
- తెలంగాణ జలసాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమంతా లోపభూయిష్టంగా ఉందని, అందుకు బాధ్యులెవరో ప్రభుత్వం తేల్చాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. అత్యంత లోపాలతో కూడిన నిర్మాణాన్ని చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా దుర్వినియోగమైన ప్రజాధనాన్ని రికవరీ చేయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల కుంగుబాటుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక ఇచ్చిన నేపథ్యంలో గురువారం తెలంగాణ జల సాధన సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. ఎగువ నుంచి దిగువకు నీటి ప్రవాహం వచ్చిన తర్వాత తిరిగి ఎగువకు చేర్చే ప్రయత్నం ఆమోదయోగ్యం కాదని, కానీ కాళేశ్వరం ప్రాజెక్టు సహజత్వానికి విరుద్ధంగా నిర్మించారని విమర్శించారు. అందులోనూ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కట్టడంతో నిర్మాణాలు కూలిపోతున్నాయని పేర్కొన్నారు. ఒక ప్రాజెక్టు నిర్మిస్తే వంద సంవత్సరాలు ఉపయోగంలో ఉండాలని, కాళేశ్వరం ఏడాదిన్నరలోపే కూలిపోతోందని అన్నారు. రూ. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులు నిరుపయోగంగా మారటానికి బాధ్యులు ఎవరో ప్రభుత్వం గుర్తించాలని కోరారు.

వేగంగా శిక్షలు పడాలి: జస్టిస్ చంద్రకుమార్

ప్రస్తుతం సమాజంలో అవినీతికి పాల్పడుతున్న వారు యథేచ్ఛగా జీవిస్తున్నారని, వారిపై కేసులు నమోదైనప్పటికీ అవి తేలేనాటికి ఏళ్లు గడుస్తున్నాయని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఇలాంటి అవినీతిపరుల భరతం పట్టాలంటే వేగంగా శిక్షలు విధించడంతో పాటు దుర్వినియోగమైన సొమ్మును రికవరీ చేయాలని అభిప్రాయపడ్డారు. తుమ్మిడిహెట్టి వద్ద గోదావరిపై ప్రాజెక్టును నిర్మించాలని, అక్కడి నుంచి కిందకు నీటిని గ్రావిటీ ద్వారా పంపిణీ చేసే అవకాశం ఉంటుందని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమంతా అశాస్త్రీయంగా ఉందని ప్రఖ్యాత ఇంజనీర్, వరంగల్ నిట్ మాజీ డైరెక్టర్ పీజీ శాస్త్రి విమర్శించారు. బాక్రానంగల్, ధవళేశ్వరం ప్రాజెక్టులు వందల సంవత్సరాలైనా చెక్కుచెదరలేదని, కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రం మూడేళ్లకే కూలిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు సంబంధించిన లోపాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్, వినాయకరెడ్డి, పలువురు రిటైర్డ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బాటకు సన్నద్ధమవ్వండి

- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలు నిర్వహిస్తున్న బడిబాట మాదిరిగా అంగన్‌వాడీల బాట చేపట్టాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపు నిచ్చారు. 'అమ్మమాట అంగన్‌వాడీ బాట' అనే నినాదంతో క్షేత్రస్థాయిలో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. గురువారం సచివాలయం నుంచి జిల్లా సంక్షేమాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యాసంవత్సరం ప్రారంభంనాటికల్లా అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి సౌకర్యాలతో సిద్ధం చేయాలని, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలను ఈ కేంద్రాల్లో చేరేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీల్లో ఫర్నిచర్, ఆట వస్తువులు, ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత జిల్లా సంక్షేమాధికారులపై ఉందన్నారు. కొత్తగా మంజూరు చేసిన 85 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం కోసం, మరో 457 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉపాధిహామీ నిధి కోటా ద్వారా ఒక్కో కేంద్రానికి రూ.12 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశామని, పనులు తక్షణమే ప్రారంభించాలని సూచించారు. మరో 500 అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరిస్తున్నామని తెలిపారు.

ఎన్‌ఎస్పీసీఎల్‌తో సింగరేణి ఒప్పందం

- 5 లక్షల టన్నుల బొగ్గు సరఫరాకు అంగీకారం

సాక్షి, హైదరాబాద్ : సింగరేణి ఈ ఏడాది ఐదు లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేసేందుకు ఎన్‌ఎస్పీసీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు గురువారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్డీఎం సుభాని సమక్షంలో సింగరేణి జనరల్ మేనేజర్ మార్కెటింగ్ ఎన్వి.రాజశేఖర్‌రావు, ఎన్‌ఎస్పీసీఎల్ సీఈవో దివాకర్ కౌశల్, జనరల్ మేనేజర్లు నీల్‌కమల్, పలాశ్‌లు అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. ప్రముఖ జాతీయ విద్యుత్ ఉత్పత్తి సంస్థ అయిన ఎన్టీపీసీ, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు సంయుక్తంగా ఏర్పాటు చేసుకున్న జాయింట్ వెంచర్ కంపెనీనే ఎన్‌ఎస్పీసీఎల్. ఇది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో దుర్గాపూర్ వద్ద ఉంది. ఈ థర్మల్ విద్యుత్‌కేంద్రానికి సింగరేణి సంస్థ నాణ్యత గల బొగ్గును తగిన పరిమాణంలో సకాలంలో అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్లు శ్రీనివాసరాజు, సురేందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో యువతి మృతి

- తూర్పార మిషన్ వద్ద విద్యుదాఘాతంతో ప్రమాదం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): ధాన్యం కొనుగోలు కేంద్రంలో విద్యుదాఘాతానికి గురై ఓ యువతి మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెంలో అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. అబ్బుగూడెం గ్రామానికి చెందిన మామిడి రెమల్య(20) తన కుటుంబసభ్యులతో కలిసి గురువారం కొనుగోలు కేంద్రంలో పనికి వచ్చింది. ఆమె సోదరుడు ప్రేమ్‌కుమార్ ధాన్యం తూర్పార పట్టే మిషన్‌కు విద్యుత్ వైర్లు అమరుస్తుండగా విద్యుత్ సరఫరా జరిగింది. ఆ సమయాన మిషన్‌ను పట్టుకొని ఉన్న రెమల్య విద్యుదాఘాతంతో అపస్మారకస్థితికి చేరింది. దీంతో 108లో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. ఈ ఘటనలో మృతురాలి సోదరి శ్రావణికి సైతం గాయాలయ్యాయి. అప్పటివరకు తమతో కలిసి ఉన్న రెమల్య మృతితో ఆమె కుటుంబీకులు, సహచర కూలీలు కన్నీరుమున్నీరయ్యారు.

'సాగర్'లో కొడుకును తోసి తల్లి ఆత్మహత్య

- భర్త బలవన్మరణంతో మనస్తాపం
- భారమైన కుటుంబ పోషణ



ప్రమీల



అక్షయ్

నిజాంసాగర్ (జుక్కల్): భర్త బలవన్మరణం చెందడం, ఇంట్లో కుటుంబ కలహాలతో మానసిక వేదనకు గురైన మహిళ తన ఏడేళ్ల కుమారుడితో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకుంది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం మునిగేపల్లి గ్రామానికి చెందిన ధార ప్రమీల (37), సాయిలు దంపతులకు కుమారుడు అక్షయ్, కూతురు హారిక ఉన్నారు. అప్పుల బాధ కారణంగా సాయిలు గత నెల 24న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త మృతితో విషాదంలోకి వెళ్లిన ప్రమీలకు కుటుంబ పోషణ భారంగా మారింది. అంతేగాకుండా అత్తగారింట్లో వేధింపులు, కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన ప్రమీల ఈనెల 14న బ్యాంకుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి కుమారుడిని వెంటతీసుకెళ్లింది. నిజాంపేట నుంచి మాసాన్‌పల్లి మీదుగా నిజాంసాగర్ ప్రాజెక్టుకు వచ్చింది. కుమారుడిని నీళ్లలోకి తోసి తాను కూడా దూకింది. ప్రమీల, అక్షయ్ రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు చుట్టుపక్కల వెతికారు. గురువారం ఉదయం నిజాంసాగర్ ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లిన జాలరులకు మృతదేహాలు కన్పించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ ప్రాజెక్టు వద్దకు చేరుకుని తల్లి, కుమారుడి మృతదేహాలను జాలర్ల సహాయంతో బయటకు తీయించారు. ప్రమీల తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'ఆర్టీఐలో బీసీలకు స్థానం లేదా?'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ పదవుల్లో బీసీలకు స్థానం ఇవ్వరా? అని సీఎం రేవంత్‌రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ప్రశ్నించారు. జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీలు ఆర్టీఐకి అర్హులు కాలేరా? అని గురువారం ఒక ప్రకటనలో నిలదీశారు. కేవలం ఒకే కులానికి కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు.

'విష్ణు నివాసం'లో చోరీ

తిరుపతి క్రైమ్: తిరుమల దర్శనానికి వచ్చిన భక్తుల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన గురువారం జరిగింది. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడుకు చెందిన విజయ్ భాస్కర్ తమ కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారి దర్శనం కోసం వచ్చారు. గురువారం విష్ణు నివాసానికి చేరుకుని సేదతీరుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు అతని బ్యాగులోని వస్తువులను దొంగతనానికి పాల్పడ్డారు. 32 గ్రాములు విలువచేసే నల్లపూసల దండ, రూ.1,20,000 నగదు, 40 వేల రూపాయలు విలువచేసే మొబైల్ ఫోను చోరీకి పాల్పడినట్టుగా ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.





'తీస్తా ప్రహార్' విన్యాసాల్లో భాగంగా గురువారం పశ్చిమబెంగాల్‌లోని సిలిగురి సమీప తీస్తా ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో సైనిక విన్యాసాలు చేస్తున్న పదాతి, శతఘ్ని, వైమానిక దళాలు. ఇటీవల సైన్యానికి అప్పగించిన నూతన తరం ఆయుధాలు, ఆయుధ వ్యవస్థలను విన్యాసాల్లో భాగంగా ఈ మూడు విభాగాల బలగాలు పరీక్షించాయి. పదాతి, వైమానిక, శతఘ్ని దళాలు 'సమీకృత రణక్షేత్రం'లో చక్కటి సమన్వయంగా విన్యాసాలు పూర్తిచేశాయని రక్షణ శాఖ ప్రకటించింది. ఈశాన్యభారతాన్ని, ఇతర భారతదేశ ప్రాంతాలతో కలిపే అత్యంత ఇరుకైన, వ్యూహాత్మకంగా చాలా కీలకమైన 'చికెన్ నెక్' ప్రాంతానికి అతి సమీపంలో ఈ విన్యాసాలను చేయడం గమనార్హం.

అమెరికా ఉత్పత్తులకు భారత్‌లో జీరో టారిఫ్!

ఇండియానే ఈ ఆఫర్ ఇచ్చింది

- సంచలన ప్రకటన చేసిన ట్రంప్
- అలాంటిదేమీ లేదని స్పష్టం చేసిన భారత్
- ఇండియాలో ఐఫోన్‌లు తయారు చేయొద్దని యాపిల్‌కు ట్రంప్ సలహా

దోహా: భారత్, పాక్ పరస్పర సైనిక చర్యలతో పరిస్థితి అత్యంత ఉద్రిక్తంగా ఉన్న వేళ కాల్పుల విరమణకు ఇరుదేశాలు సమ్మతించాయని అందరికంటే ముందే ప్రకటించి అభాసుపాలైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు తొందరపాటు ప్రకటన చేశారు. టారిఫ్‌లు విధించకుండానే అమెరికా నుంచి వస్తూత్పత్తుల దిగుమతికి భారత్ అత్యుత్సాహం చూపిస్తోందని ట్రంప్ గురువారం అనూహ్య ప్రకటన చేశారు. దీంతో వెంటనే భారత్ స్పందించింది. అలాంటిదేమీ లేదని, టారిఫ్‌ల ఖరారుపై విస్తృతస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, చర్చలు ఇప్పట్లో ముగిసిపోవని భారత్ స్పష్టంచేసింది. జీరో టారిఫ్ ప్రతిపాదన లేదని కుండబద్దలు కొట్టింది.

మోదీ మౌనమేల?: కాంగ్రెస్

ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు స్పందించట్లేరని విపక్ష కాంగ్రెస్ ప్రశ్నించింది. '' అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఖరారు చర్చల కోసం మన వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వాషింగ్టన్ డీసీలో పర్యటిస్తున్నారు. ఇదే సమయంలో ట్రంప్ జీరో టారిఫ్ అంటూ ప్రకటన చేశారు. ఈ సున్నా టారిఫ్‌కు, ఆపరేషన్ సిందూర్ ఆగిపోవడానికి మధ్య సంబంధమేంటి?. ఈ అంశంలో మోదీ ఎందుకు మౌనం వహించారు?. అమెరికాతో డీల్ కుదుర్చుకునేందుకు మోదీ ఏమేం అంశాల్లో తలూపారు?'' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ 'ఎక్స్'లో ప్రశ్నించారు.



ట్రంప్ ఏం మాట్లాడారు?

గురువారం ఖతార్ రాజధాని దోహాలో వ్యాపారదిగ్గజాలు, సంస్థలతో ట్రంప్ సమావేశమయ్యారు. చైనా, అమెరికా టారిఫ్‌ల యుద్ధం నేపథ్యంలో భారత్‌లో అత్యధికంగా ఐఫోన్‌లను తయారుచేసి అమెరికాకు ఎగుమతి చేయబోతున్నట్లు యాపిల్ సంస్థ ఇటీవల ప్రకటించడం తెల్సిందే. ఈ విషయం నచ్చని ట్రంప్ ఇదే అంశాన్ని దోహా భేటీలో యాపిల్ సీఈఓ టిమ్ కుక్ వద్ద ప్రస్తావించారు. ''అమెరికాలో యాపిల్ సంస్థను ఇంతబాగా చూసుకుంటున్నా మీరేమో భారత్‌లో ఐఫోన్‌లను మరింత ఎక్కువగా తయారుచేస్తామంటున్నారు. అక్కడే కర్మాగారాలను విస్తరిస్తున్నారు. ఇది నాకు అస్సలు నచ్చలేదు. అమెరికా ఉత్పత్తులపై భారత్ చాలా ఎక్కువ టారిఫ్‌లు విధిస్తోంది. ప్రపంచంలో అధిక టారిఫ్‌లు విధించే దేశాల్లో భారత్ కూడా ఉంది. టారిఫ్‌లు పెంచాక అత్యధిక ధరలకు మీరు భారత్‌లో వస్తువులను విక్రయించడం చాలా కష్టమవుతుంది. మీకో విషయం చెప్పనా. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి భారత్ ఒక చక్కని ప్రతిపాదన తెచ్చింది. అసలు టారిఫ్‌లే లేకుండా వస్తువులను భారత్‌లోకి దిగుమతి చేసుకోవడానికి వాళ్లు దాదాపు అంగీకారం తెలిపారు. మీరు భారత్‌లో ఐఫోన్ల తయారీ కర్మాగారాలను నిర్మించినా అక్కడి సర్కార్ మిమ్మల్ని అస్సలు పట్టించుకోలేదు. వాళ్లకు స్వప్రయోజనాలే ముఖ్యం'' అని టిమ్‌కుక్‌తో ట్రంప్ మాట్లాడారు. ఈ విషయాలను మీడియాకు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. తనతో మాట్లాడిన తర్వాత అమెరికాలో ఉత్పత్తి పెంచేందుకు టిమ్‌కుక్ అంగీకారం తెలిపారని ట్రంప్ ప్రకటించారు. భారతీయ ఉత్పత్తులపై 26 శాతం టారిఫ్ విధిస్తామని ట్రంప్ ఏప్రిల్ 9వ తేదీన ప్రకటించారు. అయితే 90 రోజులపాటు ఈ పెంపును తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు తర్వాత ట్రంప్ వెల్లడించడం తెల్సిందే.



ఖండించిన భారత్

ట్రంప్ మాటల్లో వాస్తవం లేదని భారత్ గురువారం ప్రకటించింది. ఈ విషయమై భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పందించారు. '' టారిఫ్‌లుసహా సమగ్ర వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా మధ్య విస్తృతస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. ఇవి సంక్లిష్టమైనవి. చర్చలు ముగిసిపోలేదు. ప్రతి అంశంపైనా కూలంకషంగా చర్చ జరుగుతోంది. ఇప్పటిదాకా ఏ అంశంపైనా తుది నిర్ణయాలు వెలువడలేదు. ఒప్పందం కుదుర్చుకుంటే అది ఇరుపక్షాలకు ప్రయోజనకారిగా ఉండాలి. రెండు దేశాలకూ లబ్ధిచేకూరాలి. మేం ఇదే కోరుకుంటున్నాం. చర్చలు పూర్తికాకుండానే దీనిపై మాట్లాడటం తొందరపాటు చర్యే అవుతుంది'' అని జైశంకర్ వ్యాఖ్యానించారు. 2024లో ఇరుదేశాల మధ్య 129 బిలియన్ డాలర్ల విలువైన వాణిజ్యం జరిగింది.

తుర్కియేకు భారీ ఝలక్

భారతీయ ఎయిర్‌పోర్ట్‌ల నుంచి తుర్కియే సంస్థ ఔట్

- సెలెబీ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్‌కు ఇచ్చిన భద్రతా క్లియరెన్స్ రద్దు
- సినిమా, ప్రీవెడ్డింగ్ షూట్‌ల కోసం తుర్కియే, అజర్‌బైజాన్‌లకు వెళ్లొద్దని పౌరులకు సూచన !
- పాకిస్తాన్‌కు తుర్కియే సాయంపై భారత్ ఆగ్రహ ఫలితం
- ఊపందుకున్న 'బాయ్‌కాట్ తుర్కియే' నినాదం

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ వేళ ఆత్మాహుతి డ్రోన్లు, శిక్షణా సిబ్బందిని పాకిస్తాన్‌కు తరలించిన పాపానికి తుర్కియేపై భారత్ ఆగ్రహం మరింత ఎక్కువైంది. దీంతో తుర్కియేపై నిరసన చర్యల్లో భాగంగా ఆ దేశానికి చెందిన వైమానిక సేవల సంస్థకు గతంలో ఇచ్చిన భద్రతా క్లియరెన్స్‌ను భారత్ రద్దుచేసింది. ఈ మేరకు సెలెబీ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్‌కు ఇచ్చిన క్లియరెన్స్‌ను రద్దుచేస్తున్నట్లు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ(బీసీఏఎస్) గురువారం ప్రకటించింది. తుర్కియే మాతృసంస్థకు చెందిన రెండు అనుబంధ సంస్థలను అంతర్జాతీయ విమానాశ్రయాల్లో విమానాల వద్ద గ్రౌండ్ హ్యాండ్లింగ్, కార్గో మేనేజ్‌మెంట్, ఎయిర్‌సైడ్ ఆపరేషన్స్ విధుల నుంచి తప్పించారు. హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, గోవా, అహ్మదాబాద్, కానూర్, కొచ్చిన్‌లలో సెలెబీ అనుబంధ సంస్థలే గత 15 సంవత్సరాలుగా పలు రకాల సేవలు అందించాయి. ఈ సంస్థల సిబ్బందే ఇన్నాళ్లూ విమానాలను నిలిపి ఉంచే హై సెక్యూరిటీ జోన్, ఎయిర్‌సైడ్ జోన్లలో విధుల్లో ఉన్నారు. ప్రయాణికుల బ్యాగులు, కార్గో పనులను వీళ్లే చూసుకున్నారు. అంతర్జాతీయ సర్వీసుల్లో కూడా ఈ బాధ్యతలను వీళ్లే నెరవేర్చారు. ఇకపై ఈ పనులను వేరే సంస్థలకు అప్పగించనున్నారు. బీసీఏఎస్ ఆదేశాలకు అనుగుణంగా ఇకపై ఢిల్లీలో విమానాశ్రయంలో కార్గో సేవలు అందిస్తున్న 'సెలెబీ ఢిల్లీ కార్గో టెర్మినల్ మేనేజ్‌మెంట్ ఇండియా' సంస్థతో తెగతెంపులు చేసుకుంటున్నట్లు ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (డీఐఏఎల్) గురువారం ప్రకటించింది. ప్రయాణికులకు, సరకు రవాణాకు ఎలాంటి ఇబ్బంది, ఆటంకం కల్గకుండా సత్వర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది.

జామియా మిలియా సైతం..

విద్యా సంస్థలు సైతం బహిష్కరణ నినాదం చేస్తున్నాయి. ఇప్పటికే జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం తుర్కియేకు చెందిన ఇనోను యూనివర్సిటీతో ఒప్పందాన్ని రద్దుచేసుకుంది. తుర్కియేలోని విద్యాసంస్థలతో ఒప్పందాలను తక్షణం నిలిపేస్తున్నట్లు ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ గురువారం ప్రకటించింది. యూనుస్ అమీర్ ఇన్‌స్టిట్యూట్‌తో ఒప్పందం ఆపేస్తున్నట్లు హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ప్రకటించింది. పుణె వ్యాపారులు సైతం తుర్కియే ఆపిల్‌లను రోడ్డుపై పారబోసి నిరసన తెలిపారు. ఇకపై తుర్కియే నుంచి పండ్ల దిగుమతులు ఆపేస్తామన్న ట్రేడర్ల నిర్ణయాన్ని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ స్వాగతించారు.

తుర్కియే, అజర్‌బైజాన్‌కు వెళ్లొద్దు!

'బాయ్‌కాట్ తుర్కియే' నినాదం జోరందుకున్న నేప థ్యంలో ఇకపై పర్యాటకం, ప్రీ–వెడ్డింగ్, సినిమాల చిత్రీకరణల కోసం తుర్కియే, అజర్‌బైజాన్‌లకు వెళ్లొద్దని భారతీయ పౌరులకు కేంద్ర ప్రభుత్వం సూచన చేయబోతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. తుర్కియేలో షూటింగ్ కోణంలో సినీరంగానికి ప్రభుత్వ మద్దతు ఆపేయనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. సినిమా కార్మిక సంఘాలు సైతం కేంద్రసర్కార్ నిర్ణయానికి మద్దతు పలికాయి. భారతీయ నటులు, నిర్మాతలు తుర్కియేకు ప్రాధాన్యత నివ్వడాన్ని పూర్తిగా మానుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ వెస్టర్న్ ఇండియా సినీ ఎంప్లాయీస్(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ), ఆలిండియా సినీ వర్కర్స్ అసోసియేషన్(ఏఐసీడబ్ల్యూఏ) కోరాయి. కార్పొరేట్ సమావేశాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను తుర్కియేలో జరపొద్దని ప్రభుత్వం పలు రంగాలకు సూచించనున్నట్లు సమాచారం. ఇప్పటికే పర్యాటకానికి సంబంధించిన పలు భారతీయ ట్రావెలింగ్ ఏజెన్సీలు బుకింగ్‌లు నిలిపేశాయి. అక్కడి వెళ్లాలని గతంలో భావించిన వాళ్లు భారీ సంఖ్యలో క్యాన్సలేషన్‌లు చేసుకుంటున్నారు.



శ్రీనగర్‌లోని బాదామీ బాగ్ కంటోన్మెంట్‌లో మహిళా జవాన్లతో రాజ్‌నాథ్ కరచాలనం

పాక్ అణ్వాయుధాలను మీరే పర్యవేక్షించాలి

అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు రాజ్‌నాథ్ సింగ్ విజ్ఞప్తి

శ్రీనగర్: అత్యంత దుష్ట దేశమైన పాకిస్తాన్ వద్ద అణ్వాయుధాలు ఉండడం ప్రపంచానికి ఎప్పటికైనా ప్రమాదకరమేనని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తేల్చిచెప్పారు. వాటిని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) పర్యవేక్షణలోకి తీసుకురావాలని అన్నారు. పాక్ అణ్వాయుధాలు ఐఏఈఏ పరిధిలో ఉంటేనే ప్రపంచ భద్రతకు ముప్పు వాటిల్లదని స్పష్టంచేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత రాజ్‌నాథ్ సింగ్ తొలిసారిగా గురువారం జమ్మూకశ్మీర్‌లో పర్యటించారు. పహల్గాం ఉగ్రవాద దాడి మృతులతోపాటు పాకిస్తాన్‌పై దాడిలో ప్రాణత్యాగం చేసిన జవాన్లకు నివాళులర్పించారు. శ్రీనగర్‌లోని బాదామీబాగ్ కంటోన్మెంట్‌లో సైనికులను ఉద్దేశించి మాట్లాడారు. పాక్ అణు బెదిరింపులను భారత్ ఏమాత్రం లెక్కచేయలేదని గుర్తుచేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేసే విషయంలో మన పట్టుదలను దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చని అన్నారు. భారత్‌పై అణ్వాయుధాలు ప్రయోగిస్తామని పాక్ ఎన్నోసార్లు బెదిరించిందని తెలిపారు. పాక్ నిజస్వరూపం ప్రపంచం మొత్తం చూసిందని పేర్కొన్నారు. ధూర్త దేశం చేతిలో అణ్వాయుధాలు ఉండడం సరైనదేనా? అని ప్రపంచ దేశాలను రాజ్‌నాథ్ ప్రశ్నించారు. అందుకే పాక్ అణ్వాయుధాలను ఐఏఈఏ పరిధిలోకి తీసుకురావాలని స్పష్టంచేశారు. ఉగ్రవాదంపై మన పోరాటంలో 'ఆపరేషన్ సిందూర్' అతిపెద్ద చర్య అని వెల్లడించారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించే విషయంలో ఎంతదూరమైన వెళ్తామని నిరూపించామని పేర్కొన్నారు.

మత్స్య రంగం పురోగతిని సమీక్షించిన ప్రధాని

న్యూఢిల్లీ: దేశంలో మత్స్య రంగం పురోగతిని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం సమీక్షించారు. ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీప్–సీ ఫిషింగ్, సీఫుడ్ ఎగుమతులు, మత్స్య రంగం పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. మత్స్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి మార్గాల అన్వేషించడం కోసం సమావేశం నిర్వహించినట్లు ప్రధాని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఎగుమతులను ఎలా మెరుగుపరచాలి, డీప్–సీ ఫిషింగ్‌పై దృష్టిని ఎలా పెంచాలనే అంశాలపై మేధోమథనం జరిగిందని పేర్కొన్నారు. ఇటీవల మత్స్య శాఖ ముంబైలో రూ.255 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించింది. కోస్టల్ స్టేట్స్ ఫిషరీస్ మీట్–2025ను కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో సమీక్షా ఏర్పాటు చేశారు.

ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం

- 48 గంటల్లో రెండో ఎన్‌కౌంటర్
- ముగ్గురు ఉగ్రవాదులూ పుల్వామా వాసులే
- లొంగిపోవాలని తల్లి వేడుకున్నా వినని ఉగ్రవాది
- ముష్కరులు దాక్కున్న చోటు వీడియోలు వైరల్

త్రాల్: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లా, త్రాల్ ప్రాంతంలోని నాదిర్ గ్రామంలో భద్రతా దళాలతో జరిగిన కాల్పుల్లో ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు మృతి చెందారు. గురువారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన ముగ్గురు ఉగ్రవాదులను ఆసిఫ్ అహ్మద్ షేక్, అమీర్ నజీర్ వని, యావర్ అహ్మద్ భట్‌గా గుర్తించారు. వీరందరూ పుల్వామా జిల్లా వాసులే. ఆ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్లు నిర్దిష్ట సమాచారం అందుకున్న భద్రతా దళాలు కార్డన్, సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఉగ్రవాదుల జాడ కోసం భద్రతాదళాలు డ్రోన్లను ఉపయోగించాయి. ఉగ్రవాదులను గుర్తించిన అనంతరం.. లొంగిపోవాలని కోరాయి. అయితే, భద్రతా సిబ్బందిని చూసిన వెంటనే, ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. మూడు గంటల పాటు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు మృతి చెందారు. ఆ ప్రాంతంలో ఇంకా ఉగ్రవాదులు ఉండొచ్చని భద్రతా దళాలు భావిస్తున్నాయి. దీంతో ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌లో 48 గంటల్లో జరిగిన రెండో ఎన్‌కౌంటర్ ఇది. మంగళవారం షోపియాన్ జిల్లాలోని కెల్లర్ ప్రాంతంలో జరిగిన ఆపరేషన్‌లో ముగ్గురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతమయిన సంగతి తెలిసిందే.

లొంగిపోవాలని తల్లి వేడుకున్నా...

మరణించిన ఉగ్రవాదుల్లో ఒకరైన అమీర్ నజీర్ ఎన్‌కౌంటర్‌కు ముందు తల్లితో మాట్లాడిన వీడియో ఒకటి బయటికి వచ్చింది. ఎన్‌కౌంటర్‌కు ముందు చివరి క్షణాల్లో నజీర్ తను దాక్కున్న ప్రదేశం నుంచి తల్లికి వీడియో కాల్ చేశాడు. తన తల్లితో, సోదరితో మాట్లాడాడు. అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకోవద్దని, భద్రతాదళాలకు లొంగిపోవాలని నజీర్‌ను తల్లి వేడుకుంది. ఏకే 47 పట్టుకుని ఉన్న నజీర్ లొంగిపోవడానికి నిరాకరించాడు. 'సైన్యాన్ని నా ముందుకు రానివ్వండి. అప్పుడు చూస్తా' అని బదులిచ్చి కాల్ కట్ చేశాడు.

ఎన్‌ఎల్‌యూ విశిష్ట ప్రొఫెసర్‌గా చంద్రచూడ్

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ) ప్రొఫెసర్‌గా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) డీవై చంద్రచూడ్ విశిష్ట ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. ఢిల్లీ ఎన్ఎల్‌యూ గురువారం 'ఎక్స్'లో ఈ విషయం ప్రకటించింది. 'మాజీ సీజేఐ డాక్టర్ జస్టిస్ డీవై చంద్రచూడ్‌ను నేషనల్ లా యూనివర్సిటీలో విశిష్ట ప్రొఫెసర్‌గా స్వాగతించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాం'అని పేర్కొంది. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ జీఎస్ బాజ్‌పాయ్, చంద్రచూడ్‌ల ఫొటోను షేర్ చేసింది. వర్సిటీలో ఏర్పాటు కానున్న 'సెంటర్ ఫర్ కాన్‌స్టిట్యూషనల్ స్టడీస్' విభాగానికి ఆయన సారథ్యం వహిస్తారని తెలిపింది. 50వ సీజేఐగా రెండేళ్లపాటు చేసిన చంద్రచూడ్ 2024 నవంబర్‌లో పదవీ విరమణ చేయడం తెల్సిందే.

హైకోర్టుకు వెళ్లి క్షమాపణ చెప్పండి

మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షాకు సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ: కల్నల్ సోఫియా ఖురేషీ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి విజయ్ షాపై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇష్టానుసారంగా నోరుపారేసుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశమంతా ఆందోళనలో ఉన్న సమయంలో ఒక మహిళా సైనికాధికారిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం సహించరాని తప్పిదమని తేల్చిచెప్పింది. తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ విజయ్ షా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాలను నిలిపివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. బాధ్యత కలిగిన వ్యక్తులు ఏదైనా మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని, సున్నితంగా వ్యవహరించాలని పేర్కొంది. మధ్యప్రదేశ్ హైకోర్టుకు వెళ్లి క్షమాపణ చెప్పండి అని విజయ్ షాను ఆదేశించింది. కల్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు విజయ్ షాపై కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ న్యాయవాది పిటిషన్ దాఖలు చేయగా, సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇలాంటి పబ్లిసిటీ పిటిషన్లను విచారణకు స్వీకరించబోమని తేల్చిచెప్పింది. పత్రికల్లో వార్తలు చదివి ఎవరైనా పిటిషన్లు దాఖలు చేయొచ్చని పేర్కొంది. విజయ్ షాపై మధ్యప్రదేశ్ హైకోర్టు ఇప్పటికే సుమోటోగా విచారణ ప్రారంభించినట్లు ధర్మాసనం గుర్తుచేసింది. ఉగ్రవాదుల సోదరి సోఫియా ఖురేషీ అంటూ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేగిన సంగతి తెలిసిందే.

'వక్ఫ్' పిటిషన్లపై ఈ నెల 20న విచారణ

మధ్యంతర ఉత్తర్వుపై ఆ రోజే నిర్ణయం



న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) చట్టం–2025 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 20న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు గురువారం తెలియజేసింది. పిటిషనర్లకు మధ్యంతర ఊరట కల్పించే అంశాన్ని ఆరోజే నిర్ణయిస్తామని వెల్లడించింది. చట్టం అమలును కేంద్ర ప్రభుత్వం నిలిపివేసేలా మధ్యంతర ఉత్తర్వు జారీ చేయాలని పిటిషనర్లు కోరగా, దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ అగస్టీన్ జార్జి మాసీతో కూడిన డివిజన్ బెంచ్ స్పందించింది. ఈ నెల 20న నిర్ణయం తీసుకుంటామని స్పష్టంచేసింది. వక్ఫ్ (సవరణ) చట్టంలోని వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ మండలి, బోర్డుల్లో ముస్లిమేతరులను నామినేట్ చేయడం, వక్ఫ్ కింద ప్రభుత్వ భూములను గుర్తించడం అనే మూడు అంశాలపైనే ప్రధానంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నట్లు వెల్లడించింది. దీనిపై ఈ నెల 19లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని పిటిషనర్ల తరఫున హాజరైన కపిల్ సిబల్, కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు ధర్మాసనం సూచించింది.

పాకిస్తాన్‌లో అణుధార్మికత లీకేజీ జరగలేదు

సోషల్ మీడియా ప్రచారం నమ్మొద్దు ● అణుశక్తి సంస్థ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో, ఆ తర్వాత పాకిస్తాన్‌లోని అణ్వాయుధ కేంద్రాల నుంచి అణుధార్మికత(రేడియేషన్) లీకేజీ కాలేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) స్పష్టంచేసింది. అణుధార్మికత విడుదలైనట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదని వెల్లడించింది. ఈ మేరకు తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది. సోషల్ మీడియా ప్రచారాన్ని నమ్మొద్దని, అణుధార్మికత విషయంలో ఆందోళన అవసరం లేదని ఐఏఈఏ ప్రతినిధి సూచించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌లోని అణు కేంద్రాలపై భారత సైన్యం క్షిపణులు ప్రయోగించినట్లు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. రేడియేషన్ లీకవుతున్నట్లు కొందరు పోస్టులు పెట్టారు. కానీ, ఇందులో నిజం లేదని ఐఏఈఏ ప్రకటనతో తేలిపోయింది. పాకిస్తాన్ అణ్వాయుధాలు దాచిపెట్టిన కిరానా హిల్స్‌పై తాము దాడి చేయలేదని భారత ఎయిర్‌మార్షల్ ఎ.కె.భారతి ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. కేవలం పాక్ వైమానిక స్థావరాలు, ఉగ్రవాదుల క్యాంప్‌లపైనే దాడికి దిగినట్లు ఆయన వెల్లడించారు.

కాల్పుల విరమణపై భారత్, పాక్ చర్చలు!

హాట్‌లైన్ ద్వారా మాట్లాడుకున్న ఇరుదేశాల డీజీఎంఓలు



ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పులు విరమణపై చర్చలు జరిగాయని పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాఖ్ దార్ గురువారం తెలిపారు. ఇరుదేశాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్(డీజీఎంఓలు) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్, మేజర్ జనరల్ కాషిఫ్ అబ్దుల్లా బుధవారం హాట్‌లైన్ ద్వారా మాట్లాడుకున్నారని చెప్పారు. కాల్పుల విరమణను ఈ నెల 18వ తేదీ దాకా పొడిగించినట్లు పేర్కొన్నారు. ఇరువురు డీజీఎంఓల మధ్య 18న మళ్లీ చర్చలు జరుపుతారని వెల్లడించారు. అయితే, ఇషాఖ్ దార్ ప్రకటనపై భారత్ ఇంకా స్పందించలేదు. కాల్పుల విరమణపై పాక్‌తో చర్చలు జరిగాయో లేదో నిర్ధారించలేదు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కాల్పుల విరమణకు భారత్, పాక్ ఈ నెల 10న అంగీకరించిన సంగతి తెలిసిందే.

15 నగరాల్లో కాంగ్రెస్ జైహింద్ సభలు



సాక్షి, న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌లో ఉగ్రస్థావరాలను మట్టుబెట్టిన భారత సాయుధ బలగాలకు మద్దతుగా, సైన్యానికి వందనం చెబుతూ ఈ నెల 20 నుంచి 30 వరకు 'జై హింద్' సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. హైదరాబాద్ 15 రాష్ట్రాల్లోని ముఖ్యమైన నగరాల్లో సభలు నిర్వహించనున్నట్లు గురువారం ప్రకటించింది. అంతేకాదు.. జాతీయ భద్రత విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, భారత్– పాక్ మధ్య వివాదాన్ని నిలువరించడంలో అమెరికా జోక్యం, దానిపై కేంద్రం మౌనంపై ఈ సభల్లో లేవనెత్తాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. హైదరాబాద్, ఢిల్లీ, బార్మర్, సిమ్లా, హల్ద్వానీ, పాట్నా, జబల్‌పూర్, పుణే, గోవా, బెంగళూరు, కొచ్చి, గౌహతి, కోల్‌కతా, భువనేశ్వర్, పఠాన్‌కోట్‌లలో జై హింద్ సభలు జరుగుతాయని ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ 'ఎక్స్'లో ప్రకటించారు. ఈ సభలకు పార్టీ సీనియర్ నేతలతో పాటు మాజీ సైనికాధికారులు కూడా హాజరు కానున్నారు.

యూపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అజయ్ కుమార్



సాక్షి, న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)చైర్మన్‌గా రక్షణ శాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కమిషన్ అత్యంత సీనియర్ సభ్యుడు లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) రాజ్ శుక్లా ఆయనతో ప్రమాణం చేయించారు. ప్రీతి సుడాన్ ఏప్రిల్ 29వ తేదీన పదవీ విరమణ చేయడంతో ఈ పదవి ఖాళీ అయ్యింది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర పోస్టుల ఎంపిక పరీక్షను యూపీఎస్సీ నిర్వహిస్తుంది. యూపీఎస్సీ చైర్మన్ పదవీ కాలం ఆరేళ్లు లేదా 65 ఏళ్లు వచ్చే వరకు పదవిలో కొనసాగుతారు. చైర్మన్‌తో కలిపి కమిషన్‌లో ఉండాల్సిన 10 మందికి గాను ప్రస్తుతం 8మందే ఉన్నారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం : 16 : మే : 2025



ట్యాంపరింగ్ ముఠా ఆటకట్టు

వీసా, పాస్‌పోర్టులను ట్యాంపరింగ్ చేసే ముఠాలోని ఇద్దరు సభ్యులను ఆర్‌జీఐఏ ఔట్ పోస్టు, శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. -8లో



మెక్సికన్ 'మే'నూ..

మే నెల వేసవిలో వారాంతాలను మెక్సికన్ స్మోకీ మెరినేడ్ రుచులను అందిస్తున్నారు. నగరంలోని నోవోటెల్ ఎయిర్‌పోర్ట్ ఆధ్వర్యంలో మెక్సికన్ ఫుడ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
34.0/21.0

వాతావరణం

నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అఫ్జల్‌గంజ్‌లో అగ్నికీలలు

మూడంతస్తుల నివాస భవనంలో చెలరేగిన మంటలు

- పసిపాప సహా ఏడుగురిని కాపాడిన ఫైర్ సిబ్బంది
- షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగిందన్న పోలీసులు



అఫ్జల్‌గంజ్: అఫ్జల్‌గంజ్‌లోని మహారాజ్‌గంజ్‌లో గురువారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మూడంతస్తుల నివాస భవనంలో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది భవనంలోని ఏడాది చిన్నారి సహా మరో ఏడుగురిని నిచ్చెన ద్వారా కిటికీల నుంచి బయటికి తీసుకువచ్చి రక్షించారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోనే ప్రముఖ వ్యాపార కేంద్రమైన మహారాజ్‌గంజ్‌లోని మూడంతస్తుల భవనంలో రెండు కుటుంబాలు నివసిస్తున్నాయి. భవనంలో గురువారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అందులో అప్పటికే ఉంటున్న రెండు కుటుంబాలకు చెందిన కిశోర్ లాల్‌వాని, రాజు లాల్‌వాని, లక్ష్మీ లాల్‌వాని, జ్యోతిరామ్, ప్రియ, యాష్, సమర్థ్‌లతో పాటు ఏడాది వయసున్న చిన్నారిని ఫైర్ సిబ్బంది సురక్షిత ప్రాంతానికి తరలించారు. మొదటి అంతస్తు నుంచి రెండు మూడు అంతస్తులకు వేగంగా మంటలు వ్యాపించడంతో మొదట నాలుగు ఫైర్ ఇంజిన్లతో మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నించారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు సాయంత్రం వరకూ శ్రమించారు. దాదాపు 20 ఫైర్ ఇంజిన్లు వాడినట్లు అంచనా. కాగా.. ఈ భవనంలో ప్లాస్టిక్ గోదాంను నిర్వహిస్తుండడంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందినట్లు పలువురు చెబుతున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగినట్లు ఫైర్ అధికారులు గుర్తించారు. ఆస్తినష్టం ఎంత వాటిల్లిందనే విషయం తెలియాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. కాగా.. ప్రమాద ఘటనపై ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ శంకర్ యాదవ్ తదితరులు పరిశీలించారు.



ప్రమాదం నుంచి బయటపడి..

శుద్ధిలో వృద్ధి

బిగ్ స్టోరీ

దక్షిణాసియాలోనే తొలి నగరంగా రికార్డు సృష్టించేలా..

దక్షిణాసియాలోనే వంద శాతం మురుగును శుద్ధి చేసే తొలి నగరంగా రికార్డు సృష్టించేందుకు హైదరాబాద్ మహానగరం సిద్ధమవుతోంది. రాబోయే పదేళ్ల వరకు ఉత్పత్తయ్యే మురుగును సైతం శుద్ధి చేసేందుకు ముందస్తు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో జలమండలి అడుగులు వేస్తోంది. సరికొత్త సాంకేతికతో మురుగు శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నిర్మాణ పనులు పూర్తి చేస్తోంది. తాజాగా అమృత్ 2.0 పథకం కింద మరో 39 ఎస్టీపీల నిర్మాణాలకు సిద్ధమైంది.

- సాక్షి, సిటీబ్యూరో

ఇక మురుగు శుద్ధి.. వంద శాతం

- ఇప్పటికే 37 ఎస్టీపీలు.. త్వరలో మరో 8 అందుబాటులోకి
- అమృత్ 2.0 కింద కొత్తగా 39 నిర్మాణాలు..
- కేంద్రం వద్ద మరో 62 ఎస్టీపీలకు ప్రతిపాదనలు
- ముందస్తుగా పదేళ్ల వరకు ఉత్పత్తయ్యే సీవరేజీపై ప్రణాళిక
- నాగోల్ ఎస్టీపీ పని తీరుతో జలమండలికి 'వరల్డ్ వాటర్' అవార్డు

మూసీ నది దక్షిణ ఒడ్డున సరికొత్త ఆధునిక ఎస్‌బీఆర్ సాంకేతికతతో నిర్మించిన నాగోలు ఎస్టీపీ దేశంలోనే అతి పెద్దది. ఇప్పటి వరకు ఎస్టీపీలకు యూఏఎస్‌బీ, ఎంబీబీఆర్, ఈఏబీఎస్‌ఆర్ టెక్నాలజీ వినియోగించగా.. సరికొత్త ఎస్‌బీఆర్ టెక్నాలజీతో సుమారు రూ.800 కోట్ల అంచనా వ్యయంతో 320 ఎమ్మెల్డీ సామర్థ్యం గల ఎస్టీపీని 15 ఎకరాల్లో నిర్మించారు. ఇటీవల వాటర్ డైజెస్ట్ అనే అంతర్జాతీయ సంస్థ యునెస్కో భాగస్వామ్యంతో 2024-2025 సంవత్సరానికి గాను ప్రభుత్వ కేటగిరీలో ఉత్తమ ఎస్టీపీగా నాగోలు ఎంపిక చేసి జలమండలికి వరల్డ్ వాటర్ అవార్డు ప్రదానం చేసింది. పర్యావరణ అనుకూలత, సమర్థ మురుగు నీటి శుద్ధి, నీటి పునర్వినియోగం, ఆరోగ్యకర వాతావరణాన్ని అందిస్తున్నందుకు ఉత్తమ ఎస్టీపీగా ఎంపిక చేసింది.



ఎస్‌బీఆర్ సాంకేతికతతో నిర్మించిన నాగోలు ఎస్టీపీ

మురుగు నీటి పరిస్థితి ఇలా..

- హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో ప్రస్తుతం రోజువారీగా 1,950 మిలియన్ లీటర్ గ్యాలన్ల (ఎమ్మెల్డీ) మురుగు నీరు ఉత్పన్నమవుతోంది. ఇందులో జీహెచ్‌ఎంసీ పరిధిలో 1,650 ఎమ్మెల్డీ ఉంటుంది. జలమండలి ఇప్పటికే 37 ఎస్టీపీల ద్వారా 1,444 ఎమ్మెల్డీ మురుగు నీటిని శుద్ధి చేస్తోంది. మరో 322 ఎమ్మెల్డీ సామర్థ్యం గల ఐదు ఎస్టీపీలు నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ట్రయల్ రన్ దశలో ఉండగా.. సుమారు 113.5 ఎమ్మెల్డీ సామర్థ్యంగల మూడు ఎస్టీపీల నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. ఇవి పూర్తయితే దాదాపు 1,878 ఎమ్మెల్డీల మురుగు శుద్ధి చేయవచ్చు. మిగిలిన 72 ఎమ్మెల్డీల మురుగును శుద్ధి చేయాల్సి అవసరం ఉంటుంది.
- గత ప్రభుత్వం వంద శాతం మురుగు శుద్ధి లక్ష్యంతో సుమారు రూ.3,866.21 కోట్ల వ్యయంతో 3 ప్యాకేజీల్లో 5 సర్కిళ్లలో కొత్తగా 31 ఎస్టీపీల నిర్మాణాలకు సిద్ధం కాగా.. స్థలాల సేకరణ, ఇతరత్రా కారణాలతో వాటి సంఖ్యను ఇరవై ఎస్టీపీలకు కుదించినా సామర్థ్యం తగ్గకుండా పనులు పూర్తి చేసింది. అందులో ఇప్పటికే 12 ఎస్టీపీలు మురుగునీటిని శుద్ధి చేస్తుండగా, మరో ఎనిమిది ఎస్టీపీలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.



హ్యామ్ మోడ్‌లో అమృత్ ఎస్టీపీలు

కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 పథకం కింద మంజూరైన 39 ఎస్టీపీలు హ్యామ్ మోడ్‌లో నిర్మించనున్నారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో నిర్మాణ పనులకు సిద్ధమవుతున్నాయి. మొత్తం ఎస్టీపీల్లో ఒకటి పీపీపీ మోడ్‌లో.. మిగిలిన 38 హైబ్రిడ్ అన్యూయిటీ మోడల్ (హ్యామ్)విధానంలో నిర్మించనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే 972 ఎమ్మెల్డీల మురుగును శుద్ధి చేయవచ్చు. వాటి నిర్మాణ పనులు రెండు ప్యాకేజీల్లో పూర్తి చేయనున్నారు. ప్యాకేజీ-1లో 16 ఎస్టీపీలును, ప్యాకేజీ-2లో 22 ఎస్టీపీలు నిర్మిస్తారు. నిర్మాణ సంస్థ ఎస్టీపీలను నిర్మించి 15 ఏళ్లపాటు నిర్వహణకు చేపట్టనుంది.

అత్యాధునిక సాంకేతికతతో..



సరికొత్త సాంకేతిక 'సీక్వెన్షియల్ బ్యాచ్ రియాక్టర్ (ఎస్‌బీఆర్) టెక్నాలజీతో మురుగు నీటి శుద్ధి కేంద్రాలను నిర్మిస్తున్నాం. తక్కువ విస్తరణ, తక్కువ విద్యుత్‌తో ఎక్కువ మురుగు నీటిని ఇవి శుద్ధి చేస్తాయి. నిర్మాణ వ్యయం తక్కువే. మ్యాన్‌పవర్ లేకుండా పూర్తిగా ఆటోమెటిక్‌గా మురుగు నీటి శుద్ధి ప్రక్రియ కొనసాగుతోంది.

– సుదర్శన్, జలమండలి డైరెక్టర్

మురుగు నీటి శుద్ధి కేంద్రాలు ఇలా..

ఎస్టీపీలు	సంఖ్య	సామర్థ్యం (ఎమ్మెల్డీ)
పాత ఎస్టీపీలు	25	772.30
కొత్త ఎస్టీపీలు	20	1106.00
ఎస్టీపీలు అమృత్ 2.0 (టెండర్ ప్రక్రియ పూర్తి)	39	972.00

ప్రస్తుతం రోజువారీగా ఉత్పత్తి అవుతున్న మురుగు నీరు : 1950 ఎమ్మెల్డీ

ప్రస్తుతం రోజు వారీగా మురుగు శుద్ధి : 1878.30

రాబోయే పదేళ్లలో మురుగు ఉత్పతి (అంచనా) : 2,815

అమృత్ 2.0 ఎస్టీపీలు పూర్తయితే పెరగనున్న సామర్థ్యం : 2,850

మూసీపై ఎస్టీపీల ప్రతిపాదన

- హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మూసీ నదిపై సుమారు 62 ఎస్టీపీల నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదన సమర్పించింది. మహా నగరంలోని 80 శాతం మురుగు మూసీ నదిలోకి చేరుతోంది. మిగిలిన 20 శాతం స్థానిక చెరువుల్లో కలుస్తోంది. నగరంలో మూసీ నది సుమారు 55 కి.మీ మేర ప్రవహిస్తుండటంతో దానికిరువైపులా మురుగు కలుస్తోంది. రాబోయే పదేళ్లలో విస్తరించే హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో రోజువారీగా 2,815 ఎమ్మెల్డీల మురుగు నీరు ఉత్పన్నం కావచ్చని జలమండలి అంచనా వేసింది. దీంతో మూసీపై మురుగు నీటి శుద్ధి కోసం ఎస్టీపీలను ప్రతిపాదించింది.
- ప్రస్తుతం మహానగరంలో 9,769 కిలో మీటర్లు మాత్రమే సీవరేజీ పైపులైన్ నెట్‌వర్క్ విస్తరించి ఉంది. కొత్తగా జీహెచ్‌ఎంసీ పరిధిలో 2,656 కి.మీ, ఓఆర్‌ఆర్ పరిధిలో 4,378 కి.మీ మేర విస్తరించాలన్న ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి.

ముందస్తు ప్రణాళికతో..



నగరం శరవేగంగా విస్తరిస్తోంది. రాబోయే పదేళ్లలో ఉత్పత్తయ్యే మురుగు నీటిని అంచనా వేసి.. శుద్ధి ప్రక్రియ కోసం ముందస్తు ప్రణాళిక రూపొందించాం. మురుగు నీటి శుద్ధి కేంద్రాలను నిర్మిస్తున్నాం. ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న మురుగు నీటిని వంద శాతం శుద్ధి చేసే విధంగా ఎస్టీపీల నిర్మాణ పనులు పూర్తి చేశాం. భవిష్యత్తు అవసరాల కోసం అమృత్ ఎస్టీపీలు నిర్మిస్తున్నాం. మూసీలో కలిసే మురుగు నీటిని సైతం శుద్ధి కోసం ఎస్టీపీలను ప్రతిపాదించాం.

– అశోక్ రెడ్డి, జలమండలి ఎండీ

హైడ్రా టైం టేబుల్ సిద్ధం!

సోమవారం నుంచి శనివారం వరకు పని ప్రణాళికలు

- ఒక్కో రోజు ఒక్కో పని చేసేలా కమిషనర్ ఆదేశాలు
- స్వయంగా పర్యవేక్షిస్తున్న ఏవీ రంగనాథ్
- అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి వాహనాల కేటాయింపు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి (హైడ్రా) ఓ టైమ్ టేబుల్ సిద్ధమైంది. వారంలో ఏ రోజు ఏ పని చేయాలి? అనేది కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్దేశించారు. దీనికి అనుగుణంగా ఆయన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం, హైడ్రా సంస్థాగత నిర్మాణం, క్షేత్ర స్థాయి పరిశీలన.. ఇలా ప్రతి అంశానికీ సమప్రాధాన్యం ఇస్తూ ఈ ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ వారం నుంచే ఈ విధానాలను అమలులోకి తీసుకువచ్చారు. మరోపక్క హైడ్రా కోసం ఇటీవల కొనుగోలు చేసిన 122 వాహనాలను అధికారులు, సిబ్బందికి అందజేశారు.

సోమవారం ప్రజావాణితో మొదలై..

రాణిగంజ్‌లోని బుద్ధభవన్‌లో ఉన్న హైడ్రా ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నారు. ఆరోజు ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్ఆర్) వరకు ఉన్న వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదుదారులు వస్తున్నారు. ప్రతి వారం కనీసం 50 నుంచి 60 మంది వస్తుండటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సమయం పడుతోంది. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్ సహా వివిధ అంశాల గుర్తింపునకు హైడ్రా నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో పాటు ప్రముఖ సంస్థల సహకారం తీసుకుంటోంది. ఆయా ఏజెన్సీల ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తోంది. ఈ అంశాల పురోగతిని పర్యవేక్షించడానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రతి మంగళవారం రివ్యూలు ఏర్పాటు చేస్తున్నారు.

కీలక ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పర్యటన..

ప్రజావాణితో పాటు ఇతర విధానాల్లో హైడ్రాకు అందిన ఫిర్యాదులను అధికారులు అన్ని కోణాల్లోనూ పరిశీలిస్తున్నారు. దీనికోసం రెవెన్యూ, న్యాయశాఖ సహా వివిధ విభాగాల నుంచి అధికారులు డిప్యుటేషన్‌పై హైడ్రాలో పని చేస్తున్నారు. సున్నితమైన, కీలకాంశాలను స్వయంగా హైడ్రా కమిషనర్ పర్యవేక్షిస్తున్నారు. దీనికోసం ప్రతి బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే బుధవారం ఉదయం రంగారెడ్డి జిల్లా కోహెడ నుంచి పర్యటన మొదలు పెట్టిన రంగనాథ్ రాత్రి 7.30 గంటలకు మేడ్చల్ జిల్లా బౌరంపేటతో ముగించారు. గురువారం హైడ్రా పరిపాలన పరమైన అంశాలపై దృష్టి పెడుతున్న కమిషనర్ అంతర్గత సమావేశాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులు, వాటి పురోగతి, తీసుకున్న/తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి శనివారం హైడ్రా ఆధ్వర్యంలో వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నారు. వీటిని నిపుణులతో పాటు మాజీ, ప్రస్తుత అధికారులను ఆహ్వానిస్తున్నారు. ఈ శనివారం నగరంలోని నాలాలపై చేపట్టాలని నిర్ణయించారు.

ద్విచక్ర వాహనంతో పాటు హెల్మెట్ సైతం..

డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) బలగాలతో పాటు హైడ్రాలో పని చేసే అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది కోసం హైడ్రా 122 వాహనాలు ఖరీదు చేసింది. వీటిలో 21 ట్రక్కుల్ని కేవలం ప్రకృతి వైపరీత్యాలు, రెస్క్యూ కార్యకలాపాలకే వినియోగించనున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక ఉపకరణాలను వాహనంలో అందుబాటులో ఉంచారు. ఉన్నతాధికారులు, అధికారుల కోసం నాలుగు ఇన్నోవా క్రిస్టాలు, 55 స్కార్పియోలు ఖరీదు చేశారు. డీఆర్‌ఎఫ్‌తో పాటు అసెట్ ప్రొటెక్షన్ విభాగానికి చెందిన సిబ్బంది తరలింపు కోసం ఐదు మినీ బస్సుల్ని ఖరీదు చేశారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బంది వినియోగించడానికి 37 ద్విచక్ర వాహనాలు కొన్నారు. ఈ వాహనాలను అధికారులు, సిబ్బందికి కేటాయింపు పూర్తి చేశారు. కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనంతో పాటు కచ్చితంగా హెల్మెట్ కూడా పంపిణీ చేశారు. వాహనం నడిపే సమయంలో కచ్చితంగా దాన్ని ధరించాలని స్పష్టం చేస్తున్నారు.

ఉస్మాన్‌సాగర్‌కు తప్పిన మురుగు ముప్పు

- బుల్కాపూర్ నాలాకు 'హైడ్రా' గేట్లు
- దీని పునరుద్ధరణపై అధికారుల దృష్టి

సాక్షి, సిటీబ్యూరో: జంట నగరాలకు తాగునీరు అందించే ఉస్మాన్‌సాగర్‌కు (గండిపేట చెరువు) మురుగు ముప్పు తప్పింది. ఖానాపూర్, నాగులపల్లి నుంచి వచ్చే మురుగు నీరు బుల్కాపూర్ నాలా ద్వారా గండిపేటలోకి వెళ్లకుండా హైడ్రా కొత్త గేట్లు ఏర్పాటు చేసింది. వరద సమయంలో ఆ నీరు గండిపేటకు చేరేలా ఉండే రెండు గేట్లు శిథిలం కావడం, దీనిపై మీడియాలో వచ్చిన కథనాలతో హైడ్రా ఈ చర్య తీసుకుంది. శిథిలమైన గేట్లను పరిశీలించడానికి గతంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారుల బృందంతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. అక్కడ పరిస్థితులు చూసిన ఆయన తక్షణం మరమ్మతులను చేపట్టాలని ఆదేశించారు. దీంతో శిథిలమైన రెండు గేట్ల స్థానంలో కొత్తవి అమర్చారు. బుల్కాపూర్ నాలాలో పేరుకుపోయిన చెత్త కొంతమేర తొలగించి మురుగు నీరు ముందుకు వెళ్లేలా ఏర్పాటు చేశారు. ఈ నాలా ఒకప్పుడు కేవలం వరద కాలువగా ఉండేది. శంకర్‌పల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి ఖానాపూర్, కోకాపేట, నార్సింగ్, పుప్పాలగూడ, మణికొండ, దర్గా, షేక్‌పేట్, టోలిచౌకి, పోచమ్మ బస్తీ, చింతలబస్తీ మీదుగా హుస్సేన్‌సాగర్ వరకు వర్షపు నీటిని తీసుకెళ్లిన చరిత్ర ఈ నాలాకు ఉంది. ప్రస్తుతం నాలాకు ఎగువన ఉన్న నివాసాలు, వాణిజ్య సముదాయాలు, రిసార్టుల నుంచి బయటకు వస్తున్న మురుగు నీరు దీని ద్వారానే ప్రవహిస్తోంది. బుల్కాపూర్ నాలాను పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తే ప్రయోజనాలుంటాయని, హుస్సేన్‌సాగర్‌కు వర్షపు నీటిని తీసుకువెళ్లే ఏకైక నాలా ఇదేనని స్థానికులు చెబుతున్నారు. దీంతో నాలా పునరుద్ధరణపైనా హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది.



నయా వెంచర్ల ఏర్పాటులో హెచ్ఎండీఏ

- ఔటర్ సమీప గ్రామాల్లో లే అవుట్లకు సన్నాహాలు
- కుత్బుల్లాపూర్, కొర్రెముల, కుర్మల్‌గూడ, ప్రతాపసింగారంలలో..

మరోసారి మహా రియల్!

సాక్షి సిటీబ్యూరో: కొత్త లేఅవుట్‌ల అభివృద్ధికి హెచ్ఎండీఏ సన్నాహాలు చేపట్టింది. ఔటర్‌రింగ్‌రోడ్డు చుట్టూ వివిధ ప్రాంతాల్లో రైతుల నుంచి భూములను సేకరించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు. బీఆర్‌ఎస్ హయాంలోనే కొన్ని ప్రాంతాల్లో హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) సొంత స్థలాలతో పాటు చుట్టుపక్కల ఉన్న రైతుల నుంచి కూడా భూములను సేకరించి భారీ లే అవుట్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత నెలకొనడంతో కొత్త లే అవుట్‌ల ఏర్పాటు ప్రక్రియను వాయిదా వేశారు. ప్రస్తుతం కొంతవరకు సానుకూల పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో అధికారులు కొత్త లేఅవుట్‌ల అభివృద్ధిపై దృష్టి సారించారు. వివిధ ప్రాంతాల్లో రైతుల నుంచి భూముల సేకరణ వివిధ దశల్లో ఉంది. కొన్ని ప్రాంతాల్లో రైతులు స్వచ్ఛందంగా భూములను హెచ్ఎండీఏకు అప్పగించేందుకు ముందుకు రావడంతో లే అవుట్‌ల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. గతంలో కోకాపేట్, బుద్వేల్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో అనూహ్యమైన స్పందన రావడంతో.. మరోసారి అదే స్థాయిలో స్పందన లభించకపోయినప్పటికీ హెచ్ఎండీఏ స్వయంగా వెంచర్లను అభివృద్ధి చేసి విక్రయిస్తే రియల్ రంగంలో కొంత మార్పు రావచ్చని అధికారులు భావిస్తున్నారు.

సుమారు 500 ఎకరాల్లో..

నగర శివార్లలోని కుర్మల్‌గూడ, ప్రతాపసింగారం, దండుమల్కాపురం, లేమూరు, ఇన్ముల్‌నర్వ, కొర్రెముల, నాదర్‌గుల్ తదితర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న భూములను గుర్తించారు. ఇప్పటికే ఇన్ముల్‌నర్వలోని 96 ఎకరాలు, లేమూరులో మరో 83 ఎకరాల భూములలో రోడ్లు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టారు. మిగతా చోట్ల కుర్మల్‌గూడలో 92 ఎకరాలు, బోగారంలో 125, ప్రతాపసింగారంలో సుమారు 151, దండుమల్కాపురంలో మరో 355 ఎకరాల చొప్పున భూమి ఉన్నట్లు గుర్తించారు. తిమ్మాపూర్‌లో 156 ఎకరాలు, కుత్బుల్లాపూర్‌లో 130, కొర్రెములలో 138 ఎకరాలు చొప్పున సేకరించనున్నారు. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా భూములు అందుబాటులో ఉన్నట్లు అంచనా. రైతుల నుంచి భూముల సేకరణ వివిధ దశల్లో ఉంది. మొదట కనీసం 500 ఎకరాల్లో లే అవుట్‌లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. గతంలో హెచ్ఎండీఏ వెంచర్‌లలో ప్లాట్‌లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోవడంతోనే రైతులు తమ భూములను హెచ్ఎండీఏకు అప్పగించేందుకు ఆసక్తితో ఉన్నట్లు అధికారులు చెప్పారు. కొనుగోలుదారులు సైతం హెచ్ఎండీఏపై నమ్మకంతో ముందుకు వస్తున్నారు.

ప్రతాపసింగారంలో పనులు..

సుమారు 150 మంది రైతుల నుంచి ప్రతాపసింగారంలో ఇప్పటికే 133 ఎకరాల భూమి సేకరించారు. మరిన్ని భూముల సేకరణకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్నవాటితో పాటు కొత్తగా సేకరించనున్న వాటితో కలిపి సుమారు రూ.120 కోట్లతో భారీ వెంచర్‌ను అభివృద్ధి చేయనున్నారు. రైతులకు ఎకరాకు 1,741 చదరపు గజాల చొప్పున అభివృద్ధి చేసిన ప్లాట్లను అందజేయనున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం లభించనుంది. మూడేళ్ల క్రితమే ఈ వెంచర్ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం రోడ్ల నిర్మాణం, మార్కింగ్ పనులు కొనసాగుతున్నాయి. నగరానికి తూర్పు వైపున, ఔటర్ రింగ్‌రోడ్డుకు చేరువలో ఉండడంతో ప్రతాపసింగారం లే అవుట్‌కు అనూహ్యమైన స్పందన లభించవచ్చని అంచనా వేస్తున్నారు.




రూ. కోటి ఇవ్వకపోతే ఫొటోలు అప్‌లోడ్ చేస్తా

- యజమానికి డ్రైవర్ బెదిరింపులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- నిందితుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: నీ భార్య ఫొటోలు డిలీట్ చేయాలంటే రూ. కోటి ఇవ్వాలని ఓ డ్రైవర్ తన యజమానిని బ్లాక్‌మెయిల్ చేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆసిఫ్‌నగర్ అహ్మద్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఇష్తేకర్ అహ్మద్ జూబ్లీహిల్స్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త వద్ద డ్రైవర్‌గా పని చేసేవాడు. సదరు యజమాని భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఇష్తేకర్ అహ్మద్ ఆమెతో కలిసి ఉన్నప్పుడు ఫొటోలు తీసుకున్నాడు. ఆమె నగ్న చిత్రాలు, వీడియోలను తీసి తన ఫోన్‌లో భద్ర చేసుకున్నాడు. ఆ ఫొటోలను తన యజమానికి పంపించి మీ భార్య నగ్న చిత్రాలు, వీడియోలతో పాటు తనతో కలిసి ఉన్నప్పుడు దిగిన అశ్లీల వీడియోలను పోర్న్ సైట్లలో, ఇతర వెబ్‌సైట్లలో పోస్ట్ చేస్తానని బెదిరింపులకు దిగాడు. అంతేగాక గతంలో యజమాని ఇంటికి వచ్చి బెదిరించగా ఆయన డయల్ 100కు ఫోన్ చేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. కొన్నాళ్లుగా వేధింపులు తీవ్రతరం చేసిన ఇష్తెకార్ అహ్మద్ యజమానికి వాట్సాప్‌లో భార్య ఫొటోలు, నగ్న చిత్రాలు పంపుతూ, వెంటనే వాటిని తొలగిస్తుండటం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సదరు వ్యాపారవేత్త గత నెలలో తన న్యాయవాది ద్వారా ఇష్తేకర్ అహ్మద్‌కు ఫోన్ చేయించి వేధింపుల విషయమై అడిగించాడు. బంజారాహిల్స్‌లోని ఓ కేఫ్‌కు రావాలని యజమానికి సూచించాడు. అక్కడికి వెళ్లిన యజమానిని మీ భార్యకు విడాకులు ఇవ్వాలని, లేదా ఖులా (భర్త నుంచి విడాకులు) అడగాలని బెదిరించాడు. అలాంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడవద్దని, బ్లాక్‌మెయిల్ చేయవద్దని అతను కోరినా పట్టించుకోకుండా అసభ్యంగా దూషించాడు. ముగ్గురు పిల్లలను చంపి భవిష్యత్తు లేకుండా చేస్తానని బెదిరించాడు. ఫోన్‌లో సేవ్ చేసిన ఫొటోలు, వీడియోలు డిలీట్ చేయాలంటే రూ. కోటి ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, మహ్మద్ ఇష్తేకర్ అహ్మద్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీసా, పాస్‌పోర్టుల ట్యాంపరింగ్
ముఠా ఆటకట్టు



- ఉద్యోగాల పేరుతో విజిటింగ్ వీసాలపై విదేశాలకు పంపుతున్న వైనం
- మహిళ ఫిర్యాదుతో వెలుగులోకి
- నలుగురి ముఠా సభ్యుల్లో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్

శంషాబాద్: వీసా, పాస్‌పోర్టులను ట్యాంపరింగ్ చేయడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా విజిటింగ్ వీసాలపై అమాయకులను ఉద్యోగాల పేరుతో విదేశాలకు పంపుతున్న ఓ ముఠాలోని ఇద్దరు సభ్యులను ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు, శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 13న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వెంకటరమణమ్మ కువైట్ వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చింది. ఆమె పాస్‌పోర్టు, వీసాలను పరిశీలించిన అధికారులు ట్యాంపరింగ్ జరిగినట్లు గుర్తించి ఆమెను అడ్డుకున్నారు. దీంతో బాధితురాలు ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనతో పాటు మరికొందరికి ఇదే తరహాలో పశ్చిగోదావరి జిల్లాకు చెందిన ఏజెంట్లు కువైట్‌లో ఉద్యోగానికి పంపేందుకు తప్పుడు వీసాలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండకు చెందిన సత్యనారాయణ, చిలుకూరు బాలాజీ, హైదరాబాద్‌కు చెందిన అంజి, కడప జిల్లాకు చెందిన సుంకర శివకుమార్, గోపాల్ ముఠాగా ఏర్పడి గల్ఫ్ ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. నిరక్షరాస్యులు, అమాయకులను టార్గెట్ చేసుకుని కువైట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. వర్కింగ్ వీసా కోసం నిబంధనల ప్రకారం ప్రొటెక్షన్ ఆఫ్ ఇమిగ్రేంట్ సర్టిఫికెట్ ఉండాల్సి ఉండగా వీరు దానిని తీసుకోకుండా వర్కిగ్ వీసా రద్దయినట్లు నకిలీ స్టాంపులతో క్యాన్సిల్డ్ ముద్రలు వేస్తున్నారు. అనంతరం బాధితులకు విజిటింగ్ వీసాలు అందజేసి ముందుగా మస్కట్‌కు పంపి అక్కడి నుంచి వారిని కువైట్‌కు పంపుతున్నారు. ఈ క్రమంలో పాస్‌పోర్టు, వీసాలను ట్యాంపరింగ్ చేయడంతో పాటు పీఓఈ సర్టిఫికేట్ లేకుండా విదేశాలకు పంపుతున్నారు. విజిటింగ్ వీసాలపై వెళుతున్న అమాయకులు పలు ప్రాంతాల్లో పట్టుబడుతూ మోసపోతున్నారు. నిందితుల ఆచూకీపై సమాచారం అందడంతో గురువారం నాంపల్లిలోని ఓ హోటల్‌పై దాడి చేసి చిలుకూరి బాలాజీ, సుంకర శివకుమార్‌లను అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి నుంచి ట్యాంపరింగ్ చేసిన 14 వీసాలు, 14 పాస్‌పోర్టులు, 16 విమాన టికెట్లు, 2 నకిలీ స్టాంపులు, ఏడు సెల్‌ఫోన్లు, 1 ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఆర్‌జీఐఏ ఔట్ పోస్టు సీఐ బాలరాజు, ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్, ఎస్‌ఐ సిద్దేశ్వర్ తదితరులను ఏసీపీ అభినందించడంతో పాటు రివార్డులను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దుండిగల్: టాటా ఏసీ వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుండిగల్ ఎస్సీ కాలనీకి చెందిన యాప్రాల కృష్ణ(52) కూలీగా పని చేసేవాడు. గురువారం ఉదయం అతను స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి దుండిగల్ బస్టాప్ వైపు నడిచి వస్తుండగా పోచమ్మ గుడి వద్ద ఎదురుగా వచ్చిన టాటా ఏసీ వాహనం అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న అదే గ్రామానికి చెందిన జె.నర్సింగ్ రావు మద్యం మత్తులో ఉన్నట్లు తేలింది. మృతుడి కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

నాంపల్లి: నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారి నుంచి 15 నకిలీ సర్టిఫికెట్లు, మూడు మొబైల్ ఫోన్లు, రూ. 8 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మాసబ్‌ట్యాంక్ ప్రాంతానికి చెందిన షాబాజ్ ఖాన్, ముర్తుజా నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ ఇస్మాయిల్, శాలివాహన నగర్‌కు చెందిన కడారి రమేష్ నకిలీ సర్టిఫికెట్ల దందా నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పసికందును చిదిమేశాడు

- 11 రోజుల కుమార్తెను గొంతు కోసి చంపిన తండ్రి
- మరో కుమార్తె ఎదుటే ఘాతుకం
- పోలీసుల అదుపులో నిందితుడు



నిందితుడు జగత్

గోల్కొండ: కన్న కూతురిని కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే ఆమె పాలిట కాలయముడయ్యాడు. 11 రోజుల పసికందును తన మరో నాలుగేళ్ల కుమార్తె ఎదుటే దారుణంగా గొంతు కోసి హత్య చేసిన సంఘటన గురువారం గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ బి.సైదులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నేపాల్‌కు చెందిన జగత్ నగరానికి వలస వచ్చి అపార్ట్‌మెంట్‌ల వద్ద వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఆరేళ్ల క్రితం అతడి మొదటి భార్య చనిపోవడంతో తమ దేశానికే చెందిన గౌరీ అనే మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. షేక్‌పేట్ గుల్షన్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న జగత్ కుటుంబంతో కలిసి అక్కడే వాచ్‌మెన్ రూంలో నివాసం ఉంటున్నాడు. వారికి ఓ కుమార్తె (4) ఉంది. 11 రోజుల క్రితం అతడి భార్య గౌరీ మరో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మద్యానికి బానిసైన జగత్ తరచూ తాగివచ్చి రాత్రి వేళల్లో భార్యతో గొడవపడేవాడు. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి గదిలోనుంచి పసికందును తీసుకుని అపార్ట్‌మెంట్ గేటు బయటికి తెచ్చాడు. దీనిని గుర్తించిన అతడి పెద్ద కూతురు (4) తండ్రి వెంటే వచ్చింది. అనంతరం జగత్ పసికందును గేటు పక్కన రోడ్డుపై పడుకోబెట్టి గొంతు కోశాడు. అనంతరం చిన్నారి మృతదేహాన్ని టవల్‌లో చుట్టుకుని ఏమీ జరగనట్లు ఇంట్లోకి తీసుకెళ్లాడు. అప్పటికే భార్య నిద్రలో ఉండడంతో పసికందు మృతదేహాన్ని గదిలోని మూలన దాచాడు. తెల్లవారుజామున నిద్ర లేచిన అతడి భార్య గౌరి చిన్నారి కనిపించకపోవడంతో అపార్ట్‌మెంట్‌వాసులకు చెప్పింది. దీంతో వారు సీసీ కెమెరాలు పరిశీలించగా జగత్ చిన్నారిని హత్య చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గోల్కొండ పోలీసులు నిందితుడు జగత్ కోసం గాలింపు చేపట్టారు. అతను మెహిదీపట్నంలో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. మృతదేహాన్ని సెవన్ టూమ్స్- టోలిచౌకీ రోడ్డులోని డస్ట్ బిన్‌లో పడేసినట్లు చెప్పాడు. పోలీసులు చిన్నారి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలు నడిరోడ్డుపై యువకుడి దారుణ హత్య

రెడ్‌హిల్స్‌లో ఘటన



అయాన్ ఖురేషీ (ఫైల్)

నాంపల్లి: పట్టపగలు.. నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే ఓ యువకుడిని ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో వెంబడించి దారుణంగా హత్య చేసిన సంఘటన గురువారం ఉదయం రెడ్‌హిల్స్ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాతబస్తీ హఫీజ్ బాబానగర్‌కు చెందిన యాన్ ఖురేషీ (22) తన బావ మరిది హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. 17 ఏళ్ల వయస్సులోనే హత్యకు పాల్పడిన అతను జువైనల్ హోమ్‌కు వెళ్లాడు. కంచన్‌బాగ్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఈ కేసుపై నాంపల్లి క్రిమినల్ కోర్టులో విచారణ జరుగుతోంది. గురువారం ఉదయం కేసు విచారణకు హాజరైన యాన్ ఖురేషీ బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్తుండగా రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి ఎదుట గుర్తు తెలియని వ్యక్తులు బ్యాట్‌తో దాడి చేశారు. కిందపడ్డ అతడిపై దాడి చేసి కత్తులతో గొంతు కోశారు. అంతటితో ఆగకుండా కడుపులో కసి తీరా పొడిచారు. దీనిపై సమాచారం అందడంతో నాంపల్లి పోలీసులు, క్లూస్ టీమ్ బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. నిందితులను పట్టుకునేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించినట్లు నాంపల్లి పోలీసులు తెలిపారు. పాత కక్షల కారణంగానే హత్య జరిగినట్లుగా అనుమానిస్తున్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేను చైర్మన్‌ను..రూ.20 లక్షలు పంపండి..

ఆస్పత్రి చైర్మన్ పేరుతో సైబర్ మోసానికి యత్నం..

బంజారాహిల్స్: తాను చైర్మన్‌నని, రూ.20 లక్షలు తాను చెప్పిన బ్యాంక్ అకౌంట్‌కు పంపించాలంటూ ఓ సైబర్ మోసగాడు ప్రముఖ ఆస్పత్రి చైర్మన్ పేరుతో అదే ఆస్పత్రి చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్‌కు మెసేజ్ పెట్టాడు. అదృష్టవశాత్తు సదరు సీఎఫ్ఓ క్రాస్ చెక్ చేసుకుని తన చైర్మన్‌ను సంప్రదించడంతో సైబర్ మోసం గుట్టురట్టయ్యింది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లో ఉన్న ఓ ప్రముఖ ఆస్పత్రి సీఎండీ పేరుతో అదే ఆస్పత్రి సీఎఫ్ఓకు వాట్సాప్ మెసేజ్ వచ్చింది. తాను పేర్కొన్న బ్యాంక్ అకౌంట్‌కు రూ.20 లక్షలు పంపించాలంటూ సదరు సైబర్ మోసగాడు సూచించాడు. అయితే సీఎఫ్ఓ ఈ మెసేజ్‌ను క్రాస్ చెక్ చేసుకోవడమే కాకుండా చైర్మన్‌ను మీరేమైనా డబ్బులు పంపాలని మెసేజ్ పెట్టారా? అంటూ ప్రశ్నించాడు. తాను ఎలాంటి వాట్సాప్ మెసేజ్ పెట్టలేదని, అది నా ఫోన్ నెంబర్ కాదని చైర్మన్ స్పష్టం చేయడంతో సదరు సీఎఫ్ఓ ఇది సైబర్ మోసమని గుర్తించాడు. దీనిపై బ్యాంక్ అకౌంట్, పేరు, వాట్సాప్ మెసేజ్‌తో పాటు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విచారణకు మంత్రి సీతక్క గైర్హాజరు

- కరోనా సమయంలో కేసు నమోదు
- జులై 2కు వాయిదా

సిటీ కోర్టులు : కోవిడ్ -19 సమయంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద పోలీసుల అనుమతి లేనిదే ధర్నా నిర్వహించారని అప్పటి ములుగు ఎమ్మెల్యే సీతక్క, ఎన్ఎస్ యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్, రంజిత్,, విధుర్ చావ్లా, అభిజిత్ యాదవ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై గురు వారం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. విచారణకు మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ గైర్హాజరు కావడంతో వీరి తరపున న్యాయవాదులు కృష్ణ కుమార్, కుర్మ నరేందర్, బంగారం. నర్సింగ్ వకాలత్ దాఖలు చేశారు. వివిధ పనుల నేపథ్యంలో కోర్టుకు హాజరు కాలేక పోవడంతో న్యాయవాదులు సెక్షన్ 317 సీఆర్‌పీసీ పిటీషన్ దాఖలు చేశారు. విచారణకు రంజిత్, విధుర్ చావ్లా, అభిజిత్ యాదవ్ హాజరయ్యారు. కోవిడ్ -19 కరోనా వ్యాధిని ఆరోగ్య శ్రీ లో చేర్చాలని, ప్రజలకు ఉచితంగా సేవలు అందించాలని అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేశారని పోలీసులు 2021లో 188, 269,270 ఐ పి సి కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుపై గురు వారం విచారణ చేపట్టిన న్యాయస్థానం జులై 2కు వాయిదా వేసింది.

బిచాణా ఎత్తేసిన ఐటీ కంపెనీ

- ఒక్కో వ్యక్తి నుంచి రూ.2.5 లక్షలు వసూలు
- గచ్చిబౌలి పీఎస్‌లో బాధితుల ఫిర్యాదు



గచ్చిబౌలి: శిక్షణతో పాటు మంచి జీతంతో ఉద్యోగం కల్పిస్తామని నమ్మించి రూ.లక్షలు దండుకున్న ఓ ఐటీ కంపెనీ బిచాణా ఎత్తేసింది. శిక్షణ ఇస్తున్నట్లు నటిస్తూనే బోర్డు తిప్పేయడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని స్కిల్ హబ్ కన్సల్టెన్సీ నిర్వాహకులు ఉద్యోగాలు కల్పిస్తామంటూ నిరుద్యోగులను నమ్మించారు. గచ్చిబౌలిలోని ప్లాటినా బిల్డింగ్‌లోని 7వ అంతస్తులో ప్యూరోపాల్ క్రియేషన్స్, ఐటీ సొల్యూషన్స్‌లో శిక్షణతో పాటు ఉద్యోగం ఇస్తామని చెప్పారు. మొదటి విడతలో గత ఫిబ్రవరిలో దాదాపు 70 మంది నుంచి స్కిల్ హబ్‌లో డబ్బులు తీసుకొని ప్యూరోపాల్‌కు పంపించారు. సంవత్సరానికి రూ.4 లక్షల ప్యాకేజీ కావాలనుకునే వారి నుంచి రూ.1.8 లక్షలు, రూ.5 లక్షల ప్యాకేజీ కోసం రూ.2.6 లక్షల ప్యాకేజీ కోసం 2.50 లక్షల చొప్పున వసూలు చేశారు. ఆరు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. ల్యాప్‌టాప్ ఇచ్చి వర్క్ ఫ్రం హోం ద్వారా శిక్షణ అందించి ఒక నెల జీతం కూడా చెల్లించారు. దీన్ని నమ్మిన చాలా మంది నిరుద్యోగులు స్కిల్ హబ్ ద్వారా ప్యూరోపాల్‌లో చేరారు. మే 7న ఆఫీస్‌కు తాళం వేసి ఉండటంతో నిరుద్యోగులంతా కంగుతిన్నారు. స్కిల్ హబ్, ప్యూరోపాల్ రెండు ఒకరే నిర్వహిస్తున్నారని బాధితులు తెలిపారు. ప్యూరోపాల్ కంపెనీ హెడ్ పెరుగు మాధవ రావు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ నిధి, వర్షిణి ద్వారా డబ్బులు సేకరించినట్లు పేర్కొన్నారు. హెచ్ ఆర్ హృతికా రెడ్డి తమను నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్‌తో కలిసి బాధితులు గురువారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

పోలీసు విచారణకు బెల్లంకొండ హాజరు

బంజారాహిల్స్: రాంగ్‌రూట్‌లో రావడమే కాకుండా ఆపినందు కు ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన సినీ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌పై జూబ్లీహి ల్స్ పోలీసులు కేసు నమోదు చేయడమే కాకుండా గురువారం విచారణకు పిలిపించారు. రెండు రోజుల క్రితం జరిగిన ఘటనపై ఆరా తీయడమే కాకుండా రాంగ్‌రూట్‌లో ఎందుకు వెళ్లాల్సి వచ్చిందని, మధ్యాహ్నం ఎక్కడి నుంచి వస్తున్నారంటూ ప్రశ్నించారు.అతడికి చెందిన బీఎండీ కారును సీజ్ చేశారు. 41ఏ నోటీసు ఇచ్చి తాము పిలిచినప్పుడు విచారణకు హాజరుకావాలని సూచించారు. శ్రీనివాస్‌పై జూబ్లీహిల్స్ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. సుమారు గంట పాటు ఆయనను జూబ్లీహిల్స్ పోలీసులు విచారించారు.





పోలీసులు సీజ్ చేసిన కారు, బెల్లంకొండ సాయి శ్రీనివాస్..

ముగ్గురు కుమార్తెలతో సహా చెరువులో దూకిన తల్లి

- తల్లి, చిన్న కుమార్తె మృతి
- ఇద్దరు పిల్లలను కాపాడిన స్థానికులు



సుజాత కుటుంబం (ఫైల్)



సుజాత, వర్షిణి మృతదేహాలు



మేడిపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ తన ముగ్గు కుమార్తెలతో సహా చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్ నగర్ జిల్లా కన్మనూరు గ్రామానికి చెందిన నాగరాజు, సుజాత (32) ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలసవచ్చిన వీరు నారపల్లి, మహాలక్ష్మీపురం కాలనీలో నివాసం ఉంటున్నారు.సుజాత చెరుకు రసం బండి నడుపుతుండగా, నాగరాజు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు అక్షిత(13), ఉదయశ్రీ(11) వర్షిణి(6) ఉన్నారు. కొన్నాళ్లుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో బుధవారం పెద్ద మనుషులు పంచాయితీ చేసి ఇద్దరికి సర్దిచెప్పారు. అయితే అదేరోజు రాత్రి మళ్లీ గొడవ జరగడంతో మనస్తాపానికి లోనైన సుజాత గురువారం ముగ్గురు పిల్లలతో సహా నారపల్లి చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. దీనిని గుర్తించిన స్థానికులు చెరువులోకి దూకి వారిని బయటికి తీశారు. అయితే అప్పటికే సుజాత, చిన్న కుమార్తె వర్షిణి మృతి చెందారు. అపస్మారకస్థితిలో ఉన్న అక్షిత, ఉదయశ్రీని గాంధీ ఆసుపత్రికి తరలించారు.వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ అసుపత్రికి తరలించారు. సుజాత బంధువుల ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

18న భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ-25 పురస్కారాల సభ

హిమాయత్‌నగర్: భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ–2025 పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈ నెల 18న తెలంగాణ సారస్వత పరిషత్తులోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు 'భూపతి చంద్ర'స్మారక కథనికల పోటీ-25 అధ్యక్షులు ఎం.ఎల్.కాంతారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.రామచంద్రమూర్తి (సీనియర్ సంపాదకులు), ఆత్మీయ అతిథిగా బి.నరసింగరావు (సినీ దర్శకుడు, సంస్కృ ప్రతినిధి), గౌరవ అతిథిగా, ప్రొ.మన్నవ సత్యనారాయణ(పూర్వాధ్యక్షులు, తెలుగు శాఖ, నాగార్జున యూనివర్సిటీ) పాల్గొంటారని సభా నిర్వహణ సి.ఎస్. రాంబాబు నిర్వహిస్తారని తెలిపారు.

తమ్ముడిపై పెట్టిన కేసు వెనక్కి తీసుకోవాలి బెదిరింపు

బంజారాహిల్స్: తన తమ్ముడిపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలంటూ కత్తితో బెదిరించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..బంజారాహిల్స్ సయీద్‌నగర్‌కు చెందిన షేక్ అలీ (18) ప్లంబర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 7న రాత్రి 8 గంటల సమయంలో తన ఇంటి ముందు కూర్చొని ఫోన్‌లో గేమ్స్ ఆడుకుంటుండగా ఖాదర్ అహ్మద్ అనే వ్యక్తి వచ్చి తన తమ్ముడిపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలంటూ కత్తితో బెదిరించాడు. రాజీకి రావాలని, లేకపోతే నీ అంతు చూస్తానంటూ అసభ్యకర పదజాలంతో దూషించాడు. దీంతో బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీఐ కమిషనర్ల నియామకంలో బీసీలకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: సమాచార కమిషనర్ల నియాకమంలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 56 శాతం జనాభా ఉన్న బీసీలలో రాష్ట్ర సమాచార కమిషనర్లకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత గల ఒక్క అభ్యర్థి కూడా లేరా ? అని ప్రశ్నించారు. నియామకాల్లో బీసీలు ఒక్కరు కూడా లేకపోవడం దారుణమన్నారు.

సత్ఫలితాలిస్తున్న వరదనీటి సంప్‌లు



రాజ్‌భవన్ రోడ్డు లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ముందు నిర్మించిన రెయిన్‌వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్

ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో భారీ సంప్ నిర్మాణం

- వరద నీటిని నాలుగు గంటల్లోనే ఖాళీ చేస్తున్న మోటార్లు
- మరిన్ని చోట్ల నిర్మించేందుకు ప్రతిపాదనలు
- గతంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టిన సంప్‌లు

బంజారాహిల్స్: భారీ వర్షాలు కురిసినప్పుడు రోడ్లపై వరదనీరు నిలవకుండా నిర్మించిన రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్లు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. మొదటి ఫేజ్ కింద జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాల్లో హోల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణం పూర్తి చేసుకోగా, రాజ్ భవన్ రోడ్డులోని లేక్‌వ్యూ గెస్ట్ హౌస్‌తో పాటు సోమాజీగూడ ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ముందు మెర్క్యూరీ హోటల్ చౌరస్తాలో, సచివాలయం సమీపంలో వీటి నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ క్రమంలోనే గత మార్చి 3వ తేదీ నుంచి ఇప్పటివరకు పలుమార్లు కురిసిన భారీ వర్షాలకు గతంలో ఉన్నంత వరద తీవ్రత కనిపించడం లేదు. గత మార్చి 3న మూడు గంటల్లోనే 9 సెంటీమీటర్ల వర్షం కురవగా, లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ముందు రెండు చోట్ల నిర్మించిన వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ వద్ద వరదనీరు ఎప్పటికప్పుడు సంప్‌ల్లోకి చేరుకుంది. రాజ్‌భవన్ రోడ్డులో గతంలో 5 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురిస్తే ట్రాఫిక్ స్తంభించిపోయి రాకపోకలు నిలిచిపోయేవి. కానీ మార్చి 3న 9 సెంటీమీటర్ల వర్షంపాతం దాటినా పెద్దగా ఇబ్బంది కలగలేదు.

ఆర్టీఏ ఆవరణలో మరో సంప్ నిర్మాణం..

- ఈ వరదనీటి సంప్‌ల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి వెల్లడించారు.
- ఈ హోల్డింగ్ స్ట్రక్చర్లను 10 లక్షల లీటర్ల నీటిని స్టోర్ చేసుకునేలా నిర్మించారు. భారీ వరదలకు 10 లక్షల లీటర్ల నీటిని ఈ సంప్‌లు తీసుకోగలుగుతున్నాయి.
- ఒకవేళ వీటిని నిర్మించకుంటే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగి ఉండేవి. ఖైరతాబాద్ ఆర్టీఏ ఆఫీసు వద్ద కూడా చిన్నపాటి వర్షానికి నడుము లోతు నీరు నిలిచిపోయేది.
- ఇక్కడ కూడా భారీ సంప్ నిర్మాణంతో సమస్య పరిష్కారమైంది. ఇప్పుడు వీటికి అదనంగా ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో కూడా 10 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం ఉండే సంప్‌ను నిర్మిస్తున్నారు.
- మెర్క్యూరీ హోటల్ ముందు నిర్మించిన సంప్‌లో వరదనీరు నిలవగానే నేరుగా ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న సంప్‌లోకి మళ్లిస్తారు. దీంతో ఒక్క చుక్క కూడా నీరు నిలవకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
- రెయిన్‌వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్‌లో సుమారు 10 లక్షల లీటర్ల నీరు స్టోరేజ్ చేయడానికి అవకాశం ఉంటుంది.
- ఈ స్ట్రక్చర్స్‌లో వరద నిండిన వెంటనే తొలగించేందుకు జీహెచ్ఎంసీ వీటి దగ్గర 25 హెచ్‌పీ కెపాసిటీ ఉన్న మీటర్లను బిగించింది.
- సంప్ నిండగానే నాలుగు గంటల్లోనే ఈ నీళ్లను ఖాళీ చేస్తున్నారు.
- మరిన్ని చోట్ల రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్‌ను నిర్మించాలని ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.
- రెండో దశలో వీటి నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. దీని కోసం వాటర్ లాగింగ్ సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తిస్తున్నారు.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఫిలింనగర్, శ్రీనగర్‌కాలనీ, శ్రీకృష్ణానగర్, సోమాజీగూడ, పంజగుట్ట తదితర ప్రాంతాల్లో కూడా వరదనీటి సంపుల నిర్మాణం చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

23 నుంచి హైలైఫ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను ఈ నెల 23న హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని మార్క్స్ మీడియా సెంటర్‌లో హైలైఫ్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన సన్నాహక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సినీ నటులు స్రవంతి చొక్కారపు, చాందిని భగ్వనాని, పలువురు మోడల్స్ పాల్గొని సందడి చేశారు. ఎగ్జిబిషన్‌లో లభించి డిజైనరీ దుస్తులతో పాటు వజ్రాభరణాలను ధరించి హొయలు పోయారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన డిజైనర్లు రూపొందించిన వస్త్రాలు, ఆభరణాలు ప్రదర్శిస్తారని నిర్వాహకులు వెల్లడించారు.

కమ్యూనిటీ హాల్‌ను పునర్ నిర్మించండి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం:10లోని సింగాడ బస్తీలో కమ్యూనిటీ హాల్‌ను పునర్‌నిర్మించాలని బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ కమ్యూనిటీ హాల్ సమస్య పెండింగ్‌లో ఉందని ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి నూతన కమ్యూనిటీ హాల్ కోసం ప్రతిపాదనలు రూపొందించి నిధులు మంజూరు చేయించి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సింగాడబస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జవ్వాది అనిల్‌కుమార్, సతీష్‌కుమార్, మూర్తి, గంగరాజు, సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సింగాడ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఈటలపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న గుర్రాల మల్లేశం ముదిరాజ్

పంజగుట్ట: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ డిమాండ్ చేసింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ వర్కింగ్ ప్రసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పల్లె బోయిన అశోక్, రాష్ట్ర యువత అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్ మాట్లాడుతూ..ఈటల రాజేందర్ తల్లి, తండ్రి ఇద్దరూ ముదిరాజ్ అయితే ఈటల ముదిరాజ్ కాదా అని ప్రశ్నించారు. గౌడ కులానికి చెందిన బీసీ బిడ్డ పీసీసీ అధ్యక్షుడు అయితే ఎంతో సంతోషించామని, కానీ బీసీ బిడ్డ ఈటలపై ఇలా అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సమావేశంలో రాజ్‌కుమార్, పోలు లక్ష్మణ్, చొప్పరి సోమయ్య, గుడెల్లి తిరుపతి, పొన్నం మొగిలి, రజనీ కాంత్, సదయ్య, ప్రశాంత్, సురేష్ పాల్గొన్నారు.

బీవీబీపీ సీబీఎస్ఈ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో సీబీఎస్ఈ 10, 12 తరగతుల ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతి పరీక్షల్లో 153 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 100 శాతం ఉత్తీర్ణులయ్యారు. స్కూల్ టాపర్‌గా 97.8 శాతం మార్కులతో అనిమేష్ పాణిగ్రాహి, ఎర్రమనేని రేయాన్స్, 97.6 శాతం మార్కులతో సీహెచ్.హతికారెడ్డి, 97.4 శాతం మార్కులతో జి.సంజన, అక్షత్ అంజారియా, దూదిపాళ్ల గ్రీష్మ టాపర్లుగా నిలిచారు. 110 మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లో 35 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో అందరూ 100 శాతం మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధవీలత విద్యార్థులను అభినందించారు.



టాపర్లతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధవీలత, ఇతర టీచర్లు

12వ తరగతిలో..

బీవీబీపీ స్కూల్ విద్యాశ్రమంలో 12వ తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో 61 మంది విద్యార్థులకు గాను అందరూ ఉత్తీర్ణులయ్యారు. సైన్స్ గ్రూపులో 16 మంది, ఆర్ట్స్ గ్రూపులో 28 మంది డిస్టింక్షన్‌లో పాసయ్యారు. సైన్స్ గ్రూపులో 93 శాతం మార్కులతో రాయలశ్రీ ఐశ్వర్య స్కూల్ టాపర్‌గా, 91.2 శాతం మార్కులతో ఎస్.భావన, 86.4 శాతం మార్కులతో సాయి కుందనప్రియ టాపర్‌గా నిలిచారు. కామర్స్ విభాగంలో 97 శాతం మార్కులతో ఆయుష్ స్కూల్ టాపర్‌గా నిలిచారు.

సింగరేణిలో కుంభకోణాలపై దర్యాప్తు చేయాలి



అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పంజగుట్ట: బీఆర్ఎస్ పాలనలో సింగరేణిలో జరిగిన కుంభకోణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని వివిధ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గొల్లపల్లి దయానంద రావు, ప్రజా సంఘాల మేధావుల విభాగం కార్యదర్శి నందికంటి సాయికుమార్, తెలంగాణ సమరయోధుల వేదిక ప్రతినిధి గంటా సత్యనారాయణ రెడ్డి మాట్లాడారు. సింగరేణిలో గత ప్రభుత్వంలో అనేక కుంభకోణాలు జరిగాయని, గత ప్రభుత్వ హయాంలో గల అధికారులే ప్రస్తుతం కొనసాగుతుండడంతో వారు కోవర్టులుగా మారి సింగరేణిని రక్షించాల్సింది పోయి భక్షిస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో డిజిల్ కుంభకోణం, శ్రీరాంపూర్, సత్తుపలి, బొగ్గు కుంభకోణంలో డి గ్రేడ్ బదులు బి గ్రేడ్ బొగ్గు సరఫరా చేసి సంస్థకు నష్టం వాటిల్లేలా చేశారన్నారు. ముఖ్యమంత్రి స్పందించి సింగరేణిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి దాన్ని కాపాడాలని సూచించారు. సమావేశంలో పోకల కిరణ్ కుమార్, మహేశ్వర రాజు పాల్గొన్నారు.


అక్రమ నిర్మాణాల కూల్చివేత



అంబేద్కర్‌నగర్ బస్తీలో అక్రమ నిర్మాణాలు కూల్చివేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

ఫిలింనగర్: ఫిలింనగర్ పద్మాలయా అంబేద్కర్‌నగర్ బస్తీలో ఇద్దరు మహిళలు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను గురువారం షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. ఆ ప్రాంతంలో ఇది ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కొంత కాలంగా బస్తీకి చెందిన ఇద్దరు మహిళలు 100 గజాలు ఒకరు, 160 గజాలు మరొకరు సర్కార్ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. స్థానికుల నుంచి ఫిర్యాదు అందుకున్న రెవెన్యూ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను గతంలో రెండు సార్లు కూల్చివేసి ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కబ్జాదారులపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయితే ఇంతవరకు వీరిపై చర్యలు తీసుకోకపోవడంతో మళ్లీ ఆక్రమణలకు తెగబడ్డారు. ఈ స్థలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించడం ద్వారా కాపాడుకునేందుకు వీలుంటుందని స్థానికులు అంటున్నారు.

ముందుకు సాగని పనులు



షాకత్‌నగర్‌లో గుంతలమయమైన రోడ్డు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-3లోని షాకత్‌నగర్ బస్తీలో వీధులన్నీ గుంతలమయమై స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధి కిందికి వచ్చే ఈ బస్తీలో రోడ్లతో పాటు డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని, నిధులు మంజూరు చేసి కొత్తవి వేయాలని షాకత్‌నగర్ నైబర్‌హుడ్ వెల్ఫేర్ కమిటీ గత ఏడాది అక్టోబర్ 23న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో వినతిపత్రం సమర్పించారు. ఎక్కడి నుంచి ఎక్కడి వరకు రోడ్డు వేయాలో కూడా వీరు ఇంటి నెంబర్లతో సహా పూర్తి సమాచారం ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేరోజు ఎమ్మెల్యే దానం నాగేందర్ సంబంధిత జీహెచ్ఎంసీ ఈఈ, డీఈఈ, ఏఈఈలకు ఆదేశాలు జారీ చేస్తూ కొత్త రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ఎనిమిది నెలలు గడుస్తోన్నా ఇంతవరకు సంబంధిత ఇంజినీర్లు అటువైపు తొంగి చూడలేదు. బస్తీలో 6–8 వరకు వీధులు గుంతలమయమై డ్రైనేజీ పొంగిపొర్లుతూ అధ్వానంగా మారాయి. సమస్య ఎంతవరకు వచ్చిందని పలుమార్లు స్థానికులు ఎమ్మెల్యేను కలిసి అడిగారు. ఇంజినీర్లకు చెప్పానంటూ ఆయన బస్తీవాసులకు చెప్పి పంపిస్తున్నారు. సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది.

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ శ్రీ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని శ్రీ గణపతి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయని పేర్కొన్నారు.

రూ.86వేలు మాయం చేసిన సైబర్ నేరగాళ్లు

సనత్‌నగర్: ఇంట్లో పాడైన టీవీ మరమ్మతు కోసం గూగుల్ శోధించిన ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. రూ.9 పంపమని చెప్పి అతని ఖాతాలోని రూ.86 వేలు మాయం చేశారు. పోలీసులు తెలిపిన మేరకు..బేగంపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన రామారావు ఇంట్లోని సోనీ టీవీ పాడవ్వడంతో మరమ్మతు సేవల కోసం గూగుల్‌లో శోధించాడు. గూగుల్‌లో కనిపించిన ఓ నెంబర్‌కు ఫోన్ చేశాడు. వివరాలు అడిగిన అవతలి వ్యక్తి రూ.9 పంపమని చెప్పడంతో అతని చెప్పిన నెంబర్‌కు రూ.9 పంపాడు. దీంతో వెంటనే రామారావు బ్యాంక్ ఖాతా నుంచి రూ.86 వేలు గల్లంతయ్యాయి. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్–19 ఆధ్వర్యంలో గురువారం ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీ ప్రధాన రహదారిలో ఇరువైపులా ఆక్రమణలు తొలగింపు చేపట్టారు. తొలుత కట్ట మైసమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన ఆక్రమణలు చివర ఏ-బ్లాక్ వరకు కొనసాగాయి. ఇదిలా ఉండగా మార్గమధ్యలో ఉన్న కొన్ని బిల్డింగ్స్‌కు అనుకుని ఉన్న టీ స్టాల్స్, మెట్లు, రెయిలింగ్స్ కొన్ని తొలగించలేదు. దీంతో మధురానగర్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీ ప్రధాన రహదారిలో ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించకుండా అడపాదడపా ఉన్న టీ దుకాణాలు, కొన్ని హాస్టల్స్‌కు చెందిన మెట్ల మార్గం, మరికొన్ని ఫుట్‌పాత్‌ల ఏరియాలను మాత్రమే ఎందుకు తొలగించారని, నిరంతరం వేలాది రూపాయలతో వ్యాపారం చేస్తున్న స్వీట్ షాపుల మెట్లను, కొన్ని అక్రమ నిర్మాణాల ద్వారా ఏర్పాటైన హాస్టల్స్‌ను ఎందుకు తొలగించలేదని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ అధికారులు వివరణ కోరగా మధురానగర్‌లో ఇరువైపులా ఉన్న ఆక్రమణలన్నీ తొలగించడం జరుగుతుందని, ఇందులో ఎలాంటి రాజకీయ ఒత్తిడిగాని, స్వలాభాపేక్ష లేదని అన్నారు. ఈ ఫుట్‌పాత్ ఆక్రమణలు శుక్రవారం కూడా కొనసాగుతాయని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



ఉషాశ్రీ మృతి దేహం

హిమాయత్‌నగర్: రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందిన ఘటన గురువారం నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చోటుచేసుకుంది. కూకట్‌పల్లికి చెందిన ఉషాశ్రీ(21), అభిషేక్ (21)లు స్నేహితులు. బుధవారం రాత్రి హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెం.14లోని తమ స్నేహితుడి ఇంట్లో జరిగిన పార్టీకి ఉషాశ్రీ, అభిషేక్ హాజరయ్యారు. తిరిగి వెళ్తున్న సమయంలో గురువారం ఉదయం అభిషేక్ నడుపుతున్న స్పోర్ట్స్ బైక్ వేగంగా డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉషాశ్రీ గాలిలో ఎగిరిపడగా తల రోడ్డుకు బలంగా తగిలింది, అభిషేక్‌కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే వారిని స్థానికులు హైదర్‌గూడ అపోలో హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఉషాశ్రీ మృతిచెందగా అభిషేక్‌కు వైద్యులు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. అభిషేక్ పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసి, ఉషాశ్రీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

బీరు బాటిల్‌తో దాడి.. కేసు నమోదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–11లోని ఉదయ్‌నగర్ బస్తీకి చెందిన అమర్‌సింగ్ అనే వ్యక్తికి అదే ప్రాంతానికి చెందిన చందర్ అనే వ్యక్తితో పాత కక్షలు ఉన్నాయి. ఇద్దరూ కొంతకాలంగా మాట్లాడుకోవడం లేదు. బుధవారం సాయంత్రం అమర్‌సింగ్ ఇంటి బయట కూర్చొని ఉండగా అదే సమయంలో అక్కడికి వచ్చిన చందర్ బీరు బాటిల్‌తో అమర్ తలపై దాడి చేశాడు. ఈ ఘటనలో అమర్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంజారాహిల్స్‌లో అర్ధరాత్రి కారు బీభత్సం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లో బుధవారం అర్ధరాత్రి అదుపుతప్పిన వేగంతో దూసుకెళ్తున్న ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన కె.అనిరుథ్ అనే విద్యార్థి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో అనిరుథ్ రోడ్డునెంబర్–12 నుంచి విరించి ఆస్పత్రి వైపు ఐ20 కారులో దూసుకెళ్తున్నాడు. పిజ్జా హట్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు దెబ్బతినగా, అనిరుథ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేశాభివృద్ధిలో ఏఐవైఎఫ్ కీలకపాత్ర



జాతీయ మహాసభల్లో పాల్గొన్న నాయకులు

హిమాయత్‌నగర్ : దేశ అభివృద్ధిలో ఏఐవైఎఫ్‌ది కీలక పాత్ర అని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలిఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఈ నెల 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరుగుతున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల్లో భాగంగా గురువారం మొదటి రోజు జరిగిన ర్యాలీ, బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర సమితిగా పెద్దఎత్తున ప్రతినిధి బృందం హాజరై, జెండాలు, ప్లకార్డులు చేతబూని పాల్గొన్నట్లు చెప్పారు. శ్రీకాంత్, రవి, సత్య ప్రసాద్, కొండల్, వెంకటేశ్వర్లు, మహేందర్, శ్రీనివాసులు, యుగంధర్, సల్మాన్ బేగ్, షేక్ మహమూద్, మాజీద్ అలీ ఖాన్, లక్ష్మణ్, మహేష్, నయీమ్, రాజేష్, శివ కుమార్, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్నాడంటూ ఫిర్యాదు

వెంగళరావునగర్: జీతాలు ఇవ్వకపోగా ఉద్యోగులను బెదిరిస్తున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం ఎస్.బాల ప్రియాంక మధురానగర్ కాలనీలోని హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తుంది. గతేడాది జనవరిలో మాదాపూర్‌లోని రియల్ ఎస్టేట్ సంస్థలో విధులు నిర్వహిస్తుంది. అదే సంస్థలో నర్సింహులు అనే వ్యక్తి కూడా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో పీకెవిఎస్ అనే సంస్థ పేరుతో శ్రీనగర్‌కాలనీలో నర్సింహులు సొంతగా రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ప్రారంభించాడు. జూలై నెలలో తన స్నేహితులు దేవి, క్రాంతికుమార్‌తో కలిసి ఆమె కూడా తొలుత పనిచేసే సంస్థకు రాజీనామా చేసి ఇక్కడ జాయిన్ అయ్యారు. ఆ సమయంలో ప్రతినెల రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చాడు. అయితే నేటి వరకు కూడా జీతాలు ఇవ్వలేదు. ఇదేమని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నాడని ప్రియాంక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సాక్షి
శుక్రవారం । 16 । మే । 2025

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 7విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శ్రీద్వారం దుర్గాప్రసాదరావు రచించిన సంగీత సాహిత్య వ్యాసాల విశిష్ట సంపుటి జీవాళి పుస్తకావిష్కరణ కార్యక్రమం రవీంద్రభారతిలో సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది.
- వనస్థలిపురం డబుల్ రోడ్డులోని హియర్ వెల్, స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉచిత వినికిడి పరీక్షలు, చెవి మిషన్ ట్రయల్ జరుగుతుంది.
- మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీకాలనీలో లులుమాల్‌లో లులు బిగ్ చాకో డేస్ ఫెస్టివల్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవులు సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మైలార్‌దేవ్‌పల్లి గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 నుంచి ఉదయం 11 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

టర్కీ విద్యాసంస్థతో 'మనూ' ఎంఓయూ రద్దు

రాయదుర్గం: టర్కీ దేశంలోని ఓ విద్యాసంస్థతో చేసుకున్న ఒప్పందం రద్దు చేసుకుంటున్నట్లు గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం(మనూ) గురువారం ఒక ప్రకటన తెలిపింది. ఇండో–పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్తాన్ ఉగ్రవాద కార్యకలాపాలకు టర్కీ దేశం మద్దతు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మనూ స్పష్టం చేసింది. టర్కీలోని యూనస్ ఎమ్రే ఇన్‌స్టిట్యూట్‌తో మనూ అయిదు సంవత్సరాల కాలానికిగాను 2024 జనవరి 2న విద్యాపరమైన అవగాహనా ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో ఉర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ లాంగ్వేజెస్, లింగ్విస్టిక్స్ అండ్ ఇండాలజీలో టర్కిష్ భాషలో డిప్లొమా ప్రారంభించింది. దీని కోసం విజిటింగ్ ప్రొఫెసర్ నియమించింది. తాజాగా ఉర్దూ విశ్వవిద్యాలయం తీసుకున్న నిర్ణయంతో టర్కీ దేశం నుంచి వచ్చిన విజిటింగ్ ప్రొఫెసర్ ఇప్పటికే తన దేశానికి తిరిగి వెళ్లిపోయారని తెలిసింది.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయానికి మరోసారి బాంబు బెదిరింపునకు సబంధించిన ఈమెయిల్ వచ్చింది. ఆ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 9న బాంబు బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. ఈ నేపథ్యంలో భద్రతాధికారులు ఎయిర్‌పోర్టులో విస్తృతంగా తనిఖీలు చేసి బాంబులు లేవని తేల్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్న సంగతి తెలిసిందే. మరోసారి ఈ నెల 13 అర్ధరాత్రి కూడా ఆర్‌జీఐఏ కస్టమర్ సపోర్ట్ గ్రూప్‌నకు మరోసారి మెయిల్ వచ్చింది. డిపార్చర్ ఏరియాతోపాటు బెల్ట్ 7, 8 మధ్య బాంబులు అమర్చినట్లు పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు మరోసారి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఈ విషయమై ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఐర్లాండ్ నుంచే రెండుసార్లు బాంబు బెదిరింపు ఈమెయిల్స్ వచ్చినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. రెండుసార్లు బెదిరింపు ఈమెయిల్స్ చేసిన ఆగంతకుడు ఒక్కడేనా..? వేర్వేరు వ్యక్తులా అనే కోణంలో అధికారులు లోతైన దర్యాప్తు చేపడుతున్నారు.

మంటలు ఎగసినప్పుడే.. నిబంధనల కొరడా!

తర్వాత షరా మామూలే
- నివాస భవనాల్లోనే గోడౌన్లు
- గతంలో ప్రాణాలు పోయినా వీడని నిర్లిప్తత



సాక్షి, సిటీబ్యూరో: అగ్నిప్రమాదాలపై అధికారులు ఇంకా నిర్లిప్తత వీడలేదు. ఘటన జరిగినప్పుడే హడావుడి. ఆ తర్వాత షరామామూలే. జరగరానిది జరిగినప్పుడే నిబంధనల కొరడా ఝుళిపిస్తుంటారు. ఆపై నిర్లక్ష్యమే నిర్లక్ష్యం. ఎప్పుడు ప్రమాదాలు జరిగినా చర్యలు తీసుకుంటామని, జనావాసాల మధ్య అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన గోడౌన్‌లు తదితరమైన వాటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామనే ప్రకటనలే తప్ప, చర్యలు శూన్యం. దీనికి తాజాగా నగరంలోని అఫ్జల్‌గంజ్ సమీపంలో ఉన్న ఓ భవనంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదమే నిదర్శనం. ఇందులో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో దాని గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. కానీ, నివాస భవనాల్లో గోడౌన్లు, స్క్రాప్ నిల్వలు వంటి వాటిలో అగ్నిప్రమాదం జరిగితే మంటలు క్షణాల్లో తీవ్రమవుతున్నాయి. ప్రాణ నష్టాలు కూడా జరుగుతున్నాయి.

ప్రమాదాల పరంపర...

దాదాపు ఏడాదిన్నర క్రితం బజార్‌ఘాట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. నివాస భవనంలో రసాయన గోడౌన్ నిర్వహిస్తున్నట్లు ఆ ఘటనలో వెల్లడైంది. దాదాపు మూడేళ్ల క్రితం బోయిగూడ స్క్రాప్ గోడౌన్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 11 మంది మరణించారు. తాజాగా ప్రమాదం జరిగిన భవనం సైతం నివాస భవనమే అయినప్పటికీ ప్లాస్టిక్ డిస్పోజబుల్ గ్లాసులు, ప్లేట్లు తదితరమైన వాటి గోడౌన్‌గా వినియోగిస్తున్నారు. ఇక వాణిజ్య భవనాల్లోనూ జరిగిన అగ్నిప్రమాదాల్లో గత మూడేళ్లలో ఎందరో మరణించారు. ప్రమాదాలు జరిగినప్పుడు సదరు భవనాలకు నిర్మాణ అనుమతులు కానీ, ట్రేడ్ లైసెన్సులు కానీ లేవనే విషయాలు పలు సందర్భాల్లో వెలుగుచూశాయి. గోడౌన్లు, షోరూమ్‌లు, హోటళ్లు, హాస్పిటళ్లు, పబ్‌ల పరిస్థితి కూడా ఇదే. వేటికీ నిబంధనల మేరకు సెట్‌బ్యాక్‌లు, ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లుండవు. దాదాపు రెండేళ్ల క్రితం ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా అప్పటి ఈవీడీఎం విభాగం హెచ్చరించినప్పటికీ ఆ తర్వాత పెద్దగా పట్టించుకున్న దాఖలాల్లేవు.

అమలుకు నోచని ఆలోచనలు

నగరంలో జనావాసాలతోపాటు శివార్లలోనూ భారీ సంఖ్యలో గోడౌన్లున్నాయి. వాటిల్లో ఎన్నింటికి ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లున్నాయనే విషయం అధికారులకే తెలియదంటే అతిశయోక్తి కాదేమో! గతంలో ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు లేని భవనాలపై చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్, ఫైర్‌సేఫ్టీ, ఆరోగ్యం–పారిశుధ్యం, రెవెన్యూ విభాగాల అధికారుల బృందాలతో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినప్పటికీ అది అమలుకు నోచుకోలేదు. ఇటీవల అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ డిపార్ట్‌మెంట్, జీహెచ్‌ఎంసీలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని దాదాపు నెలన్నర క్రితం అప్పటి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయించారు. నివాస, వాణిజ్య భవనాల్లో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌సేఫ్టీ విధానాలు కచ్చితంగా అమలు చేయడంతోపాటు గత రెండేళ్లలో ఎక్కడెక్కడ అగ్నిప్రమాదాలు ఎక్కువ జరిగాయో, అందుకు కారణాలేమిటో పరిశీలించి చర్యలు తీసుకోవాలని భావించారు. కార్యాచరణ ప్రారంభం కాకముందే ఇలంబర్తి బదిలీ కావడం గమనార్హం.

నిజాయితీ గల అధికారులతోనే చట్టాలు పటిష్టంగా అమలు

జస్టిస్ చంద్రకుమార్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జేబీ రాజు, పాల్గొన్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నిజాయితీ గల అధికారులతోపాటు పేద, దళిత బహుజనులకు అనుకూలంగా వ్యవహరించే అధికారులు ఉంటేనే అన్ని చట్టాలు సమర్థవంతంగా అమలు అవుతాయని, లేకుంటే అన్ని సమస్యలు పెండింగ్‌లో ఉంటాయని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన శ్రామిక యూనియన్ తెలంగాణ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు తీరుపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిటిజన్స్ ఆడిట్ యానువల్ రిపోర్టు 2023 బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. అనంతరం జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ మొదటి నుంచి కొందరు అధికారులు అట్రాసిటీ కేసులను పక్కదారి పట్టిస్తూనే ఉన్నారని అన్నారు. జ్ఞానం, అధికారంలేని జాతులు బలహీన పడిపోతున్నాయని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టు జేబీ రాజు మాట్లాడుతూ అట్రాసిటీ కేసులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కూడా కేసు పెట్టాలని సూచించారు. అట్రాసిటీ కేసులను పటిష్టంగా అమలు చేయడానికి స్పెషల్ కోర్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీఐ కమిషనర్ భూపాల్ మాట్లాడుతూ దళిత హక్కులు నెరవేరితేనే సమాజంలో సమానత్వం వస్తుందన్నారు. అంబేడ్కర్ ఇచ్చిన హక్కుల వల్లే ఈ స్థాయికి ఎదిగామన్నారు. దళిత బహుజన శ్రామిక యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.నరసింహ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సి.ఆనందం, సలహాదారులు నందగోపాల్, పి.శంకర్, శివలింగం, రాంప్రసాద్, న్యాయవాది దర్శనం నరసింహ, రిటైర్డ్ ఎస్పీ ఆనందం తదితరులు పాల్గొన్నారు.

బోర్ల రీచార్జితోనే నీటిభద్రత

భూగర్భ జలసంరక్షణ నిపుణుడు డాక్టర్ దేవరాజరెడ్డి



మాట్లాడుతున్న దేవరాజరెడ్డి. వేదికపై చంద్రమౌళి, మేరెడ్డి శ్యాంప్రసాదరెడ్డి, కరుణాకర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: విచ్చలవిడిగా కొత్తబోరు బావులు తవ్వుకుంటూ వెళ్లటం కంటే, ఉన్న బోర్లలో వాన నీటిని నింపే రీచార్జి కట్టడాలను నిర్మించటం ద్వారానే నీటి భద్రత చేకూరుతుందని కర్ణాటకకు చెందిన భూగర్భ జల సంరక్షణ నిపుణుడు డాక్టర్ ఎస్.జె.దేవరాజ రెడ్డి స్పష్టం చేశారు. విద్యాసాగర్ రావు భవన్‌లో తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం(ట్రీ), వాక్ ఫర్ వాటర్ సంస్థల ఆధ్వర్యంలో బోరు బావుల రీచార్జి ఆవశ్యకతపై గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం, గృహ, పారిశ్రామిక రంగాల్లో నీటి భద్రత సాధించాలంటే పొలాలు, గ్రామాలు/పట్టణాలు/నగరాల్లో ఇళ్ల దగ్గర, పరిశ్రమలు, సంస్థల ఆవరణల్లో బోరుబావుల చుట్టూ ఇంకుడుగుంతలు తవ్వాలని సూచించారు. తెలంగాణలో బోరుబావులు ఉన్న వారంతా వాన నీటి సంరక్షణ చేస్తే భూగర్భ జలాలు పెరిగి ఐదేళ్లలో నీటి కొరత తీరిపోతుందని పేర్కొన్నారు. తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం(ట్రీ) అధ్యక్షుడు ఎం.శ్యాంప్రసాదరెడ్డి మాట్లాడుతూ వాన నీటి సంరక్షణ ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజెప్పేందుకు దశాబ్దకాలంగా ఉద్యమిస్తున్నామని, 'సాక్షి'మీడియా గ్రూప్ సౌజన్యంతో పొలాల్లో కందకాలు తవ్వటంపై శిక్షణా శిబిరాలు నిర్వహించామన్నారు. వాక్ ఫర్ వాటర్ సంస్థ వ్యవస్థాపకుడు ఎం.కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఒడిసి పట్టే ప్రతి వర్షపు చుక్కా రేపటి తరాలకు భూగర్భ జల కానుక అని అన్నారు. వాన నీటిని ప్రతి ఒక్కరూ సంరక్షించాలని, పొదుపుగా వాడుకోవాలని పిలుపునిస్తూ సభికులతో నీటి ప్రతిజ్ఞ చేయించారు. తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం (ట్రీ) గౌరవాధ్యక్షుడు సంగెం చంద్రమౌళి, వాననీటి సంరక్షణ నిపుణుడు సుభాష్‌రెడ్డి, పలు జిల్లాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

జూన్‌లో జేఎన్‌టీయూహెచ్ గ్రాడ్యుయేషన్ డే

సరికొత్త సంప్రదాయానికి తెరతీసిన అధికారులు



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ కిషన్‌కుమార్ రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని వైస్ చాన్స్‌లర్ టి.కిషన్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం యూనివర్సిటీలోని గోల్డెన్ జూబ్లీ సెమినార్ హాలులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్‌లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి ప్రతి క్లాసులో టాప్ 10 విద్యార్థులకు మెరిటోరియస్ సర్టిఫికెట్స్ ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎప్‌సెట్‌ను విజయవంతంగా నిర్వహించి రికార్డు సమయంలో కేవలం వారం రోజుల్లో ఫలితాలు ఇచ్చామన్నారు. వర్సిటీలో విద్యార్థులు, ఉపాధ్యాయులను కలిసి మాట్లాడి మౌలిక వసతులపై అవగాహన పెంచుకుంటున్నానని అన్నారు. విద్యలో సంస్కరణలో తీసుకుని వచ్చి, వివరణాత్మక సిలబస్ రూపొందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. 13వ స్నాతకోత్సవం కోసం సన్నాహాలు జరుగుతున్నాయని, పీహెచ్‌డీ నోటిఫికేషన్ త్వరలో ఇస్తామని, అవి ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ ఉంటాయని, రాబోయే 10 రోజుల్లో ప్రకటన వస్తుందని పేర్కొన్నారు. విద్య, పరిశోధన ఆవిష్కరణ రంగాలను బలోపేతం చేసే లక్ష్యంతో అమెరికా కాన్సులేట్ బృందం జేఎన్‌టీయూహెచ్‌ని సందర్శించిందని పేర్కొన్నారు. జేఎన్‌టీయూ 60 సంవత్సరాల వేడుకలు అక్టోబర్, నవంబర్‌లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రెక్టార్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

18 వరకు రేషన్ సరుకుల పంపిణీ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా పరిధిలో రేషన్ సరుకులు డ్రా చేసే గడువు ఈ నెల 18 వరకు పొడిగించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15తో సరుకులు పంపిణీ చేసే గడువు పూర్తి కాగా... 17, 18 తేదీల్లోనూ ప్రభుత్వ చౌకధరల దుకాణాలు తెరిచి సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రేషన్‌కార్డు దారులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓయూలో ఎమ్మెస్సీ డాటా సైన్స్ కోర్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సిద్దిపేట పీజీ సెంటర్‌లో ఎమ్మెస్సీ డాటా సైన్స్ కోర్సును ప్రవేశ పెట్టనున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం వైస్ చాన్స్‌లర్ ప్రొ.కుమార్ సిద్దిపేట పీజీ సెంటర్‌లో పర్యటించారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కోర్సుల్లో సీట్ల సంఖ్యను పెంచనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలసి పీజీ సెంటర్‌కు రోడ్డు, వీధి దీపాలు, తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని కోరగా అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఓయూ అధికారులు తెలిపారు.

జేఎన్‌టీయూలో బదిలీలు

కేపీహెచ్‌బీ కాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో వివిధ విభాగాలకు నూతన డైరెక్టర్లను నియమిస్తూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి. కిషన్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ విభాగం డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ వి.కామాక్షి ప్రసాద్‌ను అకడమిక్ అఫైర్స్ విభాగం డైరెక్టర్‌గా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సపోర్ట్ అండ్ డెవలప్‌మెంట్ విభాగానికి ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, యూజీసీ వ్యవహారాల విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమించారు. డాక్టర్ ఎ.చెన్నకేశవరెడ్డిని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్‌గా కామాక్షి ప్రసాద్ స్థానంలో నియమించారు. డాక్టర్ ఎస్‌వీ రమణను హైదరాబాద్ ఇంజనీరింగ్ కళాశాలకు ఇఇఇ విభాగం ప్రొఫెసర్‌గా బదిలీ చేశారు. డాక్టర్ ఎ. జయలక్ష్మిని ఇఇఇ విభాగం ప్రొఫెసర్‌గా బదిలీ చేశారు.

విద్యార్థుల పఠనస్థాయి పెంచాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: ప్రతి పాఠశాలలోని విద్యార్థులందరూ చదవగలిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. గురువారం నాంపల్లి అలియా ప్రభుత్వ మోడల్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ఉపాధ్యాయులకు విద్యాబోధన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థుల్లో రీడింగ్, రైటింగ్ వంటి ప్రాథమిక నైపుణ్యాల పెంపుదలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎక్కువ జ్ఞానం, నైపుణ్యాలను పెంచడానికి శిక్షణ ప్రాముఖ్యత, అభ్యాసాల అమలు వ్యూహాలను చర్చించారు. విద్యాప్రమాణాలపై ప్రతి ఒక్క టీచర్ చర్చించుకునేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. విద్యార్థుల పఠన స్థాయిని పెంచి, చదవడంరాని విద్యార్థులు తమ పాఠశాలలో లేరని డిక్లేర్ చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చటంతో హాజరు శాతం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. చాలామంది విద్యార్థులు ఇంగ్లిష్ వంటి సబ్జెక్టుల్లో 90 మార్కులకుపైగా సాధించడాన్ని అభినందించారు. సదస్సులో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి, డైట్ ప్రిన్సిపాల్ రవికాంత్ రావు, ఎస్ఆర్పీలు నాగరాజు, బాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చివరి పనిదినాన రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి

బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్లకు సంబంధించిన డబ్బులను చివరి పనిదినాన అందించాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రభుత్వం బకాయిపడ్డ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 35 సంవత్సరాలపాటు ప్రభుత్వానికి సేవలందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యుటీ, జీపీఎఫ్, వేతన సవరణ బెనిఫిట్లను సకాలంలో చెల్లించకపోవడంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులను ఈసడించుకోవడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తగదని అన్నారు. పౌర సమాజం, ఉద్యోగుల సహకారంతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించిన విషయాన్ని రేవంత్‌రెడ్డి మర్చిపోవద్దన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే రాహుల్‌గాంధీకి లేఖ రాస్తామని, ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలుస్తామని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల యూనియన్ కన్వీనర్ జోగు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తులసి సత్యనారాయణ, ఎంబీసీ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఇంజనీర్ సురేష్, కొండ రాంమోహన్, బొమ్మ నరేందర్, బండారు పద్మావతి, తాళ్ల భాగ్యలక్ష్మీ, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా, తెలంగాణ సినిమా విభజన జరగాలి

తెలంగాణ సినిమా వేదిక (టీసీవీ) ప్రతినిధుల డిమాండ్



వెబ్‌సైట్ లోగో ఆవిష్కరిస్తున్న టీసీవీ ప్రతినిధులు

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు అవుతున్నా తెలంగాణ సినిమాపై ఇంకా సీమాంధ్ర సినిమా పెద్దలే అజమాయిషీ, పెత్తనం సాగిస్తున్నారని తెలంగాణ సినిమా వేదిక(టీసీవీ) ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో టీసీవీ ఆధ్వర్యంలో జరిగిన 'మన రాష్ట్రం మన సినిమా'అనే చర్చావేదికలో ఆ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, కన్వీనర్ లారా, కో కన్వీనర్ మోహన్ బైరాగి మాట్లాడారు. 1993లో ఉమ్మడి రాష్ట్రంలో మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్(మా) ఏర్పడిందని, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తెలంగాణ మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్ ఏర్పాటు కాలేదని అన్నారు. తెలంగాణ ఫిలిమ్ చాంబర్‌లో పూర్తి మార్పులు జరగాలని, సీనియర్ సినిమా కళాకారులకు పెన్షన్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. వంద ఎకరాల్లో తెలంగాణ ఫిలిమ్ స్టూడియో ఏర్పాటు చేయాలని, గద్దర్ అవార్డులు తెలంగాణ సినిమాలకే ఇవ్వాలన్నారు. తెలంగాణ చలనచిత్ర పాలసీ రూపొందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీసీవీ ప్రతినిధులు జైహింద్ గౌడ్, మురళీధర్ దేశ్‌పాండే, సురేష్‌రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కుటుంబం అవార్డుల ప్రదానం



అవార్డుల ప్రదానోత్సవంలో మధుసూదనాచారి, కోలేటి దామోదర్

చిక్కడపల్లి: ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ ఎంతో పురాతనమైనదని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో అంతర్జాతీయ కుటుంబాల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆదర్శ కుటుంబం అవార్డులను శోభ, డాక్టర్ రామచంద్రరావు, మాధవి, వై.శ్రీనివాసులు, రేణుక, డాక్టర్ మధుసూదన్‌రావు, బత్తిన పద్మ, నరసింహులుగౌడ్, సుజాత, శంకర్, అమంచ, అంజయ్యలకు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, సినీ దర్శకుడు డాక్టర్ నిట్టల గోపాలకృష్ణ, రిటైర్డ్ జడ్జి డాక్టర్ బూర్గుల మధుసూదన్‌రావు, సర్వేపల్లి గోపికృష్ణ, కవయిత్రి డాక్టర్ రాధాకుసుమ, నిర్వాహకులు కె.మురళీ మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మతాన్ని రాజకీయాలకు వాడుకోవద్దు

మంత్రి సీతక్క



పీస్ అంబాసిడర్ అవార్డును అందిస్తున్న సీతక్క

రాంగోపాల్‌పేట్: మతాన్ని రాజకీయాలకు వాడుకోవద్దని, మానవత్వంతో కూడిన మతాన్నే ప్రజలు ఇష్టపడతారని మంత్రి సీతక్క అన్నారు. సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో దహించు అగ్ని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పరిశుద్ధాత్మ అగ్ని సదస్సుల పేరుతో జరుగుతున్న యూత్ మీటింగ్స్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మతానికి మానవత్వం జోడిస్తేనే లోక కల్యాణం సాధ్యమవుతుందన్నారు. ఎవరి విశ్వాసాలను వారు నమ్ముతూ సాటి మనిషిని ప్రేమించాలని సూచించారు. మత సంస్థలు మత ప్రచారానికే పరిమితం కాకుండా ప్రజల సౌఖ్యం, ఆరోగ్యం కోసం పాటు పడాలని, మనం చేసే సేవ వెయ్యేండ్లపాటు ప్రజలు గుర్తు పెట్టుకోవాలని అన్నారు. మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ డాక్టర్ థామస్ మాట్లాడుతూ తెలంగాణ, ఏపీలో సంఘాలతో కేవలం యేసు క్రీస్తు సువార్తనే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. పేదలకు అన్నదానం, వితంతువులకు కుట్టు శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ, అనాథ పిల్లలకు ఉచిత విద్య, యువతులకు వివాహాలు జరిపిస్తామన్నారు. ఈనెల 17వ తేదీ వరకు ఈ సదస్సులు జరుగుతాయని చెప్పారు.

పీస్ అంబాసిడర్ అవార్డు

దహించు అగ్ని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న బిషప్ డాక్టర్ థామస్‌కు అమెరికా యూనివర్సిటీ అందించిన పీస్ అంబాసిడర్ అవార్డును మంత్రి సీతక్క బహూకరించారు. ఈ కార్యక్రమంలో షీబా థామస్, మోజస్, డేవిడ్ జీవన్ డిన్ను, అశోక్, జాయ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాలకు పోస్టులు సృష్టించాలి

ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో వెంకటేష్ తదితరులు

ముషీరాబాద్: ఆరు సంవత్సరాల క్రితం కొత్తగా 23 జిల్లాలు, ఆఫీసులు ఏర్పాటు చేసినప్పటికీ, సరిపడా పోస్టులు సృష్టించకపోవడంతో ఉద్యోగుల కొరత ఏర్పడిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సమర్థవంతంగా సాగాలంటే ఇన్‌చార్జీల స్థానంలో పూర్తిస్థాయి అధికారులను, ఉద్యోగులను నియమించాలని కోరారు. ఆరు సంవత్సరాల క్రితం ఏర్పడ్డ 23 జిల్లాలో 40 శాఖల జిల్లా ఆఫీసులు, తాలుకా ఆఫీసులు 131 మండలాలు, 30 రెవెన్యూ డివిజనల్ ఆఫీసులు, 76 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 4,383 గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయని తెలిపారు. వీటిల్లో గ్రూప్–1, 2, 4 సర్వీసు పోస్టులు పెద్ద ఎత్తున అవసరం కాగా ఒక్కటి కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని వెంటనే కొత్త జిల్లాలకు సరిపడా సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, జి.అనంతయ్య, జిల్లెపల్లి అంజి, సి.రాజేందర్, నందగోపాల్, ర్యాగ రమేష్, రాజునేత, రామూర్తిగౌడ్, రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉపాధి భద్రత కల్పించాలి



ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నాలో చేపలతో మత్స్యకార్మిక సంఘం నాయకులు

కవాడిగూడ: మత్స్యకారులకు వృత్తి రక్షణ, ఉపాధి భద్రత కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నరసింహ, ప్రధాన కార్యదర్శి లెల్లల బాలకృష్ణ, రాష్ట్ర నాయకులు పిట్టల రవీందర్ మాట్లాడుతూ మత్స్య వృత్తిలో మైదాన ప్రాంత, సముద్రతీర మత్స్యకారులు, చేపల మార్కెట్లో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారం చేసేవారు, చేపల ఎగుమతులు, దిగుమతులు, డ్రెస్సింగ్, ప్రాసెసింగ్ చేసేవారు, వలలు, బోట్ల తయారీ, ఐస్ ప్యాకింగ్ వంటి అనుబంధ వృత్తులపై జీవనోపాధి పొందుతున్న కోట్లాది మంది మత్స్యకారులు, మత్స్యకార్మికులు సరైన అభివృద్ధి లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా చేపల వేటకు వెళ్తున్న మత్స్యకారులకు ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియా వంటి సదుపాయాలు కూడా లేవని విచారం వ్యక్తం చేశారు. నాబార్డు ద్వారా మత్స్యకారులకు ఇచ్చే రుణాలను కేంద్ర ప్రభుత్వం నిలిపేసిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం 5 వేల కోట్ల రూపాయలను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. మత్స్య సొసైటీల సభ్యులందరికీ 10 లక్షల రూపాయలు గ్రూప్ ఇన్సూరెన్స్‌ను ఎలాంటి షరతులు లేకుండా అందించాలని కోరారు. ఈ ధర్నాలో సంఘం నాయకులు కొప్పు పద్మ, బోడంకి చందు, శీలం శ్రీను, గొడుగు వెంకట్, కర్రెల్లి లలిత, శంకర్, విజయకుమార్‌తోపాటు మత్స్యకారులు, మత్స్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శుక్రవారం
16, మే, 2025



గచ్చిబౌలిలో నటి
స్రవంతి సందడి

పోల్కీ, వజ్రాభరణాల స్టోర్ ప్రారంభం

గచ్చిబౌలి : గచ్చిబౌలిలో సినీనటి స్రవంతి చొక్కారపు సందడి చేశారు. గచ్చిబౌలిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ ప్రముఖ జ్యువెలరీ స్టోర్‌ను స్రవంతి గురువారం ప్రారంభించారు. అద్భుతమైన బంగారం, పోల్కీ, వజ్రాల ఆభరణాల్లో విశ్వసనీయమైన పేరుకు ఈ స్టోర్ నిదర్శనమని, అందుకే స్థానికంగా ఉన్న ఆభరణాల ప్రియులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ స్టోర్‌ని ప్రారంభించినట్లు తెలిపారు. సంస్థ జ్యువెలరీ బ్రాండ్‌కు ఒక ముఖ్యమైన మైలురాయి అని, నాణ్యమైన హస్తకళ, సొగసైన డిజైన్ పట్ల దాని నిబద్ధతను ప్రదర్శిస్తుందని అన్నారు. రాజేంద్రఖైతాన్, వినీతా ఖైతాన్ యాజమాన్యంలో నిర్వహిస్తున్న వీరు ఆభరణాల్లో అత్యుత్తమ బ్రాండ్‌గా ఖ్యాతిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు.



లులు మాల్‌లో
ఫ్యాషన్ షో

- లోగో ఆవిష్కరించిన మాల్ యాజమాన్యం
- 17, 18 తేదీల్లో ఫ్యాషన్ వీక్-2025 పేరిట నిర్వహణ

మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీలోని లులు మాల్‌లో అతి పెద్ద ఫ్యాషన్ షో నిర్వహించనుంది. లులు ఫ్యాషన్ వీక్ -2025 పేరిట నిర్వహించే ఈ కార్యక్రమం ఈ నెల 17,18 తేదీల్లో జరగనుందని తెలిపారు. రీజనల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ షేక్, రీజనల్ మేనేజర్ మహమ్మద్ షరీఫ్ ఫ్యాషన్ వీక్ లోగోను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల్ జనరల్ మేనేజర్ విమేష్ మాట్లాడుతూ లులు ఫ్యాషన్ వీక్ అనేది లులు గ్రూపు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమం అని తెలిపారు. ఫ్యాషన్ రంగంలో దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ బ్రాండ్ల తాజా ట్రెండ్స్, సృజనాత్మక డిజైన్లు ప్రదర్శించడానికి అద్భుత వేదికని అన్నారు. యూఎస్ పోలో సమర్పణలో, ఆముక్తి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ షో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫ్యాషన్ రంగ మోడళ్లు, సెలబ్రిటీలు ఈ షోలో పాల్గొని ర్యాంప్ వాక్ ద్వారా 17 బ్రాండ్లకు చెందిన వస్త్రాల్ని ప్రదర్శిస్తారన్నారు. బైయింగ్ మేనేజర్ సఫరుద్దీన్ మాట్లాడుతూ ఫ్యాషన్ రంగంలో కొత్త కలెక్షన్ గురించి తెలుసుకోడానికి ఇదొక మంచి అవకాశమన్నారు. ఫ్యాషన్ షోతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నామని, ఈ షోను వీక్షించడానికి ప్రవేశం ఉచితమని తెలిపారు.



కళ్లకు గంతలు.. 'కళ'అద్దే వింతలు..

- నగరంలో బ్లైండ్‌ఫోల్డ్ ఆర్ట్‌కి ఆదరణ
- ఆసక్తి గలవారి కోసం ఈ నెల 17న వర్క్‌షాప్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో బ్లైండ్ ఫోల్డ్ వర్క్‌షాప్స్ ఊపందుకుంటున్నాయి. కళ్లకు గంతలు కట్టుకుని కుంచెకు పనిచెప్పే చిత్రకారులు సృష్టిస్తున్న చిత్రాలు కళాభిమానుల్ని ఆకట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే నగరంలో ఆ తరహా చిత్రకళా నైపుణ్యం అందించే వర్క్‌షాప్స్ కూడా జరుగుతున్నాయి. తాజాగా నగరంలోని మాదాపూర్‌లో ఉన్న ట్రైలింగ్ ఐవీ కేఫ్ ఆధ్వర్యంలో ఒక వర్క్‌షాప్ జరగనుంది. ఔత్సాహికులకు బ్లైండ్ ఫోల్డ్ ఆర్ట్ మెళకువలను నేర్పేందుకు శనివారం మధ్యాహ్నం 12.గంటలకు ఈ వర్క్‌షాప్ ప్రారంభం కానుంది. దాదాపు 2గంటల పాటు కొనసాగే ఈ కళాశిక్షణపై ఆసక్తి కలిగినవారు బుక్ మై షో ద్వారా ఎంట్రీలు పొందవచ్చు.

వేసవి సెలవుల్లో అలా విదేశాలు తిరుగుతూ మెక్సికన్ ఫుడ్ తినాలనుకుంటున్నారా..! అవసరం లేదు. తామే మెక్సికన్ రుచులను నగరానికి తీసుకొస్తున్నామని ప్రముఖ చెఫ్ అమన్నా రాజు అంటున్నారు. మే నెల వేసవిలో వారాంతాలను అలా మెక్సికన్ స్మోకీ మెరినేడ్ రుచులను ఆస్వాదించాలనే వారికి తాము ప్రత్యేక వంటలను అందిస్తున్నట్లు సూచిస్తున్నారు. నగరంలోని నోవోటెల్ ఎయిర్‌పోర్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మెక్సికన్ ఫుడ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నారు. మెక్సికోలోని ఓక్సాకా, వెరాక్రూజ్ ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన విభిన్న రుచులను మెక్సికన్ గ్రిల్ నైట్స్‌తో నగరానికి పరిచయం చేస్తున్నారు. ఈ నెల 31వ తేదీ వరకూ ప్రతి శనివారం ఈ మెక్సికన్ ఫుడ్ ఫెస్ట్ అలరించనుంది.

– సాక్షి, సిటీబ్యూరో



మెక్సికన్
మేనూ..

అందుబాటులో అంతర్జాతీయ ఆహార పదార్థాలు

ఓక్సాకా, వెరాక్రూజ్ రుచుల పరిచయం	నగరంలో మెక్సికన్ వంటల సందడి	31 వరకూ కొనసాగనున్న మిస్ వరల్డ్ పోటీలు	అప్పటి వరకూ నోవోటెల్‌లో ఫుడ్ లవర్స్‌కు పసందు

ఓవైపు నగర వేదికగా ఈ నెల 31వ తేదీ వరకూ ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ తరుణంలో అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన మెక్సికన్ ఫుడ్ వెరైటీలు నగర వాసులను, నగరానికి విచ్చేస్తున్న విదేశీ అతిథులను ఆత్మీయ విందుకు ఆహ్వానిస్తోంది. అంతేకాకుండా ఈ ఫెస్ట్ నగరంలోని ఆహార వైవిధ్యానికి, విభిన్న సంస్కృతులకు చెందిన రుచుల సమ్మేళనానికి ప్రతీకగా నిలుస్తుందని నోవోటెల్ ఎయిర్‌పోర్ట్ జనరల్ మేనేజర్ సుఖ్‌బీర్ సింగ్ పేర్కొన్నారు.



గ్యాస్ట్రోనమిక్ సంతృప్తి..

అంతర్జాతీయంగా మెక్సికన్ వంటలకు ప్రత్యేక ఆదరణ ఉంటుంది. ఫ్లేమ్-గ్రిల్డ్ మాంసాహారాలు, స్మోకీ మెరినేడ్‌లు, అరుదైన సుగంధ ద్రవ్యాల కలయికే ఈ వంటల ప్రత్యేకత. ఈ గ్యాస్ట్రోనమిక్ రుచుల వైవిధ్యాన్ని వేసవి ప్రత్యేకంగా నగరంలో ఆవిష్కరిస్తున్నారు. ఈ ఫుడ్ ఫెస్ట్‌లో అతిథులు వెజిటబుల్ బౌల్, బీన్ ఎన్చిలాడా సూప్‌తో ప్రారంభిస్తారు. అనంతరం మినీ కార్న్ డాగ్స్ వంటి ఆహ్లాదకరమైన స్టార్టర్స్‌ను పచ్చి మిరపకాయ, ఆవాలు, రుచికరమైన గుమ్మడికాయ ఎంపనాడాస్‌తో కలిపి వడ్డిస్తారు. ప్రత్యేకంగా అందించే సలాడ్ టెక్స్చర్స్, వినూత్న రుచుల మిశ్రమంతో అలరిస్తుంది.



ప్రత్యేక దినుసులు..

ఫెస్ట్‌లో భాగంగా సీఫుడ్ సెవిచే, శ్రీరాచా డ్రెస్సింగ్‌తో స్పైసీ మెక్సికన్ చికెన్ సలాడ్, చిపోటిల్ డ్రెస్సింగ్‌లో కలిపి కాల్చిన బెల్ పెప్పర్ సలాడ్ జిహ్వకు సరికొత్త రుచిని అందిస్తుంది. గ్వాకామోల్, పైనాపిల్ సల్సా, టొమాటో సల్సా వంటి క్లాసిక్ మెక్సికన్ రుచులు ఈ మెనూలో మరో ప్రత్యేకం. మెక్సికో నుంచి దిగుమతి చేసుకున్న కొన్ని మసాలాలు దక్షిణాది మసాల రుచులకు భిన్నమైన అనుభూతిని అందిస్తాయి. చికెన్ క్యూసాడిల్లాస్, కాలాబాసిటాస్ కాన్ క్యెసో – చీజ్, వెజిటబుల్ చీజ్ ఎన్చిలాడాస్‌తో వండిన గుమ్మడికాయ, రుచికరమైన మొక్కజొన్న మిశ్రమాల్లో మసాల పరిమళం నగరవాసులను ఓక్సాకా, వెరాక్రూజ్ ప్రాంతాలకు తీసుకెళుతుంది. సీ ఫుడ్ లవర్స్ కోసం మెక్సికన్ రొయ్యలు, చేపల బిస్క్యూ పిసికాడో, కామరాన్ పోజోల్‌ను ఆస్వాదిస్తారు.



మెక్సికన్ ఫియస్టా అలరిస్తుంది..



ప్రస్తుత తరుణంలో హైదరాబాద్ ఫుడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా మారింది. మంచి పాకశాస్త్ర నిపుణులతో ప్రాణం పోసుకున్న మెక్సికో రుచులు ఈ వేసవి ప్రత్యేకం. స్టార్టర్స్, హార్టీ సూప్స్ మొదలు మెయిన్స్ వరకూ మెక్సికన్ ఫియస్టా అలరిస్తుంది. ప్రతి శనివారం సాయంత్రం 7 గంటల నుండి రాత్రి 11 గంటల వరకూ మెక్సికన్ గ్రిల్ నైట్స్ మరచిపోలేని అనుభూతినిస్తుంది. ప్రతి వంటకం చెప్పే కథను భోజన ప్రియులకు తెలియజేస్తాం. పికో డి గాల్లో, స్మోకీ కార్న్ ఆన్ ది కాబ్‌తో శాఖాహారం-మాంసాహారం రెండింటితో తయారు చేసిన నాచోలతో క్రిస్పీ టోస్టాడాస్‌ను లైవ్ కౌంటర్లలో ఆస్వాదించవచ్చు.

– అమన్నా రాజు, ఎగ్జిక్యూటివ్ చెఫ్.



చక్కటి ఆభరణాలు వస్త్రధారణలో ఒక ముఖ్యమైన భాగం. ఇది దుస్తులను మెరిపించడం మాత్రమే కాదు డ్రెస్సింగ్ వెలవెల బోయేలా చేసే శక్తి కూడా కలిగి ఉంటుంది. మెరవాలంటే ట్రెండ్‌కు అనుగుణంగా ఉంటే మాత్రమే సాధ్యం. అయితే ప్రతి సీజన్‌లో రకరకాల ట్రెండ్‌లు వస్తుండటంతో, ఏది అనుసరించాలో, ఏది వదిలివేయాలో ? అనే గందరగోళం తప్పదు. ఈ నేపథ్యంలో సిటీ జ్యువెలరీ డిజైనర్‌లు అందిస్తున్న సూచనలివి..

సాక్షి, సిటీబ్యూరో:

ఫ్యాషన్
నగరిలో..



లేయరింగ్, స్టాకింగ్..

పలు రకాల లెంగ్త్ ఉన్న చైన్ పెండెంట్‌లను లేయర్ లాగా ధరించవచ్చు. లేదా ఒకే వైపు పలు బ్రేస్‌లెట్‌లను ఒకటిగా పేర్చవచ్చు. ఆల్ పీసెస్ రంగులు కలిసి కనబడేలా చూసుకోవడమే ఖచ్చితమైన స్టాక్‌కు కీలకం. ఇవి ఒక సాధారణ బైండింగ్ కారకంగా ఉండాలి.

షాండ్లియర్ చెవిపోగులు..

ఈ షాండ్లియర్ శైలి చెవిపోగులు అత్యధికంగా మహిళల్ని ఆకట్టుకుంటాయి. దుస్తులకు నప్పేలా అలంకరణకు ఇది సరైన మార్గం. వీటిని మరే ఇతర ఆభరణాలూ లేకుండా ధరించవచ్చు. డైమండ్ షాండ్లియర్స్ కావచ్చు లేదా జడౌ చంద్బాలిస్ కావచ్చు చెవిపోగులు మాత్రం తప్పనిసరిగా ఉండాలి.



బోల్డ్ రింగులు..

ఒక పెద్ద డేరింగ్ రింగ్ ధరించడం రూపానికి అత్యాధునికతను జోడిస్తుంది. దీని కోసం ఓ అసాధారణమైన డిజైన్‌లను ఎంచుకోవాలి. రత్నం, సిగ్నెట్ పెద్ద వాస్తవిక పువ్వులు వంటివి మరింత అందాన్నిస్తాయి.

జడౌ..జతగా..

ఏదైనా భారతీయ ఆభరణాల శైలిలో జడౌ నెక్లెస్ ధారణ తరతరాల వారసత్వంగా వస్తోంది. పూర్వ కాలంలో చాలా ఆభరణాలు మొఘల్ ఇతివృత్తంతో ప్రభావితమయ్యాయి, అయితే ప్రస్తుతం ఆధునిక ఆభరణాల తయారీలో పురాతన పద్ధతుల్లో ఏదైనా ఒకదానిని జత కలపడం ఒక ప్రత్యేకమైన కొత్త సంప్రదాయంగా మారింది. ఆ విధంగా జడౌ నెక్లెస్‌కు ఆదరణ పెరిగింది.

ఆమె..ఆభరణం..

కాబోయే వధువు అయితే, పెళ్లి రోజు లుక్‌లో ఆభరణాలు అతి ముఖ్యమైన భాగం. పెళ్లి ఆభరణాలు, అవి ఏ వధువునైనా యువరాణిగా చూపించగలవు. పెళ్లి వేడుకల్లో భారీ నెక్‌పీస్ ఎంచుకుంటారు. అయితే ఇవి విడదీసి, ధరించగలిగేలా ప్రత్యేకంగా రూపొందుతాయి. అన్నీ కలిపినప్పుడు అవి గ్రాండ్‌లుక్‌ని సంతరించుకుంటాయి. అలాగే వివాహానంతరం కూడా వాటిని సందర్భానుసారం ధరించవచ్చు.

ఆఫీస్..డైమండ్ పీస్..

పని విధానాలకు అనుగుణంగా అలాగే సాయంత్రం సమావేశాల్లో సమర్థవంతంగా మమేకమయ్యే అందమైన పీసెస్, సెన్సిటివ్ డైమండ్ హగ్గీలు లేదా సాలిటైర్ స్టడ్‌లు రోజువారీ డ్రెస్సింగ్‌కు సరైన ఎంపిక. ఆఫీసుకు ఇండియన్ ఫార్మల్స్ ధరించడం ఇష్టపడితే, డైమండ్ సరౌండ్‌తో లేదా ఒక జత సింగిల్ పోల్కీ ఇయర్ స్టడ్‌తో సరిపెట్టొచ్చు.

అమెరికాలో
అరకు రుచులు..

- హైదరాబాద్ టు యూఎస్‌ఏ పరిచయం చేసిన మొదటి బ్రాండ్‌గా అరకు అరోమా
- గ్రీన్ కాఫీ, అరబికా రీగేల్, ఫిల్టర్ కాఫీ వంటి కొత్త కాఫీ బ్లెండ్‌ల ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: అరకు కాఫీ రుచిని యునైటెడ్ స్టేట్స్‌కు పరిచయం చేసిన మొదటి బ్రాండ్‌గా అరకు అరోమా నిలిచిందని, హైదరాబాద్ నగరంతో పాటు స్థానిక రుచులను విశ్వవ్యాప్తం చేయడంలో తాము వినూత్న ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అరకు అరోమా వ్యవస్థాపకులు కృష్ణ చైతన్య తెలిపారు. క్రిష్ ఫుడ్ అండ్ ఫన్ ఇండియా ఆధ్వర్యంలో అరకు అరోమా కొత్త కాఫీ బ్లెండ్‌లను ఆవిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. రుచి, నాణ్యతకు ప్రసిద్ధి చెందిన ఈ ఆఫర్‌లు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కాఫీ ఔత్సాహికులకు సరికొత్త అనుభవాలను అందిస్తాయని అన్నారు. ఈ కొత్త బ్లెండ్‌లలో అరకు అరోమా గ్రీన్ కాఫీ, అరబికా రీగేల్, ఫిల్టర్ కాఫీ, అరబికా ప్రైమ్ ఉన్నాయన్నారు. యూఎస్‌ఏలో రిజిస్టర్డ్ బ్రాండ్ ఉనికితో ప్రపంచవ్యాప్తంగా కాఫీ ప్రియులకు సేవలు అందిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.




80% భూగర్భ జలం ఖాళీ!

విచ్చలవిడిగా బోరుబావులు తవ్వకమే కారణం

- ఎన్ని బోర్లున్నాయో లెక్కలే లేవు
- వాన నీటి సంరక్షణతోనే నీటి భద్రత
- నీటి సంరక్షణ చైతన్యం పెంచటమే మార్గం
- ప్రముఖ హైడ్రో జియాలజిస్ట్ డా.ఎన్.జె.దేవరాజరెడ్డి

'భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడేస్తుండటం వల్ల జల సంపద వేగంగా అంతరించిపోతోంది. భూగర్భంలో నీటి ఆవాసాలు (అక్విఫెర్లు) 80% వరకు ఇప్పటికే ఖాళీ అయిపోయాయి. వర్షపు నీటి విలువను మనం ఇప్పటికీ తెలుసుకోలేకపోతున్నాం' అని ప్రముఖ హైడ్రాలజిస్టు డాక్టర్ ఎన్.జె.దేవరాజ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నీటి వృథాను అరికట్టడం.. వాన నీటిని ఒడిసిపట్టడమే.. భవిష్యత్తులో నీటి సమస్య రాకుండా చేయగలవు అంటారాయన. ఇంకా ఆయన ఏమన్నారంటే...

- సాక్షి, సాగుబడి



ప్రశ్న: భూగర్భ జలాలు గతమెన్నడూ లేనంత అథమ స్థాయికి తగ్గిపోవటం ఆందోళన కలిగిస్తోంది. మూడు దశాబ్దాలకు పైగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు కన్సల్టెన్సీ సేవలందిస్తున్న నిపుణుడిగా నీటి సంక్షోభంపై మీరేమనుకుంటున్నారు?

జవాబు: ప్రపంచంలోనే రెండో అత్యధిక వర్షపాతం నమోదయ్యే దేశం మనది. సగటు వార్షిక వర్షపాతం దక్షిణ అమెరికాలో 1,596 మిల్లీమీటర్లుగా ఉంది. 1,150 ఎం.ఎం.తో ఆ తర్వాతి స్థానం మనదే. వాన నీటి విలువను మనం ఇప్పటికీ తెలుసుకోలేకపోతున్నాం. ఫలితంగా భూగర్భంలో నీటి ఆవాసాలు (అక్విఫెర్లు) 80% వరకు ఇప్పటికే ఖాళీ అయిపోయాయి. మిగతా 20 శాతాన్ని గుర్తించడానికి తగినంత సమర్థత గల సాంకేతికత అందుబాటులో లేకపోవటం వల్ల అదయినా మిగిలింది. అటవీ విస్తీర్ణం తగ్గిపోవటం, నదుల్లో ఇసుకను విచక్షణారహితంగా తొలగించటం, కరవు కాటకాలు, వాన నీటి సంరక్షణపై చైతన్యం కొరవడటం.. భూగర్భ జల సంక్షోభానికి మూల కారణాలు. విచ్చలవిడిగా బోరుబావులు తవ్వుకుంటూ పోతున్నారు. ఎన్ని బోర్లున్నాయో ఇదమిత్థంగా లెక్కలు కూడా లేని పరిస్థితి. ఎక్కడ కురిసిన వానను అక్కడే నేలలో ఇంకింపజేయటం ఒక్కటే దీనికి అసలైన పరిష్కారం. ప్రజలూ, ప్రభుత్వాలూ.. అందరూ ఈ చైతన్యాన్ని పెంపొందించుకోవటం ఎంతో ముఖ్యం. అప్పుడే మన భవిష్యత్ తరాలకు కూడా భూగర్భ జలాలు మిగులుతాయి.

ప్ర: ఎక్కడ బోరు తవ్వితే నీరు పడుతుందో కచ్చితంగా అంచనా వేయలేకపోవటం వల్ల ఎక్కువ బోర్లు తవ్వాల్సి వస్తోందా?

జ: ఇది కొంత వరకు నిజమే. జియోఫిజికల్ సర్వే ద్వారా.. దాదాపు కచ్చితంగా ఎక్కడ బోరు తవ్వితే ప్రయోజనం ఉంటుందో చెప్పే సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. నేను చాలా కాలంగా దీన్నే వాడుతున్నా. కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా దీన్నే అనుసరిస్తున్నాయి. భూగర్భంలో రాతి పొరల మధ్యలో పగుళ్లు ఉన్న చోట్లను గుర్తిస్తే నీటి జాడ తెలుస్తుంది. అయితే, అత్యంత వేగంతో బోరును తవ్వుతున్నందు వల్ల తక్కువ స్థాయిలో ఉన్న నీటి లభ్యతను గుర్తించలేని పరిస్థితి ఏర్పడుతోంది.

ప్ర: బోరు తవ్వే యంత్రం నెమ్మదిగా పనిచేస్తే మంచిదనా మీరు అంటున్నది?

జ: అవును. అంతేకాదు, ఒకసారి బోరు తవ్వటం పూర్తయ్యాక నీరు సంతృప్తికరంగా పడకపోతే, ఆ బోరులో నుంచి వెంటనే కేసింగ్ పైపును తీసేసి, మట్టితో బోరుబావి గుంతను పూడ్చేస్తున్నారు. ఇది తప్పు. బోరు తవ్విన తర్వాత కనీసం ఒక వానాకాలం గడిచే వరకు దాన్ని పూడ్చకూడదు. ఎందుకంటే.. అప్పటికి నీటి జాడ కనిపించనంత మాత్రాన ఆ బోరులో ఎప్పటికీ నీరు రాదని అర్థం కాదు. దానికి మూత బిగించి, కొద్ది నెలలు వేచి చూస్తే.. ఎంతో కొంతమేరకైనా ఆ బోరులో నీరు కనిపిస్తుంది. ఈ వాస్తవాన్ని గుర్తించిన తమిళనాడు ప్రభుత్వం జయలలిత హయాంలో.. తవ్విన బోరును, నీరు పడినా పడకపోయినా పూడ్చవద్దని ఉత్తర్వులు జారీ చేసింది. మిగతా రాష్ట్రాలు కూడా ఇలాంటి చట్టం చేయాలి. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. బోరులో బెజ్జాలు లేని ప్లెయిన్ పైపు వాడుతున్నారు. అలా కాకుండా స్క్రీన్ పైపు వాడితే, కొద్దిపాటి నీటి జాడ కనిపించినా బోరులోకి నీరు చేరే అవకాశం ఉంటుంది. బోరు తవ్విన ప్రయత్నం వృథా కాకుండా ఉంటుంది.

ప్ర: బోరు తవ్వే పద్ధతిలో మార్పు అవసరమా?

జ: కాదు, మన ఆలోచనా విధానంలో మార్పు రావాలి. 1970వ దశకంలో డెన్మార్క్ నుంచి బోరు తవ్వే టెక్నాలజీని మనం దిగుమతి చేసుకున్నాం. బోరు బావి లోతును 25 మీటర్ల వరకే పరిమితం చేస్తే మంచిదని ముందుచూపుతో డెన్మార్క్ మనకు సూచించింది. కానీ మన వాళ్లు వినిపించుకోలేదు. చిత్తూరు, కోలారు తదితర ప్రాంతాల్లో 3 వేల అడుగుల లోతుకు కూడా బోర్లు తవ్వుతున్నారు. వంద రోజులు కురిసిన వాన నీటిని జాగ్రత్త చేసుకోవటం మానేసి, ఇంకా ఎంత లోతుకు బోర్లు తవ్వుకుంటూ వెళ్తాం? వాన నీటిని భూమిలోకి ఎంత వీలైతే అంత ఇంకేలా చూసుకుంటే ఈ దుస్థితి తలెత్తేదే కాదు. ఇకనైనా ఈ వాస్తవాన్ని అందరూ గుర్తించాలి.

ప్ర: జల సంరక్షణకు ఏం చేయాలి?

జ: నీటి వాడకంలో వృథాను అరికట్టడం చాలా ప్రధానం. ట్యాప్ నుంచి చుక్క చుక్కగా నీరు నిరంతరం కారుతుంటే.. ఏడాదిలో 50,000 లీటర్ల జలం వృథాగా పోతుంది. పేదలైనా, సంపన్నులైనా ఇంటిపైన కురిసే వానను నేలలోకి ఇంకే ఏర్పాటు చేసుకోవాలి. వాన నీటినే భూగర్భ ట్యాంకుల్లో దాచుకొని నిశ్చింతగా సంవత్సరం అంతా తాగుతున్నాను. అందరూ అలా చేయొచ్చు.

జల సంరక్షకుడు

కర్ణాటకకు చెందిన ఎస్.జె.దేవరాజరెడ్డి ప్రముఖ హైడ్రో జియాలజిస్టు.. అంటే భూగర్భ జలాలతో పాటు, ఉపరితల జలాల పరిరక్షణకు కూడా కృషిచేస్తున్న వ్యక్తి. అంతేకాదు, వాన నీటి సంరక్షణలోనూ నిపుణుడు. 1987 నుంచి ఈ మహాయజ్ఞంలో ఆయన చురుగ్గా పాల్గొంటున్నారు. కర్ణాటక ప్రణాళికా సంఘ సభ్యుడిగా సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ సలహాదారుగా పనిచేశారు. వాన నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. దేవరాజరెడ్డి ఇప్పటివరకు లక్షకుపైగా బోరుబావులను రీచార్జింగ్ వ్యవస్థతో ఏర్పాటుచేశారు. వాన నీటి సంరక్షణ వ్యవస్థలను 10,000కుపైగా పెట్టించారు.

క్లుప్తంగా...

ఫీజు బకాయిలు వెంటనే చెల్లించండి

ముఖ్యమంత్రికి బండి సంజయ్ లేఖ



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏటా నిర్ణీత వ్యవధిలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గురువారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యపూరిత ధోరణితో లక్షలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లుగా ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో దాదాపు 8 వేల కోట్ల రూపాయలు బకాయిలుగా పేరుకుపోయినట్లు ఆయన తెలిపారు. ప్రైవేట్ కళాశాలలు అధ్యాపకులకు, సిబ్బందికి జీతభత్యాలు, నిర్వహణ చార్జీలు కూడా చెల్లించలేక అవస్థలు పడుతూ.. అప్పుల పాలయ్యాయని పేర్కొన్నారు. ఫీజు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇచ్చేది లేదని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు తెగేసి చెబుతుండటంతో విద్యార్థులు అటు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోలేక, ఇటు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బండి సంజయ్ తెలిపారు.

'కృష్ణా'ను పూడ్చి నిరంజన్‌రెడ్డి భూ కబ్జా

వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కృష్ణానదిని పూడ్చి భూకబ్జాకు పాల్పడ్డారని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆరోపించారు. గద్వాలలోని మానపాడు మండలం చందూరు గ్రామంలో సర్వే నంబర్ 57లో రెండు ఎకరాల 19 గుంటల భూమిని కబ్జా చేసినట్లు తేలిందని, ఈ విషయాన్ని రెవెన్యూ శాఖ మంత్రికి ఫిర్యాదు చేశామని తెలిపారు. గురువారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, నిరంజన్‌రెడ్డి భూకబ్జాపై గద్వాల్ కలెక్టర్ విచారణ జరిపారని, కబ్జా నిజమేనని తేలిందని అన్నారు. కలెక్టర్ విచారణ తరువాత ఆక్రమించుకున్న భూమి నుంచి ఫెన్సింగ్ తీసివేశారని, భూ కబ్జాల ఫైల్స్‌ను మాయం చేయడం కోసం మానపాడు ఎమ్మార్వో ఆఫీస్‌ను తగలబెట్టారని ఎమ్మెల్యే తెలిపారు. నిరంజన్‌రెడ్డి కూతురు పేరిట ఈ భూ ఆక్రమణ జరిగినట్లు చెప్పారు. భూ కబ్జా గురించి ప్రశ్నించిన తమను నిరంజన్ రెడ్డి ఇష్టానుసారంగా దూషించారని ఆయన తెలిపారు. వనపర్తిలోని రైస్ మిల్లులు ప్రభుత్వానికి రూ.650 కోట్లు బకాయి ఉన్నాయని, 150 రైస్ మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారని, దీనికి కారణం నిరంజన్‌రెడ్డేనని ధ్వజమెత్తారు.

సినీ జర్నలిస్ట్ - రచయిత బీకే ఈశ్వర్ కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: సీనియర్ సినిమా జర్నలిస్ట్, ప్రముఖ సినీ రచయిత బీకే ఈశ్వర్ (77) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. విజయవాడకు చెందిన బీకే ఈశ్వర్ 'విజయచిత్ర' పత్రికలో రెండు దశాబ్దాలపాటు ఉప సంపాదకునిగా పనిచేశారు. పలు పత్రికలకు, వీక్లీలకు వ్యాసాలు రాయడంతోపాటు కొన్ని టీవీ సీరియల్స్ కూడా రాశారాయన. వాటిలో కొన్ని నంది అవార్డులను అందుకున్నాయి. 'హృదయాంజలి' చిత్రానికి మాటలు, పాటలు అందించారు. అదే విధంగా 'కాలేజ్ డేస్ టు మ్యారేజ్ డేస్, చీకటిలో నేను, నగరంలో వినాయకుడు, జంబో క్రైమ్ స్టోరీ, అజయ్ పాసయ్యాడు, నేను–ఆది– మధ్యలో మా నాన్న'వంటి సినిమాలకు రచయితగా పనిచేశారు. 'సూపర్ మూవీస్ అడ్డా' పేరుతో సొంత యూట్యూబ్ చానల్‌ను నిర్వహించారు. కాగా గురువారం హైదరాబాద్‌లో బీకే ఈశ్వర్ అంత్యక్రియలను కుటుంబ సభ్యులు నిర్వహించారు.

'సరస్వతి' పునాదిగా పుష్కర వేడుకలు

త్వరలో వచ్చే గోదావరి, కృష్ణా పుష్కరాలనూ ఘనంగా నిర్వహిస్తాం

సమ్మక్క సారలమ్మ జాతరను వైభవంగా జరిపిస్తాం

ఈ అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా...

కాళేశ్వరం ప్రాంతానికి ఘనచరిత్ర ఉంది.. ఈ ప్రాంత అభివృద్ధికి రూ.200 కోట్లు

చతుర్వేద పుష్కరఘాట్ వద్ద ఘనంగా సరస్వతి పుష్కరాలు ప్రారంభం

త్రివేణి సంగమంలో మంత్రులతో కలిసి సీఎం పుష్కరస్నానం



శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఆది శ్రీనివాస్

కాళేశ్వరం నుంచి సాక్షి ప్రతినిధి, వరంగల్

'సరస్వతి పుష్కరాలు పునాదిగా త్వరలో వచ్చే గోదావరి, కృష్ణా పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం. మేడారం సమ్మక్క సారలక్క జాతరను ఘనంగా జరిపిస్తాం. తెలంగాణ ప్రభుత్వం నా హయాంలో ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించడం నా అదృష్టంగా భావిస్తున్నా' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నదులను పూజించడం మన సంస్కృతి, సంప్రదాయమని, అందుకే నదులను దేవతలు, దేవుళ్లుగా పూజిస్తున్నామని చెప్పారు. జేఎస్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గురువారం ప్రారంభించిన సరస్వతి పుష్కర వేడుకల్లో రేవంత్ పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 4.12 గంటలకు కాళేశ్వరం చేరుకున్న రేవంత్ రెడ్డికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రేవంత్ సరస్వతి ఘాట్‌ను ప్రజలకు అంకితం చేశారు. ఘాట్ వద్ద ఏర్పాటుచేసిన వేదికపై నుంచి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. మెదక్ జిల్లా రంగంపేటకు చెందిన మాధవానంద సరస్వతిస్వామిజీ ప్రారంభించిన పుష్కరాలు ఈ నెల 26 వరకు కొనసాగుతాయి.

కాళేశ్వరం అభివృద్ధికి రూ.200 కోట్లు

మంథని నియోజకవర్గానికి పెద్ద చరిత్ర ఉందని, దేశ ఆర్థికాభివృద్ధికి ఆద్యుడైన పీవీ నరసింహారావు మంథని నుంచి గెలిపొందారని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రపంచంలో మన దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేసిన ఆయన మంథని ప్రాంతానికి ఎంతో చేశారన్నారు. రాష్ట్రానికి రూ.వేల కోట్ల పెట్టుబడులను తేవడంలో మంత్రి శ్రీధర్‌బాబు కృషి చాలా గొప్పదని కొనియాడారు. మంథని నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కష్టపడే శ్రీధర్ బాబును ప్రజలే కాపాడుకోవాలన్నారు. ఆయన సేవలు రాష్ట్రం యావత్తు అవసరమని, ఆయన నియోజకవర్గ అభివృద్ధికి తక్కువ సమయం కేటాయించి, రాష్ట్ర అభివృద్ధికి ఎక్కువ సమయం కేటాయించాలని సూచించారు. కాళేశ్వరాన్ని గొప్పగా అభివృద్ధి చేయడానికి రూ.100 కోట్లు కావాలని శ్రీధర్‌బాబు అడిగారని, కానీ తాము రూ.200 కోట్లయినా వెచ్చిస్తామని రేవంత్ చెప్పారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాళేశ్వరం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని మంత్రి సురేఖ, ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్‌లను కోరుతున్నానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి గ్రీన్ చానల్‌లో నిధులు విడుదల చేస్తామని చెప్పారు.

టెంట్ సిటీ వద్ద గంటసేపు..

హెలిప్యాడ్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి వీఐపీ ఘాట్ సమీపంలో భక్తులకోసం ఏర్పాటు చేసిన టెంట్ సిటీకి చేరుకున్నారు. రేవంత్ సుమారు గంటపాటు టెంట్ సిటీలో గడిపారు. పుష్కరాల ఏర్పాట్లు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులతో పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. పుష్కర ఘాట్ త్రివేణి సంగమం ఒడ్డున ఏర్పాటు చేసిన 17 అడుగుల సరస్వతీ మాత విగ్రహం, రెండు వైపుల చతుర్వేద మూర్తుల విగ్రహాలను రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం త్రివేణి సంగమంలో మంత్రులతో కలిసి పుష్కర పుణ్యస్నానం ఆచరించారు. తర్వాత శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి, శుభానందదేవిని, ప్రౌఢ సరస్వతి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీఎం, మంత్రులు, వారణాసి నుంచి వచ్చిన అషుతోష్ పాండే, 8 మంది వేద పండితుల బృందం ఆధ్వర్యంలో మహా సరస్వతి నవరత్న మాలిక హారతి ఇచ్చారు. శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని ఆహ్వానించలేదని నిరసన

భూపాలపల్లి: సరస్వతి పుష్కరాలకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఆహ్వానించలేదంటూ అతడి వర్గీయులు నిరసన చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి పుష్కర ఘాట్ వద్ద సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సమయంలోనే చెన్నూరు నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సభాస్థలి ఎదుట నిలబడి ఫ్లెక్సీలతో నిరసన చేపట్టారు. ఈ క్రమంలో సీఐ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఒక నాయకుడిపై చేయి చేసుకున్నారు. పోలీసు ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం భక్తులు, మీడియా, వీఐపీలకు ఇబ్బందికరంగా మారింది.

రూ. 12,600 కోట్లతో ఐఎస్‌జీజేవీ

- ఆర్వోఎఫ్ఆర్ భూఅభివృద్ధికి ఇందిర సౌరగిరి జల వికాసం
- పథకం అమలుకు మార్గదర్శకాల విడుదల

సాక్షి, హైదరాబాద్: అటవీ హక్కుల చట్టం–2006 కింద గుర్తింపు పొందిన గిరిజన రైతుల భూముల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా ఇందిర సౌరగిరి జలవికాసం (ఐఎస్‌జీజేవీ) పథకాన్ని అమలు చేయనుంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు, నిధుల కేటాయింపుల వివరాలతో కూడిన ఉత్తర్వులను గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్ గురువారం విడుదల చేశారు. ఐఎస్‌జీజేవీ పథకం కింద రానున్న ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.12,600 కోట్లు ఖర్చు చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 2.10 లక్షల మంది రైతులను ఎంపిక చేస్తూ, వారికి చెందిన 6 లక్షల ఎకరాల భూములను అభివృద్ధి చేస్తూ సౌరవిద్యుత్‌తో జలసిరులు వచ్చే విధంగా వ్యవసాయ యోగ్యంగా మార్చడంతోపాటు అందులో వివిధ రకాల వ్యవసాయ కార్యక్రమాల అమలుకు ఈ నిధులు ఖర్చు చేయనుంది. ఒక్కో రైతును ఒక యూనిట్‌గా పరిగణిస్తూ..ఒక్కో యూనిట్‌పైన రూ.6 లక్షలు చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.

18న ప్రారంభించనున్న సీఎం

ఆర్వోఎఫ్ఆర్ చట్టం–2006 కింద రాష్ట్రంలో 6.69 లక్షల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేశారు. తాజాగా ఐఎస్‌జీజేవీ పథకం కింద ఈ భూములను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ పథకాన్ని ఈనెల 18న అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఈమేరకు గిరిజన సంక్షేమశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ పథకాన్ని 2025–26 నుంచి 2029–30 వరకు వంద శాతం రాయితీతో అమలు చేస్తారు. అటవీ శాఖ, ఇంధన శాఖ, ప్రజారోగ్యం, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, భూగర్భ జల వనరులు, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ మరియు ఇతర సహకార విభాగాల సమన్వయంతో అమలు చేస్తారు. ఐఎస్‌జీజేవీ అమలు కోసం, జిల్లా స్థాయిలో ఇన్‌చార్జ్ మంత్రి అనుమతితో కలెక్టర్ ఖరారు చేస్తారు. పథకం అమలును పర్యవేక్షించడానికి జిల్లాల్లో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లు (పీఎంయూ) ఏర్పాటు చేస్తారు.

ఐదేళ్ల వార్షిక ప్రణాళిక ఇలా...

సంవత్సరం	ఎస్టీ రైతులు	విస్తీర్ణం	బడ్జెట్ (రూ.కోట్లలో)
2025-26	10,000	27,184	600
2026-27	50,000	1,43,204	3,000
2027-28	50,000	1,43,204	3,000
2028-29	50,000	1,43,204	3,000
2029-30	50,000	1,43,204	3,000

రూ.8.6 కోట్ల నగదు.. రూ.23 కోట్ల నగలు

- వీవీఎంసీ డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి ఇళ్లు, ఆఫీసుల్లో ఈడీ స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చి భారీ మొత్తంలో ఆస్తులు కూడబెట్టిన వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ (వీవీఎంసీ) టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి గుట్టు రట్టు చేశారు ఈడీ ముంబై జోనల్ కార్యాలయం అధికారులు. వీవీఎంసీలో అక్రమంగా 41 భవనాలు నిర్మించిన కుంభకోణంలో ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టి వైఎస్ రెడ్డి ఇళ్లు, ఆఫీసుల్లో సోదాలు నిర్వహించింది. బుధ, గురువారాల్లో ముంబై, హైదరాబాద్‌లోని మొత్తం 13 ప్రాంతాల్లో చేపట్టిన సోదాల్లో రూ.8.6 కోట్ల నగదుతోపాటు రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు ఏపీ, తెలంగాణలో స్థిరాస్తులకు సంబంధించి పెద్దమొత్తంలో డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

హైకోర్టు తీర్పుతో..: ముంబై వీవీఎంసీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో రెసిడెన్షియల్, కమర్షియల్ కాంప్లెక్సులు అక్రమంగా నిర్మించారు. ఆ ప్రాంతం వీవీఎంసీ అభివృద్ధి ప్రణాళిక ప్రకారం మురుగునీటి శుద్ధి కర్మాగారం, డంపింగ్ గ్రౌండ్ నిర్మాణం కోసం రిజర్వు చేయబడింది. ఇందులో 2009 నుంచి 41 అక్రమ భవనాలు నిర్మించారు. ముంబై హైకోర్టు ఆదేశంతో ఈ అక్రమ నిర్మాణాలను ఈ ఏడాది ఫిబ్రవరి 20న కూల్చివేశారు. ఈ వ్యవహారంలో ముంబైలోని మీరా భయాందర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ కుంభకోణంలో కీలక నిందితులుగా బిల్డర్లు సీతారాం గుప్తా, అరుణ్ గుప్తా సహా వీవీఎంసీ అధికారులు, మరికొంత మందిని గుర్తించింది. అక్రమ నిర్మాణాలకు వైఎస్ రెడ్డి అనుమతులు ఇచ్చినట్లు ఈడీ విచారణలో తేలింది. కేసు దర్యాప్తులో భాగంగానే వైఎస్‌రెడ్డి నివాసంలో ఈడీ అధికారులు గత రెండు రోజులుగా సోదాలు నిర్వహించారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్టు తెలిపారు.

మెట్రో చార్జీల మోత



రేపటి నుంచి కొత్త చార్జీల అమలు

టికెట్ కనిష్టంగా రూ.12, గరిష్టంగా రూ.75


ప్రయాణికులపై రోజుకు సుమారు రూ.కోటి అదనపు భారం

సాక్షి, హైదరాబాద్: రాజధానిలో మెట్రోరైలు చార్జీలను పెంచారు. ఈ నెల 17 నుంచి కొత్త చార్జీలు అమల్లోకి రానున్నాయి. చార్జీల ఖరారు కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ) సూచనల మేరకు గరిష్టంగా 30 శాతం వరకు పెంచినట్లు ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైల్ తెలిపింది. ప్రస్తుతం రూ.10 ఉన్న కనిష్ట చార్జీ రూ.12కు, గరిష్ట చార్జీ రూ.60 నుంచి రూ.75కు పెంచారు. చార్జీల పెంపుతో ఒక్కో ప్రయాణికుడిపై రూ.15 వరకు అదనపు భారం పడనుంది. ప్రస్తుతం నాగోల్, ఉప్పల్ స్టేషన్ నుంచి రాయదుర్గం వరకు రూ.60 చార్జీ ఉండగా, ఈ నెల 17 నుంచి రూ.75 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఎల్బీ నగర్ నుంచి మియాపూర్ వరకు రూ.75 ఉంటుంది. చార్జీల పెంపు వల్ల ప్రయాణికులపై రోజుకు సుమారు రూ.కోటి వరకు అదనపు భారం పడే అవకాశం ఉంది. టికెట్ రూపంలో రోజుకు రూ.1.92 కోట్ల ఆదాయం లభిస్తుండగా, చార్జీల పెంపుతో రూ.2.80 కోట్ల వరకు లభించనున్నట్లు అంచనా. మెట్రో రైల్వేస్ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) చట్టం ప్రకారం హైకోర్టు మాజీ న్యాయమూర్తి సారథ్యంలోని కమిటీ సిఫార్సుల మేరకు చార్జీలను సవరించినట్లు మెట్రో అధికారులు తెలిపారు. 2023 జనవరి 25న చార్జీల సవరణకు సిఫార్సు చేస్తూ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే ఈ నెల 17 నుంచి చార్జీల పెంపును అమలు చేయనున్నట్లు చెప్పారు.

ఏడేళ్ల తరువాత పెంపు

నగరంలో 2017 నవంబర్ నుంచి మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు చార్జీలను పెంచలేదు. ఈ ఏడేళ్లలో సుమారు రూ.6,500 కోట్ల నష్టాలు వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. మెట్రో రైళ్ల నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలు, విద్యుత్ తదితర ఖర్చులకు అనుగుణంగా ఆదాయం లభించకపోవడం వల్ల ఏటేటా అప్పులు పెరిగాయి. దీంతో చార్జీల పెంపు అనివార్యంగా మారింది. జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ కారిడార్‌లో ప్రయాణికుల రద్దీ తక్కువగా ఉంటుంది. మిగతా రెండు కారిడార్‌లలో ప్రయాణికులు గరిష్టంగా రాకపోకలు సాగిస్తున్నారు. నాగోల్–రాయదుర్గం, ఎల్బీ నగర్–మియాపూర్ కారిడార్‌లలో ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. బెంగళూరులో గతేడాది ఫిబ్రవరిలో 45 శాతం వరకు మెట్రో చార్జీలను పెంచారు. దాంతో అక్కడ అకస్మాత్తుగా 7 శాతం ప్రయాణికులు తగ్గినట్లు అంచనా. ఈ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొని చార్జీల పెంపుపై హైదరాబాద్‌లో వ్యతిరేకత రాకుండా ఉండేందుకు పెంపు 30 శాతంలోపే ఉండేలా జాగ్రత్తలు పాటించినట్లు ఓ అధికారి చెప్పారు.

హైదరాబాద్‌లోని మెట్రో కారిడార్లు **3** | రోజూ నడిచే ట్రిప్పులు **1,200**



వేదవల్లి కుటుంబాన్ని ఆదుకున్న సీఎం

- బ్లడ్ క్యాన్సర్‌తో చిన్నారి వేదవల్లి గత ఏడాది మృతి
- ఆమె చికిత్సకు గతంలోనే సీఎంఆర్ఎఫ్ కింద రూ.8 లక్షలు విడుదల
- కుటుంబం ఆర్థికంగా చితికిపోవటంతో మరో రూ.7 లక్షలు అందజేత

సాక్షి, హైదరాబాద్: తీవ్ర అనారోగ్యం బారిన పడిన కూతురును కాపాడుకునేందుకు ఆ తల్లిదండ్రులు చివరి క్షణంవరకు పోరాడారు. ఆస్తులన్నీ అమ్మి, అప్పులు చేసి కూడా రెండేళ్లపాటు వైద్యం చేయించారు. అయినా, పాప ప్రాణాలు దక్కలేదు. మరోవైపు స్తోమతకు మించి వైద్యానికి ఖర్చు చేయటంతో ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఆ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆపన్నహస్తం అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి గతంలో పాప వైద్యానికి రూ.8 లక్షలు ఇవ్వటంతోపాటు.. ఇప్పుడు ఆ పాప కుటుంబాన్ని ఆదుకునేందుకు మరో రూ.7 లక్షలు మంజూరు చేశారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌కు చెందిన రఘు, మంజుల దంపతుల పెద్ద కుమార్తె వేదవల్లి (5)కి 2022లో బ్లడ్ క్యాన్సర్ సోకింది. పాపను రక్షించుకునేందుకు రెండేళ్లపాటు తల్లిదండ్రులు ఆసుపత్రుల చుట్టూ తిప్పారు. 2024లో సీఎం ఎ.రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయం రావటంతో చికిత్సకు అవసరమైన రూ.8 లక్షలు మంజూరు చేశారు. చికిత్స అందించినప్పటికీ గతేడాది చివరలో వేదవల్లి మరణించింది. ఆమె చికిత్సకు ఆ కుటుంబం పెద్ద మొత్తంలో ఖర్చు చేయటంతో కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.7 లక్షలు మంజూరు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఆ మేరకు రూ.7 లక్షల చెక్కును సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు గురువారం వేదవల్లి తండ్రి రఘుకు అందజేశారు.


యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ తూర్పు మాడవీధిలో ఫొటో దిగుతున్న మిస్ వరల్డ్ పోటీదారులు


కోలాటం ఆడుతున్న సుందరీమణులు


పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు ధరించి ర్యాంప్‌వాక్ చేస్తున్న మోడల్

శిల్పకళలకు ముగ్ధులై.. చేనేతకు పరవశించి..

బతుకమ్మలు పేర్చుతూ.. కోలాటం ఆడుతూ...

- మగ్గాలు నేస్తూ... ఇక్కత్ వస్త్రాలు వేసుకొని..
- యాదగిరిగుట్ట, పోచంపల్లిలో ఆద్యంతం ఆసక్తిగా సాగిన అందాల భామల పర్యటన

సాక్షి,యాదాద్రి: యాదగిరిగుట్ట ఆలయ శిల్ప కళను చూసి మంత్రముగ్ధులయ్యారు... పోచంపల్లిలోని చేనేత వస్త్రాలను చూసి పరవశించిపోయారు ప్రపంచ సుందరీమణులు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న వారు తమ టూర్ షెడ్యూల్‌లో భాగంగా గురువారం సాయంత్రం యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించారు. వివిధ దేశాలకు చెందిన 25 మంది సుందరీమణులు భూదాన్ పోచంపల్లిని, తొమ్మిది మంది యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్షేత్రాన్ని సందర్శించారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలతో స్వాగతం

భూదాన్‌పోచంపల్లిని సందర్శించిన ఆఫ్రికన్ దేశాలకు చెందిన 25 మంది సుందరీమణులకు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. ముందుగా వారు గ్రామీణ పర్యాటక కేంద్రం లోపలి ద్వారం వద్ద ఏర్పాటు చేసిన టెర్రా కోట్ (ముగ్గులతో అలంకరించిన) కుండలను పరిశీలించారు.

★ గచ్చు ప్రాంతంలో వేసిన మెహందీని ఆసక్తిగా తిలకించి దాని ప్రత్యేకతను అడిగి తెలుసుకున్నారు. పలువురు సుందరీమణులు తమ చేతులపై మెహందీ డిజైన్లు వేసుకున్నారు.

★ మగ్గాలపై చేనేత వస్త్రాల తయారీ విధానాన్ని పరిశీలించారు. చీరల తయారీ, జరీ అంచు, డిజైన్లన ఆసక్తిగా చూసి వివరాలు తెలుసుకున్నారు. మగ్గాలపై నేతన్నలు వస్త్రాలు నేస్తుండటాన్ని ఆసక్తిగా తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. కొందరు సుందరీమణులు మగ్గం నేయడానికి ప్రయత్నించారు. పట్టు, ముడిసరుకు, పడుగు, పేకల పట్టు, నూలు పట్టుకొని పరిశీలించారు. రాట్నంపై కండె చుట్టే విధానాన్ని పరిశీలించారు. కొందరు రాట్నం తిప్పి ఆనందపడ్డారు. ఇక్కత్ చీరలు డిజైన్లు చూసి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక్కత్ డిజైన్ చీరలను ఒంటిపై వేసుకొని సంబురపడ్డారు.

★ టూరిజం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎడ్లబండిని చూసి ఫొటోలు దిగారు. ఇక్కడే కొందరు మహిళలు తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మను పేర్చుతూ పాటలు పాడగా వారితో సుందరీమణులు సందడి చేశారు. కిన్నెర, జమిడికా వాయించి డ్యాన్స్ చేశారు.టూరిజం ప్రాంగణం ఇరువైపులా ఏర్పాటు చేసిన పది చేనేత స్టాళ్లను పరిశీలించారు. ఇందులో పోచంపల్లి ఇక్కత్‌కు సంబంధించిన స్టాళ్లు ఏడు, గద్వాల, సిద్ధిపేట, గొల్లభామ, నారాయణపేటస్టాల్స్ ఉన్నాయి. లీవ్ టుక్లాత్ ప్రాసెసింగ్ ప్రక్రియలను చేనేత మహిళా కార్మికులు సుందరీమణులకు వివరించారు. అక్కడి నుంచి యాంపి థియేటర్ చేరుకున్నారు.

ర్యాంప్ వాక్‌ను తిలకించిన సుందరీమణులు

యాంపి థియేటర్‌లో ఇండో–వెస్టన్ ఇక్కత్ వస్త్రాలతో మన ప్రాంత మోడల్స్ నిర్వహించిన ర్యాంప్ వాక్‌ను సుందరీమణులు తిలకించారు. తెలంగాణ పర్యాటక శాఖ రూపొందించిన పలు వస్తువులు, పోచంపల్లి ఇక్కత్ ప్రాధాన్యతను థియేటర్‌లోని స్క్రీన్‌పై తిలకించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మీ, డీసీపీ అక్షాంక్ష్ యాదవ్, టూరిజం డైరెక్టర్ మందడి ఉపేందర్‌రెడ్డి, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

పలకరిస్తూ, చిరునవ్వులు చిందిస్తూ..

సుందరీమణులు శిల్పాల వద్ద ఫొటోలు దిగారు. అనంతరం అక్కడున్న వారిని హాయ్.. అంటూ పలకరిస్తూ, చేతులు ఊపుతూ, చిరునవ్వులు చిందించారు. ఆ తర్వాత బ్యాటరీ వాహనాల్లో ప్రొటోకాల్ వసతిగృహానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రభుత్వ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో హైదరాబాద్‌కు తిరుగుపయనం అయ్యారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


స్వామి దర్శనం అనంతరం పశ్చిమ ద్వారం వద్ద..

తెలుగు కట్టుబొట్టుతో గుట్ట ఆలయానికి

కరేబియన్ దీవులకు చెందిన 9 సుందరీమణులు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. తెలుగు కట్టుబొట్టుకు ఏమాత్రం తీసుపోని విధంగా లంగా ఓణీలు, చీరలతో సంప్రదాయబద్ధంగా సాయంత్రం ఐదు గంటలకు ఆలయానికి చేరుకున్న సుందరీమణులను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆలయ అధికారులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో శిల్పకళను చూసి ముగ్ధులయ్యారు. కోలాటం ప్రదర్శన, పాటలకు పరవశించి వారు కూడా కోలాటం ఆడారు. అనంతరం ప్రొటోకాల్ అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ ప్రొజెక్టర్ ద్వారా ఆలయ విశిష్టతను ఆలయ వైస్ చైర్మన్ కిషన్‌రావు వివరించారు. ఆ తర్వాత సుందరీ మణులు ప్రధానాలయంలోకి వెళ్లారు. అఖండ దీపమండపం వద్ద దీపారాధన చేశారు. కోలాటం, సంప్రదాయ భజన శాస్త్రీయ నత్యాల మధ్య తూర్పు రాజగోపురం చేరుకొని ఆలయ ఆగ్నేయ మూలలో ఫొటోషూట్‌లో పాల్గొన్నారు. తూర్పు మహాగోపురం వద్ద వేద పండితులు స్వాగతం పలకగా త్రితల రాజగోపురం, ఆంజనేయస్వామి గుడి, ధ్వజస్తంభం ద్వారా ప్రధానాలయంలోకి ప్రవేశించారు. స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.


ఇక్కత్ చీరలు పరిశీలిస్తున్న అందాలభామ


పోచంపల్లి టూరిజం పార్కులోని మ్యూజియంలో ఏర్పాటు చేసిన మగ్గాన్ని నేస్తున్న సుందరీమణులు


ఇక్కత్ వస్త్రాలు ధరించి రాట్నం తిప్పుతూ...


ఆలయ నిర్మాణ శైలిని పరిశీలిస్తూ..

అటు పిల్లలమర్రి.. ఇటు ఎక్స్‌పీరియం పార్కు

నేడు సందర్శించనున్న సుందరీమణులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/శంకర్‌పల్లి: మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి వృక్షాన్ని, రంగారెడ్డి జిల్లాలోని ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కును శుక్రవారం ప్రపంచ సుందరీమణులు సందర్శించునున్నారు.

- ఒక బృందంలోని 22 మంది అందాల భామలు 750 ఏళ్ల చరిత్ర కలిగిన పిల్లలమర్రికి సాయంత్రం ఐదు గంటలకు చేరుకుంటారు. తెలంగాణ పండుగల విశిష్టత, సంస్కృతిని ప్రతిబింబించేలా బతుకమ్మలు, బోనాలు, గిరిజనుల సంప్రదాయ నృత్యాల మధ్య వారికి ఆహ్వానం పలికేలా అధికారులు ఏర్పాట్లు చేశా రు. ముందుగా వారు విజయనగర కాలం నాటి పునర్నిర్మించిన రాజరాజేశ్వర ఆలయాన్ని సందర్శిస్తారు. ఆపై పురావస్తు మ్యూజియానికి చేరకుంటారు. ఆ తర్వాత లంబాడాల నృత్య ప్రదర్శన మధ్య పిల్లలమర్రికి వస్తారు. మహా వృక్ష విశిష్టత, దీనికి సంబంధించిన చరిత్ర, పునరుజ్జీవం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ప్రత్యేక గైడ్‌ల ద్వారా ప్రపంచ సుందరీమణులకు వివరిస్తారు. అనంతరం తిరిగి వారు రాత్రి ఏడు గంటలకు రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు వెళతారు.
- రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరులోని ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కును చూసేందుకు మరో బృందంలోని 22 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ పోటీదారులు వస్తున్నారు. సాయంత్రం 4.30 గంటలకు ఇక్కడకు చేరుకొని రాత్రి 8గంటల వరకు ఉంటారు. ఈ పార్కు 150 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీనిలో 85 దేశాలకు చెందిన 25 వేల చెట్లు, మొక్కలు ఉన్నాయి. నాలుగు గంటల పాటు ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కులో అందాల భామలు సందడి చేయనున్నారు.

కాళ్లపై నీళ్లు పోశారు.. కడగలేదు

బీఆర్ఎస్ నాయకులది కోడిగుడ్డుమీద ఈకలు పీకే ప్రయత్నం: మంత్రి సీతక్క

ములుగు: ప్రపంచ సుందరీమణుల వరంగల్ పర్యటన విజయవంతం కావడంతో చేసేదేమీ లేక బీఆర్ఎస్ నాయకులు కళ్లలో నిప్పులు పోసుకుంటూ కోడిగుడ్డుమీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. ఈ మేరకు గురువారం మంత్రి ఓ వీడియో విడుదల చేశారు. అమెరికా నుంచి ఇవాంక ట్రంప్ వచ్చినప్పుడు కోక పట్టుకొని తిరిగిన నాయకులు అప్పుడు ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలను పాటించారని ప్రశ్నించారు. గిరిజన సంప్రదాయంలో గుళ్లలోకి కాళ్లు కడుక్కొని వెళ్లడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. సుందరీమణికి ఈవెంట్ మేనేజ్‌మెంట్ యువతి కాళ్లకు నీళ్లు పోసిందని, అంతే తప్ప అధికారులు, సిబ్బందితో అలాంటి పనులు చేయించలేదనేది గమనించాలని తెలిపారు. నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేయడమేకాకుండా, సంఘటనను ప్రభుత్వానికి ముడిపెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కలెక్టర్‌ను కాళ్ల దగ్గర కూర్చోబెట్టినప్పుడు ఇవన్నీ గుర్తుకురాలేదా అని అడిగారు. తెలంగాణ ఆత్మగౌరవంపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్ పార్టీకి, నాయకులకు లేదని తెలిపారు. సబితమ్మా.. అబద్ధాలకు అంబాసిడర్‌గా మారకు అని సీతక్క హితవు పలికారు.

యూపీఏ హయాంలోనే ఉగ్ర ఘటనలు

- ప్రధాని మోదీ నాయకత్వంలో ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం
- రేపు తిరంగా ర్యాలీలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలి
- మహిళా మోర్చా సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: యూపీఏ ప్రభుత్వ హయాంలోనే దేశంలో అనేక ఉగ్రవాద కార్యకలాపాలు జరిగాయని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. వారి హయాంలోనే పార్లమెంటుపై దాడి జరిగిందని, విమానాలను హైజాక్ చేశారని గుర్తు చేశారు. కానీ గత పదేళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో భారత సైన్యం పాకిస్తాన్ ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిందని, ఐఎస్ఐ నెట్‌వర్క్‌ను అంతం చేసి నూతన అధ్యాయానికి నాంది పలికిందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మహిళా మోర్చా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ హయాంలోనే హైదరాబాద్‌లోని గోకుల్ చాట్, లుంబినీ పార్కు, దిల్‌సుఖ్‌నగర్ సహా మూడు ప్రాంతాల్లో బాంబు పేలుళ్లు చోటుచేసుకున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి అనేక ఉగ్రవాద ఘటనలు చోటుచేసుకున్నాయని, జమ్మూ కశ్మీర్‌లో పాకిస్తాన్ నిర్వహించిన ఉగ్రవాద కార్యకలాపాలతో 46,000 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అప్పుడు ఉగ్ర ఘటనలు జరిగినప్పుడు కేవలం సంతాపాలు ప్రకటించి మరిచిపోతుండేవారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ఈ పరిస్థితి మారిందని, భారత్‌పై దాడి జరిగితే కేవలం కొవ్వొత్తులు వెలిగించబోమని, బ్రహ్మోస్ క్షిపణి ప్రయోగిస్తామనే ధైర్యాన్ని మోదీ ఇచ్చారన్నారు. మోదీ నాయకత్వంలో 'న్యూ ఇండియా' ఆవిర్భవించిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నూతన భారతంలో కర్ఫ్యూలు లేవు, మతకలహాలు లేవు, ఏకే–47లు లేవు, బాంబు పేలుళ్లు లేవని చెప్పారు. మే 17న హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్‌పై నిర్వహించే 'తిరంగా ర్యాలీ'లో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికులకు మద్దతుగా నిలబడేందుకు, వారి త్యాగాలకు అభినందనగా ఈ ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. ర్యాలీని విజయవంతం చేయడానికి స్వయం సహాయక బృందాలు, ఎన్జీవోలు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనేలా మహిళా మోర్చా ఆధ్వర్యంలో పనిచేయాలని సూచించారు.

ఆత్మాభిమానం తాకట్టు

ప్రపంచదేశాల ముందు తెలంగాణ ఆత్మగౌరవాన్ని పెంచాల్సింది పోయి.. వారి ముందు మన ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ ఆడపడుచులతో విదేశీ వనితల కాళ్లు కడిగించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ గురువారం ప్రకటన విడుదల చేశారు. మహిళా సాధికారతకు, మహిళల ధైర్యసాహసాలకు ప్రతీక అయిన రాణి రుద్రమదేవి ఏలిన గడ్డపై తెలంగాణ మహిళలను అవమానించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇందుకు.. సోనియాగాంధీ, రాహుల్ గాంధీతోపాటు రేవంత్ రెడ్డి.. తెలంగాణ మహిళా సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

మా ఆడబిడ్డలతో విదేశీ మహిళల కాళ్లు కడిగిస్తారా?

- తెలంగాణ మహిళలకు రేవంత్ క్షమాపణ చెప్పాలి
- సోనియా గాంధీకి బీఆర్ఎస్ మహిళా నేతల లేఖ

సాక్షి, హైదరాబాద్: ఆత్మగౌరవంతో సాధించుకున్న తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం బానిసత్వం వైపు నడిపిస్తోందని బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆడబిడ్డలతో 'మిస్ వరల్డ్'పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విదేశీ మహిళల కాళ్లు కడిగించడం రాష్ట్ర మహిళల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని వారు మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి గురువారం లేఖ రాశారు. 18 నెలలుగా మహిళలను అడుగడుగునా మోసగిస్తున్న సీఎం రేవంత్, తన తీరు మార్చుకుని రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ సంస్కృతిని రేవంత్ అవమానించారు..

'తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని అందాల పోటీదారుల పాదాల చెంత పెట్టి సీఎం రేవంత్ తెలంగాణ సంస్కృతిని అవమానించారు. ఇది ఆయన బానిస మనస్తత్వానికి నిదర్శనం కాగా, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు అంతులేని దుఃఖాన్ని కలిగించింది. రేవంత్ చర్యలు తెలంగాణ సంప్రదాయాలను అవమానించడమే కాక, ప్రపంచం ముందు ఈ నేల ఖ్యాతిని మంటగలిపాయి. వయసుతో సంబంధం లేకుండా ఆడబిడ్డల కాళ్లు మొక్కడం ఈ నేల సంప్రదాయం. తెలంగాణ స్ఫూర్తిని అర్థం చేసుకోలేని అజ్ఞానంతో ఎవరినో సంతోషపెట్టడానికి ఈ నేల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవర్తనతో తెలంగాణ ప్రతిష్ట మసకబారుతోంది. మహిళా జర్నలిస్టులను ''బట్టలు ఊడదీసి కొడతాము''అని స్వయంగా రేవంత్‌రెడ్డి బెదిరించడం ఆయన స్త్రీ వ్యతిరేక, నియంతృత్వ ధోరణులకు సాక్ష్యం 'అని తమ లేఖలో బీఆర్ఎస్ మాజీ మంత్రులు పేర్కొన్నారు. తెలంగాణ తల్లులు, అక్క చెల్లెళ్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన సీఎం రేవంత్, కాంగ్రెస్ పార్టీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

ఆడబిడ్డలతో అందగత్తెల కాళ్లు కడిగిస్తారా

బీజేపీ ఎంపీ అరుణ ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆడబిడ్డలతో.. మిస్ వరల్డ్ పోటీదారుల కాళ్లు కడిగించడంపై మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ అభ్యంతరం వ్యక్తం చేశారు. విదేశీ మహిళల కాళ్లకు నీళ్ల పోసి, తుడిపించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మహిళలపై మోపడం బాధాకరమని పేర్కొన్నారు. ఇది ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని గురువారం ఒక ప్రకటనలో ఆమె మండిపడ్డారు. మన సంప్రదాయాలను గౌరవించాలి తప్ప.. అవమానించడం సరికాదని స్పష్టం చేశారు. అతిథి దేవో భవ.. అనే భారతీయ సంస్కృతిని తప్పుడు రూపంలో ప్రదర్శిస్తూ.. స్థానిక మహిళలను సేవకుల్లా చూపించడాన్ని తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ సంఘటనపై వెంటనే వివరణ ఇవ్వాలని, తెలంగాణ సాంస్కృతిక గౌరవాన్ని తుడిచిపెట్టే చర్యపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని అరుణ డిమాండ్ చేశారు.

అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు

మాజీ ఎంపీ బూర నర్సయ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని మాజీ ఎంపీ బూరనర్స య్యగౌడ్ విమర్శించా రు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, అందాల పోటీలకు బీజేపీ వ్యతిరేకం కాదని, కానీ ప్రభు త్వం రైతుల సమస్యలను కూడా పట్టించుకో వాలని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసి నా తడిసిన ధాన్యం కనిపిస్తోందని, ఈ నేపథ్యంలో రైతులను గాలికి వదిలేసి అందాల పోటీ లపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టిపెట్ట డం సరికాదని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసే ది, ప్రతి పైసా ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమే అని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది కేవలం దళారి పని మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆ పని కూడా సరిగ్గా చేయడంలేదని విమర్శించారు. రుతు పవనాలు తొందరగా వస్తున్నాయని వార్తలు వస్తున్నాయని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని సూచించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా మనం చేసిన ఖర్చు రూ.11 వేల కోట్లు అయితే.. పాకిస్థాన్‌కు జరిగిన నష్టం రూ.32 వేల కోట్లు అని, పాకిస్తాన్ రూపీతో పోలిస్తే దానికి రూ.లక్ష కోట్ల నష్టం జరిగిందని ఆయన అన్నారు.

చెప్పులతో బతుకమ్మ ఆటా?

మాజీ ఎమ్మెల్యే సునీత



సాక్షి, హైదరాబాద్: విశ్వ సుందరి పోటీల్లో పాల్గొంటున్న విదేశీ యువతులు.. చెప్పులు వేసుకుని బతుకమ్మ ఆడటంపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. అందాల పోటీల కోసం వచ్చిన వారికి.. తెలంగాణ అడబిడ్డలతో కాళ్లు కడిగించడమేమిటని ఆమె ప్రశ్నించారు. వరంగల్ జిల్లాకు చెందిన ఇద్దరు మహిళా మంత్రులతో పోటీదారుల కాళ్లు కడిగిస్తే.. మరింత అందంగా ఉండేదని ఎద్దేవా చేశారు. ఆమె గురువారం తెలంగాణ భవన్‌లో పార్టీ నాయ కులు పాల్వాయి స్రవంతి, వై.సతీశ్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాణి రుద్రమదేవి, సమ్మక్క సారలమ్మ వారసులైన ఓరుగల్లు మహిళల అస్తిత్వాన్ని దెబ్బ తీసేలా ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. అందాల పోటీలతో తెలంగాణకు ఎంత మేర లబ్ధి జరిగిందో చెప్పాలని సతీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

త్రిసభ్య కమిటీతో ఉద్యోగ జేఏసీ భేటీ

రెండు గంటల పాటు వివిధ అంశాలపై చర్చ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల జేఏసీ గురువారం సమావేశమైంది. జేఏసీ ప్రతినిధుల సలహాలు, సూచనలు స్వీకరించిన త్రిసభ్య కమటీ చైర్మన్ నవీన్ మిత్తల్‌ఉద్యోగులకు కార్యాచరణను వివరించినట్లు జేఏసీ నేతలు చెప్పారు. అన్ని అంశాలను క్రోడీకరించి మంత్రివర్గ ఉపసంఘానికి నివేదిక అందిస్తామని కమిటీ హామీ ఇచ్చినట్లు జేఏసీ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. త్రిసభ్య కమిటీతో సమావేశమైన వారిలో ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పాదముద్రలూ నేరస్తులను పట్టిస్తాయి

కేసుల దర్యాప్తులో సరికొత్త ఆంబిస్ టెక్నాలజీ వినియోగం



- నిందితుల వేలిముద్రలతోపాటు కాలిముద్రలూ సేకరణ
- ఐరిస్, ముఖ కవళికలు, చేతిరాత, సంతకం, ఎత్తు, బరువు కూడా..
- పైలట్ ప్రాజెక్టుగా ఐదు పోలీస్‌స్టేషన్లలో ఇప్పటికే అమలు
- దేశంలో తొలిసారి ఆంబిస్ వాడుతున్న తెలంగాణ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత టెక్నాలజీ యుగంలో నేరగాళ్లు తెలివి మీరుతున్నారు. దర్యాప్తు అధికారులకు చిక్కకుండా ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. సాంకేతికత సాయంతో పోలీసులు కూడా అంతకు మించి అప్‌డేట్ అవుతున్నారు. గతంలో వేలిముద్రల ఆధారంగానే నేర దర్యాప్తు చేసేవారు. ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక ఆంబిస్ (ఆటోమేటెడ్ మల్టీమోడల్ బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ సిస్టం) టెక్నాలజీతో మరో 'అడుగు' ముందుకేశారు. ఇకపై వేలిముద్రలే కాదు.. కాలిముద్రలు దొరికినా దొంగ చిక్కినట్టే. ఒకసారి నిందితుడు చిక్కితే వారి వేలిముద్రలు, కాలిముద్రలు, ఐరిస్, ముఖ కవళికలు, ఎత్తు, బరువు, సంతకం, చేతిరాత.. ఇలా ప్రతి విషయాన్ని నమోదు చేస్తున్నారు. ఈ డేటాను తెలంగాణ పోలీస్ క్రిమినల్ రికార్డుల్లోకి ఎక్కిస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణ పోలీసులు వాడుతున్న ఆంబిస్ టెక్నాలజీలో నమోదవుతున్న ఈ క్రిమినల్ రికార్డు బ్యాంకు.. భవిష్యత్తులో దొంగల పాలిట పాశుపతాస్త్రంగా మారనుంది. ఈ తరహా టెక్నాలజీ ప్రస్తుతం రష్యాలో మాత్రమే వాడుతున్నారు. భారత్‌లో తొలిసారి తెలంగాణ పోలీస్ శాఖ ఆంబిస్‌ను అమల్లోకి తెచ్చింది.

మూడు రకాల శాంపిల్స్ సేకరణ

ఆంబిస్ కోసం నేరస్తులు, అనుమానితుల నుంచి మూడు రకాల కొలతలు సేకరిస్తున్నారు. వాటిలో బయోమెట్రిక్ శాంపిల్స్, ఫిజికల్ బయోలాజికల్ శాంపిల్స్, బిహేవిరియల్ అట్రిబ్యూట్స్ ఉంటాయి. బయోమెట్రిక్ శాంపిల్స్‌లో వేలిముద్రలు, కాలిముద్రలను (కార్బన్ పేపర్ స్ట్రిప్స్‌తో తీసి డిజిటలైజ్ చేస్తున్నారు), అరచేతి ముద్రలు, ఫేషియల్ ఇమేజ్ టెక్నాలజీతో ముఖ కవళికలను, ఐరిష్ స్కానర్‌తో ఐరిష్‌ను సేకరిస్తున్నారు. ఫిజికల్ బయోలాజికల్ శాంపిల్స్‌లో వ్యక్తి ఎత్తు, బరువు.. బిహేవిరియల్ అట్రిబ్యూట్స్‌లో సంతకం, చేతిరాత, వాయిస్ శాంపిల్స్‌ను సేకరిస్తారు. వీటిని డిజిటలైజ్ చేసి, క్రిమినల్ డేటా బ్యాంకును రూపొందిస్తున్నారు. సీఆర్‌పీఐ (ది క్రిమినల్ ప్రొసీజర్ ఐడెంటిఫికేషన్) యాక్ట్- 2022తో ఈ రకంగా అన్ని రకాల శాంపిల్స్‌ను తీసుకునే అధికారం దర్యాప్తు అధికారులకు లభించింది.

అత్యంత కచ్చితంగా..

తెలంగాణ ఫింగర్ ప్రింట్ బ్యూరో ఇప్పటివరకు వాడుతున్న ఆఫిస్ (ఆటోమేటెడ్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం) సాంకేతికతను మరింత ఆధునీకరిస్తూ ఆంబిస్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ఇది పనిచేస్తుంది. ఇందులో న్యూరల్ నెట్‌వర్క్ ఆధారంగా పనిచేసే ఫింగర్ ప్రింట్ అల్గారిథమ్స్ నేర స్థలంలో లభించిన వేలిముద్రలను ఇవ్వగానే డేటాబేస్‌లోని వేలిముద్రలతో అత్యంత వేగంగా, కచ్చితత్వంతో పోల్చి ఫలితాలు ఇస్తుంది. కాలిముద్రలు, ఐరిష్.. ఇలా ఏది కావాలంటే దానితోనే పోల్చి చూస్తుంది. ఇది భవిష్యత్తులో దర్యాప్తు అధికారుల చేతిలో కీలక అస్త్రంగా మారుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

5 పోలీస్‌స్టేషన్లలో పైలట్ ప్రాజెక్టు..

ఆంబిస్ టెక్నాలజీని పైలట్ ప్రాజెక్టు కింద ఐదు పోలీస్‌స్టేషన్లలో అమలు చేస్తున్నారు. ఎల్బీనగర్, పంజగుట్ట, మాదాపూర్, హనుమకొండ, సిద్దిపేట స్టేషన్లలో ప్రస్తుతం నిందితుల శాంపిల్స్ సేకరణ ప్రారంభించారు. వీటిని డిజిటలైజ్ చేసి క్రిమినల్ డేటాలో భద్రపరుస్తున్నారు.

క్లుప్తంగా...

జూన్ 2న 'జాగృతి' యువ కవుల సమ్మేళనం

ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన యువ కవుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. జూన్ 2న తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగే ఈ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను కవిత గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. తెలంగాణ జీవన శైలి విశిష్టతను చాటేలా యువ కవి సమ్మేళనం ఉంటుందన్నారు. తెలంగాణ తాత్వికత, చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక వైభవం, సౌభ్రాతృత్వం, సహనశీలత, సమగ్రత, సమష్టితత్వాన్ని ప్రతిబింబించేలా కవిత్వం ఉండాలని కవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కవులు, కవయిత్రులు 35 ఏళ్ల లోపువారే పాల్గొనాలన్నారు. తెలుగు, హిందీ ఇంగ్లిష్, ఉర్దూలలో కవితలు వినిపించవచ్చునని, వివరాలను ఈ నెల 26 లోపు kavitha.telangana@gmail.comకు మెయిల్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సాహిత్యానికి కనీస గౌరవం ఇవ్వడం లేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. దాశరథి, బిరుదురాజు శత జయంతి ఉత్సవాలు ప్రభుత్వం నిర్వహించడం లేదని, తెలంగాణకు చెందిన మహాకవులు, కళాకారులు సమాజానికి చేసిన సేవలను ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు.

18న సింగరేణిలో జాబ్ మేళా

- 100 ప్రైవేటు సంస్థల్లో 3 వేల ఉద్యోగాల భర్తీ కోసం ఎంపిక
- సింగరేణి సీఎండీ బలరామ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రామగుండం-1 ఏరియా గోదావరిఖనిలో ఈనెల 18న మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. మెగా జాబ్ మేళాలో హైదరాబాద్ ప్రాంతానికి చెందిన సుమారు 100 ప్రైవేటు సంస్థల్లోని వివిధ విభాగాల్లో 3 వేల ఉద్యోగాల భర్తీ కోసం ఎంపిక జరుగుతుందని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నిరుద్యోగ యువత హైదరా బాద్ లాంటి నగరాలకు వెళ్లి ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేయడం వ్యయ ప్రయా సలతో కూడుకుని ఉంటోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పలు సంస్థల ప్రతినిధులతో మాట్లాడి స్థానికంగా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

18న 'భూపతి చంద్ర' స్మారక పురస్కారాల సభ

కథానికల పోటీ అధ్యక్షుడు ఎంఎల్ కాంతారావు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: 'భూపతి చంద్ర' స్మారక కథానికల పోటీ- 2025 పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈ నెల 18న సాయంత్రం అబిడ్స్‌లోని డా.దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్వహిస్తున్నామని భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ అధ్యక్షుడు ఎంఎల్ కాంతారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, ఆత్మీయ అతిథిగా సినీ దర్శకుడు, సాంస్కృతిక ప్రతి నిధి బి.నరసింగరావు, గౌరవ అతిథిగా నాగార్జున యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ప్రొ. మన్నవ సత్యనారాయణ పాల్గొంటారని, సభా నిర్వహణ సీఎస్ రాంబాబు నిర్వహిస్తారని వివరించారు. ప్రథమ బహుమతి చాగంటి ప్రసాద్: తీరని ఋణం, ద్వితీయ బహుమతి ఉప్పలూరి మధుపత్ర శైలజ: అనుకోని అతిథి, తృతీయ బహుమతి కొండి మల్లారెడ్డి: కర్రెకోడి కథానికలు ఎంపికయ్యాయని, ప్రోత్సాహక బహుమతులు ఎం.శ్రీనివాసరావు: సమిధ, గొర్తివాణి శ్రీనివాస్: వెన్నెలరాగం, కె.వాసవదత్త రమణ: సాగనీ పయనం, ఎన్.గంగాలక్ష్మి: శారద విజయం, పప్పు శాంతాదేవి: ఏది ముఖ్యం? కథానికలకు అందించనున్నామని వివరించారు.

విచారణ పేరుతో వేధింపులు

- న్యాయస్థానం ఉత్తర్వులు బేఖాతర్..
- ఏకంగా 13 గంటలకుపైగా సీనియర్ సిటిజన్ల విచారణ
- అడిగిన ప్రశ్నలే మళ్లీ అడుగుతూ మానసికంగా ఒత్తిడి
- రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి పట్ల సిట్ తీరు ఇదీ

సాక్షి, అమరావతి: మద్యం విధానంపై చంద్రబాబు ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసుకు అనుకూలంగా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిని సిట్ తీవ్ర వేధింపులకు గురి చేస్తోంది. గురువారం దాదాపు 13 గంటలకుపైగా విచారణ పేరుతో ప్రహసనం సాగించడం సిట్ కుట్రలకు అద్దం పడుతోంది. రిటైర్డ్ అధికారులు, సీనియర్ సిటిజన్లు అయిన వారిని ఉదయం 10 నుంచి రాత్రి 11.15 గంటలవరకు విచారణ పేరుతో విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఉంచడం గమనార్హం. తాము తదుపరి విచారణ చేపట్టేవరకు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని సిట్‌ను ఆదేశిస్తూ తదుపరి విచారణను సుప్రీంకోర్టు శుక్రవారానికి వాయిదా వేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారిద్దరూ బుధవారం స్వచ్ఛందంగా సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. తొలిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వారిని విచారించిన సిట్ అధికారులు మరుసటి రోజు గురువారం కూడా రావాలని పేర్కొన్నారు. దీంతో వారిద్దరూ వరుసగా రెండో రోజు గురువారం కూడా విచారణకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకే విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి చేరుకున్నారు.

మళ్లీ మళ్లీ.. అవే ప్రశ్నలు

సిట్ చీఫ్‌గా ఉన్న విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు, ఇతర అధికారులు వారిని విడివిడిగా రోజంతా విచారించారు. మొదటి రోజు అడిగిన ప్రశ్నలనే మళ్లీ మళ్లీ అడగడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంతో తమకు ఏమాత్రం సంబంధం లేదని ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. సీఎంవో కార్యదర్శి, ఓఎస్డీలకు మద్యం విధానం రూపకల్పన, అమలుతో ఎలాంటి సంబంధం ఉండదని నిబంధనలను ఉటంకిస్తూ తేల్చి చెప్పారు. ఆ అంశం పూర్తిగా ఎక్సైజ్ శాఖ, బెవరేజస్ కార్పొరేషన్‌కు సంబంధించినదని పేర్కొన్నారు. అయినా సరే సిట్ అధికారులు పదే పదే అవే ప్రశ్నలు వేస్తూ వారిని వేధించారు. ఉద్దేశపూర్వకంగానే కాలయాపన చేస్తూ వారిపై మానసిక ఒత్తిడికి గురి చేసేందుకు యత్నించారు. ఇక మెయిల్ ఐడీలు, పాస్ వర్డ్ చెప్పమని సిట్ అధికారులు అడిగారు. అందుకు వారిద్దరూ సున్నితంగా తిరస్కరించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు నడుచుకుంటామని స్పష్టం చేశారు.

వెళ్లిపోవచ్చంటూ.. మళ్లీ రప్పించి..

ఎట్టకేలకు రాత్రి 9.30 గంటల సమయంలో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి నుంచి సెల్ ఫోన్లు తీసుకుని విచారణ ముగిసిందని, వెళ్లవచ్చని సిట్ అధికారులు చెప్పారు. అయితే బయటకు వెళుతున్న వారిని మరోసారి వెనక్కి రప్పించారు. సిట్ చీఫ్ ఎస్వీ రాజశేఖర్‌బాబు మరోసారి విచారిస్తారని, వేచి ఉండాలని సూచించారు. అయితే రాజశేఖర్‌బాబు పనుల మీద బయటకు వెళ్లినందున ఆయన వచ్చే వరకు వేచి ఉండాలంటూ మరో గంటన్నరకుపైగా కాలహరణం చేశారు. వారిద్దరినీ మానసికంగా, శారీరకంగా వేధించడమే లక్ష్యంగా వ్యవహరించారు. సిట్ అధికారుల తీరుపై వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. న్యాయస్థానం ఆదేశాలకు విరుద్ధంగా సిట్ అధికారులు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో ఎట్టకేలకు రాత్రి 11.15 గంటల సమయంలో విచారణ ముగిసిందంటూ ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని సిట్ అధికారులు పంపించేశారు. ఇలా ఉద్దేశపూర్వకంగా వేధించాలని ముందుగానే రూపొందించుకున్న ప్రణాళికను అమలు చేశారు. శుక్రవారం కూడా మళ్లీ విచారణకు రావాలని వారికి సిట్ అధికారులు సూచించారు.

సిట్ తీరు దారుణం

దర్యాప్తు పేరుతో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని సిట్ వేధింపులకు గురి చేస్తోంది. రాజ్యాంగం, న్యాయస్థానాల తీర్పులు అంటే ఏమాత్రం లెక్కలేనట్లు కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. సీనియర్ సిటిజన్లు అయిన వారిద్దరినీ 12 గంటలకు పైగా విచారణ పేరుతో వేధించడం ప్రభుత్వ కుట్రకు తార్కాణం. పౌరుల స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారు. ఈ అక్రమ కేసులో గతంలో ఓ నిందితుడి పట్ల సిట్ అధికారులు ఇలాగే వ్యవహరిస్తే న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన ఇంటికి వెళ్లి విచారించాలని, సాయంత్రం 5 గంటల తరువాత విచారించవద్దని ఆదేశించింది. అయినా సరే సిట్ తీరు ఏమాత్రం మారలేదు. సిట్ అధికారులు రాజకీయ పార్టీ నేతల్లా వ్యవహరించడం సరికాదు. ఈ వ్యవహారాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకువెళతాం.
– మనోహర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు

రాజకీయ వేధింపులు...

రాజకీయ కారణాలతోనే ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని సిట్ వేధిస్తోంది. కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఈ అంశాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకెళతాం.
– మొండితోక అరుణ్‌కుమార్, దేవినేని అవినాశ్, వైఎస్సార్‌సీపీ నేతలు

'గుడి' దొంగలను ఈశ్వరుడైనా పట్టలేడు!

- ఐదేళ్ల క్రితం వేములవాడ ఆలయ హుండీ సొత్తు దొంగపాలు?
- ఆ సొమ్ము గుడిది కాదని నాడు తప్పించుకున్న అధికారులు
- ఐదేళ్లు సాగదీసి విచారణను అటకెక్కించిన దేవాదాయశాఖ
- చాలా దేవాలయాల్లో మాయమవుతున్న బంగారు, వెండి కానుకలు

సాక్షి, హైదరాబాద్: దేవాలయంలో చోరీ చేసినట్టు దొంగ చెబుతుండగా, ఆ సొత్తు దేవాలయానిది కాదని ఆలయ అధికారులు బుకాయించి తప్పించుకున్నారు. ఇప్పుడు ఆ వ్యవహారంలో విచారణను స్వయంగా దేవాదాయ శాఖ అటకెక్కించేసింది. దేవాలయాల్లో అవినీతి అధికారులకు అభయం దక్కే తరహాలో దేవాదాయ శాఖ వ్యవహరిస్తోంది. ఐదేళ్ల నాటి ఘటన ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

ఆ సొమ్ము గుడిదే కాదంటూ..


ఐదున్నరేళ్ల క్రితం 2019లో వేములవాడలో పోలీసులు ఓ దొంగను పట్టుకున్నారు. భక్తులు వేములవాడ రాజరాజేశ్వర స్వామికి సమర్పించిన బంగారు, వెండి శివలింగాలు, శూలాలు, బాసింగాలు (బాషికాలు), పాదాలు, సర్పాలు, మట్టెలు, కన్నులు తదితరాలు ఆ దొంగ వద్ద లభించాయి. అనారోగ్యంతో బాధపడేవారు ఆయా శరీర అవయవాల ఆకృతులతో బంగారు, వెండి వస్తువులు చేయించి స్వామివారికి సమర్పించే ఆచారం అక్కడ ఉంది. వాటిని భక్తులు హుండీలో వేస్తారు. హుండీ లెక్కింపు సమయంలో నగదు నుంచి వీటిని వేరు చేసి నగల జాబితాలో బ్యాంకు లాకర్లలో ఉంచుతారు. అవసరమైనప్పుడు కరిగించి వినియోగిస్తారు. ఇలా దేవాలయానికి సమర్పించిన బంగారు, వెండి వస్తువులతో కూడిన ఓ పెద్ద మూటను ఓ ప్రైవేటు వ్యక్తి నుంచి అప్పట్లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అవన్నీ దేవుడికి సమర్పించిన వస్తువుల్లాగే ఉండటంతో చోరీకేసు నమోదు చేసి ఆ వ్యక్తి అరెస్టు చేశారు. దేవాలయం నుంచి తస్కరించినట్టు ఆ వ్యక్తి అంగీకరించాడని రిమాండ్ రిపోర్టులో కూడా నమోదుచేశారు. ఈ అంశంపై పోలీసులు వాకబుచేయగా, దేవాలయంలో చోరీ జరగలేదని అధికారులు బుకాయించారు. అది దేవుడి సొత్తే అని అంగీకరిస్తే, దేవాలయంలో చోరీ జరిగినా పట్టించుకోలేదనో, కావాలనే సొత్తును బయటకు తరలిస్తున్నారన్న నిందను మోయాల్సి వస్తుందన్న భయంతోనో.. అది దేవుడి సొత్తు కాదని వాదించారు. చోరీ చేసిన వ్యక్తిని మాత్రం అది దేవాలయానిదేనని చెప్పినట్లు పోలీసులు పేర్కొనటంతో విషయం దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి చేరింది. దీనిపై విచారణ జరుపుతున్నట్టు అప్పట్లో ఉన్నతాధికారులు ప్రకటించారు. కానీ ఐదేళ్లు గడుస్తున్నా ఆ చోరీ సొత్తును దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోకపోవటంతో పోలీస్‌స్టేషన్‌లోనే మగ్గుతోంది. తాజాగా దేవాదాయ శాఖ ఆ విచారణను కూడా అటకెక్కించినట్లు తేలింది. వేములవాడలో అలాంటి ఓ ఘటన జరిగిందన్న విషయాన్ని కూడా కమిషనరేట్‌లో లిఖితపూర్వకంగా నమోదు చేయలేదని తెలిసింది. ఆ ఘటన జరిగిన సమయంలో మిగతా దేవాలయాల్లో అధికారులు అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకున్నారు. కానీ, విచారణ చేపట్టి నివేదికను అందించే బదులు, అసలు విచారణనే చేపట్టకుండా అటకెక్కించటంతో చాలా దేవాలయాల్లో ఇలాంటి చిల్లర కానుకలు యథేచ్ఛగా బయటకు వెళ్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టీజీసీఎస్‌బీకి మరింత బలం

- సైబర్ భద్రతపై గూగుల్, అరెటే సంస్థలతో ఎంఓయూ
- తెలంగాణ పోలీసులకు శిక్షణ ఇవ్వనున్న ఈ సంస్థలు

సాక్షి, హైదరాబాద్: సైబర్ భద్రతను బలోపేతం చేసే దిశగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు గూగుల్, అరెటే సంస్థలతో గురువారం ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం గూగుల్ తన క్లౌడ్ ఆధారిత సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (ఎస్‌ఓసీ) అయిన గూగుల్ సెక్‌ఓప్స్‌ను టీజీసీఎస్‌బీకి ఉచితంగా అందించనుంది. ఈ సర్వీసును గూగుల్ క్లౌడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన భాగస్వామి ఇలోయిస్ డిజిటల్ అమలు చేయనుంది. ఇది 24 గంటలపాటు సైబర్ మానిటరింగ్, రియల్ టైమ్ నెట్‌వర్క్ డేటా విశ్లేషణ, మాలీషియస్ బిహేవియర్‌ను గుర్తించడంలో సహాయపడుతుంది. అదేవిధంగా అరెటే సంస్థ కూడా టీజీసీఎస్‌బీకి ఉచితంగా ఈడీఆర్ (ఎండ్‌పాయింట్ డిటెక్షన్ అండ్ రెస్పాన్స్) సేవలు అందించనుంది. ఈ ఎంఓయూ మూడేళ్ల పాటు అమలులో ఉంటుంది. సైబర్ భద్రతపై తెలంగాణ పోలీసులకు ఈ సంస్థలు శిక్షణ కూడా అందించనున్నాయి. ఈ సందర్భంగా టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలను నియంత్రించేందుకు టీజీసీఎస్‌బీకి ఈ ఒప్పందం మరింత శక్తినిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీసీఎస్‌బీ ఎస్పీ హర్షవర్ధన్, ఇలోయిస్ డిజిటల్ డైరెక్టర్ ముత్తుస్వామి ధరణీధరన్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు బుల్లెట్‌ప్రూఫ్ కారు


సిరిసిల్ల పర్యటనలో కేటీఆర్ ప్రయాణిస్తున్న బుల్లెట్‌ప్రూఫ్ కారు

సిరిసిల్ల: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు బుల్లెట్‌ప్రూఫ్ కారులో గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చారు. ఇంటెలిజెన్స్ వర్గాల సూచనలతో కేటీఆర్ తాను ప్రయాణించే కారును మార్చుకున్నట్లు సమాచారం. కేటీఆర్ ఎమ్మెల్యేగా ఐదుసార్లు ఎన్నికవడంతో పాటు మంత్రిగా రెండు పర్యాయాలు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ తనయుడు కావడంతో ఆయనకు అదనపు రక్షణ అవసరమన్న నిఘా వర్గాల సూచనలతో బుల్లెట్‌ప్రూఫ్ కారును చండీగఢ్‌లో చేయించినట్లు తెలిసింది.

మన దగ్గరా కర్ణాటక తరహా లైసెన్స్‌డ్ సర్వేయర్ల విధానం

- ఆ రాష్ట్ర అధ్యయన బృందంతో భేటీ అయిన రెవెన్యూ మంత్రి పొంగులేటి
- సర్వేయర్ల నియామకం పూర్తయ్యాక రిజిస్ట్రేషన్ల సమయంలోనే మ్యాపింగ్ విధానం అమలు



సాక్షి, హైదరాబాద్: పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో అమలవుతున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల విధానాన్ని మన రాష్ట్రంలోనూ అమలు చేయనున్నారు. ఇప్పటికే సర్వేయర్ల శిక్షణ కోసం ఆ శాఖ దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈనెల 17 నాటికి దరఖాస్తు గడువు ముగియనున్న నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం సచివాలయంలో కర్ణాటక రాష్ట్ర అధ్యయన బృందంతో సమావేశమయ్యారు. అక్కడ అమలవుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలోనూ లైసెన్స్‌డ్ సర్వేయర్లను వీలున్నంత త్వరగా అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఉన్నతాధికారులను ఆదేశించారు.

అక్కడ అమలవుతోందిలా...!

సమావేశంలో భాగంగా కర్ణాటకలో అమలవుతున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల విధానాన్ని అధికారులు మంత్రి పొంగులేటికి వివరించారు. ప్రస్తుతం కర్ణాటకలో ఆరు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు, 4 వేల మంది ప్రభుత్వ సర్వేయర్లు ఉన్నారన్నారు. ఒక్కో లైసెన్స్‌డ్ సర్వేయర్ సగటున నెలకు 20-25 దరఖాస్తులు స్వీకరించి సర్వే నిర్వహిస్తారని, తద్వారా వారికి రూ.25 వేల నుంచి 30 వేల వరకు ఆదాయం వస్తుందని వెల్లడించారు. 1999లో కర్ణాటక ప్రభుత్వం రెవెన్యూ చట్టాన్ని సవరించడం ద్వారా 2005 నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చిందని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు భూములను సర్వే చేసి రిజిస్ట్రేషన్ కంటే ముందే స్కెచ్ తయారు చేసి సదరు పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారని, దాన్ని ప్రభుత్వ సర్వేయర్లు పరిశీలించిన అనంతరం సంబంధిత సర్వే అధికారి ఆమోదిస్తారని వెల్లడించారు. ఈ స్కెచ్‌లోనే భూమి విస్తీర్ణం, టైటిల్, సరిహద్దులకు సంబంధించిన వివరాలు ఉంటాయని చెప్పారు. ఈ విధానం ద్వారా భూలావాదేవీలు మరింత సమర్థవంతంగా, శాస్త్రీయంగా జరుగుతున్నాయన్నారు.

గ్రామీణ యువతకు ఉపాధి

మంత్రి పొంగులేటి మాట్లాడుతూ కర్ణాటకలో 20 ఏళ్ల నుంచి ఈ విధానం కొనసాగుతోందని, మన రాష్ట్రంలో కూడా అమల్లోకి తెస్తే గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. రైతులకు మరింత మెరుగైన సేవలందించేలా భూలావాదేవీలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. భూభారతి చట్టం అమలులో భాగంగా రిజిస్ట్రేషన్ల సమయంలోనే భూమి సర్వే మ్యాప్‌ను జతపర్చేందుకు ఈ సర్వేయర్ల విధానాన్ని తెస్తున్నామని, ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయా మండలాల్లో జరిగే భూలావాదేవీలు, మొత్తం భూమి విస్తీర్ణానికి అనుగుణంగా లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ఏపీ రాజధానిలో ఆయకట్టు భూములు..

- వాటికి ఇకపై సాగునీరు అవసరం లేదు
- ఆ నీటిని బేసిన్ లోపలి ప్రాజెక్టులకు కేటాయించాలి
- కృష్ణా ట్రిబ్యునల్-2 ఎదుట తెలంగాణ వాదనలు

సాక్షి, హైదరాబాద్: క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్డీఏ) పేరుతో ఏపీలో నిర్మిస్తున్న కొత్త రాజధాని పరిధిలోకి.. కృష్ణా డెల్టా సిస్టమ్‌తో పాటు నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువలకు సంబంధించిన కొంత ఆయకట్టు వస్తోందని తెలంగాణ రాష్ట్రం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ ఆయకట్టుకు సంబంధించిన కృష్ణా జలాలను పరీవాహక ప్రాంతం పరిధిలోని ప్రాజెక్టులకు కేటాయించాలని కోరింది. ఈమేరకు జస్టిస్ బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్-2 ఎదుట గురువారం తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపించారు. నాగార్జునసాగర్ కుడి కాలువ కింద ఏపీలోని ఆయకట్టుకు పులిచింతల ప్రాజెక్టు ద్వారా ప్రత్యామ్నాయంగా సాగునీటిని సరఫరా చేయవచ్చని, అలా చేస్తే మిగిలే కృష్ణా జలాలను పరీవాహక ప్రాంతం లోపలి ప్రాజెక్టులకు కేటాయించాలని సూచించారు. పదకొండేళ్లుగా ఏపీ పరీవాహక ప్రాంతం వెలుపలి ప్రాజెక్టులకు నీళ్లను తరలిస్తోందని గుర్తు చేశారు. పెన్నా, ఇతర నదుల పరీవాహక ప్రాంతంలో ఏపీ 360 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యం కలిగి ఉండగా, దీనికంటే 1.4 రెట్లు అధికంగా నీళ్లు వాడుకునే సామర్థ్యాన్ని ఏపీ కలిగి ఉందని వాదించారు. తాజాగా ఏపీ 150 టీఎంసీల సామర్థ్యంతో బొల్లపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తోందని నివేదించారు. పంటలకు సాగునీటి అవసరాలను నిర్ధారించడానికి శాస్త్రీయ పద్ధతులను అవలంబించి కేటాయింపులు జరపాలని ట్రిబ్యునల్‌కు విజ్ఞప్తి చేశారు.

సునీతారావుపై సీరియస్


మీనాక్షి దృష్టికి గాంధీభవన్‌లో ఆందోళన అంశం..
క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: పార్టీ పదవుల్లో అన్యాయం జరుగుతుందంటూ గాంధీభవన్‌లోని టీపీసీసీ అధ్యక్షుడి చాంబర్ ఎదుట ఆందోళనకు దిగిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.సునీతారావుపై ఆ పార్టీ సీరియస్ అయినట్టు తెలుస్తోంది. ఎలాంటి జాబితా విడుదల కాకముందే నిరసనకు దిగడం, పార్టీ నేతలనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఆమెపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. గాంధీభవన్ ఇన్‌చార్జ్ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు ఈ మేరకు లిఖితపూర్వకంగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన గురించి క్రమశిక్షణా కమిటీకి తెలియజేశారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. దీంతోపాటు మహిళా కాంగ్రెస్ నేతల ఆందోళన అంశం రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టికి కూడా వెళ్లిందని, అసలేం జరిగిందో తెలుసుకోవాలని, జాబితా రాకముందే అన్యాయం జరిగిందని ఎలా అంటారని ఆమె ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. మహిళా కాంగ్రెస్ నేతలు కోరుతున్న పదవులు ఇంతవరకు ప్రకటించనే లేదని, అలాంటప్పుడు అన్యాయం జరిగిందని ఎలా ఆందోళనకు దిగుతారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో సునీతారావుతోపాటు ధర్నాలో పాల్గొన్న కొందరు ముఖ్య నేతలకు టీపీసీసీ త్వరలోనే షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్టు సమాచారం

ఎన్నికల బదిలీల పరిష్కారమే ఎజెండా

- రెవెన్యూ ఉద్యోగ సంఘాల సమావేశంలో ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: గత ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి వెనక్కు పంపేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, ఈ సమస్య పరిష్కారమే ఉద్యోగ సంఘాల ప్రధాన ఎజెండా అని ఉద్యోగ జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం అను కూలంగా ఉందని, ఒత్తిడి పెంచి సమస్యను పరిష్కరించుకుందామన్నారు. గురువారం డిప్యూటీ కలెక్టర్ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సంఘాల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సకాలంలో బదిలీలు జరగకపోవడంతో ఆయా అధికారుల కుటుంబాలు తీవ్ర వేదనకు గురవుతున్నాయని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు ఏర్పాటైన త్రిసభ్య కమిటీ దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసు కెళ్లామని వెల్లడించారు. రెవెన్యూ శాఖలో ఉద్యోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, వీటిలో అన్నింటికంటే కీలకం ఎన్నికల బదిలీలే అని చెప్పారు. ఉమ్మడిగా, ఏకైక ఎజెండాగా ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దామని సూచించారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన అధికా రులను ఎన్నికలు ముగిసిన వెంటనే తిరిగి వెనక్కు రప్పించాల్సి ఉండగా, రెండేళ్లయినా ఆ పని చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్.. తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం పాల్గొన్నారు.

పూర్వ జిల్లాలకు తహసీల్దార్లు

గత ఎన్నికల్లో ఇతర జిల్లాలకు బదిలీ అయిన వారికి ఊరట

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ, ఆ తర్వాత జరిగిన ఎంపీ ఎన్నికల సమయంలో ఎన్నికల నిబంధనల మేరకు ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహ సీల్దార్లకు ఎట్టకేలకు ఊరట కలిగింది. దాదాపు 18 నెలల కాలం నుంచి దూరప్రాంతాల్లో విధులు నిర్వర్తి స్తున్న వారిని పూర్వ జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మల్టీజోన్-1 పరిధిలో 55 మంది, మల్టీజోన్-2 పరిధిలో 44 మందిని పూర్వ జిల్లాలకు పంపిస్తూ భూపరి పాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు వెంటనే తహ సీల్దార్లను రిలీవ్ చేయడంతో పాటు వచ్చిన వారిని జాయిన్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఈ తహసీల్దార్లు బదిలీ కావడానికి ముందు ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో పనిచేశారో, మళ్లీ అదే నియోజకవర్గంలో మాత్రం పోస్టింగ్ ఇవ్వద్దని జిల్లా కలెక్టర్లకు ఈ ఉత్తర్వుల్లో ఆదేశాలు జారీ చేశారు. కాగా, 'ఎన్నికల బదిలీ'లకు మోక్షం కలగడంతో దూర ప్రాంతాల్లో కుటుంబాలను వదిలి విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్యాషన్

మారుతున్న ఫ్యాషన్ ట్రెండ్ ల ప్రపంచంలో
కోటా డోరియా చీరలు ఎప్పటికీ నిలిచే ఉండే కళాఖండాలు.
వాటి క్లాసిక్ అందం కారణంగా ఏ తరహా కట్టు, కుట్టుకైనా
అద్భుతమైన మ్యాచ్‌గా అమరిపోతాయి.
సంప్రదాయ నేతలను ఇష్టపడేవాళ్లు
తమ డిజైన్‌లో భారతీయ వారసత్వాన్ని చేర్చాలనుకుంటే,
కోటా డోరియా చీర ఎప్పటికీ వికసించే క్లాసిక్ సొగసు.
నైపుణ్యాన్ని కళ్లకు కట్టే విలాసవంతమైన కళాత్మకం.





● కోటా డోరియా

కళాత్మకమైన క్లాసిక్ సొగసు

కోటా చీర డిజైన్ల వైవిధ్యమైన కళాత్మకత తరతరాలను ఆకర్షిస్తూ వస్తున్నాయి. ఈ ఐకానిక్ చీరల వెనుక ఉన్న సాంస్కృతిక వారసత్వం, శ్రమతో కూడిన ప్రక్రియలు మేడ్ ఇన్ ఇండియా నిధిగా, రాజస్థానీ కోటా సిల్క్ మన దేశ వస్త్ర శ్రేష్ఠతను సూచిస్తుంది. కోటా పట్టు 17వ శతాబ్దానికి చెందింది. రాజస్థాన్‌లోని కోటాలో డోరియా టెక్నిక్‌ని ఉపయోగించి కోటా డోరియా ఫ్యాబ్రిక్‌ను రూపొందించారు. దారాల అల్లికలతో తేలికైన కోటా చీరల క్రియేషన్ జరిగింది. శతాబ్దాలుగా ఈ చీరల నాణ్యత, సంక్లిష్టమైన నేత రాజస్థానీ సంస్కృతికి పర్యాయపదంగా, కోటా పట్టుచీరలు విలువైన వారసత్వ సంపదగా నిలిచాయి.

చేతిపనుల అద్భుతం

సంప్రదాయ పిట్ లూమ్‌లను కోటా సిల్క్ మెటీరియల్‌లో 'ఖాట్స్' అని పిలువబడే సిగ్నేచర్ చెక్ ప్యాటర్న్‌లను రూపొందించడానికి ఉపయోగించేవారు. ట్రాన్స్‌పరెంట్‌గా ఉండే ఈ నేత ప్రపంచవ్యాప్తంగా ప్రశంసించబడింది. ఈ ప్రాచీన తయారీ పద్ధతిని చేతివృత్తులవారు కొనసాగిస్తూనే తమ నేత నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటున్నారు.

సంప్రదాయం ఆవిష్కరణ

సంప్రదాయ కోటా సిల్క్ చీరలను పూల తీగలు, పైస్లీ, టెంపుల్ బార్డర్స్, క్లాసిక్ మోటిఫ్‌లు రాజస్థానీ డిజైన్‌లలో అలంకరిస్తాయి. కాంతిమంతమైన రంగోలి ప్రింట్లు, రేఖాగణిత ఆకారాలు సమకాలీన డిజైన్ అంశాలుగా పుట్టుకొచ్చాయి. ప్రత్యేకమైన బ్లౌజ్, పల్లూ డిజైన్లతో రాజస్థానీ కోటా సిల్క్ చీరలు ఫ్యాషన్ పరిధిని మరింత విస్తృతం చేశాయి.





ప్రింటెడ్ కోటా

కోటా డిజైనర్ చీరల తయారీలో పూర్వీకుల పద్ధతులను పాటిస్తూనే ప్రస్తుత ఆధునిక పోకడల మిశ్రమాన్ని ప్రదర్శిస్తాయి. బాగ్రు బ్లాక్ ప్రింటింగ్, డాబు మడ్ రెసిస్ట్, గోటా పట్టి కోటా సిల్క్ మెటీరియల్‌పై పూలు, పైస్లీ మోటిఫ్‌లు అలంకరించాయి. జరీతో నేసిన లైన్లు ప్రింటెడ్ కోటా సిల్క్ చీరలకు మెరుపును జోడిస్తాయి. ప్రింట్లు స్థానిక కళాకారుల సృజనాత్మకత నుండి ప్రేరణ పొందాయి.

స్టైలింగ్ చిట్కాలు

కోటా పట్టు చీరల అంచులు పైథానీ డిజైన్లతో మెరిపించడంతో మరింత రిచ్ లుక్‌తో ఆకట్టుకుంటున్నాయి. దీంతో వివాహ వేడుకలలో హల్దీ వంటి ఆచారాల నుండి సాయంత్రాలలో జరిగే కాక్‌టెయిల్ పార్టీల వరకు అందమైన హంగుగా అమరిపోయాయి. అందమైన పూలు ప్రింట్ చేసిన కోటా చీరలు సంగీత్ ఫంక్షన్లకు ఉత్సాహాన్ని జోడిస్తున్నాయి. కోటా సిల్క్ చీరలు పండగలలో సిగ్నేచర్ వేర్‌గా వచ్చి చేరాయి.

కోటా కాటన్ చీరలు వెయ్యి రూపాయల నుంచి అందుబాటులో ఉండగా, కోటా ప్యూర్ పట్టు వాటి డిజైన్లను బట్టి రెండు లక్షల రూపాయలకు పైగా ధరలు ఉన్నాయి.

– నిర్మలారెడ్డి



ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ నందిని గుప్తా రాజస్థాన్‌లోని కోటా నుండి వచ్చింది. తన స్వస్థలానికి వన్నె తెచ్చే కోట డోరియా ఫ్యాబ్రిక్‌తో తనకున్న అనుబంధాన్ని వేదికల మీద చాటింది. కోటా డోరియా చేనేత ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ స్థానిక కళాకారులకు మద్దతు ఇస్తోంది. వివిధ కార్యక్రమాలలో కోటా డోరియా డిజైన్‌లను ధరించి, మరింత బ్రైట్‌గా మెరిసిపోయింది.



కుతూహలం, జిజ్ఞాస,
ప్రతిభ, సామాజిక బాధ్యత,
లాస్ట్ బట్ నాట్ లీస్ట్ అందం..
అన్నిటికీ పర్యాయ పదం!
నటాషా పరిచయం
ఆమె మాటల్లోనే...

మన శక్తిని నమ్ముకుందాం

నటాషా న్యో న్యో జీ..
మిస్ యుగాండా!

నేను పుట్టి,పెరిగింది యుగాండాలో! అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్ గ్రాడ్యుయేషన్ కోసం యూకే వెళ్లి, చదువు పూర్తవగానే తిరిగి నా దేశానికి వచ్చేశాను. వృత్తి రీత్యా అకౌంటెంట్‌ని, ఆంట్రప్రెన్యూర్‌ని కూడా. కంపాలాలో నాకో బ్యూటీ స్టోర్ ఉంది. స్కిన్ కేర్, మేకప్, యాక్సెసరీస్ లాంటివంటే నాకు చాలా ఆసక్తి. అదే నన్ను ఈ పాజెంట్ వైపు లాక్కొచ్చిందని చెప్పొచ్చు. మా దగ్గర కూడా అమ్మాయిలు, అబ్బాయిలకు మధ్య వివక్ష చాలా! కానీ అదృష్టవశాత్తు మా ఇంట్లో లేదు. మమ్మల్నందరినీ సమానంగా పెంచారు.

బ్యూటీ విత్ పర్పస్

మా తమ్ముడికి ఆటిజం. యుగాండాలో స్పెషల్ నీడ్స్ పిల్లలకు కావలసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేదు. వాళ్లనెలా పెంచాలో కూడా తెలియదు. తమ్ముడి కోసం అమ్మ ట్రైన్ అయింది. అమ్మ నడిపే స్కూల్లోనే స్పెషల్ నీడ్ చిల్డ్రన్ కోసం కూడా ఓ సెక్షన్ పెట్టింది. పిల్లల పేరెంట్స్‌కి అవేర్‌నెస్ కల్పిస్తోంది. అందులో నేనూ పాలు పంచుకుంటున్నాను. స్పెషల్ నీడ్ పిల్లల కోసం హెల్త్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ సిస్టమ్ డెవలప్ అయ్యేందుకు నా వంతు ప్రయత్నం చేస్తున్నాను. నా బ్యూటీ విత్ పర్పస్ అదే! అలాగే టాలెంట్ రౌండ్‌లో నేను పియానో ప్లే చేయబోతున్నాను. స్పోర్ట్స్ రౌండ్‌లో స్విమ్మింగ్. స్విమింగ్ ఈజ్ మై ఫేవరిట్ స్పోర్ట్.

మర్యాద, మాట తీరు..

రిచ్ కల్చర్, ట్రెడిషన్ వంటి విషయాల్లో మా దేశానికి, ఇండియాకు చాలా పోలిక ఉంది. ఇక్కడి రైస్, స్పైసీ ఫుడ్ నాకు చాలా నచ్చాయి. కొత్త వాతావరణంలో.. కొత్త మనుషుల మధ్య ఉన్నామన్న ఫీలింగే లేదు. అందరికీ అందరం ఎప్పటి నుంచో పరిచయం అన్నట్టుగానే ఉంది. కొత్త భాషల్లో రోజూ కనీసం ఒక వర్డ్ అయినా నేర్చుకుంటున్నాను. అలాగే మా భాషనూ నా తోటి కంటెస్టెంట్స్‌కి నేర్పేందుకు ట్రై చేస్తున్నాను. ఐకమత్యం అసాధ్యాలను సుసాధ్యం చేయగలదని అర్థమైంది. వేగంగా వెళ్లాలంటే ఒంటరిగా ప్రయాణించాలి. కానీ సుదీర్ఘ దూరాలకు వెళ్లాలంటే మాత్రం కచ్చితంగా గుంపుగా ప్రయాణించాలి'' అంటూ చెపాపు నటాషా.

– సరస్వతి రమ

అందుకే కనెక్ట్ అయ్యాను..

నాకు ఇక్కడి చీరలు చాలా నచ్చాయి. కొనుక్కెళ్లాలనుకుంటున్నాను. బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రాకు బిగ్ ఫ్యాన్‌ని. ఆమె నటించిన బర్ఫీ సినిమా చాలాసార్లు చూశాను. అందులో ఆమె ఆటిజం అమ్మాయిగా అద్భుతంగా నటించింది. మా తమ్ముడికీ ఆటిజం కదా! అందుకే కనెక్ట్ అయ్యాను. విమెన్ ఎంపవర్‌మెంట్ విషయానికి వస్తే.. ప్రతి అమ్మాయి తన శక్తిని నమ్ముకోవాలి. ఎవరైనా వెనక్కి లాగితే రెట్టింపు ఉత్సాహంతో అడుగులు వేయాలి. మన సంకల్పం గట్టిగా ఉంటే మనల్ని ఎవరూ ఆపలేరు!

– నటాషా న్యో న్యో జీ – యుగాండా

మిస్ వరల్డ్ మధురమైన పాట

అందంలోనే కాదు అద్భుతమైన గానంలోనూ 'భేష్' అనిపించుకున్నారు మిస్ వరల్డ్ అందాల తారలు...

- మిస్ వరల్డ్ (2019) టోని-అన్ సింగ్, వైట్నీ హ్యూస్టన్ పాట 'ఐ హ్యావ్ నథింగ్'ను మిస్ వరల్డ్ ఫైనల్ ఈవెంట్‌లో అద్భుతంగా ఆలపించింది.
- మాజీ మిస్ వరల్డ్ ప్రియాంక చోప్రా తన సినిమాల్లోని పాటలను మ్యూజిక్ లేకుండానే పాడుతూ ప్రేక్షకులను అలరిస్తుంది.
- మిస్ వరల్డ్(1997) డయాన హేడెన్ ప్రొఫెషనల్ సింగర్. కాలేజీ రోజుల్లో ఎన్నో పోటీల్లో పాల్గొంది. మ్యూజిక్ ఇండస్ట్రీలో పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా పనిచేసింది.



- మిస్ వరల్డ్ (1999) యుక్తా ముఖీ మోడలింగ్, నటనలోనే కాదు గానంలోనూ 'భేష్' అనిపించుకుంది. హిందుస్థానీ క్లాసిక్ మ్యూజిక్‌లో మూడు సంవత్సరాల కోర్సు చేసింది.
- మిస్ వరల్డ్ (2017) మానుషి చిల్లర్ కూచిపూడి డ్యాన్సర్ మాత్రమే కాదు మంచి సింగర్ కూడా.
- మిస్ వరల్డ్ (1994) ఐశ్వర్య రాయ్ టెలివిజన్ షోలతో సహా ఎన్నో కార్యక్రమాలలో తన మధుర గాత్రాన్ని వినిపించింది.

బస్సెక్కినా రైలెక్కినా విమానం ఎక్కినా
మనకు కావలసింది ఏది?
కిటికీ పక్కన సీటు? ఎందుకు?
బయటకు చూస్తుంటే బాగుంటుంది.
ఎందుకు బాగుంటుంది?
కొత్త ప్రాంతాలు కాబట్టి.



పిల్లలూ... మనిషి పుట్టింది ఉన్న చోట ఉండటానికి కాదు.
ప్రయాణించడానికి.
తిరిగి లోకం చూడాలి. కొత్త మనుషులను కలవాలి.
ప్రయాణాల్లో ఏం చూశారో, ఏం తెలుసుకున్నారో రాయాలి.
అప్పుడు మీరు 'ట్రావెల్ రైటర్' అవుతారు.
'యాత్రికుడు' అనిపించుకుంటారు.



కిటికీ పక్కన సీటు

పిల్లలూ! వేసవి సెలవుల్లో అమ్మా నాన్నలు మిమ్మల్ని ఏదో ఒక ఊరు తీసుకెళతారు. కొత్త ప్రదేశాలు చూపిస్తారు. మీరు అక్కడి వింతలు, విశేషాలు చూసి ఆనందిస్తారు. కొన్ని ఫొటోలు దిగి, తర్వాత ఇంటికి వచ్చేస్తారు. అక్కడితో ఆ పర్యటన ఓ గుర్తుగా మారుతుంది. అంతటితో సరేనా? దాన్ని మరింత పదిలం చేసుకోవాలని మీకు ఉండదా? మరి దానికేంటి మార్గం? ఒక్కటే. మీ పర్యటనలో మీకు ఎదురైన అనుభవాలను రాయడం. వాటిని రికార్డు చేసి పదిలంగా దాచుకోవడం.

ట్రావెల్ ఎక్స్‌పీరియన్స్ ఎందుకు రాయాలి?

ట్రావెలర్స్ ట్రావెల్ చేసి పొందిన అనుభవాలను రాయడం కొత్త విషయమేమీ కాదు. గతంలో ఎంతోమంది తాము చేసిన యాత్రల వివరాలు, విశేషాలను పుస్తకాల రూపంలో రాశారు. వాటిని 'యాత్రా కథనాలు' అంటారు. వాటిని చదవడం వల్ల అక్కడకు పోలేని వారికి ఆ ప్రాంతాల చరిత్ర, విశిష్టత, కల్చర్, లైఫ్‌స్టైల్ గురించి అవగాహన ఏర్పడుతుంది. కొత్త ప్రదేశాల్లో ఉండే వైవిధ్యం తెలుస్తుంది. ఇదే మీరూ చేయొచ్చు. మీరు చూసిన ప్రదేశాల తాలూకు విశేషాలను వ్యాసంగా రాయొచ్చు. దాన్ని మీ స్నేహితులకు, టీచర్లకు చూపించొచ్చు. దీనివల్ల మీ అనుభవాలకు విలువ ఏర్పడుతుంది. అందరిలోనూ ప్రత్యేకంగా నిలుస్తారు.

యాత్రాకథనాలు రాయడం వల్ల కలిగే లాభాలు

యాత్రాకథనాలు రాయడంలో మీ ఎక్స్‌ప్రెషన్‌దీ లాంగ్వేజ్‌దీ కీలకమైన పాత్ర. కొత్త ప్రాంతంలో మనకు ఎదురైన అనుభవాలను మన మాటల్లో పెట్టడం వల్ల మనసులోని భావాలను ఎలా వ్యక్తీకరించాలో తెలుస్తుంది. దీనివల్ల స్పష్టమైన దృక్పథం ఏర్పడుతుంది. నచ్చింది నచ్చనిది చెప్పడం చేతనవుతుంది. ఉదాహరణకు మీరు ఊటీ వెళ్లారనుకోండి. క్యాబ్‌డ్రైవర్ మీతో మంచిగా వ్యవహరిస్తే ఆ సంగతి రాస్తారు. ర్యాష్‌గా ఉంటే 'ఊటీ వెళ్లినప్పుడు మీరు సరైన డ్రైవర్‌ను ఎంచుకోండి. లేకుంటే ఇబ్బంది పడతారు' అని రాస్తారు. అది చదివి మిగిలిన వారు అలర్ట్ అవుతారు.

జ్ఞాపకశక్తి పెరుగుతుంది

మీరు ట్రావెలింగ్‌లో చూసిన విషయాలు అప్పటికప్పుడు పుస్తకంలో రాసుకోవచ్చు లేదా వాటిని గుర్తు పెట్టుకొని ఇంటికి వచ్చాక రాసుకోవచ్చు. లేదా అక్కడే చిన్నచిన్న పాయింట్ల రూపంలో రాసుకొని, ఇంటికి వచ్చాక విస్తరించి రాయొచ్చు. ఇలా చేయడం వల్ల మీ జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మీ ఆలోచనాధోరణి పదునెక్కుతుంది.

చారిత్రక, సాంస్కృతిక అవగాహన

మీరు చూసిన ప్రదేశాల గురించి రాయాలని అనుకున్నప్పుడు తప్పనిసరిగా ఆ ప్రదేశాల గురించి గూగుల్ చేస్తారు. మీరు చూసిన చోటు గురించి మరిన్ని విషయాలు తెలుసుకుంటారు. ఉదాహరణకు రెండు రోజులు హంపీ చూసి వస్తారు. ఆ ప్లేస్ మీద మీకు ఇంట్రెస్ట్ వస్తుంది. గూగుల్ చేసి యూట్యూబ్ ద్వారా హంపి గురించి ఇంకా చాలా విషయాలు తెలుసుకుంటారు. దీనివల్ల ఆ ప్రదేశాల చరిత్ర, సాంస్కృతిక విశేషాలు తెలుసుకుంటారు. ఇది మీకెంతో మేలు చేస్తుంది.

నేరుగా తెలుస్తుంది

ఎప్పుడూ స్వీట్ తినని వారికి ఎంత చెప్పినా స్వీట్ అంటే ఏంటో తెలియదు. కేరళ ఎలా ఉంటుందో ఎన్ని వీడియోలు చూసినా నేరుగా చూడటంలోని మజా రాదు. కేరళ వెళితే హౌస్‌బోట్‌లో తిరుగుతున్నప్పుడు ఆ బ్యాక్‌వాటర్స్‌లో ఎంత బాగుంటుందో అనుభవించి రాస్తే ఆ ఫీలింగ్ వేరేగా ఉంటుంది. ప్రపంచంలో గొప్ప వారంతా నెలలో, మూడు నెలలకోసారి ఏదో ఒక కొత్త ప్రాంతానికి వెళతారు. ఎందుకంటే తిరిగితే నాలుగు విషయాలు తెలుస్తాయి. ఇప్పుడు యూట్యూబ్ ట్రావెలర్స్ ఎందరో తిరుగుతూ వీడియోలు చేస్తూ సంపాదిస్తున్నారు కూడా. వేసవి సెలవులన్నీ నెక్స్ట్ క్లాస్ సబ్జెక్ట్స్ చదువుతూ వృథా చేయకండి. కిటికీ పక్కన ఒక్కసారైనా కూచోండి. కదలండి.

– కె.



మెంటల్ హెల్త్ పై సైలెన్స్ వద్దు

''ప్రస్తుతం నేను ప్రతిష్ఠాత్మక ప్రపంచ సుందరి వేదిక పైన నిల్చున్నాను. కానీ మన ప్రపంచం అంత అందంగా లేదు..., ఎన్నో సామాజిక వైరుధ్యాలున్నాయ'ని మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న మిస్ జింబాబ్వే కోర్ట్నని జాంగ్వే తెలిపింది. 2023 నాటికి ప్రపంచ సామాజిక వైకల్యానికి మానసిక ఆరోగ్య సమస్యలు ప్రధాన కారణంగా నిలువనున్నాయని, ఇది తన మాట కాదు.. ఏకంగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ హెచ్చరించిందని గుర్తు చేసింది. ముఖ్యంగా తమ ఆఫ్రికన్ దేశాల్లో ఈ మానసిక ఆరోగ్య (మెంటల్ హెల్త్) సమస్యలు మరింత ఎక్కువగా ఉన్నప్పటికీ, దీని గురించి ఎవరూ అంతగా మాట్లాడట్లేదని జాంగ్వే ఆవేదన వ్యక్తం చేసింది. ఒక వేళ తాను మిస్ వరల్డ్ విజేతగా నిలిస్తే ఈ సమస్యపై కొనసాగుతున్న నిశ్శబ్దాన్ని ఛేదించడానికి తన కిరీటాన్ని, కీర్తిని వినియోగిస్తానని ఉద్వేగంగా ప్రకటించింది. మిస్ వరల్డ్ 2025 నేపథ్యంలో కోర్ట్నని జాంగ్వే ప్రత్యేకంగా 'సాక్షి'తో తన అనుభవాలను పంచుకుంది.

మిస్ వరల్డ్ అనేది మహిళా సాధికారత పై దృష్టి సారించే అంతర్జాతీయ వేదిక. ఈ గుర్తింపు మహిళా సాధికారత, ఇతర సమస్యల పైన పోరాడటానికి మద్దతిస్తుందని నమ్ముతాను. నా దృష్టిలో నిజమైన అందం బాహ్య రూపాన్ని అధిగమిస్తుంది. నిజమైన సౌందర్యం మనల్ని వ్యక్తపరిచే వ్యక్తిత్వం, చుట్టూ ఉన్న ప్రపంచానికి ఎలా దోహదపడతారనే బాధ్యత. అందుకే సోషల్ మెంటల్ హెల్త్‌ను నా భద్యతగా తీసుకున్నాను. డిప్రెషన్, మానసిక ఒత్తిడి వంటి సమస్యలతో పోరాడుతున్న సమాజంలో పెరిగాను. ఇలాంటి కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్న కుటుంబాలను దగ్గరగా చూశాను. నా పాఠశాలలో నా స్నేహితులు డ్రగ్స్‌కు బానిసలైన సంఘటనలు చూస్తూ పెరిగాను. ఈ సమస్యలకు మా మూలాల్లో కారణాలు ఎన్నైనా ఉండొచ్చు..., కానీ వాటిని మార్చాల్సిన బాధ్యత నా పైన ఉంది.

జింబాబ్వే వంటి మా ఆఫ్రికన్ దేశాల్లో పలు సామాజిక రుగ్మతలున్నాయి. ఇలా మాట్లాడితే అది మా మూలాలకు కళంకం కావొచ్చు. కానీ నేను దీని పైన అవగాహన కల్పించాలని నిశ్చయించుకున్నాను. ఇది మా ఒక్కరి సమస్య కాదు.. ప్రపంచ సమస్య. మిస్ జింబాబ్వేగా నిలిచిన తరువాత నా ప్రయత్నం వల్ల చాలా మార్పును చూశాను. అందుకే నేను మిస్ వరల్డ్ విజేతగా నిలిస్తే నా ప్రయత్నాన్ని విశ్వవ్యాప్తం చేస్తాను. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జింబాబ్వేలో చేపట్టిన నా ప్రాజెక్ట్‌ను ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్తాను. డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలించడానికి నాకున్న పలుకుబడితో అవగాహన కల్పిస్తాను. ఆకలి, పేదరికం, కనీస వసతులు లేని వారి గొంతుకగా మారతాను.

అంతర్జాతీయంగా ఫ్యాషన్ రంగంలో మా కళకు, డిజైనింగ్‌కు ప్రత్యేకత ఉంది. మా డిజైనర్లకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. ఒక మోడల్‌గా ఈ విషయంలో నేను గర్వపడతాను. మాది చాలా కష్టపడే వ్యక్తిత్వం. జింబాబ్వే గురించి నాకు చాలా నచ్చిన ఒక విషయం.. ఎట్టి పరిస్థితుల్లోనూ మా ప్రామాణికతను కోల్పోము. అందుకే విదేశాల్లోనూ ఆఫ్రికన్ల సంస్కృతి ఇప్పుడు ట్రెండ్‌గా మారుతోంది.

భారతదేశంలో సాంస్కృతిక వైవిధ్యం, సమ్మేళనం మనమందరమెంత విభిన్నమో దానిని అంతే అందంగా చూపిస్తుంది'' అంటూ తన మనసులోని భావాలను పంచుకున్నారు జాంగ్వే.



మిస్ జింబాబ్వే కోర్ట్ను జాంగ్వే

– హనుమాద్రి శ్రీకాంత్

• స్ఫూర్తి



• కష్టాల్లో ఉన్న వారికి అండగా... శాలిని



మాయమైపోతున్న మనిషి కోసం...

రోడ్డు ప్రమాదంలో తండ్రి... సహాయం కోసం అరుస్తూనే ఉంది శాలిని. ఇలా చూసి అలా వెళ్లిపోతున్నారు కొందరు. కొందరైతే ఫోన్‌లో వీడియోలు తీస్తున్నారు.

...తన బాధను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది శాలిని. మాయమైపోతున్న మనిషి కోసం, మానవత్వం కోసం, ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం కోసం ఆన్‌లైన్ కమ్యూనిటీని ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించింది తమిళనాడుకు చెందిన శాలిని...

కళ్లెదుటే తండ్రి మరణాన్ని చూసి తట్టుకోలేక పోయింది సాగయా ఏంజెలిన్ శాలిని. తండ్రితో కలిసి హాస్టల్‌కు వెళుతుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. సహాయం కోసం ఎంతోమందిని వేడుకుంది. సహాయం చేసే బదులు తనని ఆశ్చర్యంగా చూస్తూ ఎవరి దారిలో వారు వెళుతున్నారు.

కొందరైతే తన విషాదాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడానికి వీడియోలు తీస్తున్నారు!

'సాటి మనిషి బాధను పంచుకునే టైమ్, దయ మానవులలో ఎందుకు మాయం అవుతుంది?' అనే కోణంలో ఆలోచించింది. ఆ విషాద సంఘటన శాలినిని మానసికంగా, ఆర్థికంగా కృంగదీసింది. రెండు నెలల పాటు బయటి ప్రపంచంలోకి రాలేదు. 'జీవితంలో విషాదం ఒక భాగం అని అర్థం చేసుకునే పరిణతి నాలో ఆ సమయంలో లేదు' అని గతాన్ని గుర్తు చేసుకుంది శాలిని. తన దుఃఖాన్ని ఇతరులతో పంచుకొని మనసు తేలిక చేసుకోవడానికి ఇన్‌స్టాగ్రామ్‌లోకి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తన బాధనే కాదు ఇతరుల బాధను కూడా పంచుకుంటుంది. యాక్సిడెంట్ సంఘటన తరువాత తనకు ఎదురైన చేదు అనుభవం గురించి శాలిని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియోకు అనూహ్యమైన స్పందన వచ్చింది. ఆ స్పందనే ఒక కమ్యూనిటీ ఏర్పాటుకు దారి తీసింది.

బాధితులకు తమ వంతు సహాయపడడానికి కమ్యూనిటీ ఏర్పాటైంది. తమిళనాడు నలుమూలల నుంచి ఈ కమ్యూనిటీలో వందలాది సభ్యులు ఉన్నారు. బాధితులకు నైతికస్థైర్యం ఇవ్వడం నుంచి ఆర్థిక సహాయం అందించడం వరకు ఈ కమ్యూనిటీ పనిచేస్తోంది. చెన్నైలోని మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది శాలిని. తమ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా అనాథాశ్రమాలకు వెళ్లడం, అక్కడి పిల్లలతో గడపడం శాలిని కటుంబ సభ్యులకు సంప్రదాయంగా వస్తుంది. ఆ సంప్రదాయమే శాలినిని సామాజిక సేవ వైపు అడుగులు వేసేలా చేసింది. సివిల్ ఇంజనీరింగ్ చేసిన శాలిని పార్ట్ టైమ్ కంటెంట్ రైటర్‌గా పనిచేస్తూ వచ్చిన డబ్బులతో పిల్లలకు సహాయపడేది. తరచుగా అనాథాశ్రమాలకు వెళుతూ పిల్లల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తుంటుంది. 'నేను మీకు సహాయం చేస్తాను' అని హామీ ఇవ్వడానికి ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తుంది. 'నిలబెట్టుకోలేని హామీని ఇచ్చి వారిని బాధ పెట్టడం నాకు ఇష్టం లేదు' అంటుంది శాలిని. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం నుంచి ఎవరైన చిన్న షాప్ పెట్టుకోవడం వరకు తన వంతుగా సహాయం చేస్తుంటుంది.

'ఆర్థిక సహాయం మాత్రమే కాదు.. ప్రేమ పంచుకోవడం, ఎమోషనల్ సపోర్ట్‌తో ఎందరో జీవితాల్లో మార్పు తేవచ్చు' అంటుంది శాలిని. 'నేను ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు నాన్న చనిపోయారు. ఎప్పుడూ బాధలో ఉండేదాన్ని. ఆత్మవిశ్వాసం కోల్పోయాను. ఆ సమయంలో శాలిని అక్క నాలో ధైర్యం నింపింది. ఉత్సాహాన్ని ఇచ్చింది. నేను తిరిగి చదువుకునేలా చేసింది. ఆమె నా వెనకాల ఉంది అనే భావన ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది' అంటుంది తెన్‌కాశీకి చెందిన పద్దెనిమిది సంవత్సరాల అశ్మి. శాలినిని అభిమానించే వాళ్లలో అశ్మి లాంటి వాళ్లు ఎంతోమంది ఉన్నారు. వారి అభిమానమే తన బలం.



అలా ఎప్పుడూ చేయలేదు

ఇతరుల బాధలను సొమ్ము చేసుకోవాలని, నేను చేసిన వీడియోలు వైరల్ కావాలని ఎప్పుడూ ప్రయత్నించలేదు. నేను పోస్టు చేసిన 190 వీడియోలు నిజాయితీతో చేసినవి మాత్రమే. బాధితుల సమస్యలు నా దృష్టిలో కంటెంట్ కాదు. ఏదో విధంగా వీడియోలు చేసి సొమ్ము చేసుకోవడం తేలికైన విషయం కావచ్చు, అయితే అలాంటి వారు వేగంగా నమ్మకంగా కోల్పోవడానికి ఎంతో సమయం పట్టదు.

– శాలిని

గురి తప్పని విజయం

యువర్స్

వెంట్రుక వాసిలో పతకాలు చేజారిపోయే పిస్టల్ షూటింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరుస్తూ గుంటూరుకు చెందిన ముఖేశ్ నేలపల్లి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నాడు. జూనియర్ పిస్టల్ షూటింగ్‌లో పతకాలతో భవిష్యత్ తారగా ఎదిగాడు....

గత ఏడాది పెరూలో జరిగిన వరల్డ్ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మొత్తం 5 బంగారు, 2 కాంస్య పతకాలు సాధించి ముఖేశ్ రికార్డు సృష్టించాడు. ఈ నెల 17 నుంచి 26 వరకు జర్మనీలోని సుహుల్‌లో జరగనున్న జూనియర్ వరల్డ్ కప్ షూటింగ్ పోటీలకు సిద్ధమయ్యాడు. ప్రస్తుతం ఢిల్లీలో నిర్వహిస్తున్న జాతీయ శిక్షణ శిబిరంలో ముఖేశ్ సాధన చేస్తున్నాడు. 11 ఏళ్ల వయస్సులో స్కూల్ నిర్వహించిన వేసవి శిబిరంలో బాస్కెట్‌బాల్ సాధన కోసం ముఖేశ్ చేరాడు. కోచ్ సూచనతో అనుకోని విధంగా పిస్టల్ షూటింగ్ శిక్షణలో అన్న హితేశ్‌తో కలిసి సాధన ప్రారంభించాడు. కొద్ది రోజులకే ముఖేశ్ పతకాలు సాధించడంతో తండ్రి శ్రీనివాసరావు 2018లో స్థానికంగా అందుబాటులో ఉన్న అంతర్జాతీయ కోచ్, ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ చీఫ్ కోచ్ నగిశెట్టి సుబ్రమణ్యం దగ్గర శిక్షణలో చేర్పించారు. తన ప్రతిభకు మరింత మెరుగులు దిద్దుకునేందుకు ముఖేశ్‌పుణేకు మకాం మార్చాడు. లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గగన్ నారంగ్ పుణేలో నిర్వహిస్తున్న 'గన్ ఫర్ గ్లోరీ' షూటింగ్ అకాడమీలో చేరాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్, ర్యాపిడ్ ఫైర్ పిస్టల్, స్టాండర్డ్ పిస్టల్, 50 మీటర్ల పిస్టల్‌లో విభాగాలలో ముఖేశ్ నిలకడగా రాణిస్తున్నాడు. జాతీయ స్థాయిలో 80కుపైగా పతకాలు సాధించిన ముఖేష్ భారత రైఫిల్ షూటింగ్ శిబిరానికి ఎంపికయ్యాడు.

– మురమళ్ల శ్రీనివాసరావు, సాక్షి స్పోర్ట్స్, గుంటూరు



• యంగ్ టాలెంట్



ఒలింపిక్స్ లక్ష్యం

భారత జట్టు తరపున సీనియర్ విభాగంలో ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే నా లక్ష్యం. జర్మనీలో జరగనున్న పోటీల్లో 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో పోటీపడుతున్నాను. పతకాలతో తిరిగి వస్తానని ఆత్మవిశ్వాసంతో ఉన్నాను. **- ముఖేశ్**

• ఇంగ్లీష్ ఇడియమ్స్

కట్ ఆఫ్ వన్స్ నోస్ టు స్పైట్ వన్స్ ఫేస్

ఒక చర్య లేదా ప్రతిచర్య పరిస్థితిని మరింత దిగజార్చేలా ఉంటే, ఆవేశంతో, అజ్ఞానంతో తీసుకున్న నిర్ణయాలు తనకే నష్టం కలిగించేలా ఉంటే... ఇలాంటి సందర్భాల్లో వాడే మాట... కట్ ఆఫ్ వన్స్ నోస్ టు స్పైట్ వన్స్ ఫేస్.

ఉదా: డోన్ట్ లెట్ యువర్ యాంగర్ మేక్ యూ కట్ ఆఫ్ యువర్ నోస్ టు స్పైట్ యువర్ ఫేస్

బిహైండ్ ది ఎయిట్ బాల్

పరిస్థితి అనుకూలంగా లేదు, కష్టంగా ఉంది, పనిలో వెనకబడిపోవడం, సక్సెస్ కావడం కష్టం....ఇలాంటి సందర్భాల్లో వాడే మాట.. బిహైండ్ ది ఎయిట్ బాల్.

ఉదా: ఆఫ్టర్ మిస్సింగ్ ది డెడ్‌లైన్, షీ ఫౌండ్ హర్‌సెల్ఫ్ బిహైండ్ ది ఎయిట్ బాల్ ఎట్ వర్క్




వన్‌ప్లస్ ప్యాడ్ 2 ప్రో

• టెక్.. టాక్

సైజ్	: 13.2 అంగుళాలు
రిఫ్రెష్ రేట్	: 144 హెచ్‌జడ్
బ్యాటరీ	: 12,140 ఎంఏహెచ్
వోఎస్	: ఆండ్రాయిడ్ 15
ఫ్రంట్ కెమెరా	: 8–మెగాపిక్సెల్
రిజల్యూషన్	: 2400×3392 పిక్సెల్స్
ర్యామ్	: 12జీబి స్టోరేజ్: 256 జీబి

త్వరలో... వీడియో వోవర్ వ్యూస్

బెస్ట్ ఏఐ పవర్డ్ యాప్‌లలో గూగుల్ వారి 'నోట్‌బుక్‌ఎల్‌ఎం' ఒకటి. గత సంవత్సరం 'ఆడియో వోవర్‌వ్యూస్' అనే కొత్త ఫీచర్ గురించి గూగుల్ పరిచయం చేసింది. యూజర్‌లు తమ నోట్స్‌ను ఏఐ హోస్ట్‌లతో పాడ్‌కాస్ట్‌గా మార్చడానికి ఈ ఫీచర్ ఉపకరిస్తుంది. తాజాగా గూగుల్ 'వీడియో వోవర్‌వ్యూస్' అనే కొత్త ఫీచర్‌పై పనిచేస్తోంది. రాబోయే ఫీచర్ కంపెనీ ఏఐ జనరేటెడ్ ఆడియో పాడ్ కాస్ట్‌లను రిప్లేస్ చేస్తుందా? విజువల్ ఎఫెక్ట్స్ ద్వారా మెరుగు పరుస్తుందా? అనేది వేచి చూడాలి. 'ఎడిటర్స్ పిక్స్' అనే విభాగం ద్వారా 'నోట్‌బుక్‌ఎల్‌ఎం స్టూడియో సెక్షన్'ను కొద్దిగా రీడిజైన్ చేశారు. యూజ్‌ఫుల్ ఇన్‌ఫర్‌మేషన్‌ను హైలెట్ చేయడానికి ఇది ఉపకరిస్తుంది.





కలర్‌ఫుల్‌గా!

పాత ఆల్బమ్‌లోని బ్లాక్ అండ్ వైట్ ఫోటోలను చూసినప్పుడు 'కలర్‌లో ఉంటే బాగుండేది' అనిపిస్తుంది. చాట్‌జీపీటీ సహాయంతో అలాంటి ఫోటోలను సహజత్వం ఉట్టిపడేలా కలర్‌లో మార్చవచ్చు. ఒరిజినల్ లైటింగ్ కాంట్రాస్ట్, టెక్చర్ మిస్ కాకుండా చాట్‌జీపీటీకి సూచనలు ఇవ్వవచ్చు. స్టెప్ 1: ● చాట్‌విండోలోని ఇమేజ్ ఐకాన్‌పై క్లిక్ చేయాలి. బ్లాక్ అండ్ వైట్ ఫోటోను అప్‌లోడ్ చేయాలి. చాట్‌జీపీటీ ఇమేజ్ టూల్స్‌తో బ్లాక్ అండ్ వైట్ ఫోటోలను రీస్టోర్, కలరైజ్ చేయవచ్చు. స్టెప్ 2: ● ఇమేజ్ అప్లోడ్ చేసిన తరువాత పర్సన్‌కు సంబంధించి వివరంగా ప్రాంప్ట్ ఇవ్వాలి. ప్రాంప్ట్‌లో షేడ్, క్లాతింగ్, బ్యాక్‌గ్రౌండ్, టైమ్ పీరియెడ్....మొదలైన వివరాలు ఇవ్వాలి. ప్రాంప్ట్ తరువాత కొన్ని సెకన్‌లకు ఔట్‌పుట్ వస్తుంది. ఇమేజ్ పూర్తిగా డెవలప్ అయిన తరువాత డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

కిండెల్ పేపర్ వైట్ (12 జెన్)



రూ.16,999 ధరతో కొత్త కిండెల్ అమెజాన్‌లో అందుబాటులో ఉంది. సంవత్సరం విరామం తరువాత ఈ కొత్త ఇ–రీడర్ అప్‌డేట్‌లతో వచ్చింది. డైమెన్షన్స్: 127.5×176.7×7.8 ఎంఎం ● వాటర్ ప్రూఫింగ్ ● డిస్ట్రక్షన్ ఫ్రీ రీడింగ్ ● 7–అంగుళాల గ్లేర్–ఫ్రీ ఇ–లింక్ డిస్‌ప్లే బరువు: 211 గ్రా. స్క్రీన్ రిజల్యూషన్: 1264×1680 పిక్సెల్స్

సాక్షి సినిమా



• హాలీ బెర్రీ



• టామ్ క్రూజ్

మూడేళ్ల తర్వాత కాన్స్‌లో టామ్ క్రూజ్

• 'మిషన్ ఇంపాజిబుల్: ది ఫైనల్ రెకనింగ్'కి స్టాండింగ్ ఒవేషన్
• ఫ్రెంచ్ నటుడు థియో నవర్రోపై నిషేధం

ఫ్రాన్స్‌లో 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జోరుగా సాగుతోంది. రెడ్ కార్పెట్‌పై అందాల తారలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఈ నెల 13న ప్రారంభమైన ఈ చిత్రోత్సవాలు ఈ నెల 24 వరకు జరగనున్న సంగతి తెలిసిందే. కాగా ఈ చిత్రోత్సవాల రెండో రోజున హాలీవుడ్ యాక్షన్ హీరో టామ్ క్రూజ్ సందడి హైలైట్‌గా నిలిచింది. 'టాప్ గన్: మేవరిక్' సినిమా ప్రీమియర్ కోసం 2022లో జరిగిన 75వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు టామ్ క్రూజ్. మళ్లీ మూడేళ్ల తర్వాత 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'మిషన్ ఇంపాజిబుల్: ది ఫైనల్ రెకనింగ్' ప్రీమియర్ సందర్భంగా టామ్ క్రూజ్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సినిమా దర్శకుడు క్రిస్టోఫర్ మెక్‌క్వారీ, ఇతర నటీనటులు సందడి చేశారు. 'మిషన్ ఇంపాజిబుల్: ది ఫైనల్ రెకనింగ్' ప్రీమియర్‌కు వీక్షకుల నుంచి ఐదు నిమిషాల స్టాండింగ్ ఒవేషన్ దక్కింది. "ముప్పై సంవత్సరాలుగా 'మిషన్ ఇంపాజిబుల్' ఫ్రాంచైజీతో మిమ్మల్ని (ప్రేక్షకులను ఉద్దేశించి) ఎంటర్‌టైనర్ చేస్తున్నందుకు హ్యాపీగా ఉంది. కాన్స్‌లాంటి ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో పాల్గొంటానని, నా లైఫ్‌లో ఇలాంటి సెలబ్రేషన్స్ ఉంటాయని నా చిన్నతనంలో నేను ఊహించలేదు. సుదీర్ఘ కాలంగా ఇండస్ట్రీలో ఉన్న నేను ఈ సినిమాకు ఓ నిర్మాతగా ఉండటం సంతోషాన్నిచ్చింది" అని టామ్ క్రూజ్ చెప్పారు. ఇక 'మిషన్ ఇంపాజిబుల్: ది ఫైనల్ రెకనింగ్' ఇండియాలో ఈ నెల 17న తెలుగు, తమిళ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో విడుదల కానుంది. విదేశాల్లో మే 23న విడుదలవుతుంది.

ఫ్రెంచ్ యాక్టర్‌పై నిషేధం... ఫ్రెంచ్ క్రైమ్ డ్రామా ఫిల్మ్ 'డోస్సిసిర్ 137'ను కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. ఈ చిత్రదర్శకుడు డొమినిక్ మోల్, ప్రధాన తారాగణం లియో డ్రక్కర్, జోనాథన్ టర్న్‌బుల్ తదితరులు రెడ్ కార్పెట్‌పై నడిచారు. అయితే సపోర్టింగ్ రోల్ చేసిన థియో నవర్రో ముస్సీ కనిపించలేదు. లైంగిక వేధింపుల కారణంగా థియో నవర్రోపై కాన్స్ నిర్వాహకులు నిషేధం విధించారని వార్తలు ఉన్నాయి.



• నవర్రో ముస్సీ



• ఇవా లాంగోరియా

ఆంధ్ర కింగ్ తాలూకా

రామ్ పోతినేని హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రానికి 'ఆంధ్ర కింగ్ తాలూకా' అనే టైటిల్‌ని ఖరారు చేశారు మేకర్స్. పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. కన్నడ హీరో ఉపేంద్ర ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్నారు. కాగా గురువారం (మే 15) రామ్ పోతినేని పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రానికి 'ఆంధ్ర కింగ్ తాలూకా' అనే టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రిలీజ్ చేశారు. "ఈ సినిమాని మహేశ్‌బాబు తనదైన స్పెషల్ హ్యూమర్‌తో పాటు హృదయాన్ని హత్తుకునే కథనంతో రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో సూపర్ స్టార్‌గా నటించిన ఉపేంద్రకి వీరాభిమానిగా రామ్ కనిపిస్తారు. మా సినిమా ప్రతి స్టార్ అభిమానికి తప్పకుండా మంచి అనుభూతిని అందిస్తుంది" అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సీఈఓ: చెర్రీ, సంగీతం: వివేక్–మెర్విన్, కెమేరా: సిద్ధార్థ నుని.



• రామ్

పోటాపోటీగా దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్

• రాజ్‌కుమార్ హీరాణీ దర్శకత్వంలో ఆమిర్ ఖాన్
• రాజమౌళి సమర్పణలో 'మేడ్ ఇన్ ఇండియా'

భారతీయ సినీ పితామహుడు దాదా సాహెబ్ ఫాల్కే (అసలు పేరు ధుండీరాజ్ గోవింద్ ఫాల్కే) బయోపిక్ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. దాదా సాహెబ్ ఫాల్కే బయోపిక్ చేసేందుకు ఇటు రాజమౌళి అటు ఆమిర్ ఖాన్ ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. దీంతో ముందుగా ఎవరు ఈ సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్తారనే చర్చ ఇండస్ట్రీలో జోరుగా సాగుతోంది.

త్రీ ఇడియట్స్ కాంబినేషన్... భారతీయ తొలి ఫీచర్ ఫిల్మ్ దర్శక–నిర్మాతగా 'రాజా హరిశ్చంద్ర'తో చరిత్రలో నిలిచిన దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్‌లో టైటిల్ రోల్‌ని ఆమిర్ ఖాన్ పోషించనున్నారు. ఈ చిత్రానికి రాజ్‌కుమార్ హీరాణీ దర్శకత్వం వహించనున్నారు. 'త్రీ ఇడియట్స్' (2009), 'పీకే' (2014) వంటి బ్లాక్‌బస్టర్ సినిమాల తర్వాత హీరో ఆమిర్ ఖాన్, దర్శకుడు రాజ్‌కుమార్ హీరాణీ 'దాదాసాహెబ్ ఫాల్కే' బయోపిక్ సినిమా కోసం వర్క్ చేయనుండటం విశేషం. రాజ్‌కుమార్ హీరాణీ, అభిజిత్ జోషీ, హిందూకుష్ భరద్వాజ్, ఆవిష్కర్ భరద్వాజ్‌లు ఈ బయోపిక్‌కు నాలుగేళ్లుగా స్క్రిప్ట్ రాసే పనిలో ఉన్నారని సమాచారం. ఈ బయోపిక్ చిత్రీకరణ అక్టోబరులో ఆరంభం అవుతుందట. ఇక ఈ చిత్రానికి దాదాసాహెబ్ మనవడు చంద్రశేఖర్ శ్రీకృష్ణ పుసాల్కర్ తన వంతు సహకారం అందించనున్నారని బాలీవుడ్ టాక్.

మేడ్ ఇన్ ఇండియా... ఫాదర్ ఆఫ్ ఇండియన్ సినిమా బయోపిక్ 'మేడ్ ఇన్ ఇండియా'కు సమర్పకుడిగా వ్యవహరించనున్నట్లుగా 2023 సెప్టెంబరులో దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. వరుణ్ గుప్తా, ఎస్ఎస్ కార్తికేయ ఈ సినిమాను నిర్మించనున్నట్లు, నితిన్ కక్కడ్ (హిందీ చిత్రం 'నోట్‌బుక్' ఫేమ్) ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహించనున్నట్లుగా ఆ వీడియోలో ఉంది. ఆ తర్వాత ఈ సినిమా గురించిన అప్‌డేట్ ఏదీ బయటకు రాలేదు. అయితే ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ దాదాపు పూర్తయిందని, ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ తుది దశకు చేరుకున్నాయని సమాచారం. ఈ దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్‌కు మేకర్స్ ఎన్టీఆర్‌ను సంప్రదించగా, ఈ హీరో ప్రాథమికంగా అంగీకారం తెలిపారనే వార్తలు తాజాగా పెద్ద ఎత్తున తెర పైకి వచ్చాయి. ఈ వార్తలు వచ్చిన 24 గంటల్లోపే దాదా సాహెబ్ ఫాల్కే బయోపిక్‌ను ఆమిర్ ఖాన్ చేస్తున్నట్లుగా గురువారం అధికారిక ప్రకటన వచ్చింది.



• ఆమిర్ ఖాన్



• ఎన్టీఆర్

ప్రేమకథకి శ్రీకారం

'బేబీ' (2023) చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య కాంబినేషన్‌లో మరో సినిమాకి శ్రీకారం జరిగింది. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. గురువారం హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నటుడు శివాజీ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరోయిన్ రష్మికా మందన్నా క్లాప్ కొట్టారు. దర్శకులు వెంకీ అట్లూరి, కల్యాణ్ శంకర్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. "చక్కని ప్రేమకథా చిత్రమిది. జూన్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవుతుంది" అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు.



• ఆనంద్ దేవరకొండ, రష్మిక, వైష్ణవీ చైతన్య

ధర్మం దారి తప్పినప్పుడు...



• కృష్ణ, శైలేష్, తమన్, అశ్విన్‌బాబు, రియా సుమన్, గణపతి రెడ్డి

'ధర్మం దారి తప్పినప్పుడు... ఏ అవతారం రానప్పుడు... వచ్చినవాడు గౌతమ్' అంటూ హీరో మనోజ్ మంచు పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్‌తో 'వచ్చినవాడు గౌతమ్' సినిమా టీజర్ మొదలైంది. అశ్విన్‌బాబు హీరోగా, రియా సుమన్, అయేషా ఖాన్ హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. మామిడాల ఎంఆర్. కృష్ణ దర్శకత్వంలో అరుణశ్రీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై టి. గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ తమన్, డైరెక్టర్ శైలేష్ కొలను ఈ సినిమా టీజర్‌ని విడుదల చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. అశ్విన్‌బాబు మాట్లాడుతూ– "డైరెక్టర్ కృష్ణ చెప్పిన ఈ చిత్రకథ బాగా నచ్చింది. చాలా కొత్త పాయింట్ ఇది" అన్నారు. "ఈ సినిమా టీజర్ ఇంత అద్భుతంగా రావడానికి కారణం అశ్విన్‌బాబు. నన్ను నమ్మి ప్రయాణం చేశారు" అన్నారు ఎంఆర్. కృష్ణ. "ఈ సినిమాని ఎక్కడా రాజీపడకుండా నిర్మించాం. అందరి సపోర్ట్ కావాలి" అని గణపతి రెడ్డి చెప్పారు. ఇదిలా ఉంటే... ఇటీవల పాక్ సైనికుల కాల్పుల్లో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి గణపతి రెడ్డి ఆర్థిక సాయం అందించారు. ఈ వేడుకలో రియా సుమన్, మ్యూజిక్ డైరెక్టర్ హరి గౌర, నిర్మాతలు కేఎస్ రామారావు, కేఎల్ దామోదర ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

జూలైలో జూనియర్



• కిరీటి రెడ్డి

ప్రముఖ పారిశ్రామికవేత్త, కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీలీల కథానాయిక. జెనీలియా కీలక పాత్రలో నటించగా, కన్నడ స్టార్ డా. రవిచంద్ర ప్రధాన పాత్ర పోషించారు. వారాహి చలన చిత్రం పతాకంపై రజనీ కొర్రపాటి నిర్మించిన ఈ పాన్ ఇండియన్ ఫిల్మ్‌ని జూలై 18న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ని విడుదల చేశారు. "వినోదం, భావోద్వేగాలతో చక్కని కుటుంబ కథా చిత్రంగా 'జూనియర్' రూపొందింది. కుటుంబంతో కలిసి సరదాగా చూడొచ్చు" అని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమేరా: కేకే సెంథిల్ కుమార్.

జీవనజ్యోతి @ 50 ఇయర్స్



గోల్డెన్ మెమొరీస్

సరిగ్గా యాభై ఏళ్ళ క్రితం... మండు వేసవి. దాదాపు 113 డిగ్రీల ఫారెన్‌హీట్ ఉష్ణోగ్రతతో బెజవాడ అక్షరాలా 'బ్లేజ్‌వాడ'గా ఠారెత్తిస్తోంది. వడగాడ్పులు, ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంది. ఆ పరిస్థితుల్లో వాణిశ్రీ ప్రధానపాత్రలో, శోభన్‌బాబు హీరోగా, బేబీ వరలక్ష్మి చిన్నారి బాబు పాత్రలో కె. విశ్వనాథ్ దర్శకత్వంలో, డి.వి.ఎస్. రాజు నిర్మించిన 'జీవనజ్యోతి' చిత్రం రిలీజైంది. ఫస్టాఫ్‌లో అల్లరిపిల్లగా కనిపించి, సెకండాఫ్‌లో పోగొట్టుకున్న తన బాబు కోసం ఆరాటపడే మతి భ్రమించిన మాతృమూర్తిగా కన్నీళ్ళు పెట్టించే లక్ష్మి పాత్ర పోషణలోని రెండు విభిన్న ఛాయలను వాణిశ్రీ అద్భుతంగా అభినయించారు. ఆ సెంటిమెంటల్ కుటుంబ కథ ఆ మండుటెండల్లోనే బాక్సాఫీస్ మలయమారుతమైంది. సిల్వర్‌జూబ్లీ సూపర్‌హిట్‌గానే కాక, ఆ ఏడాది అత్యధిక వసూళ్ళు సాధించిన అరుదైన చిత్రంగా చరిత్రకెక్కింది. 'ముద్దుల మా బాబు నిద్దరోతున్నాడు...', 'సిన్ని ఓ సిన్నీ...', 'ఎందుకంటే ఏమి చెప్పను...' అలాంటి సూపర్‌హిట్ పాటలున్న మ్యూజికల్ హిట్ చిత్రానికి నేటితో 50 ఏళ్ళు. ఈ సందర్భంగా రెంటాల జయదేవ ప్రత్యేక కథనం... 'బాక్సాఫీస్ సెంటిమెంట్ బంగారం... జీవనజ్యోతి'... ఇవాళ్టి 'సాక్షి... సినిమా ప్లస్' ఇ–పేపర్‌లో!

స్టాక్ మార్కెట్లు
(తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	1,200	82,531
నిఫ్టీ ▲	395	25,062

విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,165	▲	18
డోజోన్స్	42,227	▲	176
ఎఫ్‌టీఎస్ఈ 100	8,634	▲	49
డాక్స్	23,696	▲	169
షాంఘై	3,381	▼	23
నికాయ్	37,752	▼	373

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	112.30	115.19
€	యూరో	ఎస్‌బీఐ	94.53	97.22
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.06	56.30
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.30	68.27
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.75	23.29
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.25	24.00
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.85	12.76

పర్యావరణహితంగా సిమెంట్ పరిశ్రమ..

సీఐఐ గ్రీన్ సిమెంటెక్ ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఉద్గారాలను తగ్గిస్తూ, పర్యావరణహితంగా కార్యకలాపాల నిర్వహణను మెరుగుపర్చుకునే దిశగా సిమెంటు పరిశ్రమ కృషి చేస్తోందని అంబుజా సిమెంట్స్ ఎండీ, గ్రీన్ సిమెంటెక్ 2025 చైర్మన్ అజయ్ కపూర్ తెలిపారు. ఇందుకోసం ప్రత్యామ్నాయ ఇంధనాలు, పునరుత్పాదక విద్యుత్, సాంకేతికత మొదలైన వాటిని వినియోగించుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు వివరించారు. బొగ్గు స్థానంలో ఘన వ్యర్థాలు, ప్లాస్టిక్‌లాంటి ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం ప్రస్తుతం సగటున సుమారు ఆరు–ఏడు శాతం స్థాయిలో ఉన్నట్లు చెప్పారు. సిమెంట్



తయారీ సంస్థల అసోసియేషన్‌తో (సీఎంఏ) కలిసి పరిశ్రమల సమాఖ్య సీఐఐ నిర్వహిస్తున్న సీఐఐ గ్రీన్ సిమెంటెక్ 21వ ఎడిషన్ ప్రారంభం సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు వినూత్న వ్యూహాలు, కార్యక్రమాలపై ప్రధానంగా ఫోకస్‌తో ఇది రెండు రోజుల పాటు సాగుతుంది. గత కొన్నేళ్లుగా కర్బన ఉద్గారాలు గణనీయంగా తగ్గినట్లు సాగర్ సిమెంట్స్ జాయింట్ ఎండీ ఎస్. శ్రీకాంత రెడ్డి తెలిపారు. తటస్థ ఉద్గారాల స్థాయికి ప్రభుత్వం నిర్దేశించిన గడువుకు పదేళ్ల ముందుగానే లక్ష్యాన్ని సాధించేందుకు సంస్థలు ప్రయత్నిస్తున్నాయని వివరించారు. సర్టిఫై చేసిన హరిత ఉత్పత్తులు, ప్రోత్సాహకాల కారణంగా పర్యావరణహిత భవంతుల నిర్మాణం పుంజుకుంటోందని ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ జాతీయ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

16-5-2025

విశాఖ	520–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	525–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70



ఏటీఎంలకు డిజిటల్ గ్రహణం!

దేశంలో డిజిటల్ లావాదేవీల విప్లవం ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్ (ఏటీఎం)లకు గండి కొడుతోంది. ఒకపక్క బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు చెలామణీ అంతకంతకూ ఎగబాకుతూ ఆల్‌టైమ్ గరిష్టాల్లో కొనసాగుతోంది. మరోపక్క ఏటీఎంలు మాత్రం తగ్గుముఖం పడుతున్నాయి. బ్యాంకులు కొత్తగా తెరుస్తున్న ఏటీఎంల కంటే మూసేస్తున్నవే ఎక్కువ కావడం విశేషం! - సాక్షి, బిజినెస్ డెస్క్

ఖర్చుల్లో కోతకు ఏటీఎంలను మూసేస్తున్న బ్యాంకులు

డిజిటల్ లావాదేవీల జోరు ఎఫెక్ట్... ● ఏడాదిలో 5,500 ఏటీఎంలకు తాళం

కొత్తిమీర కట్ట నుంచి బైకులో పెట్రోలు దాకా దేనికైనా డిజిటల్ చెల్లింపులే నడుస్తున్నాయిప్పుడు! మన దైనందిన ఆర్థిక లావాదేవీల్లో యూపీఐ పేమెంట్స్ అంతలా పెనవేసుకుపోయాయి మరి. దీంతో ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రాలు కూడా తగ్గుతున్నాయి. ఇదిలా ఉంటే, ఒకప్పుడు మెయిన్ రోడ్లపైనే కాకుండా సందుల్లో కూడా ఎడాపెడా ఏటీఎంలను తెరిచిన బ్యాంకులు.. ఇప్పుడు చడీచప్పుడు లేకుండా వాటికి తాళాలేస్తున్నాయి. ఆర్‌బీఐ నిబంధనల మేరకు ఏటీఎం ఉచిత లావాదేవీలపై పరిమితులు విధించడం, ఏటీఎం ఇంటర్–ఆపరబిలిటీ, వేరే బ్యాంకుల కస్టమర్లు ఏటీఎంలను ఉపయోగించుకునేటప్పుడు విధించే ఇంటర్‌చేంజ్ ఫీజు పెరుగుదల పెద్దగా లేకపోవడంతో బ్యాంకులు ఏటీఎంల నిర్వహణ బిజినెస్ పట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కొత్త ఏటీఎంల ఏర్పాటుకు ముఖం చాటేస్తున్నాయి. బ్యాంకింగ్ రంగంలో దేశవ్యాప్తంగా 2023 డిసెంబర్ నాటికి 2,19,882 ఏటీఎంలు ఉండగా, 2024 డిసెంబర్ నాటికి వీటి సంఖ్య 2,14,398కి తగ్గిపోయింది. అంటే దాదాపు ఏడాది వ్యవధిలో 5,484 ఏటీఎంలను ఎత్తేశాయన్నమాట! ముఖ్యంగా ఆఫ్‌సైట్ (బ్యాంకు బ్రాంచ్‌లలో కాకుండా ఇతర లొకేషన్లలో ఉన్నవి) ఏటీఎంల విషయంలో ఈ కోత భారీగా ఉంది. 2022 సెప్టెంబర్లో గరిష్ఠంగా 97,072 ఆఫ్‌సైట్ ఏటీఎంలు ఉండగా.. 2024 డిసెంబర్ నాటికి ఇవి 85,913కి తగ్గిపోవడం గమనార్హం.

డిజిటల్ రయ్...

బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు చెలామణీ ప్రస్తుతం ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలో రూ.34.7 లక్షల కోట్లకు పైగానే ఉంది. పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) నుంచి చూస్తే రెట్టింపైంది. మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఇది 12 శాతం కింద లెక్క. ఇంతలా నగదు వ్యవస్థలో ఉన్నప్పటికీ, ఏటీఎంల సంఖ్య పెరక్కపోగా.. అంతకంతకూ తగ్గుతుండటం విశేషం. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం ప్రస్తుతం దేశంలో ప్రతి లక్ష మంది జనాభాకు 15 ఏటీఎంలు మాత్రమే ఉన్నాయి. కాగా, 2024 పూర్తి ఏడాదికి చూస్తే, 17,200 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయి. 2023తో పోలిస్తే (11,760 కోట్లు) 46 శాతం దూసుకెళ్లాయి. మరోపక్క, ఆర్‌బీఐ అనుమతితో ఈ నెల 1 నుంచి ఏటీఎం చార్జీలను బ్యాంకులు పెంచేశాయి. దీంతో ఉచిత లావాదేవీల పరిమితి దాటితే, ప్రతి లావాదేవీకి ఇప్పుడున్న రూ.21 చార్జీ రూ.23కు పెరిగింది. నెలకు సొంత బ్యాంకుల ఏటీఎంలలో 5, ఇతర బ్యాంకుల ఏటీఎంల విషయానికొస్తే మెట్రోల్లో అయితే 3, నాన్ మెట్రోల్లో 5 లావాదేవీలు ఉచితం. క్యాష్ విత్‌డ్రాతో పాటు బ్యాలెన్స్ ఎంక్వయిరీ వంటివన్నీ లావాదేవీగానే పరిగణిస్తున్నారు.

ఎనీటైమ్ సమస్యలు...!


కొన్ని బ్యాంకులు బ్రాంచ్‌ల వద్ద ఏటీఎంలను బాగానే నిర్వహిస్తున్నప్పటికీ, ఆఫ్‌సైట్ ఏటీఎంల విషయంలో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎప్పుడు చూసినా సాంకేతిక సమస్యలు, లేదంటే క్యాష్ లేకపోవడం వంటివి కస్టమర్లకు నిత్యకృత్యంగా మారుతున్నాయి. దీంతో అత్యవసరంగా క్యాష్ విత్‌డ్రా చేసుకోవాలంటే రెండు మూడు ఏటీఎంలకు తిరగాల్సి వస్తోందనేది అధిక శాతం మంది ఖాతాదారుల ఫిర్యాదు. 'దేశంలో ప్రస్తుత ఏటీఎంల ట్రెండ్‌ను పరిశీలిస్తే, బ్యాంకింగ్ రంగంలో టెక్నాలజీ, ముఖ్యంగా డిజిటల్ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరోపక్క, బ్యాంకింగ్ సేవలు తక్కువగా ఉన్న మారుమూల ప్రాంతాలపై బ్యాంకులు దృష్టి పెట్టడం కూడా మొత్తంమీద ఏటీఎంలు తగ్గుముఖం పట్టడానికి కారణం' అని ఆన్‌లైన్ పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ ఏజీఎస్ ట్రాన్సాక్ట్ టెక్నాలజీస్ చైర్మన్ రవి బి. గోయల్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాల నేపథ్యంలో నెట్‌వర్క్ స్థిరీకరణ జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

34.7 లక్షల కోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలో చెలామణీలో ఉన్న నగదు (జీడీపీలో ఇది 12 శాతం).

2,14,398 2024 డిసెంబర్ నాటికి దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల మొత్తం ఏటీఎంల సంఖ్య (స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు సహా). ఇందులో 1,28,485 ఆన్‌సైట్, 85,913 ఆఫ్‌సైట్ ఏటీఎంలు ఉన్నాయి.

36,000 దేశంలో వైట్ లేబుల్ ఏటీఎంల సంఖ్య దాదాపుగా. ప్రస్తుతం ఈపీఎస్, ఇండియా1 పేమెంట్స్, హిటాచి పేమెంట్ సర్వీసెస్, టాటా కమ్యూనికేషన్స్ పేమెంట్ సొల్యూషన్స్, వక్రంగీ.. ఈ ఐదు ప్రైవేటు కంపెనీలు వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లుగా ఉన్నాయి.

17,200 కోట్లు 2024లో యూపీఐ లావాదేవీల సంఖ్య (రోజువారీగా సగటు విలువ రూ. 74,990 కోట్లు)



2025లో తొలిసారి 25000 పైకి నిఫ్టీ

- సెన్సెక్స్ 1200 పాయింట్లు ప్లస్
- ట్రంప్ 'జీరో టారిఫ్' వ్యాఖ్యలతో కొనుగోళ్ల వెల్లువ
- దిగివచ్చిన ద్రవ్యోల్బణం, బలపడిన రేట్ల తగ్గింపు ఆశలు



ముంబై: పరస్పర సుంకాలు లేని వాణిజ్యాన్ని భారత్ ప్రతిపాదించిందనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలతో దలాల్ స్ట్రీట్ గురువారం ఒకటిన్నర శాతం ర్యాలీ చేసింది. భారత్‌తో పాటు యూఎస్ ద్రవ్యోల్బణ దిగిరావడమూ కలిసొచ్చింది. సెన్సెక్స్ 1,200 పాయింట్లు పెరిగి 82,531 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 395 పాయింట్లు బలపడి 2025లో తొలిసారి 25వేల స్థాయిపైన 25,062 వద్ద నిలిచింది. ముగింపు స్థాయి ఇరు సూచీలకు ఏడు నెలల గరిష్ఠం కావడం విశేషం. ఒక దశలో సెన్సెక్స్ 1,387 పాయింట్లు ఎగసి 82,718 వద్ద, నిఫ్టీ 449 పాయింట్లు దూసుకెళ్లి 25,116 ట్రేడయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- దిగుమతిదారుల నుంచి అమెరికా డాలర్‌కు డిమాండ్ పెరగడంతో భారత కరెన్సీ రూపాయి ఒత్తిడికి లోనైంది. డాలర్ మారకంలో 22 పైసలు బలహీనపడి 85.54 స్థాయి వద్ద స్థిరపడింది.
- స్టాక్ మార్కెట్ వరుస లాభాలతో బుధ, గురువారాల్లో రూ.9 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ రూ.440 లక్షల కోట్లకు చేరింది.

లాభాలు ఎందుకంటే

- ఖతార్‌లో పర్యటిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం మధ్యాహ్నం... ''భారత్ ఒక వాణిజ్య ఒప్పందాన్ని ప్రతిపాదించింది. దీని ప్రకారం అనేక అమెరికా ఉత్పత్తులపై ప్రాథమికంగా సున్నా టారిఫ్‌లు ఉంటాయి'' అన్నారు. ట్రంప్ ప్రకటనతో మార్కెట్లో సెంటిమెంట్ ఒక్కసారిగా మారిపోయింది. మిడ్‌సెషన్ వరకు ఫ్లాట్‌గానే కదలాడిన సూచీలు భారీ లాభాలు నమోదు చేశాయి.
- ఇరాన్‌తో అమెరికా అణు ఒప్పందం కుదిరే అవకాశం నేపథ్యంలో సరఫరా పెరుగుతుందనే అంచనాలతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గాయి. భారత్‌కు దిగుమతయ్యే బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 3.50% తగ్గి 63.79 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.
- రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్టానికి చేరుకోవడంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీ రేట్లు తగ్గించే అవకాశాలు మరింత బలపడ్డాయి.
- వరుస మూడు నెలల అమ్మకాల అనంతరం విదేశీ ఇన్వెస్టర్లు ఏప్రిల్ 15 నుంచి భారతీయ ఈక్విటీలలో దాదాపు రూ.50 వేల కోట్లు పెట్టుబడి పెట్టారు. గత 20 సెషన్లలో 19 సార్లు నికర కొనుగోలుదారులుగా నిలిచారు. ఎఫ్ఐఐల వరుస కొనుగోళ్లు మన సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
భారత్‌లో ఇంధన డిమాండ్ జోరు..
ఏప్రిల్‌లో ఎగుమతులు అప్



రన్నరప్ నిహాల్ సరీన్

అల్ అయిన్ (యూఏఈ): ఆసియా వ్యక్తిగత చెస్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఒక్క పతకం లభించింది. పురుషుల విభాగంలో కేరళకు చెందిన 20 ఏళ్ల నిహాల్ సరీన్ రన్నరప్‌గా నిలిచి రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. గురువారం ముగిసిన ఈ టోర్నీలో నిహాల్, బర్దియా దానిశ్వర్ (ఇరాన్) ఏడు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... బర్దియాకు స్వర్ణ పతకం, నిహాల్‌కు రజతం ఖరారయ్యాయి. 150 మంది ప్లేయర్ల మధ్య స్విస్ ఫార్మాట్‌లో తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహించారు. నిహాల్ ఆరు గేముల్లో గెలిచి, రెండు గేమ్‌లను డ్రా చేసుకొని, ఒక గేమ్‌లో ఓడిపోయాడు. ఇదే టోర్నీ మహిళల విభాగంలో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత ప్లేయర్ వంతిక అగర్వాల్ ఏడు పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. భారత్‌కే చెందిన శ్రీజా శేషాద్రి 6.5 పాయింట్లతో ఐదో స్థానాన్ని దక్కించుకుంది.

భారత చెస్ 86వ గ్రాండ్‌మాస్టర్‌గా శ్రీహరి



చెన్నై: ఏడాది విరామం తర్వాత భారత చెస్‌లో మరో ప్లేయర్ గ్రాండ్‌మాస్టర్ (జీఎం)గా అవతరించాడు. తమిళనాడుకు చెందిన 19 ఏళ్ల ఎల్ ఆర్ శ్రీహరి భారత్ నుంచి 86వ గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపు పొందాడు. యూఏఈలో గురువారం ముగిసిన ఆసియా వ్యక్తిగత చాంపియన్‌షిప్ సందర్భంగా శ్రీహరి జీఎం హోదా ఖరారు కావడానికి అవసరమైన మూడో జీఎం నార్మ్‌ను సాధించాడు. ఎనిమిదో రౌండ్‌లో భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ప్రాణేశ్‌తో జరిగిన గేమ్‌ను 'డ్రా' చేసుకోవడం ద్వారా శ్రీహరికి మూడో జీఎం నార్మ్ ఖాయమైంది. గ్రాండ్‌మాస్టర్ (జీఎం) టైటిల్ లభించాలంటే 2500 ఎలో రేటింగ్ పాయింట్ల మైలురాయిని ఒక్కసారైనా దాటడంతోపాటు మూడు జీఎం నార్మ్‌లు సాధించాలి. శ్రీహరి 2023 ఖతర్ మాస్టర్స్ టోర్నీలో తొలి జీఎం నార్మ్, 2024 చెన్నై జీఎం ఓపెన్ టోర్నీలో రెండో జీఎం నార్మ్ అందుకోవడంతోపాటు గత ఏడాది ఆగస్టులో 2500 ఎలో రేటింగ్ పాయింట్లను అధిగమించాడు. తాజాగా ఆసియా చాంపియన్‌షిప్‌లో కనబరిచిన ప్రదర్శనతో శ్రీహరికి మూడో జీఎం నార్మ్ లభించడంతో అతనికి జీఎం హోదా దక్కింది. గత ఏడాది మే 12వ తేదీన శ్యామ్ నిఖిల్ భారత 85వ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచాడు.



డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా (ఫైల్)

డబ్ల్యూటీసీ విజేత జట్టుకు రూ. 30 కోట్ల 78 లక్షలు

మూడో స్థానంలో నిలిచిన భారత్‌కు రూ. 12 కోట్ల 31 లక్షలు

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ -2025) ప్రైజ్‌మనీని భారీగా పెంచింది. ఇప్పటికే డబ్ల్యూటీసీ టైటిల్ పోరుకు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా అర్హత సాధించిన సంగతి తెలిసిందే. జూన్ 11 నుంచి లండన్‌లోని లార్డ్స్ స్టేడియంలో ఈ మెగా ఫైనల్ జరుగుతుంది. ఈ నేపథ్యంలో విజేత, రన్నరప్ సహా తొమ్మిదో స్థానం వరకు నిలిచే జట్లకు ఎంత మొత్తం ప్రైజ్‌మనీ లభించనుందో ఐసీసీ గురువారం వివరంగా వెల్లడించింది. చాంపియన్‌గా నిలిచిన జట్టు 'డబ్ల్యూటీసీ గద'తో పాటు 36 లక్షల డాలర్లు (రూ. 30 కోట్ల 78 లక్షలు) అందుకుంటుంది. గత చాంపియన్‌షిప్ (2023)లో భారత్‌పై గెలిచి విజేతగా నిలిచిన ఆస్ట్రేలియాకు రూ.13 కోట్ల 68 లక్షలు (16 లక్షల డాలర్లు) ఇవ్వగా... ఈసారి రెట్టింపుకంటే ఎక్కువ మొత్తం లభించనుంది. రన్నరప్‌గా నిలిచిన జట్టు 21 లక్షల 60 వేల డాలర్లు (రూ. 18 కోట్ల 46 లక్షలు) దక్కుతాయి. ఇక మూడో స్థానం భారత్‌కు ఖరారు కావడంతో ప్రైజ్‌మనీగా టీమిండియాకు 14 లక్షల 40 వేల డాలర్లు (రూ. 12 కోట్ల 31 లక్షలు) అందజేస్తారు. నాలుగో స్థానంలోని న్యూజిలాండ్‌కు 12 లక్షల డాలర్లు (రూ. 10 కోట్ల 26 లక్షలు), ఐదో స్థానంలో ఉన్న ఇంగ్లండ్‌కు 9 లక్షల 60 వేల డాలర్లు (రూ. 8 కోట్ల 20 లక్షలు) దక్కుతాయి. 6, 7, 8, 9 స్థానాల్లో ఉన్న శ్రీలంక (రూ.7 కోట్ల 18 లక్షలు), బంగ్లాదేశ్ (రూ. 6 కోట్ల 15 లక్షలు), వెస్టిండీస్ (రూ. 5 కోట్ల 13 లక్షలు), పాకిస్తాన్ (రూ. 4 కోట్ల 10 లక్షలు)లకు ప్రైజ్‌మనీ లభించనుంది.

ఫైనల్‌పై యువ భారత్ గురి

యుపియా (అరుణాచల్ ప్రదేశ్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్–19 టోర్నమెంట్‌లో సంపూర్ణ ఆధిపత్యంతో దూసుకెళ్తున్న భారత యువ జట్టు ఇప్పుడు ఫైనల్ బెర్త్‌పై కన్నేసింది. ఇందులో భాగంగా నేడు జరిగే సెమీఫైనల్లో మాల్దీవులు జట్టుతో భారత్ తలపడనుంది. ఈ టోర్నీలో ఆరంభం నుంచి భారత్ జోరుకు ఎదురేలేదు. గ్రూప్ 'బి'లో ఉన్న యువ భారత్ ధాటికి ప్రత్యర్థి జట్లు శ్రీలంక, నేపాల్ కనీసం ఒక్క గోల్ అయినా చేయలేకపోయాయి. అసాధారణ ప్రదర్శన కనబరిచిన కుర్రాళ్లు 8–0తో శ్రీలంకను చిత్తు చేశారు. తర్వాత రెండో లీగ్ మ్యాచ్‌లోనూ భారత్ 4–0తో నేపాల్‌పై కూడా ఏకపక్ష విజయాన్ని సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ఇప్పుడు వరుసగా 'హ్యాట్రిక్' విజయం సాధిస్తే భారత యువ జట్టు నేరుగా టైటిల్ పోరుకు అర్హత సాధిస్తుంది. గ్రూప్ 'ఎ'లో ఉన్న మాల్దీవులు ప్రదర్శన కాస్త భిన్నం! ఆడిన రెండు మ్యాచ్‌ల్లో గెలవలేదు. అలాగని ఏ ఒక్క మ్యాచ్‌లోనూ ఓడలేదు. మొదట బంగ్లాదేశ్‌తో 2–2తో 'డ్రా' చేసుకున్న మాల్దీవులు... రెండో మ్యాచ్‌లోనూ అదేస్కోరుతో భూటాన్‌తోనూ 'డ్రా' చేసుకుంది. ప్రత్యేకించి 'శాఫ్' ఫుట్‌బాల్ టోర్నీల్లో మాల్దీవులుపై భారత్‌ది ఘనమైన చరిత్ర. వివిధ వయో విభాగాల టోర్నీల్లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ భారతే విజయం సాధించింది. గతేడాది చివరిసారిగా 'శాఫ్' అండర్–17 ఈవెంట్‌లో భారత్ 3–0తో మాల్దీవులు జట్టును కంగుతినిపించింది.

టి20ల్లో షఫాలీ పునరాగమనం

- యస్తిక భాటియాకూ చోటు
- టి20ల్లో తొలిసారి శ్రీచరణికి అవకాశం
- ఇంగ్లండ్‌తో పోరుకు భారత మహిళల జట్టు ప్రకటన



షఫాలీ



శ్రీచరణి



అరుంధతి

న్యూఢిల్లీ: ఇంగ్లండ్ పర్యటనలో 5 టి20లు, 3 వన్డేల్లో పాల్గొనే భారత మహిళల జట్టును గురువారం సెలక్టర్లు ప్రకటించారు. టి20ల కోసం 15 మందిని, వన్డేలకు 16 మందిని ఎంపిక చేయగా... రెండు టీమ్‌లకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. భారత్ వేదికగా జరిగే వన్డే వరల్డ్ కప్‌కు ముందు మన జట్టు ఆడనున్న ఆఖరి వన్డే సిరీస్ ఇదే కానుంది. దూకుడైన ఆటతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ ఓపెనర్ షఫాలీ వర్మ భారత జట్టులో పునరాగమనం చేసింది. గత ఏడాది అక్టోబరు తర్వాత ఆమె స్థానం కోల్పోయింది. ఉమెన్ ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫు 9 మ్యాచ్‌లలో 304 పరుగులు చేసి షఫాలీ సత్తా చాటింది. అయితే షఫాలీని టి20లకు మాత్రమే ఎంపిక చేసిన సెలక్టర్లు వన్డే జట్టులో స్థానం కల్పించలేదు. వికెట్ కీపర్ బ్యాటర్ యస్తిక భాటియా కూడా తిరిగి జట్టులోకి వచ్చింది. గత ఏడాది నవంబరులో మణికట్టు గాయంతో ఆమె ఆటకు దూరమైంది. యస్తికకు వన్డే, టి20 రెండు టీమ్‌లలో చోటు లభించింది. ఇటీవల శ్రీలంకతో ముక్కోణపు టోర్నీలో ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచిన స్నేహ్ రాణా కూడా టి20ల్లో మళ్లీ చోటు దక్కించుకుంది. ఇదే టోర్నీలో ఆకట్టుకున్న ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన లెఫ్టార్మ్ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీచరణి తొలిసారి టి20 టీమ్‌లోకి ఎంపికైంది. హైదరాబాద్ పేసర్ అరుంధతి రెడ్డి కూడా టి20 జట్టులోకి పునరాగమనం చేసింది.

భారత టి20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, యస్తిక భాటియా, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, శ్రీచరణి, శుచి ఉపాధ్యాయ్, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, సయాలీ సత్‌ఘరే.

భారత వన్డే జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీక రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, యస్తిక భాటియా, తేజల్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, శ్రీచరణి, శుచి ఉపాధ్యాయ్, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, సయాలీ సత్‌ఘరే.

భారత్, ఇంగ్లండ్ సిరీస్ షెడ్యూల్

తొలి టి20:	జూన్ 28	నాటింగ్‌హామ్
రెండో టి20:	జూలై 1	బ్రిస్టల్
మూడో టి20:	జూలై 4	ఓవల్
నాలుగో టి20:	జూలై 9	మాంచెస్టర్
ఐదో టి20:	జూలై 12	బర్మింగ్‌హామ్
తొలి వన్డే:	జూలై 16	సౌతాంప్టన్
రెండో వన్డే:	జూలై 19	లార్డ్స్
మూడో వన్డే:	జూలై 22	చెస్టర్ లీ స్ట్రీట్

ముగిసిన భారత్ పోరు

ప్రిక్వార్టర్స్‌లో ఓడిన తరుణ్ ● ఉన్నతి, మాళవిక, ఆకర్షి కూడా



తరుణ్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్ విభాగంలో తరుణ్ మన్నేపల్లి... మహిళల సింగిల్స్ విభాగంలో ఉన్నతి హుడా, మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్... మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్‌ను దాటలేకపోయారు. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ డ్రాలో అడుగు పెట్టిన తరుణ్ గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 14–21, 16–21తో ప్రపంచ మూడో ర్యాంకర్ ఆండెర్స్ ఆంటోన్‌సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడిపోయాడు. 42 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తరుణ్ రెండో గేమ్‌లో కాస్త పోటీనిచ్చాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ఉన్నతి హుడా 14–21, 11–21తో ప్రపంచ రెండో ర్యాంకర్ పోర్న్‌పవీ చోచువోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో, మాళవిక 12–21, 16–21తో ప్రపంచ మాజీ చాంపియన్ ఇంతనోన్ రచనోక్ (థాయ్‌లాండ్) చేతిలో, ఆకర్షి కశ్యప్ 9–21, 14–21తో సుపనిద కటెథోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి చవిచూశారు. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 20–22, 14–21తో రుయ్ హిరోకామి–సయాకా హొబారా (జపాన్) జోడీ చేతిలో ఓడిపోయింది. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) టూర్ టోర్నీలలో భారత్ నుంచి ఒక్కరు కూడా ఫైనల్ చేరుకోలేకపోయారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సన్నవడ్లు కొనడం లేదని రాస్తారోకో

పెద్దపల్లి రూరల్: సన్నవడ్లు కొనుగోలు చేయడం లేదని ఆగ్రహిస్తూ పెద్దపల్లి మండలం నిమ్మనపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు గురువారం ఆందోళనకు దిగారు. కొనుగోలు కేంద్రం సమీపంలోని పెద్దపల్లి–నిట్టూరు ప్రధాన రహదారిపై వాహనాలు అడ్డుగా పెట్టి నిరసన తెలిపారు. దీంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు స్తంభించాయి. అప్పుడే పెద్దపల్లి వెళ్లేందుకు వస్తున్న స్థానిక నాయకుడొకరు.. రోడ్డుకు అడ్డంగా వాహనాలను నిలిపి.. ఇబ్బంది కలిగించడమేమిటని రైతులను ప్రశ్నించారు. దీంతో కొందరు ఆయనతో వాగ్వాదానికి దిగడంతో.. కాసేపు తోపులాట జరిగింది. అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను సముదాయించి రాకపోకలను పునరుద్ధరించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనడం లేదనడం సరికాదని పెద్దపల్లి సహకార సంఘం సీఈవో మెట్టు మదన్‌మోహన్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు దొడ్డురకం ధాన్యం 14,900 క్వింటాళ్లు, సన్నరకం 2,500 క్వింటాళ్లు తూకం వేశామన్నారు. తేమశాతం రాని సన్నరకం ధాన్యం ఇంకా దాదాపు 300 క్వింటాళ్ల మేర ఉందని ఆయన వివరించారు.


రైతులను సముదాయిస్తున్న పోలీసులు

మిల్లుకు తరలించక మొలకెత్తిన ధాన్యం

దంతాలపల్లి: మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో పది రోజుల క్రితం కాంటాలు నిర్వహించారు. కానీ మిల్లులకు తరలించలేదు. ఇటీవలి వర్షాలకు ధాన్యం తడిసి గురువారం బస్తాల నుంచి మొలకలు బయటికి వచ్చాయి. దీంతో రైతులు కొండ యాకయ్య, కుంచం ఉప్పలయ్య, ఊడుగుల లింగన్న, ఉమేష్, యాకయ్య తమ ధాన్యం పరిస్థితి ఏమిటని కొనుగోలు కేంద్ర నిర్వాహకులను ప్రశ్నిస్తున్నారు. మొలకెత్తిన, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


పెద్దముప్పారం కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం

కన్నతల్లిని గెంటేసిన కొడుకు..

దంతాలపల్లి: తన ఇంట్లో ఉండొద్దని కన్నతల్లిని ఓ కొడుకు గెంటేశాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో గురువారం జరిగింది. గన్నెపల్లి గ్రామానికి చెందిన లింగమ్మ–చంద్రయ్య దంపతులకు సత్తయ్య, వెంకన్న, శ్రీనుతోపాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. లింగమ్మ భర్త గతంలోనే మృతి చెందాడు. పెద్ద కుమారుడు సత్తయ్య కొంతకాలం క్రితం మృతిచెందగా అతడి భార్య పుష్పమ్మ గ్రామంలో వేరే చోట ఇల్లు నిర్మించుకొని ఉంటోంది. మిగతా ఇద్దరు బతుకు దెరువు కోసం వరంగల్‌లో ఉంటున్నారు. కాగా లింగమ్మ తన రెండో కుమారుడు వెంకన్న ఇంట్లో ఉంటూ తనకు వచ్చే పింఛన్‌తో కాలం వెళ్లదీస్తోంది. అయితే వెంకన్న తన కూతురు పెళ్లి చేసేందుకు ఇల్లు విక్రయించానని, నువ్వు ఇంట్లో ఉండొద్దని తల్లిని గెంటేశాడు. దీంతో ఆమె గ్రామంలో రోడ్డుపై కూర్చొని రోదించిన ఘటన పలువురిని కంటతడి పెట్టించింది.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
శుక్రవారం। 16-5-2025

ఆడపడుచుల ఆత్మగౌరవంపై దాడి

రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆడబిడ్డలతో విదేశీ మహిళల కాళ్లు కడిగించడమే మిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి ప్రశ్నించారు. ఇది తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవంపై దాడేనని గురు వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దారుణ ఘటనకు తక్షణ క్షమాపణ చెప్పాలని, కార్యక్రమ నిర్వాహకులు, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టీఎల్ఎంఏఎల్‌కు హైకోర్టు ఊరట



సాక్షి, హైదరాబాద్: విమాన విడి భాగాలను తయారు చేసే టాటా లాక్హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ఎంఏఎల్)కు హైకోర్టు ఊరటనిచ్చింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు బకాయిల కోసం ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో)ను ఆదేశించింది. 2012–2017 మధ్య కాలంలో పనిచేసిన 14 మంది విదేశీ కార్మికులకు రూ.14 కోట్ల పీఎఫ్ బకాయిలు చెల్లించడంలో విఫలమైనందున టీఎల్ఎంఏఎల్ రెండు బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేస్తూ ఈపీఎఫ్‌వో ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ టీఎల్ఎంఏఎల్ హైకోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టిన జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం.. తదుపరి ఆదేశాలిచ్చే వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఈపీఎఫ్‌వోను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

ఊరంతా ఉద్యోగులే..

కంబాలపల్లి కేరాఫ్ ప్రభుత్వోద్యోగులు • గ్రామంలో 79 మందికి సర్కారీ కొలువులు

ఆర్మీ, ఉపాధ్యాయ, పోలీసు, ఎయిర్‌ఫోర్స్, నేవీలో సేవలు • ఆర్మీలో అత్యధికం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామం.. ప్రభుత్వ ఉద్యోగుల గ్రామంగా విలసిల్లుతోంది. గ్రామం నుంచి ఆర్మీ, సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఆర్టిలరీ, బీఎస్ఎఫ్, ఎస్పీఎఫ్, మద్రాస్ రెజిమెంట్, టీఎస్ఎస్పీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఏఆర్, పోలీసు విభాగాలతో పాటు ఉపాధ్యాయులు 79 మంది వరకు సేవలు అందిస్తున్నారు. కాగా ఇక్కడి నుంచి ఎక్కువగా సైనికులు దేశానికి సేవలందిస్తున్నారు. గ్రామానికి చెందిన మల్లికంటి కృష్ణయ్య మొట్టమొదటిసారిగా సీఆర్పీఎఫ్ జవాన్‌గా చేరారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని గ్రామ యువత వివిధ ప్రాంతాల్లో పనిచేస్తూ.. కంబాలపల్లి గ్రామం ఆదర్శంగా నిలిచేలా కృషి చేస్తున్నారు.

సేవలందిస్తున్న 79 మందిలో...

కంబాలపల్లి గ్రామం నుంచి 79 మంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇందులో 38 మంది ఆర్మీలో, 10 మంది కానిస్టేబుళ్లు, 15 మంది ఉపాధ్యాయులు, ఆరుగురు టీఎస్ఎస్పీ, ఇద్దరు నేవీ, ముగ్గురు ఎయిర్ ఫోర్సు, ఐదుగురు గన్‌మన్లు, ఇద్దరు ఎస్పీఎఫ్ విభాగాల్లో పనిచేస్తున్నారు.



కంబాలపల్లి గ్రామ జెడ్పీ హైస్కూల్

22 ఏళ్లుగా ఆర్మీలో ..



గ్రామానికి చెందిన సంద భాస్కర్ 22 ఏళ్ల క్రితం ఆర్మీలో చేరి విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామానికి చెందిన మల్లికంటి కృష్ణయ్య ఆర్మీలో చేరిన మొదటి వ్యక్తి కాగా.. భాస్కర్ రెండోవారు. ఆర్మీలో జూనియర్ కమాండెంట్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు.

– సంద భాస్కర్, జూనియర్ కమాండెంట్ ఆఫీసర్

తండ్రిని ఆదర్శంగా తీసుకొని..



గ్రామానికి చెందిన మల్లికంటి కృష్ణయ్య, సైదమ్మ దంపతుల చిన్న కుమారుడు అవినాశ్ తన తండ్రిని ఆదర్శంగా తీసుకుని ఆర్మీలో చేరాడు. ఆయన ప్రస్తుతం జమ్మూలో ఆర్టిలరీ విభాగంలో ఉద్యోగం చేస్తున్నారు.

– మల్లికంటి అవినాశ్, ఆర్మీ ఆర్టిలరీ ఉద్యోగి

ప్రభుత్వ ఉపాధ్యాయునిగా..



గ్రామానికి చెందిన మల్లికంటి రమేశ్ ఆర్మీలో 16 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉద్యోగ విరమణ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ రాసి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం గంగారం మండలంలో స్కూల్ అసిస్టెంట్‌గా కొనసాగుతున్నారు.

– మల్లికంటి రమేశ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

తొలిసారిగా ఎయిర్‌ఫోర్స్‌లో..



కంబాలపల్లి గ్రామం నుంచి ఎంపికైన మొట్టమొదటి ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగిగా నూకల నరేందర్ రెడ్డి పేరుపొందారు. ఎయిర్‌ఫోర్స్ విమాన కమాండర్ (ఆర్మీలో బ్రిగేడియర్ హోదా)గా 36 ఏళ్లపాటు పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం నరేందర్ రెడ్డి హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో హెలికాప్టర్ పైలట్ విధులు నిర్వర్తిస్తున్నారు. తమ గ్రామం నుంచి దేశ రక్షణ, ఇతర విభాగాల్లో యువకులు పనిచేస్తూ ఆదర్శంగా నిలవడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు.

– నూకల నరేందర్‌రెడ్డి, మొట్టమొదటి ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి

గ్రేడ్ హవల్దార్‌గా విధులు..



గ్రామానికి చెందిన కొలిశెట్టి సుధాకర్ ఆర్మీలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం గ్రేడ్ హవల్దార్ హోదాలో కొనసాగుతున్నారు. దేశ సేవ చేయాలనే లక్ష్యంతో 2001లో మొదటి ప్రయత్నంలోనే ఆర్మీలో సిపాయిగా ఉద్యోగంలో చేరారు. తర్వాత లాంచ్ నాయక్, నాయక్, హవల్దార్ హోదాల అనంతరం ప్రస్తుతం గ్రేడ్ హవల్దార్‌గా పనిచేస్తున్నారు.

– కొలిశెట్టి సుధాకర్, ఆర్మీ గ్రేడ్ హవల్దార్



సీఆర్‌పీఎఫ్ జవాన్లతో ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి

'ఆపరేషన్ కర్రిగుట్ట' సక్సెస్

జవాన్లకు ఛత్తీస్‌గఢ్ సీఎం అభినందన

చర్ల: తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలోని కర్రిగుట్టల్లో చేపట్టిన ఆపరేషన్ విజయవంతం కావడంపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి జవాన్లను అభినందించారు. కర్రిగుట్టల సమీపంలోని బీజాపూర్ జిల్లా ఊసూరు తాలూకా గలగంలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపును గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, జవాన్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 21 రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగిన ఆపరేషన్‌లో.. 31 మంది మావోయిస్టు ముఖ్య నేతలను హతమార్చడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్‌ను తీర్చిదిద్దేందుకు మరింత కృషి చేయాలని కోరారు. అప్పుడే మారుమూల గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కోర్టులను కూడా తప్పుదోవ పట్టిస్తున్నారు

ఎమ్మెల్యే వివేకానంద్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుతో సహా ఇతర కోర్టులు తప్పుపడుతున్నా వైఖరిలో మార్పు రావడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో గురువారం వివేకానంద్ మీడియాతో మాట్లాడారు. తాజాగా కంచగచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో పాటు కోర్టులను కూడా తప్పుదోవ పట్టిస్తోందన్నారు. సహనం కోల్పోయిన స్థితిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సీఎం అని సంబోధిస్తుండటాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. సీఎం రేవంత్ అనాలోచిత, అనుభవ రాహిత్యంతో కూడిన నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా నేటికీ బీఆర్ఎస్‌పైనే బురద చల్లుతూ పబ్బం గడుపుకుంటున్నాడని మండిపడ్డారు.



యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రపంచ సుందరీమణుల పర్యటన ఆసాంతం సందడిసందడిగా కొనసాగింది. రెండు బృందాలుగా వెళ్లి యాదగిరిగుట్ట, పోచంపల్లిని సందర్శించారు. లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు. పోచంపల్లిలో చేనేతల ఉత్పత్తులను చూసి మురిసిపోయారు. ర్యాంప్ వాక్‌ను ఆసక్తిగా తిలకించారు.





కలవరపెడుతున్న కిడ్నీలు


నడుము నొప్పి, మూత్రం రంగు మారడం వంటివి సాధారణమే అనుకుంటాం.. అయితే అవి కిడ్నీలో రాళ్ల సమస్య వంటి ప్రమాదకరమైన లక్షణాలు కావచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వేసవి కాలాన్ని వైద్యరంగంలో స్టోన్ సీజన్ అని కూడా అంటారు. ఉక్కబోత, చెమట, డీహైడ్రేషన్, ఆహారపు అలవాట్లు, ఎండలో తిరగడం, అవసరాలకు సరిపడా నీరు తాగకపోవడం తదితర కారణాలతో ఈ సీజన్‌లో కిడ్నీల్లో రాళ్లు ఏర్పడతాయని వైద్యులు పేర్కొంటున్నారు. శీతాకాలంతో పోల్చితే తాజాగా కిడ్నీలో రాళ్లతో ఆసుపత్రులకు వస్తున్న వారి సంఖ్య రెండున్నర రెట్లు పెరిగినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

సాక్షి, హైదరాబాద్

2.5 రెట్లు పెరిగిన కిడ్నీ రాళ్ల కేసులు

- వేసవిలో నీరు తాగకపోవడం, జంక్‌ఫుడ్ తినడమే కారణాలు
- జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు





కిడ్నీల్లో రాళ్లు ఎందుకు వస్తున్నాయి?

వేసవిలో తగినంత నీరు తాగకపోవడం వల్ల మూత్రంలో కాల్షియం, ఆగ్జలేట్, యూరిక్‌యాసిడ్, ఎసిడిటీ కాంపొనెంట్ స్థాయిలు పెరుగుతాయి. ఫలితంగా చిన్నగా రాళ్లు ప్రారంభమవుతాయి. రెండు మిల్లీమీటర్ల వరకు ఎలాంటి లక్షణాలు ఉండవు. వాటి పరిమాణం పెరిగినపుడు నెమ్మదిగా నడుం నొప్పి, మూత్రంలో మంట రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రాళ్ల పరిమాణం 5 ఎంఎం, 10 ఎంఎం స్థాయికి చేరుకునే సరికి ఇన్ఫెక్షన్ కావడం, మూత్రంతో పాటు రక్తం వస్తుంది. కొన్ని సందర్భాల్లో రెండు రాళ్లు కలిసినపుడు 2 ఎంఎం+ 2 ఎంఎం కలిసి 4 ఎంఎం కాకుండా 8 ఎంఎం, 10 ఎంఎం అయ్యే ప్రమాదం ఉంది. దీని ప్రభావం మూడు రెట్లు అధికంగా ఉంటుంది. నగరంలో 7 సెంటీమీటర్ల రాళ్లున్న రోగులు సైతం వస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. ఇలాంటి సందర్భంలో యూరిన్ బ్లాడర్‌కు వెళ్లే యూరేటర్ ట్యూబ్ మూసుకుపోతుంది. ట్యూబ్ స్తంభిస్తే కిడ్నీ వాచి అనేక సమస్యలకు దారి తీస్తుంది.

ఆహారపు అలవాట్లే..

కిడ్నీలో రాళ్ల సమస్యలు పురుషులతో పోల్చితే.. మహిళల్లో కేసుల సంఖ్య సుమారు 40 శాతం తక్కువగా ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. వివిధ పనుల నిమిత్తం ఎండలో తిరిగే వారిలో ఈ కాలం కిడ్నీలకు ప్రమాదకరంగా మారుతోంది. తాజా గణాంకాల ప్రకారం 10 సంవత్సరాల నుంచి 17 సంవత్సరాల వయసున్న యువకుల్లో కిడ్నీలో రాళ్ల కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. పాఠశాల విద్యార్థులు సరిపడా నీరు తాగకపోవడం, జంక్ ఫుడ్, స్నాక్స్ ప్యాకెట్లు తినడం, శీతల పానీయాలు తాగడం, శారీరక వ్యాయామం లేకపోవడం వంటివి కారణాలుగా కనిపిస్తున్నాయి. దీని ప్రభావం దీర్ఘకాలంలో పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది.



యువతపై ఎక్కువ ప్రభావం..

సాధారణ వ్యక్తి రోజుకు కనీసం 4 నుంచి 5 లీటర్ల నీళ్లు తాగాలి. కారణం లేకుండా నడుం నొప్పి వచ్చినా, మూత్రం రంగు మారినట్లు గుర్తించినా, వెంటనే పరీక్ష చేయించుకోవడం మంచిది. కిడ్నీలో రాళ్ల కేసుల సంఖ్య ఈ వేసవిలో అసాధారణంగా పెరిగింది. రోజుకు సరాసరి 300 నుంచి 400 మంది రోగులు వస్తున్నారు. ప్రధానంగా పిల్లలు, యువతలో కిడ్నీలో రాళ్లు వస్తున్నాయి. క్రమంగా నీళ్లు తాగకపోవడం, జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం కిడ్నీలో రాళ్ల సమస్యకు ఆజ్యం పోస్తోంది. తల్లిదండ్రులు పిల్లల ఆహారపు అలవాట్లపై దృష్టి సారించాలి. ముఖ్యంగా వేసవిలో ఉప్పు తగ్గించుకోవాలి, ప్రాసెసింగ్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ఒక దఫా రాళ్లు గుర్తిస్తే.. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం మంచిది.

– తైఫ్ బెండెగెరి, యూరాలజిస్ట్, ఏఐఎన్‌యూ ఆసుపత్రి

'గ'ఘన' విశాఖ





విశాల విశాఖపట్నం.. పేరుకు తగినట్లుగానే సుందర దృశ్యాల సమాహారం. ఒకవైపు అనంతమైన సాగరతీరం.. మరో వైపు గంభీరమైన పర్వత శ్రేణులు. వీటి నడుమ సువిశాలంగా విస్తరించిన మహా నగరం విశాఖ. ప్రపంచంలోనే ఇలాంటి అపురూప భౌగోళిక స్వరూపం కలిగిన నగరాలు చాలా తక్కువ. అందుకే ఇక్కడ జీవించడానికి ఎంతో మంది మక్కువ చూపుతారు. ఒకప్పుడు చిన్న మత్స్య కార గ్రామంగా ఉన్న విశాఖ.. నేడు బహుముఖాభివృద్ధి సాధించి మహా నగరంగా రూపాంతరం చెందింది. వివిధ రంగాల్లో దూసుకుపోతూ నగరం తన పరిధిని విస్తరించుకుంటూ పోతోంది. పర్యాటకులకు ఇది స్వర్గధామం అనడంలో అతిశయోక్తి లేదు. అటువంటి విశాఖ నగరాన్ని ఆకాశం నుంచి వీక్షిస్తే ఆ అనుభూతే వేరు. మబ్బుల పొరల మాటు నుంచి నగరాన్ని చూస్తే దాని సౌందర్యాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. యారాడ కొండలు, పోర్టు ప్రాంతం, పాత నగరాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఎండ భగభగ.. నీడకు పద పద..!

ఎండలు తీవ్రంగా ఉండటంతో మనుషులే కాదు.. మూగజీవాలు కూడా ఎక్కడ కాస్త నీడ దొరుకుతుందా.. అని వెళ్లి సేద తీరుతున్నాయి. రబీ సీజన్‌లో రైతులు మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేయడంతో పశువులకు మేత ఎక్కువగా ఉండటంతో పల్నాడు గ్రామాల నుంచి పశువులు వలస తీసుకొచ్చారు. చిత్రంలో బాపట్ల జిల్లా చుండూరు మండలంలోని యడ్ల పల్లి గ్రామంలో ఎండ వేళ చెట్టు కింద ఆవులు సేద తీరుతున్న దృశ్యం – చుండూరు(వేమూరు)

క్లుప్తంగా...

ఉపాధిని ప్రాథమిక హక్కుగా ఉద్యమించండి

సీపీఐ జాతీయ నేతలు డి.రాజా పిలుపు

తిరుపతి కల్చరల్: రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు ధారాదత్తం చేస్తున్న నరేంద్ర మోదీని సాగనంపేందుకు యువత, యువకులు విద్యార్థులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపు నిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలు గురువారం తిరుపతిలోని ఇందిరామైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా డి.రాజా హాజరై ప్రసంగించారు. మోదీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, ఈ హామీని అమలు చేసి ఉంటే 20 కోట్ల ఉద్యోగాలు దేశంలో ఇచ్చి ఉండాలని, అధికారంలోకి రాగానే హామీని తుంగలో తొక్కి నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఉపాధి హక్కును ప్రాథమిక హక్కుగా చేర్చాలని డిమాండ్ చేశారు.

'విష్ణు నివాసం'లో చోరీ

తిరుపతి క్రైమ్: తిరుమల దర్శనానికి వచ్చిన భక్తుల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన గురువారం జరిగింది. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడుకు చెందిన విజయ్ భాస్కర్ తమ కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారి దర్శనం కోసం వచ్చారు. గురువారం విష్ణు నివాసానికి చేరుకుని సేదతీరుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు అతని బ్యాగులోని వస్తువులను దొంగతనానికి పాల్పడ్డారు. 32 గ్రాములు విలువచేసే నల్లపూసల దండ, రూ.1,20,000 నగదు, 40 వేల రూపాయలు విలువచేసే మొబైల్ ఫోను చోరీకి పాల్పడినట్లుగా ఫిర్యాదు చేశాడు.

17న కర్నూలుకు సీఎం చంద్రబాబు

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబు నాయుడు కర్నూలు పర్యటన ఖరారైంది. ఈ మేరకు గురువారం సీఎం కార్యాలయం ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. కర్నూలు రైతు బజార్‌లో జరిగే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. అనంతరం ప్రజావేదికలో పీ4 లబ్ధిదారులు, మార్గదర్శకులతో మాట్లాడేందుకు వీలుగా పర్యటనను ఖరారు చేశారు.

విదేశీ వర్సిటీతో ఎంబీయూ ఒప్పందం

చంద్రగిరి: దేశంలోనే మొట్టమొదటి సారిగా విద్యార్థుల సౌలభ్యం కోసం విదేశాలకు చెందిన ప్రముఖ యూనివర్సిటీతో ఎంఓఏ ఒప్పందం చేసుకున్నట్లు ఎంబీయు ప్రో చాన్సలర్ మంచు విష్ణు తెలిపారు. గురువారం ఎంబీ యూనివర్సిటీలోని దాసరి ఆడిటోరియం ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచింది. ఈ మేరకు అమెరికాకు చెందిన పెన్ స్టేట్ విశ్వవిద్యాలయం చాన్సలర్ డాక్టర్ డేవిడ్ ఎం కాల్లెజో, వీసీ డాక్టర్ వాహిద్ మోటీపల్లిలతో ఎంబీయు చాన్సలర్ డాక్టర్ మంచు మోహన్ బాబు ఎంఓఏ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు అమెరికాకు చెందిన యూనివర్సిటీ చాన్సలర్, వీసీలతో కలసి ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే మొట్టమొదటి ప్రైవేటు విశ్వవిద్యాలయం ఇలాంటి అమెరికాకు చెందిన విశ్వవిద్యాలయంలో అవగాహన ఒప్పందం చేసుకోవడం చారిత్రాత్మకమన్నారు.

యుద్ధం మొదలైంది.. మధ్యలో ఆగిపోయింది

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): యుద్ధం మొదలైంది. మధ్యలో ఆగిపోయింది. ఎందుకు మొదలు పెట్టారో? ఎందుకు ఆపేశారో ఎవరికీ తెలియదు అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. గుంటూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాక్ పై యుద్ధం మొదలైనప్పుడు దేశవ్యాప్తంగా ఇందిరా గాంధీ, వాజ్‌పేయి హయాంలో జరిగిన యుద్ధం మాదిరిగా జరుగుతుందని భావించామని చెప్పారు. ఈ యుద్ధం పై అమెరికా జోక్యం బాగా కనిపిస్తోందని, ట్రంప్ చేతిలో మోదీ కీలుబొమ్మగా మారాడని ఢిల్లీలో అందరూ అనుకుంటున్నారని విమర్శించారు.

ఆధి'పచ్చ' పోరు

ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య కోల్డ్‌వార్

- నర్సరావుపేట ఎంపీ లావుతో ఎమ్మెల్యేల విభేదాలు
- ఏ ఒక్కరితోనూ లావుకు సఖ్యత లేదు

- కేంద్ర మంత్రి పెమ్మసానిపై పలువురు గుర్రు
- తమ నియోజకవర్గాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆగ్రహం
- విజయవాడలో కేశినేని చిన్ని హవా
- లోకేశ్ అండతో అన్ని నియోజకవర్గాల్లోనూ జోక్యం
- విశాఖలో ఎంపీ భరత్‌కే ప్రాధాన్యం.. రగిలిపోతున్న ఎమ్మెల్యేలు
- నెల్లూరులో వేమిరెడ్డి వర్సెస్ ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. తమ మాటే వినాలని అటు ఎంపీలు, ఇటు ఎమ్మెల్యేలు అధికార యంత్రాంగంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. పోస్టింగ్‌లు, కాంట్రాక్టులు, ఇతర పనుల్లో తమ మాటే నెగ్గాలని ఎవరికి వారు పట్టుబడుతుండడంతో వారి మధ్య కోల్డ్‌వార్ సాగుతోంది. కొన్ని జిల్లాల్లో ఈ విభేదాలు మరింత ముదిరిపోయి ఒకరిపై ఒకరు కత్తులు దూసుకునే పరిస్థితి నెలకొంది. పలుచోట్ల ఎంపీల పెత్తనం ఎక్కువ కావడంతో ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లోకేశ్ అండతో 'చిన్ని'కిచినికి గాలివాన..!



విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తాను లోకేశ్ మనిషినంటూ నియోజకవర్గాల్లో అన్నింటికీ తనకు వాటా ఉండాలని పట్టుబట్టి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇసుక ర్యాంపులు, మద్యం షాపులు, కాంట్రాక్టుల కోసం ఎక్కడికక్కడ తన మనుషులను పెట్టి వారితో వ్యవహారాలు నడిపిస్తున్నారు. విజయవాడ నగరంతోపాటు నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో చిన్నచిన్న విషయాల్లోనూ వేలు పెడుతుండడంతో ఎమ్మెల్యేలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఆయనను వ్యతిరేకిస్తే లోకేశ్‌తో ఇబ్బంది వస్తుందనే ఆందోళనతో ఎవరూ బయటపడడం లేదని, కేశినేని చిన్ని తీరు అన్యాయంగా ఉందని వాపోతున్నారు.

మా'లావు' చిక్కులు



నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్ని నియోజకవర్గాల్లోనూ జోక్యం చేసుకుంటూ తన మాటే నెగ్గాలని పట్టుబడుతుండడంతో ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్నిచోట్లా ప్రత్యేకంగా తన వర్గాన్ని ఏర్పాటు చేసుకుని వారితో పనులు చేయించేందుకు యత్నిస్తుండడంపై ఎమ్మెల్యేలు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలోనే గురజాల, నర్సరావు పేట సీట్లను తాను చెప్పిన వారికి ఇప్పించేందుకు యత్నించినా గురజాలలో యరపతినేని శ్రీనివాసరావు, నర్సరావు పేటలో అరవింద్‌బాబు సీట్లు తెచ్చుకుని గెలిచారు. ఆ తర్వాత కూడా వారితో లావు విభేదాలు కొనసాగిస్తూనే ఉన్నారు. నర్సరావుపేటలో జనసేన ఇన్‌చార్జిని ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యేతో కయ్యానికి కాలు దువ్వుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం చిలకలూరిపేట ఎమ్మెల్యే పుల్లారావుకు వ్యతిరేకంగా పార్టీ ఫిరాయించిన మర్రి రాజశేఖర్‌ను చేరదీయడంతో ఆయన వర్గం రగులుతోంది. మాచర్లలో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డిని పక్కనపెట్టి తన మనుషులతోనే అన్ని వ్యవహారాలు నడిపిస్తున్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తనకు మంత్రి పదవి రాకుండా లావు అడ్డుకున్నారనే కోపంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు లావు శ్రీకృష్ణదేవరాయలుపై అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

సిఫార్సుల 'పెమ్మసాని'



గుంటూరు నుంచి ఎంపీగా గెలిచిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పలు నియోజకవర్గాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారు. గుంటూరులోని తెనాలి, తాడికొండ నియోజకవర్గాల్లో బదిలీలు, పనులకు ఆయన ప్రత్యేకంగా సిఫారసు లేఖలు ఇస్తుండడంతో ఎమ్మెల్యేలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తెనాలిలో ఒక విద్యుత్ ఏఈ పోస్టు కోసం కేంద్ర మంత్రి పెమ్మసాని, స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా వేర్వేరు వ్యక్తులను సిఫారసు చేస్తూ లేఖలు ఇవ్వడంతో ఎవరి చెప్పినట్లు చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకున్నారు.

తగ్గ'వేమిరెడ్డి'!



నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు జిల్లా అంతా తనదే నంటూ అన్నింట్లో జోక్యం చేసుకోవడంపై ఎమ్మెల్యేలు మండిపడుతున్నారు. ఆయనకు సీఎం తనయుడు లోకేశ్ అండ ఉండడంతో మైనింగ్ వ్యవహారాల్లో ఆయన చెప్పినట్లే జరుగుతోంది. మైనింగ్ డీడీగా తనకు అనుకూలమైన వ్యక్తిని నియమించుకుని తాను చెప్పినట్లు వినేలా చేసుకున్నారు. దీంతో ఆయన తమ మాట కూడా వినకుండా ఎంపీ ఏది చెబితే అది చేస్తున్నారని ఎమ్మెల్యేలు భగ్గుమంటున్నారు. సర్వేపల్లి, వెంకటగిరి, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ఎంపీకి ఏమాత్రం పొసగడంలేదు. దీంతో ఆ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల అనుచరులకు సంబంధించిన అక్రమ మైనింగ్‌పై ఎంపీ వేమిరెడ్డి విజిలెన్స్ దాడులు చేయించినట్లు సమాచారం.

విశాఖలో 'భరత్'నాట్యమే!



విశాఖపట్నం ఎంపీ భరత్ సీఎం కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో అన్ని విషయాలూ తనకు తెలియాలని, తనకు చెప్పి చేయాలని అధికారులను ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యవహారాలు, గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ(జీవీఎంసీ)కి చెందిన పనులకు సంబంధించి ఆయన పెత్తనం చేస్తుండడంతో ఎమ్మెల్యేలు అసహనంగా ఉన్నారు. భరత్ వ్యవహార శైలిపై భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మండిపడుతున్నట్లు సమాచారం. అన్ని వ్యవహారాల్లోనూ జోక్యం చేసుకుంటుండడంతో మిగిలిన ఎమ్మెల్యేలు పైకి ఏమీ మాట్లాడకపోయినా అంతర్గతంగా రగిలిపోతున్నారు.

పెళ్లి పేరుతో.. టోకరా



- ఆస్తి కాజేసి ఉడాయిస్తున్న యువతులు
- మధ్యవర్తిత్వం చేసిన వ్యక్తుల ఫోన్ స్విచ్ ఆఫ్
- పెళ్లి కాని ప్రసాద్‌లనే టార్గెట్ చేస్తున్న మోసగాళ్లు
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు



- సత్యసాయి జిల్లా హిందూపురం మండలం రాచపల్లికి చెందిన 40 ఏళ్ల వ్యక్తి మ్యారేజీ బ్యూరో ద్వారా భీమవరానికి చెందిన మహిళను వివాహం చేసుకున్నారు. సంబంధం కుదిర్చిన ఇద్దరు వ్యక్తులకు రూ.4 లక్షలు చెల్లించాడు. అయితే వివాహం తర్వాత సదరు యువతిని రైలులో భీమవరానికి తీసుకువెళ్లగా.. రైల్వే స్టేషన్ నుంచే ఆమె ఉడాయించింది. ఫోన్ స్విచాఫ్ వచ్చింది. పెళ్లి చేసిన మధ్యవర్తుల నంబర్లు పనిచేయలేదు. దీంతో బాధితుడు తిరిగివచ్చి.. హిందూపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన 2024 అక్టోబరులో వెలుగు చూసింది.

- నాలుగు నెలల క్రితం ధర్మవరానికి చెందిన ఓ యువతిని పుట్టపర్తిలో పని చేసే ఓ ఉద్యోగి పెళ్లి చూపులు చూశాడు. ఆ వెంటనే సదరు యువతి బంధువులు పెళ్లిపత్రికలు ప్రింట్ చేయించారు. తాను పెళ్లికి అంగీకారం తెలపకుండానే పత్రికలు ఎలా ప్రింట్ చేయించారని అడగ్గా... తనను మోసం చేశాడని రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని సదరు యువతి నాలుగు నెలల క్రితం నానా రభస చేసింది. దీంతో ఆ ఉద్యోగి అప్పటి నుంచి పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.

సాక్షి, పుట్టపర్తి

గతంలో పెళ్లంటే... పెద్దలు కూర్చుని బంధువర్గాల్లో ఈడు, జోడు చూసి సంబంధం కుదుర్చేవారు. ఎక్కువగా బంధువర్గాల్లోని అమ్మయిలతోనే వివాహం జరిపించేవారు. కానీ ప్రస్తుత కాలంలో అమ్మాయిలు దొరకడం కష్టంగా మారింది. ఫలితంగా 30 ఏళ్లు దాటి.. 40 ఏళ్లకు సమీపిస్తున్నా.. పెళ్లి సంబంధాలు వెతుకుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. దీంతో 'పెళ్లి కాని ప్రసాద్' లను లక్ష్యంగా చేసుకుని కొందరు యువతులు, మ్యారేజీ బ్యూరో నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారు. పెళ్లి పేరుతో బంగారు నగలు, నగదు చేజిక్కించుకుని ఉడాయిస్తున్నారు. ఇంకొన్ని చోట్ల ఆస్తి రాయించుకుని అడ్డం తిరుగుతున్నారు.

వయసు మీరితే మోసపోయినట్లే..

అప్పట్లో అబ్బాయిలకు 21, అమ్మాయిలకు 18 ఏళ్లు నిండితేనే వివాహం జరిపించే వాళ్లు. అయితే ప్రస్తుతం ఉద్యోగాల వేటలో పడి 30 ఏళ్లు దాటినా పెళ్లి సంబంధాలు చూడటానికి యువకులు మొగ్గు చూపటం లేదు. ఆ తర్వాత ఏదో ఉద్యోగం లభించాక పెళ్లి సంబంధాలకు వెళ్తే...అమ్మాయిల కోర్కెల చిట్టా చూసి ఖిన్నులవుతున్నారు. రూ.లక్షల్లో జీతంతో పాటు అత్తమామ బాదరబందీ ఉండకూడదంటూ షరతులు పెడుతున్నారు. దీంతో యువకులు నచ్చిన భాగస్వామి కోసం మ్యారేజీ బ్యూరోలను సంప్రదిస్తున్నారు. ఇదే అదనుగా మధ్యవర్తులు ఇతర ప్రాంతాల అమ్మాయిలను ఒప్పించి.. ఒకట్రెండు నెలలు కాలయాపన చేసి.. ఆలోపు డబ్బులు, ఆస్తులు లాగేసుకుని పరారవుతున్నారు.

కొన్ని సామాజిక వర్గాల్లో మరీ కష్టం..

కొన్ని సామాజిక వర్గాల్లో అమ్మాయిల సంఖ్య మరీ దారుణంగా ఉంది. మండలానికి నాలుగైదు కుటుంబాలు ఉండే కులాల్లోని యువకులకు పెళ్లి పెద్ద సమస్యగా మారింది. మరోవైపు ఆస్తి తక్కువగా ఉండే అగ్రవర్ణ యువకులదీ ఇదే పరిస్థితి. ఫలితంగా యువకులు... ఎవరైతే ఏంటి..పెళ్లయితే చాలు అనే పరిస్థితికి వచ్చారు. దూర ప్రాంతాలకు వెళ్లి సామాజికవర్గం ఏదైనా సరే ఎవరో ఒక అమ్మాయిని పెళ్లిచేసుకుని వస్తున్నారు. అయితే రెండు, మూడు నెలల్లోనే సదరు యువతులు టోకరా వేసి బంగారం, నగదుతో ఉడాయిస్తున్నారు.

తిరుపతి ఐఐటీకి మహర్దశ

- ఫేజ్–బీ నిధులు రూ.2,313 కోట్లతో వసతులు
- నూతన ఆవిష్కరణలకు కేంద్ర బిందువు కానున్న తిరుపతి ఐఐటీ
- 12 వేల మంది విద్యార్థులతో క్యాంపస్ మాస్టర్ ప్లాన్



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కెఎన్ సత్యనారాయణ

ఏర్పేడు (రేణిగుంట) : తిరుపతి ఐఐటీకి కేంద్రం ఫేజ్–బీ అభివృద్ధి పనుల కింద రూ.2,313 కోట్లు నిధులు కేటాయించడంతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన క్యాంపస్ రూపకల్పన చేస్తామని ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ స్పష్టం చేశారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లోని పరిపాలన భవనంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం దేశంలోని ఐదు ఐఐటీలైన తిరుపతి ఐఐటీ, కేరళ రాష్ట్రం పాలక్కాడ్ ఐఐటీ, ఛత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్ ఐఐటీ, జమ్మూ ఐఐటీ, కర్ణాటక రాష్ట్రం దార్వాడ్ ఐఐటీలకు 2025–26 నుంచి 2028–29 నాలుగేళ్లకు రూ.11,828.79 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. అందులో భాగంగా తిరుపతి ఐఐటీకి రూ.2,313 కోట్లు కేటాయించిందని తెలిపారు. పదేళ్ల స్వల్పకాలిక ప్రస్థానంలో తిరుపతి ఐఐటీ ఎన్నో అద్భుత విజయాలను అందుకుందన్నారు. అతి తక్కువ కాలవ్యవధిలోనే ఫేజ్–ఏలో రూ.1,444 కోట్లు ఖర్చు చేసి 1,200 మంది విద్యార్థులకు సరిపడా పూర్తిస్థాయి క్యాంపస్‌ను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రస్తుతం 1,600 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని, రానున్న ఐదేళ్లలో మరో 1,300 సీట్లు పెరగనున్నట్లు ఆయన వివరించారు. బీటెక్‌తో పాటు ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సులను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా తిరుపతి ఐఐటీని 12 వేల మంది విద్యార్థులు అభ్యసించే స్థాయికి తీసుకెళ్లటమే ధ్యేయమన్నారు.

ఆవిష్కరణలకు 230 భాగస్వామ్య ఒప్పందాలు

శాస్త్ర, సాంకేతిక రంగాలలో నూతన ఆవిష్కరణలను తీసుకొచ్చే లక్ష్యంతో ఇప్పటికే 230 సంస్థలతో కలసి భాగస్వామ్య ఒప్పందాలను కుదుర్చుకుని విద్యార్థులకు సమృద్ధిగా అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. తాజాగా కియా మోటార్ ఇండియా కంపెనీతో అయిదేళ్ల కాలానికి రూ.35కోట్లతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఐఐటీ విద్యార్థులే కాకుండా బయట కళాశాలల విద్యార్థులను ఇన్నోవేషన్ హబ్‌లో భాగస్వామ్యమయ్యే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను తీసుకొస్తున్నారని, అందులో భాగంగా తిరుపతి, అనంతపురం, కాకినాడ, విజయవాడ, విశాఖపట్నంలో శాఖలను ఏర్పాటు చేసి కొత్త ఆవిష్కరణల రూపకల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. తిరుపతిలో ఏర్పాటు కానున్న రతన్‌టాటా హబ్‌కు తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో 19 ఎకరాలు స్థలాన్ని కేటాయించి ఇక్కడే ఏర్పాటు చేసేందుకు తాము సంసిద్ధత వ్యక్తం చేస్తూ ఇటీవల కలెక్టర్‌తో చర్చలు జరిపామన్నారు. శ్రీకాళహస్తి దేవస్థానం పైకప్పు లీకేజీ మరమ్మతు పనులను డిజైన్ చేసి పూర్తి చేయించామన్నారు. డిఫెన్స్‌కు సంబంధించి 11 ప్రాజెక్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాజిక కార్యక్రమాలలో భాగంగా ఏర్పేడు మండలంలో ఐదు గ్రామాలను దత్తత తీసుకున్నామన్నారు. సమావేశంలో ఐఐటీ విభాగాల డీన్‌లు శశిధర్ గుమ్మా, అనిల్ కుమార్, మురళీ కృష్ణ పాల్గొన్నారు.

వేగంగా భూ రికార్డుల డిజిటలైజేషన్

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు వెస్ట్ : ప్రజలకు వారి భూములపై సర్వహక్కులతోపాటు పూర్తి పారదర్శకమైన విధానాన్ని అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి గురువారం ఆయన గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ సుమారు వంద సంవత్సరాల క్రితం నిర్వహించిన ల్యాండ్స్ రికార్డ్స్ సర్వేలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ముఖ్యంగా ప్రజలకు భూమి అంటే ఒక అనుబంధమని, దాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందని చెప్పారు. ల్యాండ్ రికార్డ్స్ డిజిటలైజేషన్ ప్రక్రియ ఒక ఉద్యమంలా కొనసాగుతుందని చెప్పారు. రికార్డులను డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. ఈ ప్రక్రియ 2027 నాటికి పూర్తి చేస్తామన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని మాట్లాడుతూ డిజిటలైజేషన్‌లో భాగంగా ప్రతి 200–250 ఎకరాలకు ముగ్గురు అధికారులను నియమిస్తామని తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో సహా పాస్‌పుస్తకాలు అందిస్తామని చెప్పారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి కలిసి పనిచేద్దాం

పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్

సాక్షి, అమరావతి: ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి అందరం కలిసి పని చేద్దామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో చౌక దుకాణాల అసోసియేషన్ ప్రతినిధులు, ఎండీయూ ఆపరేటర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఇప్పటికీ రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. పేదల సంక్షేమం కోసం కేజీ బియ్యాన్ని రూ.46.10కు కొనుగోలు చేసి ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తమకు రావాల్సిన కమీషన్ బకాయిలు విడుదల చేయాలని చౌకదుకాణాల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

వింత ఆకారంలో కుక్క పిల్ల జననం



పెద్ద తిప్పసముద్రం : అన్నమయ్య జిల్లా పెద్ద తిప్పసముద్రం మండలంలోని బూచిపల్లిలో గురువారం వింత ఆకారంలో కుక్కపిల్ల జన్మించింది. డేగానిపల్లి నరసింహులుకు చెందిన కుక్క ఈ పిల్లకు జన్మనిచ్చింది. కాళ్లు, చేతులు శునకం లాగే ఉన్నా.. ముఖం వద్ద తొండంలా ఉంది. ముందు భాగం ఏనుగు ఆకారంలో.. వెనుక భాగం కుక్కలాగా ఉంది. గ్రామంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు వచ్చి.. దీన్ని చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. తల్లి వద్ద పాలు తాగేందుకు తొండం అడ్డు రావడంతో అది కొద్ది సేపటికే మృతి చెందింది. జన్యులోపం వల్ల ఇలా జన్మించి ఉండవచ్చని పశువైద్యులు తెలిపారు.

అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చూడండి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల సీఎండీలను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు, విద్యుత్ కోతలు, పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డితో నేరుగానూ, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీలు పృథ్వీతేజ్, సంతోషరావులతో వర్చ్యువల్‌గానూ మంత్రి సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ కోతలపై ఆరా తీశారు. వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. వ్యవసాయ సీజన్ నాటికి దరఖాస్తు చేసుకుని, అర్హులైన ప్రతీ ఒక్క రైతుకి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు.

జీవనజ్యోతి

బాక్సాఫీస్ సెంటిమెంట్ వెలుగు...

సరిగ్గా యాభై ఏళ్ళ క్రితం... మండు వేసవి. దాదాపు 113 డిగ్రీల ఫారెన్‌హీట్ ఉష్ణోగ్రతతో బెజవాడ అక్షరాలా 'బ్లేజ్‌వాడ'గా ఠారెత్తిస్తోంది. వడగాడ్పులు, ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంది. ఆ పరిస్థితుల్లో వాణిశ్రీ ప్రధానపాత్రలో, శోభన్‌బాబు హీరోగా కె. విశ్వనాథ్ దర్శకత్వంలో 'జీవనజ్యోతి' చిత్రం 1975 మే 16న రిలీజైంది. ఆ సెంటిమెంటల్ కుటుంబ కథ ఆ మండుటెండల్లోనే బాక్సాఫీస్ మలయమారుతమైంది. దేశంలో ఇందిరాగాంధీ సర్కార్ ఎమర్జెన్సీ విధించడానికి 40 రోజుల ముందు విడుదలై అటు ప్రకృతి, ఇటు సమాజంలోని ఆటుపోట్లకు అతీతంగా అఖండ విజయం అందుకుంది. సిల్వర్‌జూబ్లీ సూపర్‌హిట్‌గానే కాక, ఆ ఏడాది అత్యధిక వసూళ్ళు సాధించిన అరుదైన చిత్రంగా చరిత్రకెక్కింది. నిర్మాత డి.వి.ఎస్. రాజు సహా చిత్ర యూనిట్ అందరికీ చిరస్మరణీయ చిత్రంగా మిగిలిపోయిన 'జీవనజ్యోతి' విడుదలై నేటితో 50 ఏళ్ళు. ఆ చిత్ర విశేషాలు...

డి.వి.ఎస్. ప్రొడక్షన్స్, ఆ సంస్థ అధినేత - నిర్మాత డి.వి.ఎస్.రాజు పేరు చెప్పగానే ఆయన ఎన్టీఆర్‌తో నిర్మించిన 'మంగమ్మ శపథం' (1965) లాంటి పలు హిట్ చిత్రాలు గుర్తుకొస్తాయి. ఆ సినిమాతో మొదలుపెట్టి వరుసగా పదేళ్ళ పాటు ఎన్టీఆర్‌తోనే సినిమాలు నిర్మిస్తూ వచ్చిన నిర్మాత ఆయన. అలాంటి డి.వి.ఎస్. రాజు తొలిసారిగా వేరే హీరోతో తీసిన సినిమా - 'జీవనజ్యోతి'.

ఎన్టీఆర్ కంపెనీలోకి... శోభన్‌బాబు!

నిజానికి, పంపిణీ సంస్థ 'విజయాపిక్చర్స్' అధినేత చెరుకూరి పూర్ణచంద్రరావు చెప్పడంతో, దర్శకుడు విశ్వనాథ్ వద్దకు వెళ్ళి ఈ కథ విన్నారు రాజు. ఈ కథను కూడా ఆయన ఎన్టీఆర్‌తోనే తీద్దామనుకున్నారట! కానీ, ఫస్టాఫ్‌లో హీరో కాలేజీ విద్యార్థిగా కనిపించడం లాంటివి ఉన్నాయని తటపటాయించారు. చివరకు ఎన్టీఆరే 'మనం మరో కథతో సినిమా చేద్దాం. శోభన్‌బాబు లాంటి నవతరం హీరోతో ఈ కథ తెరకెక్కించమన్నార'ట! అలా రెగ్యులర్‌గా ఎన్టీఆర్‌తో సినిమాలు చేసే కంపెనీలోకి హీరోగా శోభన్‌బాబు వచ్చి చేరారు. అలా వచ్చింది- 'జీవనజ్యోతి'. ఈ సూపర్‌హిట్ తర్వాత ఆ అందాల నటుడు ఆ బ్యానర్‌లోనే 'జీవితనౌక' (1977), 'కాలాంతకులు' (1978), 'దోషి-నిర్దోషి' (1990) చేశారు. ఇక, 'జీవనజ్యోతి' కన్నా ముందు నుంచే విశ్వనాథ్‌తో 'చిన్ననాటి స్నేహితులు' (1971) లాంటి చిత్రాలు నిర్మించిన రాజు అటు తర్వాత ఆ సృజనశీలికి పెద్దపీట వేశారు. 1980ల దాకా ఆయన నిర్దేశకత్వంలో పలు చిత్రాలు తీస్తూ వచ్చారు.


తెరపై ప్రతిభామూర్తుల త్రివేణీ సంగమం

చరిత్ర గమనిస్తే, 'జీవనజ్యోతి' సమయానికి శోభన్‌బాబు హీరోగా వరుస విజయాలతో తారాపథానికి ఎదిగారు. ప్రతిభాశాలి అయిన దర్శకుడు కె. విశ్వనాథ్ ఏమో మూడేళ్ళు వరుసగా ఉత్తమ చిత్రాలు అందించి, వాటికి రాష్ట్ర ప్రభుత్వ బంగారు నందులు సాధించి, మంచి ఊపు మీదున్నారు. పైగా, ఆ మూడు చిత్రాల్లోనూ హీరో శోభన్‌బాబే. హీరోయిన్ వాణిశ్రీ అప్పటికే సమకాలికులు అందరినీ దాటుకుంటూ ఆల్‌రెడీ అగ్రతారగా ఎదిగారు. ఆంధ్రుల అభిమాన నటీమణిగా మార్కెట్‌లో వెలిగారు. టాప్ హీరోలు ఎన్టీఆర్ ('కోడలు దిద్దిన కాపురం', 'దేశోద్ధారకులు', 'మాయా మశ్చీంద్ర'), ఏయన్నార్ ('దసరా బుల్లోడు', 'ప్రేమ్‌నగర్') సరసన తీరిక లేనంత బిజీగా ఉన్నారు. అలాంటి సమయంలో ఈ సెంటిమెంటల్ కుటుంబ కథ ఆమెకు వచ్చింది. అందులోనూ మానసికంగా దెబ్బతిన్న ముసలి తల్లి పాత్ర, ఆ కన్నతల్లి కోసం చిన్నారి కొడుకును త్యాగం చేసే కూతురి పాత్ర... రెండూ పోషించాల్సిన డ్యుయల్ రోల్ ఆఫర్. అంతకు ముందే కన్నడంలో సంచలనం రేపిన 'శరపంజర'(1971) చిత్రానికి తెలుగు రీమేక్‌గా హీరో కృష్ణంరాజు తీసిన 'కృష్ణవేణి' (1974)లో మానసిక స్వస్థత కోల్పోయిన ఇల్లాలిగా నటించి పేరు తెచ్చుకున్నారు 'కళాభినేత్రి' వాణిశ్రీ. ఆ వెంటనే ఈ 'జీవనజ్యోతి' లోని రెండు పాత్రలనూ మరో సవాలుగా తీసుకున్నారు. అలా అరుదైన దర్శకుడు, నాయికా నాయకుల కలయికలో నవరసాలూ రంగరించి, సప్తవర్ణాలతో 'ఈస్ట్‌మన్‌కలర్'లో తయారైంది 'జీవనజ్యోతి'.

గోదావరి పొంగు లాంటి కోనసీమ పిల్ల లక్ష్మి (వాణిశ్రీ)ని చూసీచూడగానే ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడు గుంటూరు పిల్లగాడు వాసు (శోభన్‌బాబు). అతనికీ, ఆ ఉమ్మడి కుటుంబానికీ జ్యోతిగా మెలుగుతున్న ఆమెకు అనుకోని ఓ విషాద ఘటనతో మతి చలిస్తుంది. ఆ విషాదాన్ని ఆమె మనసు నుంచి దూరం చేసి, ఆమెను ఎవరు, ఎలా మామూలు మనిషిని చేశారు? ఆ కుటుంబంలో మళ్ళీ జీవనజ్యోతి ఎలా వెలిగిందన్నదీ సెంటిమెంట్ ఫిల్మ్.

సినిమా ఫస్టాఫ్‌లో అల్లరిపిల్లగా కనిపించి, సెకండాఫ్‌లో పోగొట్టుకున్న తన బాబు కోసం ఆరాటపడే మతి భ్రమించిన మాతృమూర్తిగా కన్నీళ్ళుపెట్టించే లక్ష్మి పాత్రపోషణలోని రెండు విభిన్న ఛాయలను వాణిశ్రీ అద్భుతంగా అభినయించారు. అదే సమయంలో వయసు మళ్ళిన కన్నతల్లి కోసం తన 'బాబు'ను త్యాగం చేసే కూతురు శోభ పాత్రనూ అంతే పరిణతితో పోషించారు. 'సిన్ని ఓ సిన్నీ...' అని పాటలు పాడే కోడెకారు కుర్రవాడి నుంచి మానసికంగా దెబ్బతిన్న భార్యను కాపాడుకోవడానికి తపించే భర్త వరకు జీవితంలోని వివిధ దశల్ని ప్రతిఫలించే వాసు పాత్రలో ఆ పరిణామాన్ని శోభన్‌బాబు తెరపై బాగా చూపారు. ముఖ్యంగా, చిన్నారి 'బాబు'గా బేబీ వరలక్ష్మి కూడా రెండు పాత్రల్లో ఆ రోజుల్లో ప్రేక్షకుల మనసు చూరగొంది. రథం కింద బాబు పడిపోయే అత్యంత కీలకమైన దృశ్యం గగుర్పాటు కలిగించి, కన్నీరు తెప్పించింది. సినిమా కథను మలుపు తిప్పే ఆ సన్నివేశ చిత్రీకరణలో దర్శకుడి ప్రతిభ, జి.కె. రాము ఛాయాగ్రహణ నైపుణ్యం తెరపై... సినిమా కాదు, నిజజీవిత ఘట్టం చూస్తున్నామన్నంత అనుభూతిని కలిగించాయి.

డి.వి.ఎస్. ప్రొడక్షన్స్ సంస్థలో కలర్‌లో తీసిన తొలి సినిమా కూడా ఇదే! అందుకు తగ్గట్టే, నిర్మాత రాజు తాను పుట్టిపెరిగిన కోనసీమ ప్రాంత అందాలనూ, ఆహ్లాదం పంచే అరటి - కొబ్బరి తోటలనూ, గోదావరి నదీ తీర సౌందర్యాన్నీ పాటల్లో, సన్నివేశాల్లో చూపేలా గన్నవరం ఆక్విడెక్ట్ వద్ద, అమలాపురం దగ్గరలోని కోడూరుపాడు, అల్లవరం, వెన్నుమూరు లంక గ్రామాల్లో చిత్ర నిర్మాణం సాగించారు. ఆయన మేనమామ గారి ఊరైన కోడూరుపాడులోనే క్లిష్టమైన రథోత్సవం సీన్ చిత్రీకరణ సాగింది.



● దర్శకుడు కె. విశ్వనాథ్



● శోభన్‌బాబు, వాణిశ్రీ

అభిప్రాయ భేదాలున్నా... అదే అభిమానం!

సినిమా చూస్తున్నంత సేపూ ప్రేక్షకుల్ని కథలో లీనమైపోయేలా తీసిన ప్రతిభ దర్శకుడిది. ప్రముఖ రచయిత ఆరుద్ర జీవిత భాగస్వామి - స్వయంగా ప్రఖ్యాత రచయిత్రి అయిన శ్రీమతి కె. రామలక్ష్మి ఈ చిత్రానికి మూలకథ సమకూర్చారు. దానికి విశ్వనాథ్ స్క్రీన్‌ప్లేతో సానపెట్టారు. (రామలక్ష్మి నవల 'ఆడది' ఈ చిత్రానికి మూలమని కొందరు రాస్తుంటారు. కానీ, 1967- '68 ప్రాంతంలో ధారావాహికగా రాసిన ఆ చిన్న నవలకూ, ఈ సినిమాకూ పోలికే లేదు). అయితే, ఈ చిత్ర సందర్భంగా రామలక్ష్మి, విశ్వనాథ్‌ల మధ్య సృజనాత్మక అభిప్రాయభేదాలు వచ్చాయి. ఆ తరువాత వారిద్దరూ ఎప్పుడూ కలసి పనిచేయలేదు. కానీ, చివరి వరకు పరస్పర గౌరవాభిమానాలు మాత్రం ఎప్పటిలానే కొనసాగడం నేటి తరానికి ఓ గొప్ప జీవనపాఠం.


'జీవనజ్యోతి'లో కె. విశ్వనాథ్ ఎప్పటిలానే విలక్షణమైన క్యారెక్టర్లు, వాటికంటూ ప్రత్యేకమైన క్యారెక్టరైజేషన్లతో పాటు తనదైన మార్కుతో కథలో అంతర్భాగంగానే రాజబాబు, రమాప్రభ జంటతో హాస్యం చిలికించారు. ఆయన చిరకాల మిత్రుడు, సహాధ్యాయి అయిన సముద్రాల జూనియర్ సంభాషణల్లో తన పట్టును మరోసారి ఈ చిత్రంలో చూపారు. అఫ్‌కోర్స్... ఆ రచనలో విశ్వనాథ్ గారి అదృశ్యహస్తమూ ఉందనేది బహిరంగ రహస్యం. సాక్షాత్తూ చిత్ర నిర్మాత డి.వి.ఎస్. రాజు సైతం బాహాటంగా చెప్పిన సత్యం.



● శోభన్ బాబు, వాణిశ్రీ

'జీవనజ్యోతి' వసూళ్ళ రేంజ్ ఘనత అదీ!

ఆ రోజుల్లో 'జీవనజ్యోతి' మొత్తం 32 కేంద్రాల్లో రిలీజై, అశేష ప్రేక్షకాదరణతో ఏకంగా 31 సెంటర్లలో 50 రోజులు ఆడింది. అదే ఊపులో 12 కేంద్రాల్లో శతదినోత్సవం జరుపుకొంది. నిజానికి, ఈ చిత్రం మరిన్ని కేంద్రాల్లో నూరు రోజుల పండుగ చేసుకోవాల్సి ఉంది. అయితే, దిగువ కేంద్రాలకు త్వరగా కొత్త సినిమా పంపడం కోసం పంపిణీదారులైన విజయా పిక్చర్స్ వారి పద్ధతైన 50 - 50 శాతం షేర్ వసూళ్ళ షరతు అవరోధమైంది. అలా కొన్ని సెంటర్లలో 80, 90 రోజులు పూర్తయ్యాక కూడా శతదినోత్సవ ఘనత రాకుండానే 'జీవనజ్యోతి'ని థియేటర్ నుంచి తప్పించిన తార్కాణాలున్నాయి. హైదరాబాద్‌లో మాత్రం ఈ చిత్రం షిఫ్టులతో 25 వారాలు నడిచింది. హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో విజయలక్ష్మీ టాకీస్‌లో ఆ ఏడాది నవంబర్ 6న అలా సిల్వర్ జూబ్లీ పూర్తి చేసుకుంది.



● బేబీ వరలక్ష్మి

'జీవనజ్యోతి' తర్వాత ఏడు నెలలకు 1975 లోనే డిసెంబర్‌లో వచ్చిన శోభన్‌బాబు 'సోగ్గాడు' సైతం పెద్ద హిట్. అది కూడా 32 కేంద్రాల్లోనే రిలీజై, 31 కేంద్రాల్లో 50 రోజులు జరుపుకోవడం విశేషం. అయితే, ఆ చిత్రం 19 సెంటర్లలో వంద రోజులాడినా, రజతోత్సవ ఘనత దక్కలేదు. చాలామందికి తెలియనిదేమిటంటే, శోభన్ కెరీర్‌లో అతి పెద్ద కమర్షియల్ హిట్ అని అందరూ అనుకొనే 'సోగ్గాడు' కన్నా 'జీవనజ్యోతి'దే వసూళ్ళలో పైచేయి. ఆశ్చర్యంగా అనిపించినా అదే నిజం. టికెట్ రేట్లు ఎక్కువుండే ఏసీ, డీలక్స్ థియేటర్లలో 'సోగ్గాడు' రిలీజైన కాకినాడ, నెల్లూరు టౌన్లను మినహాయిస్తే... మిగతా అన్ని కేంద్రాల్లోనూ ఎక్కువ వసూళ్ళు వచ్చింది - 'జీవనజ్యోతి'కే!

ఈ చిత్రం హిట్ రేంజ్‌కు మచ్చుకు ఓ ఉదాహరణ - కీలకమైన గుంటూరు కేంద్రం బాక్సాఫీస్ కథ. సినీచరిత్రలో... గుంటూరు టౌన్‌లో రూ. 4 లక్షల పైచిలుకు వసూలు చేసిన మొదటి సినిమా- ఈ 'జీవనజ్యోతే'. ఆ తర్వాత మళ్ళీ రెండేళ్ళకు ఎన్టీఆర్ 'దాన వీర శూర కర్ణ' (1977) అంతటి వసూళ్ళతో, ఆ ఘనత సాధించిన రెండో సినిమా అయింది. విశేషం ఏమిటంటే, మిగతా హీరోలంతా గుంటూరులో ఆ మైలురాయి వసూళ్ళకు చేరుకోవడానికి దాదాపు అయిదారేళ్ళ సమయం పట్టింది. కృష్ణకు 'ఊరుకి మొనగాడు'(1981), కృష్ణంరాజుకి 'సీతారాములు' (1980), ఏయన్నార్‌కి 'ప్రేమాభిషేకం' (1981) వచ్చేవరకు గుంటూరులో ఆ 4 లక్షల మైలురాయి లేదన్నది బాక్సాఫీస్ విశ్లేషకుల మాట. సాక్షాత్తూ శోభన్‌బాబు సైతం 'జీవనజ్యోతి' తర్వాత ఏడేళ్ళకు 'దేవత' (1982 సెప్టెంబర్ 10 రిలీజ్) వచ్చేవరకు మరోసారి ఆ రూ. 4 లక్షల ఘనత గుంటూరులో సాధించలేదు. అయితే, ఆ నడిమధ్య కాలంలో ఎన్టీఆర్ నటించిన పలు సినిమాలు మాత్రం రూ. 4 లక్షల మైలురాయిని దాటి, వసూలు చేశాయి. అదీ 'జీవనజ్యోతి' హిట్ రేంజ్!



● నిర్మాత డి.వి.ఎస్. రాజు

శోభన్‌బాబు కెరీర్‌లో... టాప్ ఇయర్!

స్వీయ నిబంధనలకు తగ్గట్టు నటించి, ఇంకా క్రేజ్, ఇమేజ్ ఉన్నా సరే సొంత ఆలోచనలకు తగ్గట్టే నటన విరమించిన అందాల నటుడు, 'నటభూషణ' శోభన్‌బాబుది చిరస్మరణీయమైన సినీ జీవితం. అంతటి కెరీర్‌లోనూ ఆయనకు శిఖరాయమాన సంవత్సరమంటే - 'జీవనజ్యోతి' రిలీజైన 1975యే! టాప్ హీరో ఎన్టీఆర్ గణనీయమైన సంఖ్యలో సినిమాలు చేస్తున్నా, హిట్లూ - కలెక్షన్లూ వస్తూనే ఉన్నా, జనం ఆగి అబ్బురపడేటంత భారీ బాక్సాఫీస్ హిట్లు రాని ఏడాది అది. మరో అగ్రహీరో ఏయన్నార్ అంతకు ముందే అమెరికాలో గుండె ఆపరేషన్ చేయించుకొని వచ్చారు. సినిమాలకు విరామమిచ్చి, పూర్తిగా విశ్రాంతి తీసుకోవడంతో, ఆ ఏడాది ఆయనకు రిలీజులే లేవు. శోభన్‌కు సాటివాడైన హీరో కృష్ణ చకచకా సినిమాలు చేస్తున్నప్పటికీ, క్రిందటేడు 'అల్లూరి సీతారామరాజు' (1974) తెచ్చిన ఇమేజ్ దెబ్బతో, 'పాడిపంటలు' (1976) వరకు సినిమాలన్నీ వరుసగా ఫ్లాపవుతున్న వత్సరమది. అలాంటి చిత్రమైన సందర్భంలో శోభన్‌బాబు పట్టిందల్లా బంగారమైంది.

ఆ 1975లో శోభన్ సినిమాలు మొత్తం 8 రిలీజయ్యాయి. అందులో 5 ('దేవుడు చేసిన పెళ్ళి', 'జీవనజ్యోతి', 'బలిపీఠం', 'జేబు దొంగ', 'సోగ్గాడు')హిట్లు. రెండే ('గుణవంతుడు', 'అందరూ మంచివారే') ఫ్లాపులు. ఒకటి మాత్రం ('బాబు') యావరేజ్. 5 హిట్లలోనూ 'జీవనజ్యోతి' ఒకటే 25 వారాలు ఆడి, సిల్వర్‌జూబ్లీ చేసుకుంది. ఏయన్నార్‌కి పర్మినెంట్ నిర్మాతైన డి. రామానాయుడు తీసిన 'సోగ్గాడు' సైతం రజతోత్సవానికి ఒక వారం ముందే థియేటర్ల నుంచి వైదొలగింది. అలా ఒకే ఏడాది అధికశాతం కమర్షియల్ సక్సెస్‌లతో శోభన్ క్రేజు పెరిగిపోయింది. పరిశ్రమలోఆయన రేంజే మారిపోయింది.

విశేషమేమిటంటే, అదే ఏడాది ప్రపంచ మహిళా సంవత్సరం. ఈ సెంటిమెంట్ సినిమాకు స్త్రీలు పోటెత్తడంతో, కొన్ని తరగతుల టికెట్లు, కొన్ని షోలు ఆడవారికే స్పెషల్‌గా కేటాయించేవారు. మూకీలు పోయి టాకీలొచ్చాక సినిమా ఆధునికమయ్యాక ఈ లేడీస్ స్పెషల్ షో ట్రెండ్‌కూ ఈ 'జీవనజ్యోతే' నాంది!

ప్రాంతాలు, భాషల తేడా లేకుండా ఈ సార్వత్రికమైన తల్లి సెంటిమెంట్ అన్ని చోట్లా పండింది. సింపుల్ సెంటిమెంట్ కథ, విశ్వనాథ్ దర్శకత్వ ప్రతిభ, వాణిశ్రీ అభినయం, అందాల శోభన్ క్రేజీ ఇమేజ్, హిట్ సాంగ్స్‌తో ఇవాళ చూసినా 'జీవన జ్యోతి' తాజాగా ఉండడం విశేషం.

- రెంటాల జయదేవ

దర్శకేంద్రుణ్ణి వెనక్కి నెట్టిన కళాతపస్వి!

సరిగ్గా ఆ ఏడాదే, అదీ శోభన్‌బాబు హీరోగానే 'బాబు' చిత్రంతో కె. రాఘవేంద్రరావు దర్శకుడయ్యారు. 'జీవనజ్యోతి'కి సరిగ్గా 14 రోజుల ముందు 1975 మే 2న ఆ సినిమా రిలీజైంది. భారీ తారాగణం, ఖరీదైన సెట్లతో సహా అన్ని రకాల హంగులు, 'ఒక జంట కలిసిన తరుణాన జేగంట మ్రోగెను గుడి లోన...' లాంటి పాపులర్ పాటలతో ఆ చిత్రం రిలీజైంది. కొత్త దర్శకుడైనా, ఖరీదైన టేకింగ్‌తో సినిమా ఫరవాలేదని అనిపించుకుంటున్న తరుణంలో... సరిగ్గా 2 వారాలకు శోభన్‌బాబే నటించిన కె.విశ్వనాథ్ 'జీవనజ్యోతి' అనుకోని పోటీగా అవతరించింది. మనసుకుపట్టే పాటలు, మహిళల్ని కట్టిపడేసే సెంటిమెంట్‌తో 'జీవనజ్యోతి' సమకాలపు సినిమాలన్నిటినీ చిత్తు చేసి, బాక్సాఫీస్ విన్నరైంది. ఇంకా చెప్పాలంటే, ఆ ఏడాది తెలుగులో వచ్చిన చిత్రాలన్నిటిలోకీ అత్యధిక వసూళ్ళు ఆ సినిమావే! ''అప్పట్లో విశ్వనాథ్ గారి 'జీవనజ్యోతి' హోరులో నా తొలిచిత్రం 'బాబు' అడ్రస్ గల్లంతైంది'' అని తర్వాతి కాలంలో దర్శకేంద్రుడిగా ఎదిగిన రాఘవేంద్రరావే స్వయంగా అంగీకరించారు. కలెక్షన్ల రీత్యా 'బాబు' యావరేజ్ సినిమాగా నిలిచినా, మితిమీరిన చిత్ర నిర్మాణ వ్యయం కారణంగా ట్రేడ్ లెక్కలో ఆ సినిమా ఫెయిల్యూర్‌గా మిగిలింది. తర్వాతి కాలంలో అదే రాఘవేంద్రరావు వసూళ్ళవర్షం కురిపించే కమర్షియల్, మాస్ చిత్ర దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. అదే కె. విశ్వనాథ్ అభిరుచి గల కళాత్మక చిత్రాలతోనూ కాసులు కురిపించిన సినీ తపస్విగా సుస్థిరస్థానం సంపాదించుకున్నారు. అదీ విశేషం.

అయిదేళ్ళలో 4 బంగారాల క్రేజీ కాంబినేషన్

కొన్ని కాంబినేషన్లు కుదిరిన వేళావిశేషం అంతే! విశ్వనాథ్ - శోభన్‌బాబుల కాంబినేషన్ 'జీవనజ్యోతి' ముందు నుంచీ సూపర్‌డూపర్ సక్సెసే. కాసులతో పాటు కావలసినంత పేరూ తెచ్చింది. 1971 నుంచి 1973 దాకా వరుసగా మూడేళ్ళూ వారిద్దరి కలయిక ('చెల్లెలి కాపురం', 'కాలం మారింది', 'శారద') కమర్షియల్ హిట్. ఆ చిత్రాలన్నీ ఉత్తమ చిత్రాలుగా రాష్ట్ర ప్రభుత్వ బంగారు నందులు సాధించడం తిరుగులేని రికార్డు! ఒక్క ఏడాది గ్యాప్ తర్వాత 1975లో మళ్ళీ వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'జీవనజ్యోతి' కూడా బాక్సాఫీస్ వద్దే కాక అవార్డుల్లోనూ బంగారమే పండించింది. అదీ అప్పట్లో విశ్వనాథ్ - శోభన్‌బాబుల క్రేజీ కాంబినేషన్ ఘనత. మరో విశేషం ఏమిటంటే... మధ్యలో 1974లో వాళ్ళిద్దరి కలయికలో సినిమా రాలేదు కానీ, ఆ ఏడాది కూడా విశ్వనాథ్ దర్శకత్వంలోని 'ఓ సీత కథ' (1974) బంగారు నందిని కాకున్నా, ద్వితీయ ఉత్తమ చిత్రంగా వెండి నందిని గెలిచింది. ఆ 1974లో బంగారు నంది తెలుగు విప్లవవీరుడి జీవితకథ అయిన కృష్ణ 'అల్లూరి సీతారామరాజు'ను వరించింది.

ఇంటింటా మోగిన ఆ పాటలు

'ఇంత మంచి చిత్రం ఇటీవల రాలేదనీ, ఇది సినిమా కాదు... జీవితమనీ' ఈ సినిమాకు జనం నీరాజనాలు పట్టారు. ఆ రోజుల్లో 'ముద్దుల మా బాబు నిద్రరోతున్నాడు... సద్దు చేశారంటే ఉలికులికి పడతాడు...' (గానం: పి. సుశీల) పాట మోగని ఇల్లు లేదు. పాడని తల్లి లేదు. 'ఎక్కడ ఎక్కడ దాక్కున్నావో చెప్పుకో' (గానం: బి. వసంత, పి. సుశీల) అంటూ సినిమాలో కీలకమైన పిల్లాడి పాత్ర మీద వచ్చే పాట అప్పట్లో ఆబాలగోపాలానికీ ఆల్‌టైమ్ ఫేవరెట్. డ్యూయెట్లలో 'సిన్ని ఓ సిన్నీ... ఓ సన్నజాజుల సిన్నీ...' పాట అన్ని దిక్కుల ప్రేక్షకుల్నీ ఊపేసింది. కొత్తగా పెళ్ళయిన జంట మీద వచ్చే 'ఎందుకంటే ఏమి చెప్పను... ఏమిటంటే ఎలా చెప్పను...' గీతం యువ ప్రేక్షకుల్ని స్వానుభవాల ఊహలలో తేలియాడించింది. వెరసి, ''పూతరేకుల తీయదనం... పాలమీగడ కమ్మదనం'' నిండిన సినారె సాహిత్యం, కె.వి. మహదేవన్ సంగీతం, విశ్వనాథ్ మార్కు సంగీత - సాహిత్యాభిరుచి త్రివేణీ సంగమమై, పాటల పల్లకీలో ఈ మ్యూజికల్ హిట్ చిత్రాన్ని ఊరూరా బాక్సాఫీస్ వద్ద ఊరేగించాయి.

హిందీలోనూ... హిట్టయిన మదర్ సెంటిమెంట్!



● జయప్రదతో హిందీలో 'సన్‌జోగ్'గా

బాక్సాఫీస్ రికార్డులే కాదు... విమర్శకుల రివార్డులు, ప్రభుత్వ - ప్రైవేటు అవార్డుల్లోనూ 'జీవనజ్యోతి'కి అగ్రతాంబూలం దక్కింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే నంది అవార్డుల్లో ఆ ఏడాదికి బంగారు నంది అందుకున్న ఉత్తమ చిత్రం అదే! (అప్పటికింకా వ్యక్తిగత విభాగాల్లో ప్రత్యేకంగా నంది అవార్డులు ఇవ్వడమనే ఆనవాయితీ లేదు. ఉత్తమ చిత్రం అవార్డు కింద నిర్మాత, దర్శకుడు, హీరో, హీరోయిన్లను అందరినీ గౌరవించేవారు. అలా 'జీవనజ్యోతి' ప్రధాన బృందం అంతటికీ గౌరవం దక్కింది). ఇక, పాపులర్ అవార్డులైన 'ఫిల్మ్‌ఫేర్'లోనూ దక్షిణాదిన ఈ సినిమాదే హవా. ఉత్తమ తెలుగు సినిమా, ఉత్తమ దర్శకుడు (కె. విశ్వనాథ్), ఉత్తమ నటుడు (శోభన్‌బాబు), ఉత్తమ నటి (వాణిశ్రీ)... ఇలా అవార్డుల పంట పండింది. ఇదే సినిమా దశాబ్ద కాలం తర్వాత విశ్వనాథ్ దర్శకత్వంలోనే హిందీలో జితేంద్ర, జయప్రదలతో 'సన్‌జోగ్' (1985)గా రీమేకైంది. అక్కడా ఈ కథ హిట్. కథానాయికగా జయప్రదకు మంచి పేరు తెచ్చింది. ఉత్తమ నటిగా ఆమె 'ఫిల్మ్‌ఫేర్'కు నామినేటైంది. చిత్రమేమంటే, ఈ తెలుగు సూపర్ హిట్ సినిమా 21 ఏళ్ళ తర్వాత కన్నడంలోనూ వచ్చింది. విష్ణువర్ధన్, ఆమనితో 'బాళిన జ్యోతి' (1996)గా క్రాంతికుమార్ దర్శకత్వంలో తెరకెక్కింది.

థగ్ లైఫ్ ట్రైలర్ రెడీ



● కమల్‌హాసన్

హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'థగ్ లైఫ్'. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రంలో శింబు, త్రిషా కృష్ణన్, ఐశ్వర్యా లక్ష్మీ, జోజూ జార్జ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్, మణిరత్నం, శివ అనంత్, ఉదయనిధి స్టాలిన్ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం జూన్ 5న విడుదల కానుంది. కమల్‌హాసన్ 'విక్రమ్', శివ కార్తికేయన్ 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చిన ఎన్. సుధాకర్‌రెడ్డి, ఈ 'థగ్ లైఫ్' సినిమాను శ్రేష్ఠ్ మూవీస్ బ్యానర్‌పై తెలుగులో విడుదల చేస్తున్నారు. కాగా ఈ సినిమా ప్రమోషనల్ ప్లాన్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ నెల 17న ట్రైలర్‌ను ఆన్‌లైన్‌లో రిలీజ్ చేయనున్నారు. అలాగే ఈ నెల 24న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ఆడియో లాంచ్, 29న విశాఖపట్నంలో తెలుగు వెర్షన్ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లుగా మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. ఈ రెండు ప్రమోషనల్ ఈవెంట్స్‌కు ముందు చెన్నైలోని సాయిరామ్ కాలేజీలో ఈ చిత్రం సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ లైవ్ పెర్ఫార్మెన్స్‌తో, 'థగ్ లైఫ్' ఆడియో లాంచ్ ఈవెంట్ జరపనున్నట్లు మేకర్స్ తెలిపారు. అలాగే పాన్ ఇండియా స్థాయిలో 'థగ్ లైఫ్' సినిమా ప్రమోషన్స్‌ను నిర్వహించనున్నట్లుగా మేకర్స్ వెల్లడించారు. ఇదిలా ఉంటే... 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో దాదాపు 38 సంవత్సరాల తర్వాత రానున్న 'థగ్ లైఫ్' సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.

ముంబై నేపథ్యంలో....



● పాయల్ కపాడియా


గత ఏడాది జరిగిన 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' సినిమాకు గ్రాండ్ ప్రీ అవార్డును అందుకున్నారు పాయల్ కపాడియా. తాజాగా జ్యూరీ సభ్యురాలి హోదాలో కాన్స్‌కు హాజరైన ఆమె మాట్లాడుతూ- ''ప్రస్తుతం నేను రెండు సినిమాలపై వర్క్ చేస్తున్నాను. ఈ రెండు సినిమాలూ ముంబై నేపథ్యంలోనే ఉంటాయి. ఓ ట్రయాలజీలా ఉంటుంది. నేను చెప్పాలనుకున్న కథలు ఇంకా చాలానే ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు పాయిల్ కపాడియా.

ఆలియా వెళతారా?

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఆలియా భట్ హాజరవుతారా? లేదా అనే అంశంపై చర్చ కొనసాగుతోంది. అయితే ప్రస్తుతం 'లవ్ అండ్ వార్' సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు ఆలియా. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా ఇది. ఈ మూవీ షూటింగ్‌తో బిజీగా ఉండటం వల్లే కాన్స్ ఓపెనింగ్ సెలబ్రేషన్స్‌లో ఆలియా పాల్గొనలేకపోయారని, ఈ చిత్రోత్సవాలు పూర్తయ్యేలోపు పాల్గొంటారని బాలీవుడ్ సమాచారం.

భారత్‌లో ఇంధన డిమాండ్ జోరు

- చైనాను మించి వేగంగా వృద్ధి
- ఈ ఏడాది 3.4% పెరిగే అవకాశం
- ఒపెక్ అంచనా



న్యూఢిల్లీ: ప్రధాన దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇంధనానికి డిమాండ్ వేగంగా పెరుగుతోంది. 2025, 2026లో చైనాకు రెండింతల వేగంతో వృద్ధి చెందనుంది. చమురు ఎగుమతి దేశాల సమాఖ్య ఒపెక్ తాజా నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. దీని ప్రకారం దేశీయంగా 2024లో రోజుకు 5.55 మిలియన్ బ్యారెళ్లుగా (ఎంబీపీడీ) ఉన్న డిమాండ్ 2025లో 3.39 శాతం వృద్ధితో 5.74 ఎంబీపీడీకి చేరనుంది. అలాగే 206లో 4.28 శాతం పెరిగి 5.99 ఎంబీపీడీకి ఎగియనుంది. అదే సమయంలో చైనాలో ఆయిల్‌కు డిమాండ్ ఈ ఏడాది, వచ్చే ఏడాది వరుసగా 1.5 శాతం, 1.25 శాతం మేర పెరగనుంది. వినియోగదారులు ఖర్చు పెడుతుండటం, పెట్టుబడుల ప్రవాహం, కీలక రంగాలకు ప్రభుత్వ మద్దతు తదితర అంశాలతో భారత్ పటిష్టమైన ఆర్థిక వృద్ధిని సాధించే ధోరణి కొనసాగుతుందని ఒపెక్ పేర్కొంది. అమెరికా ఇటీవల ప్రకటించిన టారిఫ్‌లతో భారత జీడీపీపై ప్రభావం చూపినప్పటికీ, ద్రవ్య..ఆర్థిక విధానాలపరమైన ఉద్దీపన చర్యలతో దాన్ని కొంత మేర అధిగమించవచ్చని వివరించింది. సమీప భవిష్యత్తులో భారత్‌లో ఆయిల్‌కి డిమాండ్ స్థిరంగా ఉంటుందనే సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయని పేర్కొంది. దీనికి డీజిల్ ప్రధాన చోదకంగా నిలుస్తుందని ఒపెక్ వివరించింది. భారత్ సింహభాగం క్రూడాయిల్ కోసం (85 శాతం) దిగుమతులపైనే ఆధారపడాల్సి ఉంటోంది. మార్చి డేటా ప్రకారం రష్యా నుంచి దిగుమతులు ఫిబ్రవరిలో నమోదైన 31 శాతంతో పోలిస్తే అత్యధిక స్థాయి 36 శాతానికి పెరిగాయి. 17 శాతం వాటాతో ఇరాక్ రెండో స్థానంలో, 11 శాతంతో సౌదీ అరేబియా మూడో స్థానంలో ఉన్నాయి.

మరిన్ని విశేషాలు..

- రహదారుల విస్తరణ భారీ స్థాయిలో జరుగుతున్నందున తారుకు కూడా డిమాండ్ పెరుగుతోంది. రవాణా ఇంధనాలు, తయారీ రంగం పుంజుకుంటుందనే బలమైన అంచనాలు, పెట్రోకెమికల్ రంగం ఫీడ్‌స్టాక్ అవసరాలు పెరగడం వంటి అంశాలు ఆయిల్ డిమాండ్‌కి కారణంగా నిలవనున్నాయి.
- 2026లో వాణిజ్య సంబంధ చర్చల దన్నుతో టారిఫ్‌లు గణనీయంగా తగ్గొచ్చు. దీనితో వాటి ప్రతికూల ప్రభావం పరిమిత స్థాయిలోనే ఉండొచ్చు.
- తయారీ, సేవల రంగాలు పటిష్టంగా ఉండటం, కీలక రంగాలకు ప్రస్తుత ప్రభుత్వం మద్దతునిస్తుండటం, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం లాంటి అంశాల వల్ల భారత ఎకానమీ వృద్ధి బాటలో ముందుకెళ్లనుంది.
- అంతర్జాతీయంగా చమురు డిమాండ్ కాస్త నెమ్మదించినా వరుసగా రెండేళ్లలో 1.3 ఎంబీపీడీ స్థాయిలో పెరిగే అవకాశం ఉంది.
- చమురుకు డిమాండ్‌లో అమెరికా అగ్రస్థానంలోనే కొనసాగనుంది. 2025లో 20.5 ఎంబీపీడీతో అమెరికా మొదటి స్థానంలో, 16.90 ఎంబీపీడీతో చైనా రెండో స్థానంలో ఉండనుంది. భారత్ మూడో స్థానంలో ఉంటుంది.

ప్యాసింజర్ వాహన అమ్మకాలు 4% అప్

- ఏప్రిల్‌లో 3.49 లక్షల విక్రయాలు
- ద్వి చక్రవాహన అమ్మకాల్లో రెండంకెల క్షీణత
- భారత వాహన తయారీదార్ల సంఘం సియామ్ వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో ప్రయాణికుల వాహనాల టోకు అమ్మకాలు ఏప్రిల్‌లో 4% పెరిగి 3,48,847 యూనిట్లకు చేరుకున్నాయని భారత వాహన తయారీదార్ల సంఘం (సియామ్) వెల్లడించింది. 2024 ఏప్రిల్‌లో విక్రయాలు 3,35,629 వాహనాలతో పోలిస్తే ఇవి 4% అధికంగా ఉన్నాయి. ద్వి చక్రవాహన విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 17% క్షీణించి 17,51,393 నుంచి 14,58,784 యూనిట్లకు తగ్గాయి. ఇందులో మోటార్ సైకిల్ సరఫరా 23% తగ్గి 8,71,666 యూనిట్లకు దిగివచ్చాయి. స్కూటర్ అమ్మకాలు 5,81,277 నుంచి 5,48,370 యూనిట్లకు; మోపెడ్ విక్రయాలు 41,924 నుంచి 38,748 యూనిట్లకు తగ్గాయి. త్రిచక్రవాహన విక్రయాలు సైతం స్వల్పంగా 0.75% తగ్గి 49,441 యూనిట్లకు దిగివచ్చాయి. '' ప్యాసింజర్ వాహన విభాగం ఏప్రిల్ 2025లో ఇప్పటివరకు అత్యధికంగా 3.49 లక్షల యూనిట్ల అమ్మకాలను నమోదు చేసింది. ఇది ఏప్రిల్ 2024తో పోలిస్తే 3.9 శాతం ఎక్కువ. అధిక బేస్ ప్రభావం అమ్మకాలపై పడటంతో ద్విచక్రవాహన విభాగం రెండంకెల క్షీణతను చవిచూసింది. రానున్న నెలల్లో తిరిగి పుంజుకునే వీలుంది'' అని సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మీనన్ తెలిపారు.

హానికర సైట్లను బ్లాక్ చేసేందుకు ఎయిర్‌టెల్ సొల్యూషన్



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో హానికరమైన వెబ్‌సైట్లను గుర్తించి, బ్లాక్ చేసే ఫ్రాడ్ డిటెక్షన్ సర్వీసును అందుబాటులోకి తెచ్చినట్లు టెలికం సంస్థ ఎయిర్‌టెల్ వెల్లడించింది. ఇది వాట్సాప్, టెలిగ్రాం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, ఈమెయిల్ మొదలైన ఓవర్-ది-టాప్ (ఓటీటీ) కమ్యూనికేషన్ యాప్స్, ప్లాట్‌ఫాంలన్నింటికీ పని చేస్తుంది. తమ మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్లకు అదనంగా ఎలాంటి చార్జీలు లేకుండా కంపెనీ దీన్ని ఆటో-ఎనేబుల్ చేస్తుంది. ఈ సర్వీస్ ప్రకారం ఎయిర్‌టెల్ అధునాతన సెక్యూరిటీ సిస్టం హానికరమైనదిగా గుర్తించిన వెబ్‌సైట్‌ను యాక్సెస్ చేయడానికి కస్టమర్ ప్రయత్నిస్తే, పేజీ లోడ్ కాదు. బ్లాక్ చేయడానికి గల కారణాన్ని వివరించే పేజీ వస్తుంది. ప్రస్తుతానికి ఈ సర్వీసు హర్యానా సర్కిల్‌లో అందుబాటులో ఉందని, త్వరలో దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టే ప్రణాళికలు ఉన్నాయని సంస్థ వైస్ చైర్మన్ గోపాల్ విఠల్ తెలిపారు. దీనితో స్కామ్‌ల బారిన పడతామనే భయం లేకుండా కస్టమర్లు నిశ్చింతగా ఇంటర్నెట్‌ను బ్రౌజ్ చేసుకునేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.

ఏప్రిల్‌లో నిరుద్యోగిత రేటు @ 5.1 శాతం

తొలిసారిగా నెలవారీ డేటా విడుదల

న్యూఢిల్లీ: ఈ ఏడాది ఏప్రిల్‌లో నిరుద్యోగిత రేటు 5.1 శాతంగా నమోదైంది. ఇప్పటివరకు ఈ డేటాను మూడు నెలలకోసారి, ఏడాదికోసారి ప్రకటిస్తున్న కేంద్రం .. ఇలా నెలవారీ గణాంకాలను విడుదల చేయడం ఇదే ప్రథమం. ఉద్యోగార్హతలు ఉన్న నిరుద్యోగుల గణాంకాలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే దిశగా కేంద్ర గణాంకాలు, ప్రోగ్రాంల అమలు శాఖ గురువారం తొలిసారిగా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేను (పీఎల్ఎఫ్ఎస్) విడుదల చేసింది. వీటి ప్రకారం ఏప్రిల్‌లో వివిధ వయస్సుల్లోని ఉద్యోగార్థుల్లో నిరుద్యోగిత రేటు 5.1 శాతంగా ఉంది. ఇది మహిళలతో పోలిస్తే (5 శాతం) పురుషుల్లో కాస్త అధికంగా 5.2 శాతంగా ఉంది. 89,434 కుటుంబాలపై (గ్రామీణ ప్రాంతాల్లో 49,323, పట్టణ ప్రాంతాల్లో 40,111) ఈ సర్వే చేశారు. ఇందులో 3,80,838 మంది (గ్రామీణ ప్రాంతాల్లో 2,17,483 మంది, పట్టణ ప్రాంతాల్లో 1,63,355 మంది) పాల్గొన్నారు.



మరిన్ని వివరాలు..

- దేశవ్యాప్తంగా 15-29 వయస్సు గ్రూప్‌లో నిరుద్యోగిత రేటు (యూఆర్) 13.8 శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఇది 17.2 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 12.3 శాతంగా నమోదైంది.
- 15-29 ఏళ్ల గ్రూప్‌లో మహిళల్లో యూఆర్ మొత్తం మీద 14.4 శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో 23.7 శాతంగా, గ్రామాల్లో 10.7 శాతంగా ఉంది. అదే పురుషుల విషయానికొస్తే దేశవ్యాప్తంగా 13.6 శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో 15 శాతంగా, గ్రామాల్లో 13 శాతంగా నమోదైంది.

మెష్ పేమెంట్స్‌తో జాగిల్ జట్టు

ముంబై: ఫిన్‌టెక్ సంస్థ జాగిల్ తాజాగా ట్రావెల్, ఎక్స్‌పెన్స్ సొల్యూషన్స్ సేవల సంస్థ మెష్ పేమెంట్స్‌తో జట్టు కట్టింది. మెష్ జారీ చేసే కార్పొరేట్ కార్డుల ద్వారా గ్లోబల్ మార్కెట్లో తమ వ్యయాలను నిర్వహించుకునేందుకు భారతీయ బహుళ జాతి కంపెనీలకు (ఎంఎన్‌సీ) ఇది ఉపయోగకరంగా ఉంటుందని జాగిల్ తెలిపింది. అలాగే, భారత్‌లోని మెష్ కస్టమర్లు .. జాగిల్ ప్రీపెయిడ్ కార్డులు, కార్పొరేట్ క్రెడిట్ కార్డులు మొదలైన వాటిని పొందవచ్చని వివరించింది.

రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఏయూఎం 9% అప్

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) 9 శాతం పెరిగి రూ. 38,725 కోట్లకు చేరింది. పన్నులకు ముందు లాభం (పీబీటీ) 25 శాతం వృద్ధి చెంది రూ. 198 కోట్ల నుంచి రూ. 247 కోట్లకు పెరిగింది. సమీక్షాకాలంలో కొత్త బిజినెస్ ప్రీమియం రూ. 1,245 కోట్లుగా, మొత్తం ప్రీమియం వసూళ్లు రూ. 5,711 కోట్లుగా నమోదయ్యాయి. మార్చి 31 నాటికి క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తి 98.9 శాతంగా ఉన్నట్లు సంస్థ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-5-2025

విశాఖ	520-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,970
ఎన్ఎస్ఈ	1,27,891
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,68,220
ఎఫ్ఐఐ	+ 5,939
డీఐఐ	- 1,668

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.59	$ 63.15
బ్రెంట్	64.47	$ 66.09

ఏప్రిల్‌లో ఎగుమతులు అప్

- ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తుల దన్ను
- 9 శాతం వృద్ధి; 38.49 బిలియన్ డాలర్లుగా నమోదు
- అయిదు నెలల గరిష్టానికి వాణిజ్య లోటు



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు తదితర విభాగాలు మెరుగ్గా రాణించడంతో ఏప్రిల్‌లో ఎగుమతులు 9.03 శాతం వృద్ధి చెంది 38.49 బిలియన్ డాలర్లకు చేరాయి. మరోవైపు, ముడి చమురు, ఎరువుల వల్ల దిగుమతులు 19.12 శాతం పెరిగి 64.91 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. దీంతో వాణిజ్య లోటు (ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) గతేడాది నవంబర్ తర్వాత .. అయిదు నెలల గరిష్టమైన 26.42 బిలియన్ డాలర్లకు చేరింది. అప్పట్లో ఇది 31.77 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అంతర్జాతీయంగా అనిశ్చితులు ఉన్నప్పటికీ ఈ ఏడాది మొత్తం మీద ఎగుమతులు సానుకూల ధోరణి కొనసాగిస్తూ, గణనీయంగా వృద్ధి చెందగలవని ఆశిస్తున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బరత్వాల్ తెలిపారు. 20 దేశాలు, ఆరు కమోడిటీలపై ప్రధానంగా దృష్టి పెట్టాలన్న వ్యూహం సత్ఫలితాలనిస్తోందని ఆయన చెప్పారు. త్వరలోనే పలు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందన్నారు. అంతర్జాతీయంగా ఆర్థిక సవాళ్లు, కరెన్సీ హెచ్చుతగ్గులు, అమెరికా ప్రతీకార టారిఫ్‌ల విధానంతో అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత్ నుంచి అపారెల్ ఎగుమతులు 14.43 శాతం పెరిగినట్లు పరిశ్రమ మండలి ఏఈపీసీ సెక్రటరీ జనరల్ మిథిలేశ్వర్ ఠాకూర్ తెలిపారు.

డేటా ప్రకారం..

- ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 39.51 శాతం పెరిగి 3.69 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇంజినీరింగ్ ఉత్పత్తులు 11.28 శాతం వృద్ధితో 9.51 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- పొగాకు, కాఫీ, మెరైన్ ఉత్పత్తులు, టీ, రెడీమేడ్ దుస్తులు, బియ్యం, రత్నాభరణాలు, సుగంధ ద్రవ్యాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ఫార్మాస్యూటికల్స్ ఎగుమతులు పెరిగాయి.
- క్రూడాయిల్ దిగుమతులు 25.6 శాతం పెరిగి 20.7 బిలియన్ డాలర్లకు చేరగా, పసిడి దిగుమతులు 4.86 శాతం వృద్ధితో 3.09 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- సేవల ఎగుమతుల విలువ 30.18 బిలియన్ డాలర్ల నుంచి 35.31 బిలియన్ డాలర్లకు చేరింది.
- సేవల దిగుమతులు 16.76 బిలియన్ డాలర్ల నుంచి 17.54 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

మార్చి త్రైమాసిక ఫలితాలు

జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ లాభం అప్

- క్యూ4లో రూ. 408 కోట్లు
- షేరుకి రూ. 2 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ ఇంధన దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 16% వృద్ధితో రూ. 408 కోట్లను తాకింది. 1,800 మెగావాట్ల కేఎస్‌కే మహానది థర్మల్ ప్రాజెక్ట్‌తోపాటు పవన విద్యుత్ సామర్థ్యాలు జత కలవడం ఇందుకు సహకరించాయి. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 351 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 2 డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం 21% ఎగసి రూ. 3,497 కోట్లను తాకింది. 2023-24లో రూ. 2,879 కోట్ల టర్నోవర్ సాధించింది. ఫైనాన్స్ వ్యయాలు రూ. 533 కోట్ల నుంచి రూ. 675 కోట్లకు పెరిగాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం 13 శాతం పుంజుకుని రూ. 1,951 కోట్లను తాకింది. సెక్యూరిటీల జారీ ద్వారా రూ. 10,000 కోట్లు సమీకరించేందుకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 2.6 శాతం లాభంతో రూ. 487 వద్ద ముగిసింది.

లుపిన్ లాభం రెట్టింపు

- క్యూ4లో రూ. 782 కోట్లు
- షేరుకి రూ. 12 డివిడెండ్




న్యూఢిల్లీ: ఫార్మా రంగ దిగ్గజం లుపిన్ లిమిటెడ్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 782 కోట్లను తాకింది. కొత్త ప్రొడక్టుల అమ్మకాలు, నిర్వహణా సామర్థ్యం ఇందుకు సహకరించాయి. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 368 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 4,895 కోట్ల నుంచి రూ. 5,562 కోట్లకు బలపడింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 12 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం 71% జంప్‌చేసి రూ. 3,306 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో లుపిన్ షేరు బీఎస్‌ఈలో నామమాత్ర నష్టంతో రూ. 2,071 వద్ద ముగిసింది.

అరవింద్ లాభం హైజంప్

- క్యూ4లో రూ. 155 కోట్లు



న్యూఢిల్లీ: టెక్స్‌టైల్, దుస్తుల దిగ్గజం అరవింద్ లిమిటెడ్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 48 శాతం జంప్‌చేసి రూ. 155 కోట్లకు చేరింది. టెక్స్‌టైల్స్ అమ్మకాల్లో వృద్ధి ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 104 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 2,075 కోట్ల నుంచి రూ. 2,221 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 1,944 కోట్ల నుంచి రూ. 2,091 కోట్లకు పెరిగాయి. కాగా.. మార్చి తో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 353 కోట్ల నుంచి రూ. 367 కోట్లకు పుంజుకుంది. మొత్తం ఆదాయం రూ. 7,738 కోట్ల నుంచి రూ. 8,329 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 4.5 శాతం నష్టంతో రూ. 381 వద్ద ముగిసింది.

సౌత్ ఇండియన్ బ్యాంక్ లాభం ప్లస్

- క్యూ4లో రూ. 342 కోట్లు




న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ సౌత్ ఇండియన్ బ్యాంక్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 19 శాతం వృద్ధితో రూ. 342 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 288 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,621 కోట్ల నుంచి రూ. 2,946 కోట్లకు ఎగసింది. వాటాదారులకు బ్యాంక్ బోర్డు షేరుకి రూ. 0.4 డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బ్యాంక్ నికర లాభం 22 శాతం జంప్‌చేసి రూ. 1,303 కోట్లను తాకింది. 2023-24లో రూ. 1,070 కోట్లు మాత్రమే ఆర్జించింది.

ఫలితాల నేపథ్యంలో బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో 4 శాతం ఎగసి రూ. 28 వద్ద ముగిసింది.

కొచిన్ షిప్‌యార్డ్ లాభం అప్

- క్యూ4లో రూ. 287 కోట్లు
- షేరుకి రూ. 2.25 డివిడెండ్




న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం కొచిన్ షిప్‌యార్డ్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 11 శాతం వృద్ధితో రూ. 287 కోట్లను అధిగమించింది. అధిక ఆదాయం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 259 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా రూ. 1,366 కోట్ల నుంచి రూ. 1,915 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 1,024 కోట్ల నుంచి రూ. 1,531 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 2.25 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 783 కోట్ల నుంచి రూ. 827 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 6.6% జంప్‌చేసి రూ. 1,812 వద్ద ముగిసింది.

ఐటీసీ హోటల్స్ లాభం వృద్ధి

- క్యూ4లో రూ. 258 కోట్లు



న్యూఢిల్లీ: ఆతిథ్య రంగ దిగ్గజం ఐటీసీ హోటల్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 19 శాతం వృద్ధితో రూ. 258 కోట్లకు చేరింది. అధిక ఆదాయం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 216 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1,015 కోట్ల నుంచి రూ. 1,061 కోట్లకు పుంజుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 740 కోట్ల నుంచి రూ. 750 కోట్లకు పెరిగాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 424 కోట్ల నుంచి రూ. 638 కోట్లకు బలపడింది. మొత్తం ఆదాయం రూ. 2,224 కోట్ల నుంచి రూ. 3,560 కోట్లకు జంప్‌చేసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో నామమాత్ర నష్టంతో రూ. 201 వద్ద ముగిసింది.

ముత్తూట్ ఫైనాన్స్ లాభం భళా

మార్చి క్వార్టర్‌కు రూ.1,444 కోట్లు



న్యూఢిల్లీ: బంగారం రుణాల వ్యాపారంలోని ముత్తూట్ ఫైనాన్స్ మార్చితో అంతమైన మూడు నెలల కాలంలో పటిష్ట పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 22 శాతం పెరిగి రూ.1,444 కోట్లకు చేరింది. స్టాండలోన్‌గా చూస్తే ముత్తూట్ ఫైనాన్స్ నికర లాభం 41 శాతం జంప్ చేసి రూ.1,479 కోట్లకు చేరింది. కంపెనీ నిర్వహణలోని ఆస్తుల విలువ 41 శాతం పెరిగి రూ.1.06 లక్షల కోట్లుగా నమోదైంది. 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి నికర లాభం 20 శాతం వృద్ధి చెంది రూ.5,352 కోట్లకు చేరింది. నిర్వహణ ఆస్తుల విలువ 37 శాతం పెరిగి రూ.1.22 లక్షల కోట్లకు చేరింది. ప్రతీ షేరుకు రూ.26 చొప్పున డివిడెండ్ పంపిణీకి కంపెనీ బోర్డు నిర్ణయించింది.

బీఎస్‌ఈలో ముత్తూట్ ఫైనాన్స్ షేరు 2 శాతం పెరిగి రూ.2,263 వద్ద స్థిరపడింది.

నిట్ మెరుగైన పనితీరు

- 37 శాతం తగ్గిన నికర లాభం



న్యూఢిల్లీ: నైపుణ్య శిక్షణ సంస్థ నిట్ మార్చి త్రైమాసికంలో మెరుగైన పనితీరు చూపించింది. లాభం 18 శాతం వృద్ధితో రూ.13 కోట్లుగా నమోదైంది. ఆదాయం 15 శాతానికి పైగా పెరిగి రూ.86 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.13 కోట్లు, ఆదాయం రూ.74 కోట్ల చొప్పున ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిట్ రూ.46 కోట్ల లాభాన్ని ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.38 కోట్లతో పోల్చి చూస్తే 20 శాతం వృద్ధి నమోదైంది. ఆదాయం 18 శాతం పెరిగి రూ.356 కోట్లకు చేరింది. ఆటుపోట్లతో కూడిన వాతావరణంలో వరుసగా ఐదో త్రైమాసికంలోనూ ఆదాయంలో డబుల్ డిజిట్ వృద్ధిని నమోదు చేసినట్టు కంపెనీ సీఈవో పంకజ్ జాతర్ తెలిపారు. నిట్ ఇటీవలే ఏఐ ఆధారిత డీప్ స్కిల్లింగ్ సాస్ కంపెనీ ఐయామ్‌నియోలో 70 శాతం వాటాను కొనుగోలు చేయడం తెలిసిందే.

బీఎస్‌ఈలో కంపెనీ షేరు అర శాతం పెరిగి రూ.137 వద్ద ముగిసింది.

ఎన్‌సీసీ లాభం రూ. 254 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఎన్‌సీసీ నికర లాభం (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) రూ. 254 కోట్లుగా నమోదైంది. క్రితం క్యూ4లో ఇది రూ. 239 కోట్లు. మరోవైపు ఆదాయం రూ. 6,530 కోట్ల నుంచి రూ. 6,189 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను టర్నోవరు రూ. 20,971 కోట్ల నుంచి రూ. 22,355 కోట్లకు చేరగా, నికర లాభం రూ. 711 కోట్ల నుంచి సుమారు రూ. 820 కోట్లకు పెరిగింది. రూ. 2 ముఖ విలువ చేసే ఒక్కో షేరుపై రూ. 2.20 చొప్పున డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ నిర్ణయించింది. ఆర్థిక సంవత్సరంలో రూ. 32,888 కోట్ల విలువ చేసే ఆర్డర్లను దక్కించుకోవడంతో మొత్తం ఆర్డర్ బుక్ రూ. 71,568 కోట్లకు చేరింది.

లాభాల్లో శ్రీ రేణుకా షుగర్స్

- క్యూ4లో రూ. 93 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ శ్రీ రేణుకా షుగర్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 93 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 111 కోట్ల నికర నష్టం ప్రకటించింది. వ్యయాలు తగ్గడం ఇందుకు దోహదపడింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 3,386 కోట్ల నుంచి రూ. 2,753 కోట్లకు క్షీణించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 3,430 కోట్ల నుంచి రూ. 2,662 కోట్లకు తగ్గాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర నష్టం రూ. 628 కోట్ల నుంచి రూ. 300 కోట్లకు భారీగా దిగివచ్చింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 4 శాతం జంప్‌చేసి రూ. 32 వద్ద ముగిసింది.

మైదానంలో మాత్రమే!

- అర్షద్ నదీమ్‌తో స్నేహంపై నీరజ్ చోప్రా వివరణ
- భవిష్యత్‌లో ఎలా ఉండబోతుందో చెప్పలేనన్న భారత స్టార్
- నేడు దోహా డైమండ్ లీగ్ బరిలో నీరజ్

దోహా: భారత స్టార్ జావెలిన్ త్రోయర్, రెండు వరుస ఒలింపిక్ పతకాల విజేత నీరజ్ చోప్రా తన పాక్ ప్రత్యర్థి అర్షద్ నదీమ్‌తో గల అనుబంధంపై స్పష్టత ఇచ్చాడు. దోహా డైమండ్ లీగ్‌లో పాల్గొనేందుకు వచ్చిన అతను పతకంపై గురి పెట్టాడు. విమర్శలపై సమాధానమిచ్చాడు. భారత్, పాక్‌ల మధ్య యుద్ధవాతావరణాన్ని సృష్టించిన ఉద్రిక్త పరిస్థితుల మధ్య పాకిస్తాన్‌కు చెందిన జావెలిన్ త్రోయర్, పారిస్ ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్‌కు భారత్‌లో జరిగే ఈవెంట్ కోసం ఆహ్వానం పలకడంపై నీరజ్ చోప్రా సహా అతని కుటుంబసభ్యులపై కూడా తీవ్రస్థాయిలో దుమ్మెత్తిపోశారు. వీటిని తాళలేక చోప్రా వివరణ కూడా ఇవ్వాల్సి వచ్చింది. మొత్తానికి బెంగళూరులో వచ్చే వారం నిర్వహించతలపెట్టిన 'ఎన్‌సీ క్లాసిక్' ఈవెంట్ నిరవధిక వాయిదా పడింది. అయితే తమ ఇద్దరి బంధంపై తాజాగా నీరజ్ స్పష్టత ఇచ్చాడు. 'ముందుగా మీకో విషయం స్పష్టం చేయదల్చుకుంటున్నా... అర్షద్‌తో నాకున్నది పోటీల సందర్భంగా ఉండే స్నేహమే! అంతేతప్ప బలమైన అనుబంధం, ప్రాణ స్నేహితులం ఏమాత్రం కాదు. అయితే ఇప్పుడు నెలకొన్న పరిస్థితులతో కనీసం ముందరిలా ఉంటామో లేదో కూడా తెలీదు. ఒకవేళ అతను సంస్కారం చూపితే నేను చూపుతా. అంతకుమించి ఇంకేమీ ఉండదు. మైదానంలో అథ్లెట్లుగా మాట్లాడుకుంటాం. అథ్లెట్ మిత్రులుగానే మెలుగుతాం. అంతే!' అని అన్నాడు.

మొదట్లో కష్టమనిపించినా...

ప్రస్తుత కోచ్, లెజెండ్ జాన్ జెలెజ్నీతో మొదట్లో శిక్షణ చాలా కష్టమనిపించిందని, కఠినంగా ఉండేదని అయితే ఇప్పుడా సమస్య లేదని నీరజ్ వివరించాడు. 'నా పాత కోచ్ క్లాస్ బార్టొనీట్జ్ శైలి వేరు. ప్రస్తుత కోచ్ జెలెజ్నీ శైలి పూర్తి భిన్నం. అతనితో కలిసి పని (శిక్షణ) చేయడానికి ఇబ్బంది పడ్డాను. చాలా విభిన్నమైన శిక్షణ శైలి అతనిది. తర్వాతర్వాత అలవాటు పడ్డాక అంతా సర్దుకుంది. జెలెజ్నీ కోచింగ్‌లో ఎంతటి నిష్ణాతుడో అందరికీ తెలుసు. నా టెక్నిక్, రనప్ ఇపుడంతా మెరుగైంది. అలాగని పాత కోచ్ క్లాస్ తక్కువేమీ కాదు. నాలుగేళ్లు అతని శిక్షణలోనే రాటుదేలాను' చోప్రా అన్నాడు.

టైటిల్ లక్ష్యంతో చోప్రా...

దోహా డైమండ్ లీగ్ మాజీ చాంపియన్ నీరజ్ చోప్రా మరోసారి టైటిల్ సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నాడు. ఈ స్టార్ జావెలిన్ త్రోయర్ ఫామ్‌లో ఉన్నాడు. నిలకడగా రాణిస్తున్నాడు. ఇలాంటి అనుకూలతలతో ఈ లీగ్‌లో స్వర్ణం చేజిక్కించుకోవడం అతనికి ఏమంత కష్టం కానేకాదు. శుక్రవారం జరిగే జావెలిన్ త్రో ఈవెంట్‌లో భారత స్టార్‌కు రెండు సార్లు ప్రపంచ చాంపియన్, పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా) నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశముంది. అతనితో పాటు జాకుబ్ వాద్లెచ్ (చెక్), జర్మనీకి చెందిన జులియన్ వెబెర్, మ్యాక్స్ డెహ్నింగ్, జూలియుస్ యెగో (కెన్యా), రొడెరిక్ గెన్కి డీన్ (జపాన్)లు నీరజ్ చోప్రాకు పోటీ ఇవ్వనున్నారు. అంతర్జాతీయ పోటీల్లో తలపడే ప్రత్యర్థులందరూ ఈ డైమండ్ లీగ్ బరిలో ఉన్నారు. అయితే పాక్ చాంపియన్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్ మాత్రం గైర్హాజరయ్యాడు. లీగ్ కోసం ఎంతో కసరత్తు చేశానని పతకమే లక్ష్యంగా బరిలోకి దిగుతానని చోప్రా చెప్పాడు.

స్టీపుల్‌చేజ్‌లో గుల్‌వీర్, పారుల్

నీరజ్ జావెలిన్ త్రోలో పతకంపై గురిపెట్టగా, మిగతా భారత అథ్లెట్లు గుల్‌వీర్ సింగ్, పారుల్ చౌధరీ స్టీపుల్‌చేజ్‌లో సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. జాతీయ రికార్డు నెలకొల్పిన గుల్‌వీర్ పురుషుల 5000 మీటర్ల పోటీలో పోడియంలో నిలవాలని గంపెడాశలు పెట్టుకున్నాడు. మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో పారుల్ చౌధరీ గట్టి పోటీ ఇచ్చేందుకు సై అంటోంది.



నీరజ్
అర్షద్



జెంగ్ కిన్‌వెన్

సబలెంకాకు చుక్కెదురు

ఏడో ప్రయత్నంలో ప్రపంచ నంబర్‌వన్‌పై తొలిసారి గెలిచిన చైనా ప్లేయర్ జెంగ్ కిన్‌వెన్

రోమ్: ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న బెలారస్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా జోరుకు బ్రేక్ పడింది. రోమ్ ఓపెన్-1000 సిరీస్ టెన్నిస్ టోర్నీలో చైనా స్టార్, పారిస్ ఒలింపిక్స్ చాంపియన్ జెంగ్ కిన్‌వెన్ సంచలనం సృష్టించింది. 22 ఏళ్ల జెంగ్ కిన్‌వెన్ ఏడో ప్రయత్నంలో సబలెంకాను ఓడించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో జెంగ్ కిన్‌వెన్ 6-4, 6-3తో సబలెంకాపై గెలిచింది. 97 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కిన్‌వెన్ తన సర్వీస్‌లో ఐదు బ్రేక్ పాయింట్లను కాపాడుకోవడంతోపాటు సబలెంకా సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. నాలుగు ఏస్‌లు సంధించిన కిన్‌వెన్, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. కిన్‌వెన్ తన 63 సర్వీస్ పాయింట్లలో 43 పాయింట్లు... సబలెంకా తన 68 సర్వీస్ పాయింట్లలో 38 పాయింట్లు సాధించారు. గతంలో కిన్‌వెన్‌తో తలపడ్డ ఆరుసార్లూ విజయం సాధించిన సబలెంకా ఏడో ప్రయత్నంలో మాత్రం ఓటమి రుచి చూసింది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన సబలెంకాకు 1,24,700 యూరోల (రూ. 1 కోటీ 19 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 215 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. మరోవైపు ఇటలీకి చెందిన జాస్మిన్ పావోలిని ఈ టోర్నీలో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. తొలి సెమీఫైనల్లో జాస్మిన్ 7-5, 6-1తో అమెరికాకు చెందిన పేటన్ స్టెర్న్స్‌పై గెలిచింది. 99 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జాస్మిన్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరు సార్లు బ్రేక్ చేసింది. జెంగ్ కిన్‌వెన్, కోకో గాఫ్ (అమెరికా) మధ్య రెండో సెమీఫైనల్ విజేతతో ఫైనల్లో జాస్మిన్ తలపడుతుంది.


సబలెంకా

గుజరాత్ జట్టులో కుశాల్ మెండిస్

- 'ప్లే ఆఫ్స్'కు దూరం కానున్న బట్లర్
- మళ్లీ గాయపడిన మయాంక్ యాదవ్

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ లీగ్ దశ తర్వాత జట్టు టాప్ బ్యాటర్ జోస్ బట్లర్ స్వదేశానికి తిరిగి వెళ్లనున్నాడు. వెస్టిండీస్‌తో వన్డే, టి20 సిరీస్ కోసం అతను జాతీయ జట్టుకు అందుబాటులో ఉంటాడు. గుజరాత్ ప్లే ఆఫ్స్ చేరే అవకాశాలు ఉండటంతో బట్లర్ స్థానంలో ఆ జట్టు శ్రీలంక క్రికెటర్ కుశాల్ మెండిస్‌ను ముందే ఎంచుకుంది. లంక తరఫున 78 టి20ల్లో 131.69 స్ట్రయిక్ రేట్‌తో 1920 పరుగులు చేసిన కుశాల్‌కు ఐపీఎల్ అవకాశం దక్కడం ఇదే మొదటిసారి. గాయంతో ఐపీఎల్ నుంచి చాలా ముందే తప్పుకున్న పేసర్ లోకీ ఫెర్గూసన్ స్థానంలో పంజాబ్ కింగ్స్ న్యూజిలాండ్‌కే చెందిన కైల్ జేమీసన్‌ను ఎంచుకుంది. మరోవైపు సుదీర్ఘ సమయం పాటు గాయంతో బాధపడుతూ ఇటీవలే కోలుకొని ఐపీఎల్‌లోకి అడుగు పెట్టిన లక్నో పేస్ బౌలర్ మయాంక్ యాదవ్ మళ్లీ గాయపడ్డాడు. ఈ సీజన్‌లో రెండే మ్యాచ్‌లు ఆడిన అతను వెన్ను నొప్పితో టోర్నీలోని మిగతా మ్యాచ్‌లకు దూరమయ్యాడు. మయాంక్ స్థానంలో లక్నో జట్టు కివీస్ పేస్ బౌలర్ విలియమ్ రూర్కేను తీసుకుంది.



వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ కోసం జట్టులోకి ఎంపికైన దక్షిణాఫ్రికా ఆటగాళ్లంతా ప్లే ఆఫ్స్‌కు దూరం కావడం ఖాయమైంది. వారంతా మే 27నే బయల్దేరి మిగిలిన జట్టు సభ్యులతో మే 30న లండన్‌లో కలవాలని దక్షిణాఫ్రికా బోర్డు ఆదేశించింది. మరోవైపు ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తే విల్ జాక్స్ స్థానంలో జానీ బెయిర్‌స్టోను జట్టు తీసుకునే అవకాశం ఉంది.

బుమ్రా, జడేజా కెప్టెన్సీకి అర్హులు!

రవిచంద్రన్ అశ్విన్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారత టెస్టు జట్టు కొత్త కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్ పేరు వినిపిస్తున్న నేపథ్యంలో మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ మరోసారి తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. కెప్టెన్సీ బాధ్యతల కోసం పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా పేర్లను పరిశీలించాలని అతను సూచించాడు. గిల్‌తో పోలిస్తే వీరిద్దరికి ఎక్కువ అనుభవం ఉందని అశ్విన్ పునరుద్ఘాటించాడు. 'కొత్త సారథిగా ఇప్పుడు అంతా గిల్ పేరే తీసుకుంటున్నారు. అయితే బుమ్రా, జడేజా రూపంలో ప్రత్యామ్నాయాలు మనకు అందుబాటులో ఉన్నాయి. కొత్త ప్లేయర్‌ను కెప్టెన్‌గా చేసే ముందు అతను అనుభవజ్ఞులను పరిశీలించి కనీసం రెండేళ్ల పాటు నేర్చుకుంటే బాగుంటుంది. ఆ తర్వాత కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలి. ఇంకా చెప్పాలంటే 3-4 ఆటగాళ్లను కెప్టెన్ అయితే మీ ప్రణాళికలు ఏమిటని ప్రజెంటేషన్ ఇచ్చి మరీ ఎంపిక చేయవచ్చు. ఆస్ట్రేలియాలాంటి జరిగే ఇలాంటి పద్ధతిని మనం ఎందుకు అమలు చేయకూడదు' అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. బుమ్రా ఇటీవలి గాయాలు అతను కెప్టెన్ కావడానికి అడ్డంకి కాదని మాజీ స్పిన్నర్ వ్యాఖ్యానించాడు. 'కమిన్స్ కూడా చాలా కాలం వెన్నునొప్పి సమస్యతో బాధపడ్డాడు. కానీ ఇప్పుడు అతను ఆసీస్ టెస్టు, వన్డే జట్లను నడిపిస్తున్నాడు. బుమ్రా కూడా మన జాతీయ సంపదలాంటివాడు. అతని పేరును చర్చించాల్సిన అవసరం ఉంది. కెప్టెన్సీ కోసం అతని పేరే ముందు రావాలి. అవసరమైతే నువ్వు ఐదు టెస్టులూ ఆడగలవా. పూర్తి స్థాయి కెప్టెన్‌గా ఉండగలవా అని అడిగి మరీ ఎంపిక చేయవచ్చు' అని అశ్విన్ తమ మనసులో మాట చెప్పాడు.






గ్రాండ్‌మాస్టర్ వైశాలికి నాలుగో స్థానం

వియన్నా (ఆస్ట్రియా): అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్‌లోని చివరి టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి నాలుగో స్థానంలో నిలిచింది. అన్నా ముజిచుక్ (ఉక్రెయిన్)తో గురువారం జరిగిన చివరిదైన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను వైశాలి 56 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరిగింది. వైశాలి ఐదు పాయింట్లతో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. వైశాలి మూడు గేముల్లో గెలిచి, రెండు గేముల్లో ఓడిపోయి, నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకుంది. ఆరు పాయింట్లతో అన్నా ముజిచుక్, జు జినెర్ (చైనా) సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు.

ఇంగ్లండ్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా సౌతీ

భారత్‌తో సిరీస్ కోసం నియామకం

లండన్: న్యూజిలాండ్ మాజీ పేసర్ టిమ్ సౌతీని ఇంగ్లండ్ క్రికెట్ జట్టు ప్రత్యేక నైపుణ్య సలహాదారుగా నియమించుకుంది. త్వరలో ఇంగ్లండ్, భారత్‌ల మధ్య జరిగే ద్వైపాక్షిక సిరీస్ వరకే ఈ నియామకం జరిగినట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) తెలిపింది. వచ్చే నెల ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే భారత్ అక్కడ ఐదు టెస్టుల ముఖాముఖి సిరీస్‌లో తలపడుతుంది. ముందుగా లీడ్స్ వేదికగా జూన్ 20 నుంచి తొలి టెస్టు జరుగుతుంది. జూలై 31 నుంచి ద ఓవల్‌లో జరిగే ఆఖరి టెస్టుతో సంప్రదాయ సిరీస్ ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఎంతో అనుభవజ్ఞుడైన కివీ పేసర్ సౌతీ సేవల్ని ఉపయోగించుకొని సిరీస్‌లో లబ్ధి పొందాలని ఇంగ్లండ్ బోర్డు వర్గాలు భావిస్తున్నాయి. 36 ఏళ్ల మాజీ సీమర్ గత డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. 107 టెస్టులాడి 391 వికెట్లు తీశాడు. 161 వన్డేల్లో 221 వికెట్లు, 126 టి20ల్లో 164 వికెట్లు తీసిన కివీస్ గ్రేటెస్ట్ బౌలర్ సౌతీ. భారత్‌తో సిరీస్ కంటేముందు ఇంగ్లండ్ ట్రెంట్‌బ్రిడ్జ్ వేదికపై జింబాబ్వేతో ఏకైక టెస్టు మ్యాచ్ ఆడనుంది. ఈ నెల 22 నుంచి ఈ మ్యాచ్ జరుగుతుంది.



'ఒలింపిక్ క్రీడలను దత్తత తీసుకుంటాం'

- ప్రభుత్వానికి బీసీసీఐ ప్రతిపాదన
- సహకారం అందించేందుకు క్రికెట్ బోర్డు సిద్ధం

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత ధనిక బోర్డు అయిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మన దేశంలో ఇతర క్రీడలకు అండగా నిలవాలని యోచిస్తోంది. కనీసం రెండు లేదా మూడు ఒలింపిక్ క్రీడలను దత్తత తీసుకోవాలని భావిస్తున్నట్లు బీసీసీఐ తమ ఆలోచనను కేంద్ర క్రీడా శాఖకు తెలియజేసింది. మంత్రి మన్‌సుఖ్ మాండవియాతో గురువారం బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీసీసీఐ ఈ ప్రతిపాదన చేసింది 'మా ప్రతిపాదనను బీసీసీఐ స్వాగతించింది. ఏ క్రీడలను ఎంచుకుంటే బాగుంటుందనే విషయం తుది నిర్ణయం కేంద్ర క్రీడాశాఖకే వదిలేశాం. ఆయా క్రీడల్లోనూ ఒలింపిక్ కేంద్రాలను ఏర్పాటు చేసి కనీసం 100 నుంచి 200 మందికి అత్యుత్తమ శిక్షణ ఇప్పిస్తాం. ఒలింపిక్ క్రీడలను దృష్టిలో ఉంచుకొని ఈ క్రీడల సన్నాహాలు ఉంటాయి' అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ సమావేశంలో 58 కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. క్రికెట్ బోర్డు తాజా ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన వీరు తాము కూడా సహకారం అందిస్తామని హామీ ఇవ్వడం విశేషం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 23 నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ శిక్షణా కేంద్రాలు నడుస్తున్నాయి. ఇందులో బాక్సింగ్ (రోహ్‌టక్), స్విమ్మింగ్, షూటింగ్ (న్యూఢిల్లీ)లలో మాత్రం ఒకే క్రీడాంశంలో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. విభిన్న క్రీడాంశాలకు కేంద్రంగా పటియాలా, బెంగళూరులలో 'సాయ్' కేంద్రాలు నడుస్తున్నాయి. గతంలోనూ పలు మార్లు బీసీసీఐ ఆర్థికపరంగా ఇతర క్రీడలకు సహకారం అందించింది. ఆటలను దత్తత తీసుకోవాలనే తాజా ప్రతిపాదనపై ముున్ముందు మరింత స్పష్టత రానుంది. భారత సంతతికి చెందిన విదేశాల్లో స్థిరపడిన ఓవర్సీస్ సిటిజన్ (ఓసీఐ)లు క్రీడల్లో మన దేశానికి ప్రాతినిధ్యం వహించరాదనే నియమం ప్రస్తుతం అమల్లో ఉంది. దీనిని తొలగించాలని కూడా కేంద్ర క్రీడాశాఖ యోచిస్తోంది. అక్కడ ఆటలో నిష్ణాతులైన తర్వాత మన దేశం తరఫున వచ్చి ఆడితే ఇక్కడి ప్లేయర్లకు కూడా మేలు జరుగుతుందని, వ్యవస్థలో కొత్త మార్పులు వస్తాయని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. మరోవైపు వివిధ క్రీడా సమాఖ్యలు తమలోని వర్గాల మధ్య విభేదాలను పరిష్కరించుకుంటేనే ఆట బాగుపడుతుందని... క్రీడలను కోర్టులు నడపడం సరైందని కాదని మంత్రి అభిప్రాయపడ్డారు. వారందరితో సమావేశంపై సమస్యను పరిష్కరించేందుకు మంత్రి స్వయంగా సిద్ధమయ్యారు.





ఉగ్ర దాడి నేపథ్యంలో పహల్గాంకు పర్యాటకుల రాక తగ్గిపోయింది. దీంతో అక్కడి గుర్రాల నిర్వాహకులు గురువారం పనిలేక ఇలా ఖాళీగా కూర్చున్నారు



ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో హోటళ్లు, గుర్రాల నిర్వాహకులు, గైడ్లు ఇలా జాతీయజెండాలు చేబూని తిరంగా యాత్ర నిర్వహించారు.

అమెరికాలో తెలుగు పర్వతారోహకుడి మృత్యువాత

న్యూయార్క్: అమెరికాలోని నార్త్ కాస్కేడ్స్ పర్వత శ్రేణులను అధిరోహించే క్రమంలో తెలుగు పర్వతారోహకుడు ఇరిగిరెడ్డి విష్ణు రెడ్డి(40) ప్రాణాలు కోల్పోయారు. సియాటెల్‌కు చెందిన విష్ణు రెడ్డి తన స్నేహితులైన టిమ్ ఎన్‌గుయెన్, ఒలెక్సాండర్ మార్టినెంకో, ఆంటోన్ టిసెలిక్‌లతో కలిసి శనివారం వాషింగ్టన్‌లోని కాస్కేడ్స్ పర్వత శ్రేణిని అధిరోహించేందుకు వెళ్లారు. ఆదివారం తిరిగి వస్తుండగా కొండ చరియలు విరిగి పడే ప్రమాదాన్ని గమనించి నలుగురూ వెనక్కి మళ్లారు. వేగంగా వచ్చే క్రమంలో వీరికి ఆసరాగా నిలిచిన హుక్ పనిచేయ లేదు. దీంతో, అందరూ జారి 200 అడుగుల లోతైన లోయలో పడిపోయారు. అక్కడి నుంచి జారుకుంటూ మరింత లోతైన లోయలో పడ్డారు. ఘటనలో తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయారు. ఆంటోన్ ఒక్కరే తిరిగి కోలుకుని తన కారు వద్దకు చేరుకోగలిగారు. అక్కడి నుంచి 64 కిలోమీటర్ల దూరం కారు నడుపుకుంటూ వెళ్లి పోలీసులకు సమాచారమిచ్చారు. సహాయక సిబ్బంది వచ్చే సరికే తీవ్రగాయాలైన విష్ణు, టిమ్, ఒలెగ్జాండర్ చనిపోయారు. మెదడుకు గాయం, అంతర్గత రక్తస్రావమైన టిసెలిక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, సియాటెల్‌లో టెస్ట్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ అయిన ఫ్లూక్ కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ విభాగం హెడ్‌గా విష్ణు రెడ్డి పనిచేస్తున్నారని పీటీఐ తెలిపింది.

ఆ భయంతోనే కులగణనకు మోదీ అంగీకారం

- బడుగు వర్గాల నుంచి వ్యతిరేకత వస్తుందని భయపడ్డారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వెల్లడి
- బిహార్ మిథిలా యూనివర్సిటీలో 'శిక్షా న్యాయ్ సంవాద్'



బిహార్‌లోని దర్భంగాలో గురువారం జరిగిన శిక్షా న్యాయ్ సంవాద్‌లో అంబేడ్కర్ చిత్ర పటాన్ని చూపుతున్న రాహుల్ గాంధీ

దర్భంగా/పట్నా: దేశంలో అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత వస్తుందన్న భయంతోనే కులగణనకు ప్రధాని నరేంద్ర మోదీ అంగీకారం తెలిపారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. కులగణనకు మద్దతుగా ప్రజల తరఫున ప్రతిపక్షాలు గళం విప్పాయని అన్నారు. గురువారం బిహార్ రాష్ట్రం దర్భంగా జిల్లాలోని మిథిలా యూనివర్సిటీ అంబేడ్కర్ హాస్టల్‌లో 'శిక్షా న్యాయ్ సంవాద్'లో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. దళిత, వెనుకబడిన వర్గాల విద్యార్థులతో సమావేశమయ్యారు. అంతకుముందు యూనివర్సిటీకి చేరుకోకుండా అధికారులు అడ్డంకులు సృష్టించినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదు. యూనివర్సిటీ గేటు వద్ద తన వాహనాన్ని నిలిపివేశారని, దాంతో వాహనం దిగి మరో మార్గంలో నడుచుకుంటూ వచ్చానని రాహుల్ తెలిపారు. ప్రజలు తనకు కొండంత బలం ఇచ్చారని, అందుకే బిహార్ ప్రభుత్వం తనను అడ్డుకోలేకపోయిందని అన్నారు. ఈ ప్రజాబలం ముందు ప్రధాని మోదీ సైతం తలవంచాల్సిందేనని స్పష్టంచేశారు. భారత రాజ్యాంగాన్ని తలతో తాకాలని మోదీకి చెప్పామని, చివరకు ఆయన ఆ పని చేయక తప్పలేదని అన్నారు. దేశమంతటా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశామని, దానికి కూడా ఒప్పుకున్నారని గుర్తుచేశారు. పేదలు, అణగారిన వర్గాల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందన్న భయంతోనే మోదీ ఈ రెండింటికీ అంగీకరించారని రాహుల్ గాంధీ వెల్లడించారు. అంబానీ, అదానీల సేవలో మోదీ సర్కారు తరిస్తోందని మండిపడ్డారు. దేశంలో కేవలం ఐదు శాతం ఉన్న ధనవంతుల బాగు కోసమే మన వ్యవస్థలు పని చేస్తున్నాయని ఆరోపించారు. దళితులు, గిరిజనుల, ఓబీసీలను పట్టించుకొనే దిక్కే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం, కార్పొరేట్ ప్రపంచం, మీడియాలో వారికి స్థానం దక్కడం లేదన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ రిజర్వేషన్లు

మూడు ప్రధాన డిమాండ్లపై యువత ఎట్టిపరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గొద్దని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించినట్లుగానే దేశవ్యాప్తంగా కులగణన పక్కాగా నిర్వహించాలని అన్నారు. ప్రైవేట్ కాలేజీలు, యూనివర్సిటీల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని తేల్చిచెప్పారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక కింద కేటాయించిన నిధులను ఆయా వర్గాల సంక్షేమం కోసం జాప్యం లేకుండా విడుదల చేయాలన్నారు. ఎన్డీయే పాలనలో పెద్దగా ఆశించలేమని.. కేంద్రంలో, రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక యువత సంక్షేమం, అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యాసంస్థల్లో వెనుకబడిన వర్గాల వారి పట్ల వివక్ష కొనసాగుతోందని, మీడియాలో బీసీల ప్రాతినిధ్యం లేదని, ఈ అంశాలను పార్లమెంట్‌లో ప్రస్తావించాలని రాహుల్ గాంధీని ఓ విద్యార్థి కోరారు.

'ఫూలే' చిత్రం తిలకించిన రాహుల్

రాహుల్ గాంధీ గురువారం బిహార్ రాజధాని పాట్నాలోని సినిమా హాల్‌లో హిందీ చిత్రం 'ఫూలే'ను తిలకించారు. బిహార్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సైతం రాహుల్‌తో కలిసి ఈ సినిమా చూశారు. 19వ శతాబ్దానికి చెందిన ప్రఖ్యాత సామాజిక ఉద్యమకారుడు, సంఘ సంస్కర్త జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే దంపతుల జీవితం ఆధారంగా ఫూలే చిత్రాన్ని తెరకెక్కించిన సంగతి తెలిసిందే.



ఢిల్లీలోని పీతంపురలోని గురు గోవింద్ సింగ్ కామర్స్ కాలేజీ లైబ్రరీలో గురువారం సంభవించిన అగ్ని ప్రమాదంతో కాలిపోగా మిగిలిపోయిన పుస్తకాలను తరలిస్తున్న దృశ్యం

కళ్లకు గంతలు కట్టారు.. దూషించారు..

- ఉన్నతాధికారుల వివరాలడిగారు
- బీఎస్ఎఫ్ జవాన్‌ను వేధించిన పాక్ అధికారులు

న్యూఢిల్లీ: అనుకోకుండా సరిహద్దు దాటి పాక్ రేంజర్ల చేతికి చిక్కిన బీఎస్ఎఫ్ జవాన్ పూర్ణం కుమార్ షాను భారత్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. విడుదల అనంతరం పాకిస్తాన్ కస్టడీలో ఉన్న 21 రోజుల అనుభవాలను బీఎస్ఎఫ్ అధికారులతో షా పంచుకున్నారు. షా నిర్బంధంలో ఉన్నంత కాలం, పాకిస్తాన్‌లోని మూడు గుర్తుతెలియని ప్రదేశాలకు తీసుకెళ్లారు. ఆ ప్రదేశాల్లో ఒకటి ఎయిర్‌బేస్ సమీపంలో ఉంది. కళ్లకు గంతలు కట్టి ఉంచడంతో.. విమాన శబ్దాలను బట్టి అది ఎయిర్‌బేస్‌గా షా గుర్తించారు. ఇక మరో ప్రదేశంలో జైలు గదిలో కొన్ని రోజులు ఉంచారు. కస్టడీలో ఉన్నన్ని రోజులు కళ్లకు గంతలు కట్టారు. నిద్రలేకుండా చేశారు. దూషించారు. కనీసం పళ్లు తోముకోవడానికి కూడా అనుమతించలేదు. శారీరకంగా హింసించకపోయినా.. సరిహద్దు వెంబడి బీఎస్ఎఫ్ భద్రతాదళాల గురించి ప్రశ్నించారు. అంతర్జాతీయ సరిహద్దులో ఉన్న సీనియర్ అధికారుల వివరాలు చెప్పాలంటూ ఆయనపై ఒత్తిడి తెచ్చారు. అయినా షా వేటికీ సమాధానం ఇవ్వలేదు. బీఎస్ఎఫ్ ప్రోటోకాల్ ప్రకారం.. విధుల్లో ఉండగా సెల్‌ఫోన్ వినియోగం నిషేధం. అందుకే షా పట్టుబడిన సమయంలో అతని దగ్గర మొబైల్ ఫోన్ లేదు. దీంతో వివరాలేవీ పాకిస్తాన్ అధికారులకు దొరకలేదు. పాక్ కస్టడీ నుంచి వచ్చిన షాపై బీఎస్ఎఫ్ అధికారులు విచారణ, వైద్య పరీక్షలు పూర్తి చేశారు. ప్రోటోకాల్ ప్రకారం, పాకిస్తాన్ కస్టడీలో ఉండగా ఆయన ధరించి ఉన్న దుస్తులను తనిఖీ చేసి, పారవేశారు. ఆయన శారీరకంగా, మానసికంగా స్థిరంగా ఉన్నారని సమాచారం. ఏప్రిల్ 23న విశ్రాంతి కోసం ఓ చెట్టునీడకు చేరిన షా.. అనుకోకుండా సరిహద్దు దాటాడు.

ఖాన్‌యూనిస్ వాసులకు కాళరాత్రి

ఇజ్రాయెల్ దాడుల్లో 59 మంది మృతి

ఖాన్‌యూనిస్: గాజాలోని ఖాన్‌యూనిస్ నగర పాలస్తీనియన్లకు వరుసగా రెండో రోజు రాత్రి కూడా కాళరాత్రే అయ్యింది. ఇజ్రాయెల్ వైమానిక దళాలు బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఖాన్‌యూనిస్‌తోపాటు గాజా నగరం, జబాలియాలపై యథేచ్ఛగా సాగించిన వైమానిక దాడుల్లో 59 మంది ప్రాణాలు కోల్పోయారు. నక్బాకు 77 ఏళ్లవుతున్న వేళ ఈ దారుణాలు కొనసాగుతుండటంపై పాలస్తీనియన్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఖాన్‌యూనిస్‌పై 10, జబాలియా, చుట్టుపక్కల ప్రాంతాలపై కనీసం 13 భారీ బాంబు దాడులు జరిగినట్లు మీడియా తెలిపింది. మొత్తం 59 చనిపోయారని స్థానిక పౌర రక్షణ దళాలు తెలిపాయి. కొన్ని మృతదేహాలు ఛిద్రమయ్యాయని పేర్కొన్నాయి. సరైన యంత్ర సామగ్రి లేకపోవడంతో శిథిలాల్లో చిక్కుకున్న బాధితులను వెలికి తీయడం కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఖాన్‌యూనిస్‌పై జరిగిన దాడిలో ఖతార్ టీవీ 'అల్ అరబీ'జర్నలిస్ట్ హసన్ సమౌర్ సహా అతడి కుటుంబంలోని 11 మంది చనిపోయినట్లు సోషల్ మీడియా పేర్కొంది. గాజాపై మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఇజ్రాయెల్ సాగించిన వైమానిక దాడుల్లో సుమారు 25 మంది చిన్నారులు సహా 70 వరకు ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే. హమాస్‌ను తుదముట్టించాలన్న తమ మిషన్ మరికొద్ది రోజుల్లోనే పూర్తవనుందని, అప్పటి వరకు దాడులను ఆపేదిలేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ స్పష్టం చేశారు. గాజాతోపాటు వెస్ట్‌బ్యాంక్‌లోని నగరాలు, టుబాస్, నబ్లుస్, బెత్లెహెం, కలండియా, యాబాద్, ఫవ్వర్, అస్కర్ శరణార్థి శిబిరాలపై గురువారం ఉదయం ఇజ్రాయెల్ బలగాలు దాడులు చేపట్టాయి. ఇంటింటి సోదాలు, అరెస్టులను ముమ్మరం చేశాయి.



ఇజ్రాయెల్ దాడులతో ఖాన్‌యూనిస్‌లో నేలమట్టమైన నివాస భవనం

'నక్బా' ప్రాముఖ్యం ఏమిటి?

ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాలస్తీనియన్లు ఏటా మే 15వ తేదీని నక్బా లేదా జాతి నిర్మూలన దినంగా పాటిస్తారు. పాలస్తీనా భూభాగం నుంచి 1948 మే 14వ తేదీన బ్రిటిష్ బలగాలు వైదొలగాయి. మే 15వ తేదీన ఇజ్రాయెలీలతో కూడిన జియోనిస్ట్ బలగాలు బ్రిటన్ దన్నుతో చారిత్రక పాలస్తీనాలోని వెస్ట్ బ్యాంక్, గాజా స్ట్రిప్ మినహా 78 శాతం ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాయి. ఇక్కడున్న 7.50 లక్షల పాలస్తీనియన్లను వెళ్లగొట్టి ఇజ్రాయెల్ దేశాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించాయి. జియోనిస్ట్ మూకల మారణకాండలో 15 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. నగరాలు, పట్టణాలతోపాటు 530 పాలస్తీనా గ్రామాలు ధ్వంసమయ్యాయి. దారుణాలు జరిగిన మే 15ను పాలస్తీనియన్లు 'నక్బా'గా ఏటా పాటిస్తారు. కూడు, నీడ కోల్పోయిన పాలస్తీనియన్లు గాజా, వెస్ట్ బ్యాంక్‌తోపాటు పొరుగు దేశాలైన సిరియా, లెబనాన్, ఈజిప్టుల్లో ఏర్పాటు చేసిన 58 శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. గాజాలోని 70 శాతం మంది శరణార్థులే. ఇంత సుదీర్ఘకాలం పాటు అపరిష్కృతంగా ఉన్న శరణార్థుల సమస్య ఇదే కావడం గమనార్హం.

పుతిన్ లేకుండానే ఉక్రెయిన్-రష్యా చర్చలు

ఇస్తాంబుల్: తుర్కియే వేదికగా ఉక్రెయిన్‌తో జరిగే మొట్టమొదటిసారిగా జరిగే ప్రత్యక్ష శాంతి చర్చలకు అధ్యక్షుడు పుతిన్ హాజరుకావడం లేదని రష్యా తెలిపింది. అధ్యక్షుడు పుతిన్ సహాయకుడు వ్లాదిమిర్ మెడిన్‌స్కీ సారథ్యంలోని బృందం గురువారం తుర్కియే రాజధాని అంకారా చేరుకుందని రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా వెల్లడించారు. ముగ్గురు సభ్యులతో కూడిన సీనియర్ అధికారుల బృందానికి సాయంగా నలుగురితో కూడిన నిపుణుల బృందం కూడా ఉందన్నారు. ఉక్రెయిన్‌తో జరిగే చర్చలకు అధ్యక్షుడు పుతిన్ వెళ్లడం లేదన్నారు. మూడేళ్లుగా జరిగే యుద్ధానికి ముగింపు పలికేందుకు తుర్కియేలో జరిగే శాంతి చర్చలకు రావాలని పుతిన్‌కు జెలెన్‌స్కీ సవాల్ విసిరారు. తాజా పరిణామంపై తుర్కియేలోని అంటాల్యాలో జరుగుతున్న నాటో సమావేశానికి హాజరైన జెలెన్‌స్కీ మీడియాతో మాట్లాడుతూ.. కీలకమైన విధాన నిర్ణయాలను తీసుకునే అధికారం ఆ బృందంలోని వారెవరికీ లేదని వ్యాఖ్యానించారు. అందుకే చర్చలకు తాను సైతం వెళ్లనని, రక్షణ మంత్రి రుస్తెం ఉమెరోవ్ సారథ్యంలో ప్రతినిధి బృందాన్ని పంపుతానని ప్రకటించారు. తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్‌తో మాట్లాడాక చర్చల తేదీ, ప్రాంతం వెల్లడిస్తామన్నారు. రష్యాపై ఆంక్షలను మరింత కఠినతరం చేస్తామన్న యూరప్ నేతల హెచ్చరికలు, ట్రంప్ ఒత్తిడితో పుతిన్ ఈ చర్చలకు హాజరయ్యే అవకాశముందని సర్వత్రా ఆసక్తిని రేకెత్తించింది. చివరికి ఇరు దేశాల అధ్యక్షులకు బదులుగా ప్రతినిధి బృందాలను పంపడం నిరాశ కలిగించిందని పరిశీలకులు అంటున్నారు.

నేను వెళ్లనిదే పుతిన్ రారు

తుర్కియేలో జరిగే చర్చలకు పుతిన్ హాజరు కాకపోవడంపై ఖతార్‌లో పర్యటిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనదైన శైలిలో స్పందించారు. ఈ విషయం తనకు ఆశ్చర్యం కలిగించలేదన్నారు. 'నేను వెళ్లనిదే ఆయన అక్కడికి రావడం అసాధ్యం'అంటూ పుతిన్ నిర్ణయాన్ని సమర్థిస్తూ మాట్లాడారు.



బస్సు నుంచి ఎగసి పడుతున్న మంటలు

బస్సులో మంటలు.. ఐదుగురు సజీవదహనం

లక్నో: యూపీ రాజధాని లక్నో సమీపంలో గురువారం వేకువజామున జరిగిన మరో ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు సజీవ దహనమయ్యారు. సుమారు 80 మంది ప్రయాణికులతో బిహార్‌లోని బెగుసరాయ్ నుంచి ఢిల్లీ వైపు వెళ్తున్న డబుల్ డెకర్ బస్సులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ప్రయాణికులంతా నిద్రలో ఉన్నారు. బస్సును వెంటనే ఆపకపోవడంతోపాటు అత్యవసర ద్వారం తెరుచుకోకపోవడంతో వెనుక సీట్లలో ఉన్న ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. తీవ్రంగా చెలరేగిన మంటలను అరగంటపాటు శ్రమించాక అదుపులోకి తేగలిగారు. అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది.

పాక్‌తో సంబంధాలు ద్వైపాక్షికమే: జై శంకర్

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌తో సంబంధాలు, వ్యవహారాలు కేవలం ద్వైపాక్షిక అంశాల వరకేనని విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ స్పష్టం చేశారు. చాలా ఏళ్లుగా ఇదే వైఖరిపై ఏకాభిప్రాయంతో ఉన్నామని, ఇందులో ఎలాంటి మార్పూ లేదని కుండబద్దలు కొట్టారు. పహల్గాం ఉగ్ర దాడి కారకులను చట్టం ముందు నిలబెట్టాలని ఐరాస భద్రతా మండలి సైతం కోరిందని గుర్తు చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ముష్కరులను బాధ్యులను చేశామని వ్యాఖ్యానించారు. 'పాకిస్తాన్ విషయంలో మన సంబంధాలు, వ్యవహారాలు ద్వైపాక్షికానికి మాత్రమే పరిమితం. ఏళ్లుగా జాతీయ స్థాయి ఏకాభిప్రాయంతో ఇదే కొనసాగుతోంది. దీనిలో ఎలాంటి మార్పూ లేదు. పాక్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నాం. అయితే అవి ఉగ్రవాదంపైనే ఉంటాయని ప్రధాని స్పష్టం చేశారు. ఉగ్రవాదుల పేర్ల జాబితాను పాక్‌కు ఇచ్చాం. వారిని మనకు అప్పగించాల్సి ఉంది. ముందుగా ఉగ్రమూకల మౌలిక వనరుల్ని ధ్వంసం చేయాలి. అందుకు ఏం చేయాలో పాక్‌కు తెలుసు'అని వ్యాఖ్యానించారు. 'అన్యాయంగా ఆక్రమించుకున్న కశ్మీర్ నుంచి పాక్ వైదొలగాలి. ఈ విషయంలో మన వైఖరి సుస్పష్టం'అని వివరించారు. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్తాన్ ముగింపు పలికిందని నమ్మకం కుదిరే వరకు సిందూ నదీ జలాల ఒప్పందాన్ని అమలు చేసే ప్రశ్నే లేదన్నారు.

రాష్ట్రపతి ప్రశ్నల ఉదంతంపై స్టాలిన్ అసంతృప్తి

సాక్షి, చెన్నై: బిల్లులపై గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయాలకు గడువుపై ఇప్పటికే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినాసరే మళ్లీ సలహాలు, సూచనల మాటున సుప్రీంకోర్టు నుంచి కేంద్ర ప్రభుత్వం దురుద్దేశ్యంతో అభిప్రాయాలు కోరుతోందని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే పార్టీ చీఫ్ ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బిల్లుల విషయంలో తనకు, గవర్నర్‌లకు సుప్రీంకోర్టు కాలావధిని నిర్దేశించడంపై రాష్ట్రపతి తాజాగా సర్వోన్నత న్యాయస్థానానికి 14 ప్రశ్నలు సంధించిన నేపథ్యంలో స్టాలిన్ స్పందించారు. "ఏదైనా అంశంలో నిర్ణయం కోసం రాష్ట్రపతి సుప్రీంకోర్టును సలహాలు కోరవచ్చు. ఈ నిబంధనను అడ్డుపెట్టుకుని దురుద్దేశ్యంతో రాష్ట్రపతి ద్వారా మోదీ సర్కార్ సుప్రీంకోర్టును అభిప్రాయాలు కోరుతోంది"అని స్టాలిన్ ఆరోపించారు. "తమిళనాడు గవర్నర్ కేసులో ఇప్పటికే కోర్టు సముచితమైన తీర్పు ఇచ్చాక మళ్లీ రాష్ట్రపతి రెఫరెన్స్ అస్త్రాన్ని వాడటమెందుకు?. ప్రజా తీర్పును అపహాస్యం చేసేందుకు కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నమిది"అని స్టాలిన్ తన 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. "గవర్నర్‌కు కాలపరిమితి విధిస్తే అభ్యంతరం తెలపాల్సిన అవసరం ఏమొచ్చింది?. గవర్నర్ ద్వారా బిల్లుల జాప్యాన్ని చట్టబద్ధంచేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది"అని స్టాలిన్ అన్నారు.

పీఓకేను భారత్‌లో విలీనం చేయాలి: అథవాలే

ఛత్రపతి శంభాజీనగర్: పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)ను భారత్‌లో విలీనం చేయాలని కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే అన్నారు. లేదంటే మరిన్ని యుద్ధాలు చేయాల్సి వస్తుందని ఆయన పాక్‌ను హెచ్చరించారు. గురువారం స్థానికంగా మీడియాతో మాట్లాడిన అథవాలే.. భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ప్రశంసించారు. సైన్యం పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పిందన్నారు. ఇప్పుడే ఆపరేషన్ సిందూర్ ఆగిపోయిందని చెప్పలేమన్న అథవాలే.. పీఓకేను (భారతదేశానికి) అప్పగించడం, ఉగ్రవాద కార్యకలాపాలను నిలిపేయడం తప్ప పాక్‌కు మరో గత్యంతరం లేదన్నారు. రాజీ పడమని చెప్పే హక్కు మూడో దేశానికి లేదని.. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం ఇవ్వడమే భారత్ వైఖరని ఆయన అన్నారు. పీఓకే మనదేశంలో భాగం కావాలని తాను పార్లమెంటులో కూడా చెప్పానని గుర్తు చేశారు. పాకిస్తాన్‌పై భారత్ తీసుకున్న చర్యలకు రుజువులు కావాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు చేయొద్దని అథవాలే కోరారు. సమాజ సంక్షేమం కోసం దళిత నాయకులంతా ఒకే వేదికపైకి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విజయాన్ని సెలబ్రేట్ చేసుకుంటారు.. కాల్పుల విరమణను కాదు: అఖిలేశ్ యాదవ్

అమేథీ: భారత్–పాక్ కాల్పుల విరమణ అనంతరం బీజేపీ విజయోత్సవ వేడుకలను సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఎద్దేవా చేశారు. ఎవరైనా విజయాన్ని సెలబ్రేట్ చేసుకుంటారని, కాల్పుల విరమణను కాదంటూ.. విమర్శించారు. గురువారం రాష్ట్రంలోని పలు వివాహ వేడుకలను హాజరైన ఆయన.. మీడియాతో మాట్లాడారు. శాంతి మంచిదేనని, కానీ దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, అంతర్గత విషయాల్లో విదేశీ జోక్యం సహించలేనిదని నొక్కి చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా సరిహద్దు భద్రతను బలోపేతం చేయాలని యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆర్మీ అధికారిణిపై మధ్యప్రదేశ్ మంత్రి అభ్యంతరకర వ్యాఖ్యలతో బీజేపీ నిజస్వరూపం బయటపడిందని విమర్శించారు. మహిళల పట్ల బీజేపీ అవగాహనకు అది ప్రతిబింబమన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్ర మాజీ మంత్రి స్మృతీ ఇరానీ అమేథీకి రాకపోవడంపై వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించారు. బీజేపీ అబద్ధాల పుట్టని ప్రజలకు తెలిసిపోయిందని, వారు త్వరలోనే బుద్ధి చెబుతారని అఖిలేశ్ అన్నారు.

ఎస్‌హెచ్‌ఈఏసీ సభ్యురాలిగా ఉపాసన

గౌహతి: కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఏర్పాటు చేసిన వ్యూహాత్మక ఉన్నత విద్యా సలహా మండలికి అస్సాంకు చెందిన విద్యావేత్త ప్రొఫెసర్ ఉపాసనా మహంతా నియమితులయ్యారు. ఈ గౌరవం దక్కిన మొట్టమొదటి భారతీయురాలు కావడం గమనార్హం. ప్రపంచంలోని అత్యంత ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల నుంచి అడ్మిషన్లు, ఎన్‌రోల్‌మెంట్‌లో సీనియర్లందరినీ ఒకచోట చేర్చే ప్రతిష్టాత్మక సంస్థ ఇది. ఎస్‌హెచ్‌ఈఏసీలో ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, టొరంటో, మోనాష్ వంటి విశ్వవిద్యాలయాలు, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి సంస్థల నుంచి సభ్యులు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా కేంబ్రిడ్జ్ అర్హతలను రూపొందించడంలో ఈ కౌన్సిల్ కీలక పాత్ర పోషిస్తుంది. శివసాగర్‌కు చెందిన మహంత.. ప్రస్తుతం ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో అడ్మిషన్స్, అవుట్‌రీచ్ డీన్‌గా పనిచేస్తున్నారు.

కారు, ట్రక్కు ఢీ.. కుటుంబంలోని ఐదుగురు మృతి

బల్‌రాంపూర్: యూపీలోని బల్‌రాంపూర్–బహ్రెయిచ్ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో కుటుంబంలోని ఐదుగురు మృత్యువాతపడ్డారు. మరో 8 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. గోండా జిల్లా ఖలాహియా గ్రామానికి చెందిన కొందరు శ్రావస్తిలో బంధువుల ఇంట్లో జరిగిన వివాహ వేడుకకు హాజరై తిరుగు పయనమయ్యారు. వీరి వాహనాన్ని బుధవారం అర్ధరాత్రి దాటాక బల్‌రాంపూర్ జిల్లా చక్వా గ్రామ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టింది. ఘటన తీవ్రతకు కారు తునకలయ్యింది. డ్రైవర్ ట్రక్కును అక్కడే వదిలి పరారయ్యాడు. సమీపంలోని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించి, సహాయ చర్యల్లో పాల్గొన్నారు. వాహనంలో ఇరుక్కున్న వారిని పోలీసులు అతికష్టమ్మీద వెలికి తీశారు. ఘటనాస్థలిలోనే ఐదుగురు కన్నుమూశారు.

మణిపూర్‌లో 10 మంది మిలిటెంట్లు హతం

ఇంఫాల్: మణిపూర్‌లోని చందేల్ జిల్లాలో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో 10 మంది మిలిటెంట్లు మృతి చెందారు. భారత్–మయన్మార్ అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంలోని కొండప్రాంతంలో ఘటన చోటుచేసుకుంది. చందేల్ జిల్లా ఖెంగ్‌జోయ్ తహశీల్‌లోని న్యూ సంటాల్ గ్రామం వద్ద సాయుధులు సంచరిస్తున్నట్లు కోహిమాలోని ఈస్టర్న్ కమాండ్ కార్యాలయానికి సమాచారం అందింది. ఈ మేరకు బలగాలు ఆ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి.

మళ్లీ అరెస్టయిన ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే ఇస్లాం

నాగావ్: పాకిస్తాన్‌ను, పహల్గాం ఉగ్రవాద దాడిలో ఆ దేశ సహకారాన్ని సమర్థించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న అస్సాంలోని నాగావ్‌కు చెందిన ధింగ్ నియోజకవర్గ ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే అమీనుల్ ఇస్లాం మరోసారి అరెస్టయ్యారు. జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేశారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఇస్లాం.. బహిరంగంగా తప్పుదారి పట్టించే, రెచ్చగొట్టే ప్రకటనలు చేశారని దేశద్రోహ ఆరోపణలతో ఏప్రిల్ 24న అరెస్టు చేశారు. 4 రోజుల పోలీసు రిమాండ్‌కు, ఆపై జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. జైలులో ఉన్న ఆయన బుధవారం విడుదలయ్యారు. అదే ఆరోపణలపై ఎన్ఎస్ఏ కింద గురువారం అరెస్టు చేసి నాగావ్ సెంట్రల్ జైలుకు తరలించారు.

సముద్రగుప్తుడికి సమకాలీకుడైన వాకాటక రాజు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

శాతవాహన అనంతర యుగం

1. కీసర సమీపంలో 'ఘటికేశ్వరం' అనే ఘటికా స్థానాన్ని నెలకొల్పిందెవరు?
1) మాధవవర్మ
2) ఇంద్రభట్టారకవర్మ
3) విక్రమేంద్రవర్మ
4) విక్రమేంద్ర భట్టారకవర్మ
2. ఇంద్రభట్టారక వర్మ తన కూతురు ఇంద్ర భట్టారికను ఎవరికిచ్చి వివాహం చేశాడు?
1) ఈశాన్యవర్మ 2) మొదటి అరికేసరి
3) మొదటి కీర్తివర్మ 4) శర్వవర్మ
3. గోవిందవర్మ భార్య పేరుపై నిర్మించిన మహాదేవ విహారానికి విక్రమేంద్ర భట్టారక వర్మ అగ్రహారంగా ఇచ్చిన గ్రామం ఏది?
1) పేణ్కపర 2) ఇరుణ్డెరో
3) రాయగిరి 4) భువనగిరి
4. 'జనాశ్రయుడు' అనే బిరుదున్న విష్ణుకుండిన రాజు ఎవరు?
1) ఇంద్రభట్టారకవర్మ
2) విక్రమేంద్రవర్మ
3) రెండో గోవిందవర్మ
4) నాలుగో మాధవవర్మ
5. పొలమూరు శాసనం వేయించింది?
1) ఇంద్రభట్టారకవర్మ
2) నాలుగో మాధవవర్మ
3) రెండో గోవిందవర్మ
4) విక్రమేంద్రవర్మ
6. నాలుగో మాధవవర్మ వేయించిన పొలమూరు శాసన కాలం?
1) క్రీ.శ. 619 2) క్రీ.శ. 620
3) క్రీ.శ. 621 4) క్రీ.శ. 622
7. విష్ణుకుండిన వంశ చివరి రాజు ఎవరు?
1) మంచన భట్టారకుడు
2) రెండో గోవిందవర్మ
3) మూడో మాధవవర్మ
4) ఇంద్రభట్టారక
8. నాలుగో మాధవవర్మ ఏ కాలంలో రాజ్యానికి వచ్చాడని బి.ఎన్. శాస్త్రి అభిప్రాయం?
1) క్రీ.శ. 560 2) క్రీ.శ. 570
3) క్రీ.శ. 563 4) క్రీ.శ. 573
9. మొదటి గోవిందవర్మ పృథ్వీమూలుడి సహాయంతో ఎవరిని తుదముట్టించాడు?
1) శాలంకాయనులు
2) ఆనందగోత్రికులు
3) రెడ్డి రాజులు
4) బాదామీ చాళుక్యులు
10. మొదటి గోవిందవర్మ భార్య మహాదేవి ఏ మతానికి చెందింది?
1) జైనం 2) శైవం
3) బౌద్ధం 4) వైష్ణవం
11. ఇంద్రపురిలో బౌద్ధ మహా విహారానికి మొదటి గోవిందవర్మ అగ్రహారంగా ఇచ్చిన గ్రామం ఏది?
1) భువనగిరి 2) పేణ్కపర
3) మోత్కూర్ 4) కొలనుపాక
12. పేణ్కపర అగ్రహారాన్ని ప్రస్తుతం ఏ పేరుతో పిలుస్తున్నారు?
1) మోత్కూర్ 2) రాములబండ
3) రాయగిరి 4) పనకబండ
13. పదకొండు అశ్వమేథ యాగాలు, వేయి క్రతువులను చేసినవారు?
1) మొదటి గోవిందవర్మ
2) విక్రమేంద్రవర్మ
3) రెండో మాధవవర్మ 4) దేవవర్మ
14. ఇంద్రపాలనగరం నుంచి అమరావతికి రాజధానిని మార్చిన విష్ణుకుండిన రాజు?
1) మొదటి మాధవవర్మ
2) రెండో మాధవవర్మ
3) మొదటి గోవిందవర్మ
4) రెండో గోవిందవర్మ
15. కీసరలోని రామలింగేశ్వరాలయం ఎవరి కాలం నాటిది?
1) బాదామీ చాళుక్యులు
2) రాష్ట్రకూటులు 3) విష్ణుకుండినులు
4) వేములవాడ చాళుక్యులు
16. వాకాటక రాజ్యం ఎవరి పాలన తర్వాత విష్ణుకుండిన సామ్రాజ్యంలో చేరింది?
1) రెండో పృథ్వీసేనుడు
2) దామోదరసేనుడు
3) రెండో రుద్రదేవుడు
4) దివాకరసేనుడు
17. కీసర రామలింగేశ్వర, చెరువుగట్టు జడల రామలింగేశ్వర, ఇంద్రపాలనగర అమరేశ్వర ఆలయాలను నిర్మించింది ఎవరు?
1) మొదటి గోవిందవర్మ
2) మొదటి మాధవవర్మ
3) రెండో మాధవవర్మ 4) కీర్తివర్మ
18. ఇంద్రపాలనగర తామ్రశాసనాన్ని వేయించినవారు?
1) విక్రమేంద్రవర్మ
2) విక్రమేంద్రభట్టారకవర్మ
3) ఇంద్రభట్టారక వర్మ 4) మాధవర్మ
19. 'ధర్మామృతం' ఏ మతానికి సంబంధించిన కావ్యం?
1) బౌద్ధం 2) హిందూ
3) శైవం 4) జైనం
20. ఇక్ష్వాకులను తుదముట్టించి కృష్ణానది దక్షిణ ప్రాంతాన్ని వశపరుచుకున్నవారు?
1) వాకాటకులు 2) విష్ణుకుండినులు
3) పల్లవులు 4) రెండో పులోమావి
21. ఇక్ష్వాకులు, విష్ణుకుండినుల మధ్య కాలంలో తెలంగాణ ప్రాంతాన్ని పాలించిన రాజవంశం ఏది?
1) వాకాటకులు 2) పల్లవులు
3) బృహత్పలాయనులు
4) ఆనందగోత్రికులు
22. వాకాటకుల రాజధాని ఏది?
1) విదర్భ 2) పురికా
3) విజయపురి 4) కోటిలింగాల
23. వాకాటక రాజ్య స్థాపకుడు ఎవరు?
1) మొదటి ప్రవరసేనుడు
2) మొదటి రుద్రసేనుడు
3) మొదటి పృథ్వీసేనుడు
4) వింధ్యశక్తి
24. వాకాటకులు ఉత్తర భారతదేశానికి చెందిన వారని పేర్కొన్నదెవరు?
1) వి.వి.మిరాసి 2) డాక్టర్ జైస్వాల్
3) ఆర్.సి. మజుందార్ 4) బి.ఎన్.శాస్త్రి
25. వాకాటకులు దక్షిణ భారతదేశానికి చెందిన వారని అభిప్రాయపడినవారు?
1) వి.వి.మిరాసి 2) జైస్వాల్
3) ఆర్.సి. మజుందార్ 4) బి.ఎన్.శాస్త్రి
26. ప్రభావతి ఎవరి భార్య?
1) రెండో రుద్రసేనుడు
2) మొదటి ప్రవరసేనుడు
3) వింధ్యశక్తి 4) రెండో చంద్రగుప్తుడు
27. శాతవాహనుల తర్వాత దక్కన్ ప్రాంతాన్ని ఐక్యం చేసి పాలించిన రాజు?
1) వింధ్యశక్తి 2) రెండో చంద్రగుప్తుడు
3) ఒకటో ప్రవరసేనుడు
4) రెండో ప్రవరసేనుడు
28. వాకాటకులపై విస్తృత పరిశోధన చేసినవారు?
1) కె.సి. చౌదరి 2) ఎ.ఎస్. అల్టేకర్
3) ఆర్.సి. మజుందార్ 4) జైస్వాల్
29. తెలంగాణ ప్రాంతాన్ని పాలించిన ఏ రాజుల చరిత్ర మరుగునపడింది?
1) శాతవాహనులు 2) వాకాటకులు
3) ఇక్ష్వాకులు 4) విష్ణుకుండినులు
30. సముద్రగుప్తుడికి సమకాలీకుడైన వాకాటక రాజు ఎవరు?
1) మొదటి పృథ్వీసేనుడు
2) మొదటి ప్రవరసేనుడు
3) హరిసేనుడు
4) మొదటి రుద్రసేనుడు
31. వాకాటక మహాదేవి ఎవరి కుమార్తె?
1) మొదటి పృథ్వీసేనుడు
2) రెండో పృథ్వీసేనుడు
3) రెండో రుద్రసేనుడు
4) దామోదరుడు
32. వాకాటక మహాదేవిని వివాహమాడిన విష్ణు కుండిన రాజు?
1) రెండో మాధవవర్మ
2) గోవిందవర్మ
3) విక్రమేంద్రవర్మ
4) రెండో రుద్రసేనుడు
33. వాకాటక రాజవంశంలో పరాక్రమవంతుడిగా ప్రసిద్ధి పొందిన రాజు ఎవరు?
1) విక్రమేంద్రవర్మ 2) రెండో మాధవవర్మ
3) గోవిందవర్మ 4) హరిసేనుడు
34. వాకాటకులు ఏ వర్ణానికి చెందినవారు?
1) క్షత్రియులు 2) బ్రాహ్మణులు
3) వైశ్యులు 4) శూద్రులు
35. 'మేఘదూతం' కావ్య రచయిత ఎవరు?
1) రెండో ప్రవరసేనుడు 2) సర్వసేనుడు
3) కాళిదాసు 4) సేతుబంధు
36. 'యాజ్ఞవల్క్య', 'నారదీయకాత్యాయన' అనే స్మృతులను ఎవరి కాలంలో రచించారు?
1) విష్ణుకుండినులు 2) వాకాటకులు
3) ఇక్ష్వాకులు 4) పల్లవులు
37. ప్రాకృతంలో 'సేతుబంధం' అనే కావ్యం రాసింది ఎవరు?
1) కాళిదాసు 2) సర్వసేనుడు
3) భవభూతి
4) రెండో ప్రవరసేనుడు
38. ప్రాకృత భాషలో 'హరివిజయం' అనే కావ్యాన్ని రాసినవారెవరు?
1) కాళిదాసు 2) సేతుబంధు
3) భవభూతి 4) సర్వసేనుడు
39. వాకాటకుల కాలం నాటి గొప్ప సాంస్కృతిక కేంద్రం ఏది?
1) రామగిరి 2) రాంటేక్
3) వత్సగుల్మ 4) కొండాపురం
40. అజంతా, ఎల్లోరా గుహల్లో వాకాటకుల విహార గుహలేవి?
1) 16, 17వ గుహలు
2) 16, 15వ గుహలు
3) 16, 18వ గుహలు
4) 18, 19వ గుహలు
41. సర్వసేనుడు దేన్ని రాజధానిగా చేసుకొని పాలించాడు?
1) రాంటేక్ 2) వత్సగుల్మ
3) రాయగిరి 4) పిల్లలమర్రి
42. విష్ణుకుండినులపై లోతైన పరిశోధన చేసిన వారెవరు?
1) డాక్టర్ బిరుదురాజు రామరాజు
2) రాపాక ఏకాంబరాచార్యులు
3) పి. శ్రీరామశర్మ 4) బి.ఎన్. శాస్త్రి
43. కింది వాటిలో విష్ణుకుండినుల కాలం నాటి నాణేలు దొరికిన ప్రాంతం ఏది?
1) కీసరగుట్ట 2) నార్కట్‌పల్లి
3) మౌలాలి 4) ఏలేశ్వరం
44. విష్ణుకుండినులు తెలంగాణ ప్రాంతంలో రాజ్యానికి వచ్చిన కాలం?
1) క్రీ.శ. 4వ శతాబ్దం చివర
2) క్రీ.శ. 5వ శతాబ్దం చివర
3) క్రీ.శ. 6వ శతాబ్దం
4) క్రీ.శ. 3వ శతాబ్దం
45. విష్ణుకుండిన వంశ స్థాపకుడు ఎవరు?
1) గోవిందవర్మ
2) విక్రమేంద్రవర్మ
3) మహారాజేంద్రవర్మ
4) మాధవవర్మ
46. విష్ణుకుండినుల తొలి రాజధాని వినుకొండ కాదని చరిత్రకారులు తేల్చారు. అయితే వారి తొలి రాజధాని ఏది?
1) భువనగిరి 2) ఇంద్రపాలనగరం
3) ఏలేశ్వరం 4) విజయపురి
47. విష్ణుకుండినుల తొలి రాజుల్లో అగ్రగణ్యుడు ఎవరు?
1) మహారాజేంద్రవర్మ
2) మొదటి మాధవవర్మ
3) మొదటి గోవిందవర్మ
4) రెండో మాధవవర్మ
48. మూలరాజు వంశస్థుడైన పృథ్వీమూలుడి కుమార్తె 'మహాదేవి'ని ఎవరు వివాహం చేసుకున్నారు?
1) మహారాజేంద్రవర్మ
2) మొదటి మాధవవర్మ
3) రెండో మాధవవర్మ
4) మొదటి గోవిందవర్మ
49. ఇంద్రపాలనగర తామ్రశాసనంలో 'మహాకవి'గా ఎవరిని పేర్కొన్నారు?
1) మాధవవర్మ
2) ఇంద్రభట్టారకవర్మ
3) విక్రమేంద్ర భట్టారకుడు
4) విక్రమేంద్రవర్మ
50. ఈశాన్యవర్మ చేతిలో ఓడిపోయిన విష్ణుకుండిన రాజు?
1) విక్రమేంద్రభట్టారక
2) ఇంద్రభట్టారక వర్మ
3) మాధవవర్మ
4) విక్రమేంద్రవర్మ
51. విష్ణుకుండినుల అనంతరం తెలంగాణ ప్రాంతం ఎవరి పాలనలోకి వెళ్లింది?
1) రాష్ట్రకూటులు 2) వేంగీ చాళుక్యులు
3) బాదామీ చాళుక్యులు
4) వేములవాడ చాళుక్యులు
52. తెలంగాణలో అతి ప్రాచీన శాసనం ఏ ప్రాంతంలో ఉందని చరిత్రకారుల అభిప్రాయం?
1) ఏలేశ్వరం 2) ఇంద్రపురి
3) రాయగిరి 4) భువనగిరి

సమాధానాలు

1) 2; 2) 4; 3) 2; 4) 4;
5) 2; 6) 3; 7) 1; 8) 4;
9) 1; 10) 3; 11) 2; 12) 4;
13) 3; 14) 2; 15) 3; 16) 1;
17) 3; 18) 2; 19) 4; 20) 3;
21) 1; 22) 2; 23) 4; 24) 2;
25) 1; 26) 1; 27) 3; 28) 2;
29) 2; 30) 4; 31) 2; 32) 1;
33) 4; 34) 2; 35) 3; 36) 2;
37) 4; 38) 4; 39) 3; 40) 1;
41) 2; 42) 4; 43) 1; 44) 1;
45) 3; 46) 2; 47) 3; 48) 4;
49) 4; 50) 2; 51) 3; 52) 1.

Spelling వేరైనా Pronunciation ఒకేలా!



Homophones

Two or more words that have different spellings, different meanings but the same pronunciations are called 'Homophones'. (Homophones అనగా వేర్వేరు spelling, వేర్వేరు meaning ఉన్నప్పటికీ, ఒకేలా pronunciation గల పదాలు.)

i) Lead is the heaviest metal.
ii) The teacher led me to the principal's cabin.

పై రెండు వాక్యాలలోని lead, led అనే పదాలను గమనిస్తే, రెండిటినీ ఒకే రకంగా పలుకుతున్నప్పటికీ, వీటి స్పెల్లింగ్, అర్థం రెండు వేర్వేరుగా ఉన్నాయి. మొదటి వాక్యంలోని 'lead' కి 'సీసం' అనే అర్థం, రెండో వాక్యంలోని ed కి 'తీసుకొని పోవు' అనే అర్థాలు ఉన్నాయి. కాబట్టి, ఈ రెండు పదాలని Homophones అంటాం. ఇప్పుడు ఇలాంటి కొన్ని Homophonesని తెలుసుకుందాం.

1. ❖ **Incite (verb)** = kindle/ encourage (ప్రేరేపించు)
❖ **Insight (Noun)** = intuition, aware ness (అంతర్దృష్టి/ అవగాహన)
Eg: The leader was arrested for trying to incite violence.
Eg: Srinivas has a good insight into the syllabus of this exam.

2. ❖ **aid (Noun)** =help/assistance (సహాయం)
❖ **Aide (Noun)** = a person who helps (సహాయకుడు)
Eg: During every Ramzan, Saber gives aid to those who are less fortunate.
Eg: Saber worked as a tourists' aide in Mecca.

3. ❖ Council=an assembly (సమావేశం/సభ)
❖ Counsel = advice (సలహా)
Eg: He was a member of the Legislative Council.
Eg: He gave me a very sane counsel.

4. ❖ Born = given birth to. (జన్మించిన)
❖ Borne = carried (మోయడం, భరించడం)
Eg: Srinivas was born on the eleventh of December.
Eg: Rani's stomachache had to be borne until it finally went away.

5. ❖ **aisle (N)** = space between rows (మధ్య దారి)
❖ **isle (N)** = island (దీవి)
Eg: The aisle was crowded with people looking for seats.
Eg: The British Isles are a great place to visit.

6. ❖ **adapt(V)** = to make suitable (అనుకులంగా చేయు)
❖ adept (Adj) = skilled (నైపుణ్యం గల)
❖ adopt (V) = accept as your own (స్వీకరించు, దత్తత తీసుకొను)
Eg: I quickly adapted to living away from home.
Eg: Sheela is adept at speaking languages.
Eg: It was difficult to adopt only one puppy from the animal shelter.

7. ❖ **allways** = by every means or me thod (అన్ని విధాలుగా)
❖ **always (Adverb)** = forever (ఎల్లప్పుడూ)
Eg: Lavanya tried all ways to convince me.
Eg: I always responded calmly dur ing emergency situations.

8. ❖ **Cite (V)** = quote (ఉదాహరణగా చూపించు)
❖ **Site (N)** = local position (స్థలం, ప్రదేశం)
❖ **Sight (N)** = view; scene (దృశ్యం)
Eg: I can cite a parallel stanza.
Eg: This is an ideal site for building a house.
Eg: It was a horrible sight.

9. ❖ **Apposite (Adj)** = proper; suitable (సరైనది)
❖ **Opposite (Preposition)** = standing in front of (ఎదురుగా, వ్యతిరేకంగా)
Eg: He made some very apposite obser vations on our system of edu cation in his speech.
Eg: Our school is opposite the church.

10. ❖ **Advice (Noun)** = recommendation / suggestion (సలహా)
❖ Advise (Verb) = to recommend/ to suggest (సలహా ఇవ్వడం)
Eg: I need your advice on this matter.
Eg: I advise my students to get first rank.

11. ❖ **Complement (Noun)** = that which completes (పూరక)
❖ **Compliment (Noun)** = salute; re gards (అభినందన, పొగడ్త)
Eg: This verb must take a comple ment after it.
Eg: I offer my sincere compliments to you.

12. ❖ **Canvas(N)** = a kind of rough cloth (ఒక రకమైన గుడ్డ)
❖ **Canvass(V)** = to solicit votes (ప్రచారం)
Eg: The tent is made of white canvas.
Eg: I shall not canvass for any political party.

13. ❖ Brake (N) = a lever; an instrument to stop a wheel (వాహనాలను ఆపునది)
❖ Break (v)= to make apart (పగలగొట్టు)
Eg: The brakes of my scooter are loose.
Eg: Don't break the mirror.

14. ❖ **Bough(N)** = a branch of a tree (చెట్టు కొమ్మ)
❖ **Bow (V)** = bend a contrivance to shoot arrows (విల్లు)
Eg: The monkey sits on the bough of a tree.
Eg: He came with a bow and arrows.

15. ❖ Duel (N) = a fight between two (ఇద్దరి మధ్య జరిగే పోరాటం)
❖ Dual (Adj) = double (రెండు)
Eg: There was a duel between the two combatants.
Eg: This machine serves a dual purpose.

16. ❖ **Desert** = a waste tract of sandy land (ఎడారి)
❖ **Desert** = to leave (వదిలిపెట్టు)
❖ **Dessert** = sweet served after dinner
Eg: There is little rain in a desert.
Eg: He deserted his family.
Eg: There must be a course desserts after dinner.

17. ❖ Eminent = distinguished (ప్రముఖ)
❖ Imminent = impending; approa ching (జరగబోవు)
Eg: Many eminent personalities were there.
Eg: There is imminent danger of war.

18. ❖ Hart = a male deer
❖ Heart = an organ of the body
Eg: He has been arrested for shooting the hart.
Eg: His heart beat is normal.

19. ❖ Ingenious = clever (తెలివైన)
❖ Ingenuous = frank and simple (దాపరికం లేని)
Eg: He is a very ingenious teacher.
Eg: I like her for her ingenuous nature

20. ❖ Lightening (V) = making lighter, reducing (తేలిక చేయుట/ బరువు తగ్గించు చేయు)
❖ **Lightning(N)** = electric discharge or flash in clouds. (మెరుపు)
Eg: He has appealed to the High Court for lightening the sentence.
Eg: There was fierce lightning and thunder.

21. Cease = stop, discontinue, (ఆపు)
Seize = catch; hold tightly (స్వాధీన పరుచుకొను)
Siege = state of being surrounded (ముట్టడి)
Eg: He ceases to be a Government counsel.
Eg: He seized the first opportunity.
Eg: The fort lay in siege for.

22. ❖ ate (verb) = తినెను
❖ eight (noun) = ఎనిమిది
Eg: I ate entire biryani.
Eg: I will wake up at eight o'clock tomorrow morning.

23. ❖ **bare (verb)** = ఓర్చుకొను
❖ **bear (noun)** = A large mammal (ఎలుగుబంటి)
Eg: I can't bear the pain of the wound.

24. ❖ to buy (verb) = కొనుట"to purchase."
❖ by (preposition) = చేత
❖ bye (exclamation) = short form of "goodbye.
Eg: I went to a shop to buy a pair of shoes.
Eg: The food is served by him.
Eg: I've got to go now, so bye! See you on Sunday!

25. ❖ stationary = standing still (స్థిరమైన/కదలిక లేని)
❖ stationery = writing paper (లేఖన సామగ్రి)

26. ❖ capital = major city (రాజధాని)
❖ capitol = government building (ప్రభుత్వ భవనం)

27. ❖ board = piece of wood (చెక్క బల్ల)
❖ bored = uninterested (అనాసక్తి)

28. ❖ coarse = rough (మోటుగా వుండే)
❖ course = path (మార్గము); series of lectures (ఉపన్యాసాలు)

29. ❖ corps = regulated group (పటాలం, దండు)
❖ corpse = dead body (మృతదేహం)

30. ❖ dairy = place where milk products are processed (పాల ఉత్పత్తి క్షేత్రం)
❖ diary = personal journa (దినచర్య పుస్తకము)

31. ❖ descent =downward movement (దిగడము)
❖ dissent = disagreement (విరోధం, భిన్నాభిప్రాయము)

32. ❖ discreet = modest, prudent
❖ behavior (వివేచనగల, తెలివిగల)
❖ discrete = a separate thing, distinct (విలక్షణ, ప్రత్యేక)

33. ❖ die = to lose life; (చనిపోవడం)
❖ dye = to change or add color (రంగులు అద్దడం)

34. ❖ dyeing = changing or adding color (రంగులు అద్దడం)
❖ dying = losing life (చనిపోవడం)

35. ❖ envelop = to surround (verb) (చుట్టుట, కప్పుట)
❖ envelope = container for a letter (noun) (letters పంపుటకు ఉపయోగించు కవర్)

37. » forth = forward (ముందుకు)
❖ fourth = number four in a list (నాలుగవ)

38. ❖ hoard = a hidden fund or supply, a cache (పోగుచేయు, కూడబెట్టు)
❖ horde = a large group or crowd, swarm (అల్లరిమూక, గుంపు)

39. ❖ knew = past tense of "know" (తెలుసు)
❖ new = fresh, not yet old (కొత్త)

40. ❖ *know = to comprehend (తెలుసు)
❖ no = negative (లేదు /కాదు)

41. ❖ loose = unbound, not tightly fastened (వదులుగా వుండే)
❖ lose = to misplace (కోల్పోవు, పోగొట్టుకొను)

42. ❖ meat = animal flesh (జంతుమాంసం)
❖ meet = to encounter (కలయిక)
❖ mete = to measure; to distribute (కొలత, లేదా పంచియిచ్చు)

43. ❖ miner = a worker in a mine (గని తవ్వేవాడు)
❖ minor = underage person (noun) (18 సంవత్సరములు నిండనివాడు); ess im portant (adj.) (అప్రధానమైన)

44. ❖ peace = absence of war (శాంతి)
❖ piece = part of a whole; (చిన్న ముక్క)

45. ❖ peak = point, pinnacle, maximum (పర్వతశిఖరం, అత్యున్నతి, ఆధిక్యం, కొన, అగ్రం)
❖ peek = to peer through or look furtively (దొంగతనముగా లేదా రహస్యంగా చూచుట)

46. ❖ personal = intimate; owned by a person (వ్యక్తిగతమైన)
❖ personnel = employees (ఉద్యోగులు)

47. » plain = simple, unadorned (స్పష్టమైన/అలంకారములేని/సాధారణమైన)
❖ plane = to shave wood; aircraft (noun) (వదును/విమానం)

48. ❖ right = correct; opposite of left (సరైన /కుడి)
❖ rite = ritual or ceremony (ఆచారసంబంధమైన)
❖ write = to put words on paper (రాయడం)

49. ❖ road = way, path (దారి /మార్గం)
❖ rode = past tense of "to ride" (స్వారిచేసెను)

50. ❖ scene = place of an action; segment of a play (ఒక పని జరిగిన ప్రదేశం /నాటకంలో ఒక దృశ్యం)
❖ seen = viewed; past participle of "to see" (చూసెను)

Practice Questions

1. **Fill in the blanks with the correct words.** You need to pay the ____ to go to the ____
1) fare, fair 2) Fare,fear
3) Fair, fire 4) Fair, fare
2. **Please ____ the newspaper over the table.**
1) Lay 2) Lie 3) Lain 4) laid
3. **Fill in the blank with a suitable word. They had dates for.____**
1) desert 2) Desart
3) Dessert 4) Deserrt
4. **Before the bell rang, the class was ____ to go home.**
1) Already 2) All ready
3) Allredy 4) Allready
5. **The student received a wonder ful____ after his speech.**
1) complement 2) Compliment
3) Compiyment 4) Camplemant

Answers


1) 1 2) 3) 3 4) 2 5) 2

ముఖ్యమంత్రిగా అతి తక్కువ కాలం పనిచేసిన వారెవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ



మాదిరి ప్రశ్నలు

1. జతపరచండి.
జాబితా - I
a) ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాల కేటాయింపు
b) రాష్ట్రాల్లో ద్వంద్వ పాలన
c) పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వం
d) మొదటి లా కమిషన్ ఏర్పాటు
జాబితా - II
i) భారత ప్రభుత్వ చట్టం - 1935
ii) భారత భారత కౌన్సిళ్ల చట్టం - 1909
iii) భారత ప్రభుత్వ చట్టం - 1919
iv) చార్టర్ చట్టం - 1883
ఎ) a-iv, b-ii, c-iii, d-i
బి) a-ii, b-iii, c-i, d-iv
సి) a-ii, b-iv, c-iii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

2. కింది వాటిలో సరికానిది ఏది?
1) భారత రాజ్యాంగం 1935 చట్టం జిరాక్స్ కాపీ - కె.టి. షా
2) భారత రాజ్యాంగం ఒక అందమైన అతుకుల బొంత - మారిస్ జోన్స్
3) భారత రాజ్యాంగం ఐరావతం లాంటిది - హెచ్.వి. కామత్
4) భారత రాజ్యాంగ పరిషత్ ఒక హిందువుల సభ - చర్చిల్
ఎ) 1, 3 బి) 1, 4
సి) 1, 2, 4 డి) 2, 4

3. కింది వారిలో రాజ్యాంగ పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన వారెవరు?
ఎ) జవహర్ లాల్ నెహ్రూ
బి) బి.ఆర్. అంబేడ్కర్
సి) గోపాలస్వామి అయ్యంగార్
డి) గణేశ్ వాసుదేవ మావళంకర్

4. జతపరచండి.
జాబితా - I
a) రాష్ట్రపతి ఎన్నిక విధానం
b) రాజ్యాంగ సవరణ విధానం
c) ఉమ్మడి జాబితా
d) అవశిష్ట అధికారాలు
జాబితా - II
i) కెనడా ii) ఆస్ట్రేలియా
iii) దక్షిణాఫ్రికా iv) ఐర్లాండ్
ఎ) a-iv, b-ii, c-iii, d-i
బి) a-ii, b-iii, c-i, d-iv
సి) a-iv, b-iii, c-ii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

5. కింది వాటిలో సరైనవి ఏవి?
1) సమాఖ్య ప్రభుత్వ ప్రధాన లక్షణం - కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన
2) పార్లమెంట్ ప్రధాన లక్షణం- శాసన నిర్మాణ శాఖకు కార్య నిర్వాహక బాధ్యత వహించడం
3) పార్లమెంటరీ విధానంలో మంత్రి మండలి సమష్టి బాధ్యత, వ్యక్తిగత బాధ్యత అనే సూత్రాలతో పని చేస్తుంది
4) అధ్యక్ష తరహా ప్రభుత్వం సుస్థిర కాలం ఉంటుంది
ఎ) 1, 2 బి) 3, 4
సి) 1, 2, 3 డి) 1, 2, 3, 4

6. రాజ్యాంగ ప్రవేశికకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
1) ఇప్పటి వరకు ఒకేసారి సవరించారు
2) రాజ్యాంగానికి ఉపోద్ఘాతం
3) ప్రవేశికకు మూలం నెహ్రూ ప్రవేశపెట్టిన లక్ష్యాలు, ఆశయాల తీర్మానం
4) రాజ్యాంగ ఆశయాలు - న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం
ఎ) 1, 2 బి) 1, 4
సి) 1, 2, 4 డి) 1, 2, 3, 4

7. 'రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులను సవరించడానికి గానీ, కుదించడానికి గానీ పార్లమెంటుకు ఎలాంటి అధికారం లేదు' అని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు వెలువరించింది?
ఎ) గోలక్ నాథ్ Vs స్టేట్ ఆఫ్ పంజాబ్
బి) కేశవానంద భారతీ Vs స్టేట్ ఆఫ్ కేరళ
సి) ఎస్.ఆర్. బొమ్మై Vs భారత ప్రభుత్వం
డి) నరళ ముద్గల్ Vs భారత ప్రభుత్వం

8. పౌరులు ప్రాథమిక హక్కులను వదులుకోవడానికి న్యాయస్థానం అనుమతించదు. ఈ ప్రక్రియను న్యాయ పరిభాషలో ఏమని పేర్కొంటారు?
ఎ) డాక్ట్రిన్ ఆఫ్ సెవరబిలిటీ
బి) డాక్ట్రిన్ ఆఫ్ వేవర్ సి) డాక్ట్రిన్ ఆఫ్ ఎక్లిప్స్
డి) డాక్ట్రిన్ ఆఫ్ పిత్ అండ్ సబ్‌స్టాన్స్

9. ప్రాథమిక విద్యను నిర్బంధ విద్యగా గుర్తించాలని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు వెలువరించింది?
1) ఉన్నికృష్ణన్ Vs ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
2) మోహినీ జైన్ Vs కర్ణాటక ప్రభుత్వం
ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
సి) 1, 2 డి) ఏదీకాదు

10. ఆదేశిక సూత్రాలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
1) అంబేడ్కర్ ఆదేశిక సూత్రాలను 1935 చట్టం ద్వారా వెలువడిన Instruments of Instructionsతో పోల్చాడు
2) ఆదేశిక సూత్రాలను సరిగా అమలు చేస్తే భారతదేశం భూతల స్వర్గం అవుతుంది - ఎం.సి. చాగ్లా
3) ఆదేశిక సూత్రాల అమలులో ప్రభుత్వాలు వైఫల్యం చెందితే రాబోయే ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు కోల్పోయినట్లే - బి.ఆర్. అంబేడ్కర్
4) ఆదేశిక సూత్రాలు..ఒక బ్యాంకు తనకు అనుగుణంగా చెల్లించే చెక్కు లాంటివి - కె.టి. షా
ఎ) 1, 4 బి) 1, 3, 4
సి) 2, 3, 4 డి) 1, 2, 3, 4

11. జతపరచండి.
జాబితా - I
a) రామ రాజ్యం, గ్రామ స్వరాజ్య స్థాపన
b) సంపద వికేంద్రీకరణ
c) పని హక్కు, నిరుద్యోగ భృతి
d) భారత సంస్కృతి, వారసత్వ పరిరక్షణ
జాబితా - II
i) అధికరణ - 49 ii) అధికరణ - 41
iii) అధికరణ - 39 iv) అధికరణ - 40
ఎ) a-i, b-ii, c-iii, d-iv
బి) a-iv, b-iii, c-ii, d-i
సి) a-ii, b-iv, c-iii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

12. కింది వారిలో ఉప రాష్ట్రపతి కాకుండా రాష్ట్రపతి అయిన మొదటి వ్యక్తి ఎవరు?
ఎ) వి.వి. గిరి బి) జాకిర్ హుస్సేన్
సి) నీలం సంజీవ రెడ్డి డి) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్

13. రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి కింది వాటిలో సరైనవి?
1) ఎన్నికల గణంలో పార్లమెంట్ సభ్యులు, విధాన సభ సభ్యులు ఉంటారు
2) ఎన్నికల గణంలో పార్లమెంట్ సభ్యులు, రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల విధాన సభ సభ్యులు ఉంటారు
3) ఎన్నికల గణంలో ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు, అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల విధాన సభ సభ్యులు ఉంటారు.
4) 16వ రాష్ట్రపతి ఎన్నిక రిటర్నింగ్ అధికారిగా లోక్‌సభ సెక్రటరీ జనరల్ అనూప్ మిశ్రా కొనసాగాడు
ఎ) 1, 2 బి) 3, 4 సి) 1, 3, 4 డి) 3

14. జతపరచండి.
జాబితా - I
a) లోక్‌సభ రద్దు వాయిదా
b) పార్లమెంట్ ఉమ్మడి సభల సమావేశం
c) రాష్ట్రపతి అత్యాదేశాల (ఆర్డినెన్స్) జారీ
d) రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరడం
జాబితా - II
i) అధికరణ - 85 ii) అధికరణ - 123
iii) అధికరణ - 143 iv) అధికరణ - 108
ఎ) a-i, b-ii, c-iii, d-iv
బి) a-i, b-iv, c-ii, d-iii
సి) a-ii, b-iv, c-iii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

15. కింది వారిలో సభలో సభ్యుడు కాకపోయి నప్పటికీ సభాధ్యక్షుడిగా కొనసాగేదెవరు?
ఎ) లోక్‌సభ స్పీకర్ బి) విధాన పరిషత్ చైర్మన్
సి) రాజ్యసభ డిప్యూటీ చైర్మన్
డి) రాజ్యసభ చైర్మన్

16. జతపరచండి.
జాబితా - I
a) మైనార్టీ ప్రభుత్వం
b) జాతీయ ప్రభుత్వం
c) సంకీర్ణ ప్రభుత్వం
d) అత్యధిక మెజార్టీ ప్రభుత్వం
జాబితా - II
i) జవహర్ లాల్ నెహ్రూ
ii) మొరార్జీ దేశాయ్
iii) పి.వి. నరసింహా రావు
iv) రాజీవ్ గాంధీ
ఎ) a-i, b-ii, c-iii, d-iv
బి) a-iii, b-i, c-ii, d-iv
సి) a-ii, b-iv, c-iii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

17. మంత్రి మండలికి సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
1) మంత్రి మండలి సంఖ్యపై 91వ సవరణ ద్వారా పరిమితి విధించారు
2) సమష్టి నిర్ణయాన్ని వ్యతిరేకించి రాజీనామా చేసిన మొదటి మంత్రి బి.ఆర్. అంబేడ్కర్
3) మంత్రి మండలి సమష్టిగా రాష్ట్రపతికి, వ్యక్తిగతంగా పార్లమెంట్‌కు బాధ్యత వహిస్తుంది
4) రాజ్యాంగం ప్రకారం మంత్రి మండలిని ఏర్పాటు చేసేది, శాఖలు కేటాయించేది ప్రధాన మంత్రి
ఎ) 1, 4 బి) 1, 2, 3,
సి) 2, 3, 4 డి) 1, 2

18. కింది వారిలో 1947లో నెహ్రూ మంత్రివర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందని వారు?
ఎ) అంబేడ్కర్ బి) శ్యామా ప్రసాద్ ముఖర్జీ
సి) షణ్ముగం శెట్టి డి) పై వారందరూ

19. 'అటార్నీ జనరల్‌కు పార్లమెంట్‌లో సభ్యత్వం లేకపోయినా చర్చల్లో, సమావేశాల్లో పాల్గొనే అధికారం ఉంటుంది' అని తెలిపే అధికరణ ఏది?
ఎ) అధికరణ - 76 బి) అధికరణ - 88
సి) అధికరణ - 165 డి) అధికరణ - 78

20. భారత పార్లమెంట్‌కు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
1) భారత పార్లమెంట్ పితామహుడిగా ఇంద్రజిత్ గుప్తాను పేర్కొంటారు
2) మొదటి మధ్యంతర ఎన్నికల ద్వారా 5వ లోక్‌సభ ఏర్పడింది
3) లోక్‌సభ 3వ స్పీకర్ - హుకుం సింగ్
4) రెండు దశాబ్దాల తర్వాత పూర్తి మెజార్టీతో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది
ఎ) 1, 4 బి) 1, 3, 4
సి) 2, 3, 4 డి) 1, 2, 3, 4

21. జతపరచండి.
జాబితా - I
a) ప్రభుత్వ ఖాతాల సంఘం
b) ప్రభుత్వ అంచనాల సంఘం
c) సభా వ్యవహారాల సంఘం
d) అర్జీలపై కమిటీ
జాబితా - II
i) మంత్రులకు కూడా సభ్యత్వం ఉంటుంది
ii) అతిపెద్ద పార్లమెంటరీ కమిటీ
iii) సమావేశాల అజెండా రూపకల్పన
iv) అతి ప్రాచీన పార్లమెంటరీ కమిటీ
ఎ) a-iv, b-ii, c-iii, d-i
బి) a-iv, b-iii, c-ii, d-i
సి) a-ii, b-iv, c-iii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

22. ఆర్థిక బిల్లుకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
1) రాష్ట్రపతి పూర్వ సమ్మతితో లోక్‌సభలో ప్రవేశ పెట్టాలి
2) లోక్‌సభలో ఆమోదం పొందకపోతే ప్రభుత్వం కూలి పోతుంది
3) లోక్‌సభ ఆమోదం తర్వాత రాజ్యసభకు పంపితే, ఆమోదించి లేదా వ్యతిరేకించి 14 రోజుల్లోగా తిప్పి పంపాలి
4) రెండు సభల ఆమోదం తర్వాత రాష్ట్రపతి ఆమోదిస్తే శాసనం అవుతుంది
ఎ) 1, 2 బి) 3, 4
సి) 1, 2, 3 డి) 1, 2, 3, 4

23. అవిశ్వాస తీర్మానానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
1) ప్రవేశ పెట్టేందుకు లోక్‌సభలో 50 మంది సభ్యుల మద్దతు ఉండాలి
2) తీర్మానం నెగ్గేందుకు లోక్‌సభలో సాధారణ మెజార్టీ ఆమోదించాలి
3) లోక్‌సభకు హాజరై, ఓటు వేసిన సభ్యుల్లో సాధారణ మెజార్టీ ఆమోదించాలి
4) హాజరైన సభ్యుల్లో ప్రత్యేక మెజార్టీ ఆమోదించాలి
ఎ) 2, 4 బి) 1, 3 సి) 2, 3 డి) 1, 4

24. లోక్‌సభ స్పీకర్‌గా అతి తక్కువ కాలం పనిచేసిన వారెవరు?
ఎ) నీలం సంజీవ రెడ్డి బి) బలిరాం భగత్
సి) బలరాం జాకర్ డి) సర్దార్ హుకుం సింగ్

25. జతపరచండి.
జాబితా - I
a) అమరేశ్వరీ దేవి b) లీలా సేత్
c) ఫాతిమా బీవీ d) అన్నా చాందీ
జాబితా - II
i) సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి
ii) హైకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి
iii) ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి
iv) హైకోర్టు మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తి
ఎ) a-iii, b-iv, c-i, d-ii
బి) a-iv, b-iii, c-ii, d-i
సి) a-ii, b-iv, c-iii, d-i
డి) a-i, b-ii, c-iv, d-iii

26. కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం సుప్రీంకోర్టు ఏ అధికార పరిధిలోనిది?
ఎ) ప్రారంభ అధికార పరిధి
బి) అప్పీళ్ల విచారణ పరిధి
సి) సలహాపూర్వక పరిధి డి) పైవేవీ కాదు

27. కింది వాటిలో సరైంది ఏది?
1) మన రాష్ట్ర విధాన పరిషత్ విరామ కాలం 22 ఏళ్లు
2) విధాన పరిషత్ ఏర్పాటు లేదా రద్దు న్యాయశాఖ పరిధిలోకి వస్తుంది
3) విధాన పరిషత్ రద్దు గురించి ఆర్టికల్ 169 తెలియజేస్తుంది
4) ప్రస్తుతం విధాన పరిషత్ 7 రాష్ట్రాల్లో అమల్లో ఉంది
ఎ) 1, 3 బి) 2, 4
సి) 2, 3, 4 డి) 1, 2, 3, 4

28. ముఖ్యమంత్రిగా అతి తక్కువ కాలం పనిచేసిన వారెవరు?
ఎ) యడ్యూరప్ప బి) జగదాంబిక పాల్
సి) నాదెండ్ల భాస్కర్ డి) జానకీ రామచంద్రన్

29. రాజ్యసభలో అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్లు కేటాయించాలని సిఫారసు చేసిన కమిటీ?
ఎ) సర్కారియా కమిటీ బి)రాజమన్నార్ కమిటీ
సి) సంతానం కమిటీ డి) పైవేవీ కావు

30. ప్రణాళికలు, సాంఘిక సంక్షేమం ఏ జాబితాలోకి వస్తాయి?
ఎ) కేంద్ర జాబితా బి) రాష్ట్ర జాబితా
సి) ఉమ్మడి జాబితా డి) అవశిష్ట అంశాలు

31. కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం కోసం సూచనలు చేయడానికి ప్రత్యేకంగా నియమించిన తొలి కమిటీ ఏది?
ఎ) పరిపాలన సంస్కరణల సంఘం
బి) రాజమన్నార్ కమిటీ
సి) రంజిత్ సింగ్ సర్కారియా కమిటీ
డి) ఎం.ఎం. పూంఛీ కమిటీ

32. భారతీయ జనతా పార్టీని ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1951 బి) 1976
సి) 1980 డి) 1984

సమాధానాలు

1) బి 2) డి 3) డి 4) సి 5) డి
6) డి 7) ఎ 8) బి 9) సి 10) డి
11) బి 12) డి 13) బి 14) బి 15) డి
16) బి 17) డి 18) డి 19) బి 20) డి
21) ఎ 22) సి 23) ఎ 24) బి 25) ఎ
26) ఎ 27) డి 28) బి 29) బి 30) సి
31) సి 32) సి

MODEL QUESTIONS

How many floors are there between..

BANK EXAMS
REASONING



Directions (Q.No. 1-5): Study the information and answer the given questions:

There are eight persons A,B,C,D,E, F, G and H seated in a circle all facing away from the centre but not necessarily in the same order. F is third to the left of D. G is immediate neighbour of D. A is second to the right of B. C is immediate neighbour of neither A nor B. There are three persons between E and G. E is immediate neighbour of B. F is not the neighbour of B.

1. Who is second to the left of B?
1) F 2) E 3) C
4) D 5) None of these
2. Who is between E and H?
1) F 2) B 3) C
4) D 5) None of these
3. If F and G interchange their positions, then who will be second to the right of E?
1) F 2) G 3) C
4) D 5) None of these
4. In which of the following pairs is the second person to the immediate left of first person?
1) CF 2) EG 3) BA
4) GD 5) None of these
5. How many persons are seated between F and H?
1) Three 2) Two 3) One
4) None 5) None of these

Directions (Q.No.6 -10): In these questions, the relationship between different elements is shown in the statements.

Give answer
1) If only conclusion I follows.
2) If only conclusion II follows
3) If either conclusion I or II follows.
4) If neither conclusion nor II follows.
5) If both conclusion I and II follow.

6. Statements: $D < M > P, B \leq D, Q \leq P$
Conclusion: I. $Q < B$
II. $Q = B$
7. Statements: $K > L \geq P \leq S, Q < P, L < O$
Conclusion: I. $O > K$ II. $L > Q$
8. Statements: $X=P \geq C < Z, B > X$
Conclusion: I. $B > C$ II. $B < Z$
9. Statements: $Q > Y \geq D, P = Q, P \leq C$
Conclusion: I. $C > D$ II. $D < Q$
10. Statements: $M \leq L < D, M \geq N, P = N$
Conclusion:I. $M \geq P$
II. $N < D$

Directions(Q.No. 11-16): Read the questions carefully and answer them.

There are eight persons M, N, O, P, Q, R, S and T stay in a same building that has eight floors numbered one to eight (the ground floor is numbered 1, the floor above it is numbered 2 , and so on, and the top most floor is numbered 8). But these people do not necessarily stay in the same order given. Each one has a different occupation - Doctor, Professor, School Teacher, Musician, Business Person, Bank Manager, Accountant and Engineer, again not in the same order. Each one plays a different game - hockey, volleyball, basketball, badminton, chess, cricket, football and tennis.

There are two floors between the floors of R and Q. R does not play volleyball and does not live on even numbered floor.

There is one floor between the floor of Accountant and the one who plays football.

Accountant plays badminton and lives on even numbered floor, but not on the top floor.

Professor plays basketball and lives on third floor.

R is not professor. S does not play either football or basketball. S does not live on a floor immediately above or immediately below the floor on which P lives. P is not bank manager and he does not play tennis, volleyball or hockey

M, a school teacher, lives just above the floor of business person and just below the floor in which accountant lives. T, a musician, who plays chess, lives on the floor above the R's floor but not on the Top floor. There is only one floor above the floor in which Engineer lives. Business person plays cricket and lives on fourth floor. M does not play volleyball or hockey. O is not an Engineer and neither plays badminton nor plays football.

11. Which of the following games School Teacher plays?
1) Volleyball 2) Tennis 3) Hockey
4) Football 5) None of these
12. On which of the following floors does S live?
1) 1.8th 2) 3rd 3) 6th
4) 5th 5) None of these
13. Which of the following games Engineer plays?
1) Volleyball 2) Tennis 3) Hocke
4) Football 5) None of these
14. Who among the following lives on the topmost floor, i.e floor number 8?
1) N 2) P 3) S
4) O 5) None of these
15. How many floors are there between the floors on which P & O live?
1) One 2) Two 3) Three
4) Four 5) None of these
16. Who among the following is Bank Manager?
1) N 2) P 3) R
4) O 5) None of these

Directions (Q.No. 17-22): Study the information and answer the given questions:

There are ten persons A, B, C, D, E, F, G, H, I and J seated in a line all facing north direction, but not necessarily in the same order.

J is fourth from the right end . B is third to the left of D who is second to the left of J. There are two persons between E and G. There is only one between F and D.

There are two persons between A and C. G and E are not the neighbours of I. C is not the neighbour of J. B is not seated next to G. H is eighth from the left end.

17. Who is seated between G and A?
1) None 2) D 3) H
4) G 5) J
18. What is C's position with respect to D?
1) Second to the left
2) Fourth to the right
3) Fourth to the left
4) Third to the left 5) Fifh to the left
19. Four of the following five are alike in a certain way based on their seating position in the line and so form a group. Which is the one that does not belong to the group?
1) BE 2) HC 3) JA
4) DG 5) AI
20. Who is fourth to the right to the one who is immediate left of B?
1) None 2) D 3) A
4) G 5) J
21. Who is as away from A as A is placed from I?
1) J 2) D 3) G
4) F 5) B
22. Which of the following pair sits at the extreme corners of the row?
1) D, E 2) E, A 3) A, C
4) E, I 5) None of these

Directions (Q.No. 23-27): Read the information carefully and answer the following questions.


Seven members D, G, A, E, C, F and B represent different places viz, Hyderabad, Guntur, Kurnool, Visakhapatnam, Suryapet, Vijayawada and Siddipet; each one competing for a different sport, viz. Volleyball, Archery, Rifle Shooting, Tennis, Boxing, Basketball and Football. The order of persons, places and games is not necessarily the same.

D represents Guntur for Archery.
G represents Hyderabad but not for Volleyball or Rifle Shooting.
E represents Vijayawada for Basketball.
A competes for Volleyball but not from Kurnool.
F competes for Rifle Shooting.
The one who represents Siddipet competes for Boxing. The one who represents Suryapet competes for Tennis. C does not represent Kurnool or Siddipet.

23. Which of the following combinations is correct?
1) B-Boxing-Visakhapatnam
2) F-Tennis-Suryapet
3) A-Tennis-Visakhapatnam
4) C-Tennis-Suryapet
5) None of these
24. Which of the following combination is correct?
1) A - Suryapet 2) F-Visakhapatnam
3) C- Kurnool 4) B-Siddipet
5) None of these
25. 'A' represents which place?
1) Visakhapatnam
2) Suryapet 3) Siddipet
4) Kurnool 5) None of these
26. The one who competes for Rifle Shooting, represents which place?
1) Visakhapatnam
2) Kurnool 3) Siddipet
4) Hyderabad 5) None of these
27. For which game does G compete?
1) Boxing 2) Football
3) Tennis
4) Cannot be determined
5) None of these

Key with Solutions

(1 - 5):



1) 4; 2) 2; 3)2;
4) 1; 5) 1;

(6-10):
6) 4; $B \leq D < M > P \geq Q$
B and Q cannot be compared. Hence, neither I nor II follows.
7) 2; $K > L < O$. Hence, K and O cannot be compared.
$L \geq P > Q \Rightarrow L > Q$. Hence, Conclusion II is true.
8) 1; $B > X = P \geq C < Z$
Hence, $B > C$. So, conclusion I is true. B and Z cannot be compared. So, conclusion II is not true.
9) 5; $C \geq P = Q > Y \geq D$
Hence, $C > D$. Conclusion I is true.
Hence, $Q > D$. Conclusion II is also true.
10) 5; $M \geq N = P$. Hence, conclusion I is true.
$D > L \geq M \geq N$. Hence, conclusion II is also true.

(11-16):

Floor	Person	Profession	Game
8	P	Doctor	Football
7	N	Engineer	Volleyball
6	S	Accountant	Badminton
5	M	Teacher	Tennis
4	Q	Business person	Cricket
3	O	Professor	Basketball
2	T	Musician	Chess
1	R	Bank manager	Hockey

11) 2; 12) 3; 13) 1;
14) 2; 15) 4; 16) 3;

(17 -22):
E B F G D A J H C I
17) 2; 18) 2; 19) 5;
20) 2; 21) 5; 22) 4;

(23 - 27):

Person	Place	Game
A	Visakhapatnam	Volleyball X Kurnool
B	Siddipet	Boxing
C	Suryapet	Tennis X Kurnool/Siddi
D	Guntur	Archery
E	Vijayawada	Basketball
F	Kurnool	Rifle
G	Hyderabad	Football X VB/Rifle

23) 4; 24) 4; 25) 1;
26) 2; 27) 2.